

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 29

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

న్యూస్‌మేకర్


సొంతగా రచనలు చేయగలిగేవారు అనువాదాలు చేయరు. భాష బాగా వచ్చినంత మాత్రాన అనువాదం చేయలేరు. దానికి నైపుణ్యం, కొంత నిస్వార్థం కావాలి. తమిళ రచయిత్రి నందిని కృష్ణన్ చేసిన 'పొన్నియిన్ సెల్వన్' ఇంగ్లిష్ అనువాదం ఏప్రిల్ 24న మార్కెట్లోకి రానుంది. నవలలోని పాతకాలపు తమిళాన్ని నేటి యువతకు అందేలా అనువాదం చేయడం సులువు కాదు. తమిళంలోని ఉత్తమ నవలలను సవాలుగా తీసుకుని నందిని ఇంగ్లిష్‌లో అనువాదం చేస్తోంది. ఆమెకు వస్తున్న గుర్తింపు ఆ రంగంలో రాణించాలనుకునే స్త్రీలు గమనించదగ్గది.

అనువాద వారధి


నందిని కృష్ణన్



దాదాపు 2500 పేజీలు ఉండే ఐదు భాగాల భారీ ప్రఖ్యాత తమిళ నవల 'పొన్నియిన్ సెల్వన్'ను ఇంగ్లిష్‌లో అనువాదం చేయబూనడం సాహసం. కాని ఈ క్లాసిక్‌ను అనువాదం చేయడానికి చాలా మంది ట్రై చేస్తూనే వచ్చారు. ముగ్గురు నలుగురు సఫలీకృతులయ్యారు. అయితే ఎప్పటికప్పుడు కొత్త జనరేషన్‌కు తగ్గట్టుగా అనువాదం చేయడానికి ఎవరో ఒకరు ముందుకు వస్తూనే ఉన్నారు. ఇప్పుడు నందిని కృష్ణన్ వంతు. ఆమె చేసిన ఈ నవల అనువాదం మొదటి భాగం పూర్తయ్యింది. ఏప్రిల్ 24న విడుదల కానుంది. వెస్ట్‌ల్యాండ్ బుక్స్ దీనిని ప్రచురిస్తుంటే 'పొన్నియిన్ సెల్వన్'ను రెండు భాగాల సినిమాగా తీస్తున్న దర్శకుడు మణిరత్నం ఈ కార్యక్రమానికి ప్రోత్సాహకుడిగా ఉన్నాడు.



'పొన్నియిన్ సెల్వన్ నవల 75 ఏళ్ల క్రితం నాటిదని గుర్తు లేనంతగా అనునిత్యం తమిళ సాహిత్యంలో కలగలిసిపోయింది. కల్కి రాసిన ఈ నవలలోని భాషను, పై అర్థాన్ని, లోపలి అర్థాన్ని అర్థం చేసుకుని అనువాదం చేయడం చాలా జటిలం. అయినా చేశాను. పాఠకులు సులభంగా చదువుకోవడానికి, చేత బట్టుకోవడానికి వీలుగా ఇంగ్లిష్‌లో ఐదు కంటే ఎక్కువ భాగాలుగా విభజించి పుస్తకాలుగా తేనున్నాము' అని తెలిపింది నందిని కృష్ణన్.

ఎవరీ నందిని కృష్ణన్?

నందిని కృష్ణన్ చెన్నైలో స్థిరపడిన నాటకకర్త, రచయిత్రి, స్టేజ్ యాక్టర్ కూడా. లండన్‌లో, ఢిల్లీలో జర్నలిస్ట్‌గా పని చేసింది. ఆ తర్వాత చెన్నై నుంచి వెబ్, ప్రింట్ మీడియాలలో పని చేయడం మొదలుపెట్టింది. హాస్యం రాస్తుంది. పెద్దలు కుదిర్చే పెళ్లిళ్లకు ప్రాధాన్యం ఇచ్చే భారతీయ వైవాహిక వ్యవస్థపై విమర్శను పెడుతూ వివాహమైన స్త్రీలను, పురుషులను ఇంటర్వ్యూ చేసి 'హిచ్డ్: ది మోడర్న్ అండ్ అరేంజ్డ్ మేరేజ్' పుస్తకం తెచ్చింది. ట్రాన్స్ మెన్ జీవితాల ఆధారంగా 'ఇన్‌విజిబుల్ మెన్' పుస్తకం రాసింది. పెరుమాళ్ మురుగన్ నవలలను ఇంగ్లిష్‌లో అనువాదం చేయడం ద్వారా అనువాద రంగంలో ప్రవేశించింది. ఇప్పుడు 'పొన్నియిన్ సెల్వన్' అనువాదం చేస్తోంది. నందిని కృష్ణన్ ఇంట్లో ఎప్పుడూ వీధి కుక్కలు ఉంటాయి. వాటిని సాకుతుంటుంది. పిల్లలను కూడా. 'కుక్కలు, పిల్లలు, వేల కొద్ది పుస్తకాలు అంతే మా ఇల్లు' అని చెబుతుంది.

కత్తి మీద సాము

'అనువాదం చేయడం కత్తి మీద సాము' అంటుంది నందిని. 'సొంత రచనైతే అలా ఒక సమాధి స్థితికి వెళ్లి రాసుకుంటూ పోతాము. అనువాదం అలా కాదు. అప్రమత్తంగా ఉండాలి. ఎదుటివారు చదివితే అది కేవలం అనువాదం అనిపించకూడదు. అదే సమయంలో ఒరిజినల్ నవల తాలూకు పరిమళం దానిలో ఉండాలి. అనువాదం పూర్తి చేశాక ఎవరిదో కన్నబిడ్డను మనం సాకాం... ఇక దీనితో రుణం చెల్లిపోయింది అన్న బాధ తప్పదు' అంటుంది నందిని.

'అనువాదకులు స్వయంగా రచయితలు కాకపోవడం వల్ల కొన్ని అనువాదాలు చెడిపోతాయి. ఎందుకంటే వాళ్లు ప్రతి మాటా కచ్చితంగా అనువాదం చేస్తూ కృతకంగా మారుస్తారు. అనువాదకులు స్వయంగా రచయితలైనా కూడా కొన్ని అనువాదాలు చెడిపోతాయి. ఎందుకంటే వారు తమ సృజనశక్తిని కూడా కలుపుతారు. అది తప్పు. వేరొకరు గీసిన బొమ్మను నకలు చేసేటప్పుడు మనం పికాసో అంతటివాళ్లమైనా ఆ బొమ్మలో మన గొప్పదనం చూపకూడదు. అనువాదం అయినా అంతే' అంటుంది నందిని కృష్ణన్.

మంచి అనువాద రుసుము

'అనువాదంలో రాణించాలంటే మంచి డబ్బు కూడా మనకు ఆఫర్ చేయాలి. తగిన డబ్బు లేకుండా అనువాదం చేయడం అనవసరం' అంటుంది నందిని. 'కొంతమంది కల్లబొల్లి మాటలు చెప్పి అనువాదం చేయించుకోవాలనుకుంటారు. వారి నుంచి జాగ్రత్తగా ఉండాలి. నేను రోజుకు ఆరేడు గంటలు అనువాదం చేస్తాను. ఒక పదానికి బదులు ఎన్ని పదాలు వాడొచ్చో అవసరమైతే లిస్ట్ రాసుకుంటాను. ఒరిజినల్‌ని చదువుతూ, అనువాదాన్ని చదువుకుంటూ పని ముగిస్తాను. పెరుమాళ్ మురుగన్ లాంటి రచయితలు పల్లెల్లో మరీ కొన్ని వర్గాలు మాత్రమే వాడే మాటల్ని ఉపయోగించి రాస్తారు. వాటికి ఇంగ్లిష్ మాటలు ఉండవు. డిక్షనరీలు కూడా ఉండవు. అందుకే అవసరమైతే ఒరిజినల్ రచయితనే సంప్రదిస్తూ డౌట్లు క్లియర్ చేసుకుంటూ అనువాదం ముగించాలి' అంటుంది నందిని.

నందిని లాంటి అనువాదకులు తెలుగులో కూడా ఉంటే మన క్లాసిక్స్ కూడా ప్రపంచ పాఠకులకు తప్పక చేరుతాయి. అనువాదకులకు గుర్తింపునూ తెచ్చిపెడతాయి.

ఫ్యాషన్

సమ్మర్ స్టైల్



అత్యంత వేడిగా ఉండే ఈ సీజన్‌లో తాజాగా వికసించడానికి, స్టైల్‌ని రీస్టైల్ చేయడానికి, ఈ టైమ్‌లెస్ క్లాసిక్ డ్రెస్సులు సరైన ఎంపిక. సమ్మర్ ఫ్యాషన్ ట్రెండ్‌లు ఎప్పుడూ స్టైల్‌కు దూరంగా ఉండవు. వాటిని మళ్ళీ మళ్లీ ధరించవచ్చు. క్యాజువల్ వేర్‌గానూ, పార్టీవేర్‌గానూ ఈ డ్రెస్సులతో సమ్మర్ స్టైల్‌ని సౌకర్యంగా మెరిపించవచ్చు.

ఆఫ్ షోల్డర్ టాప్స్
ట్యూబ్ టాప్స్, ఆఫ్ షోల్డర్స్, బ్రాలెట్స్, బ్యాండో టాప్స్ వంటి వేసవి స్నేహ పూర్వక దుస్తులను ఏ బాటమ్‌కైనా అందాన్నివ్వగలవు. ఈ ట్రెండ్ మిమ్మల్ని అప్రయత్నంగానే స్టైలిష్‌గా కనిపించేలా చేస్తాయి.

పూల ప్రింట్లు
తాజాగా వికసిస్తున్న పూల ప్రింట్లు గల డ్రెస్సులు స్టైలిష్ లుక్‌తో ఆకట్టుకుంటాయి. వేడి వాతావరణంలో కూడా కంటికి, మనసుకు ఆహ్లాదాన్నిస్తాయి. ఈ ప్రింట్స్ ఉన్నప్పుడు ఇక డ్రెస్ పైకి ఇతర అలంకారాలేవీ వాడక్కర్లేదు.

బటన్ డౌన్ షర్ట్
క్యాజువల్ లుక్‌తోనే స్టైలిష్‌గా కనిపించే వాటిలో తెల్లటి కాటన్ షర్ట్ ఎంపిక సరైనది. డే అండ్ నైట్ పార్టీలకూ అనుకూలమైనది. ఈ కాటన్ షర్ట్స్‌కి బాటమ్‌గా ట్రౌజర్స్, పలాజో స్టైల్ ప్యాంట్స్ కూడా ఎంచుకోవచ్చు.

కంఫర్ట్ కుర్తీ
సింపుల్‌గా అనిపించే 'ఎ'లైన్ కాటన్ కుర్తీలు, నీ లెంగ్త్ బాటమ్స్ ఈ సీజన్‌కి బాగా నప్పుతాయి. వీటిలోనే లాంగ్ అండ్ షార్ట్ కుర్తీలు ఎంచుకోవచ్చు. ప్లెయిన్, ప్రింట్ ఎవరి ఎంపిక ఎలా ఉన్నా కలర్స్ విషయంలో లేత రంగులకు ప్రాముఖ్యం ఇవ్వడం మంచిది.

బెల్ స్లీవ్స్
వదులుగా ఉండే ఫ్రాక్స్, కుర్తీలు ఈ సీజన్‌లో ఎక్కువగా ట్రెండ్‌లో ఉంటాయి. బెల్ స్లీవ్ టాప్స్, బ్లౌజ్‌లు, ఫ్రాక్స్, కఫ్తాన్లు, హారమ్ ప్యాంట్స్ మేనికి గాలి తగిలేలా ఉండి, హాయి కలిగిస్తాయి. సౌకర్యంగానూ ఉండటంతో పాటు స్టైల్‌గానూ కనిపిస్తాయి. ఇవి వేసవిలో ట్రెండీ లిస్ట్‌లో అగ్రస్థానంలో ఉంటాయి.

రుచుల నెలవంక

అమావాస్య వెళ్లి పోయింది...
నెలవంక కోసం ఎదురు చూపు మొదలైంది.
చంద్ర దర్శనం నేడు కావచ్చు... లేదా రేపు కావచ్చు.
'ఈద్ ఉల్ ఫిత్ర్' వేడుకకు ఇంటిని సిద్ధం చేద్దాం.
మన 'వంటిల్లు'లో కొలువుదీరిన రుచులను చూద్దాం.

పాకిస్తానీ షీర్ కుర్మా



కావలసినవి: సన్న సేమ్యా – పావుకేజీ; వెన్న తీయని పాలు – లీటరు; చక్కెర – పావుకేజీ; నెయ్యి – కప్పు; జీడిపప్పు – అర కప్పు ; బాదం – అర కప్పు ; పిస్తా – పావు కప్పు; గులాబీ రెక్కలు– గుప్పెడు, యాలకులు – పది.

తయారీ: ★ జీడిపప్పు, బాదం, పిస్తాలను తరగాలి. బాణలిలో నెయ్యి వేడి చేసి వీటన్నింటినీ వేసి సన్నమంట మీద దోరగా వేయించాలి. వేగిన తర్వాత గిన్నెలోకి తీసి పక్కన పెట్టుకోవాలి. మిగిలిన నెయ్యిలో సేమ్యా వేసి వేగిన తరవాత పాలు పోసి కలుపుతూ మరిగించాలి. యాలకులను నలగ్గొట్టి పాలలో వేయాలి. పదిహేను నిమిషాల పాటు మరిగిన తర్వాత చక్కెర వేసి అడుగు పట్టకుండా గరిటతో కలుపుతూ మరిగించాలి. ఖీర్ చిక్కబడిన తర్వాత ముందుగా వేయించి పక్కన పెట్టుకున్న గింజలను, పూలరెక్కలను వేసి కలిపి దించేయాలి.

ఖీమా వడ



కావలసినవి: మటన్ ఖీమా– అర కేజీ ; ఉల్లిపాయ – 3 (ఒకటి పెద్ద ముక్కలుగా తరగాలి, రెండింటిని సన్నగా తరగాలి) ; వెల్లుల్లి రేకలు – పది ; అల్లం– అంగుళం ముక్క ; లవంగాలు – 4 ; దాల్చిన చెక్క – రెండంగుళాల ముక్క ; మిరియాలు – అర టీ స్పూన్ ; సోంపు– పావు టీ స్పూన్ ; పచ్చిమిర్చి– 3 లేదా 4 ; ఉప్పు– టీ స్పూన్ లేదా రుచిని బట్టి; శనగపిండి – పావు కప్పు ; కోడిగుడ్డు – 1 ; కొత్తిమీర కట్ట– 1 (శుభ్రం చేసి సన్నగా తరగాలి) ; పుదీన కట్ట –1 (శుభ్రం చేసి వలిచి పెట్టుకోవాలి) ; నూనె– 2 కప్పులు.

తయారీ: ★మటన్ ఖీమాను శుభ్రం చేసి పక్కన పెట్టుకోవాలి. ★ మిక్సీ జార్‌లో ఉల్లి పెద్దముక్కలు, వెల్లుల్లి రేకలు, అల్లం, లవంగాలు, దాల్చిన చెక్క, మిరియాలు, సోంపు, పచ్చిమిర్చి, ఉప్పు వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. చివరగా ఖీమా కూడా వేసి ఒకసారి తిప్పి ఆపేయాలి. ★ ఈ మిశ్రమాన్ని ఒక పాత్రలోకి తీసుకుని అందులో కోడిగుడ్డు సొన, శనగపిండి వేసి కలపాలి. ఇప్పుడు పుదీన, కొత్తిమీర, సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు వేసి కలపాలి. అవసరమైతే మరికొంత ఉప్పు కలుపుకోవచ్చు. ★బాణలిలో నూనె వేడి చేయాలి. అరచేతులకు రెండు చుక్కల నూనె రాసుకుని ఖీమా మిశ్రమాన్ని నిమ్మకాయంత తీసుకుని వడల్లా వత్తి నూనెలో వేసి మీడియం మంట మీద రెండు వైపులా కరకరలాడేటట్లు కాల్చాలి. మిశ్రమం అంతటినీ ఇలాగే వడలు చేసుకోవాలి. ఖీమా వడలను స్నాక్‌గా తినాలంటే పుదీనా చట్నీ మంచి కాంబినేషన్. సైడ్ డిష్‌గా సాంబార్ రైస్‌లోకి తింటే కూడా బాగుంటాయి.

ఆఫ్ఘన్ మటన్ బిర్యానీ

కావలసినవి: మటన్– కిలో ; బాసుమతి బియ్యం – ముప్పావు కిలో ; లవంగాలు– పది ; దాల్చిన చెక్క – మూడంగుళాల ముక్కలు రెండు ; ఉప్పు – 2 టీ స్పూన్‌లు ; అల్లం వెల్లుల్లి పేస్ట్ – టేబుల్ స్పూన్ ; నీళ్లు– 8 కప్పులు ; నూనె– కప్పు ; ఉల్లిపాయ ముక్కలు – 100 గ్రా ; యాలకులు – 8 ; జీలకర్ర– టీ స్పూన్ ; క్యారట్ తురుము– పావు కేజీ ; కిస్‌మిస్ – అర కప్పు ; పైన్ నట్స్ లేదా బాదం – అరకప్పు, ఖర్జూరాలు ; పది.

తయారీ: ★ మటన్ ముక్కలను శుభ్రంగా కడగాలి. బియ్యాన్ని కడిగి మునిగేటట్లు నీటిని పోసి పక్కన ఉంచాలి. ★ మందపాటి పెద్ద పాత్రలో మాంసం ముక్కలు, ఒక దాల్చిన చెక్కను పలుకులు చేసి వేయాలి. సగం లవంగాలు, ఉప్పు, అల్లంవెల్లుల్లి పేస్ట్ వేసి కలిపి నీటిని పోసి ఉడికించాలి. ముక్క ఉడకడానికి దాదాపు ముప్పావు గంట పడుతుంది. ★ బియ్యంలో నీటిని వడపోసి చిల్లుల పాత్రలో వేసి రెండు నిమిషాల సేపు ఉంచాలి. ★ మరొక పెనంలో రెండు టేబుల్ స్పూన్‌ల నూనె వేడి చేసి పైన్ నట్స్ లేదా బాదం, కిస్‌మిస్, క్యారట్‌లను వేయించి పక్కన ఉంచాలి. ★ ఇప్పుడు పెద్ద పెనం పెట్టి నూనె వేడి చేసి ఉల్లిపాయ ముక్కలను ఎర్రగా వేయించి అందులో మరో దాల్చిన చెక్క పలుకులు, మిగిలిన సగం లవంగాలు, యాలకులు, జీలకర్ర వేయాలి. ఇవి కొద్దిగా వేగిన తరవాత ఉడికించిన మాంసాన్ని నీరు ఇతర దినుసులతో సహా ఇందులో వేయాలి. ఉడకడం మొదలైన తర్వాత బియ్యాన్ని వేసి కలిపి మూత పెట్టాలి. మీడియం మంట మీద ఉడికించాలి. పది నిమిషాల్లో ఉడుకుతుంది. మధ్యలో ఓ సారి జాగ్రత్తగా మసాలా దినుసులు సమంగా కలవడం కోసం బియ్యం విరగకుండా కలపాలి. ★ ఇప్పుడు ముందుగా వేయించి పెట్టుకున్న క్యారట్, కిస్‌మిస్ మిశ్రమాన్ని, ఖర్జూరాలను బిర్యానీ మీద సమంగా పరిచినట్లు అమర్చి గట్టిగా మూత పెట్టి, మంట తగ్గించాలి. ఏడెనిమిది నిమిషాలకు బిర్యానీ రెడీ అవుతుంది. వేడిగా ఉన్నప్పుడే రైతాతో తింటే చాలా రుచిగా ఉంటుంది.



చెట్టినాడ్ మటన్ కొళంబు



కావలసినవి: మటన్– అర కేజీ ; ఉల్లిపాయ ముక్కలు – కప్పు ; పచ్చిమిర్చి– 4 (నిలువుగా చీరాలి); కరివేపాకు రెమ్మలు –పది ; టొమాటో ముక్కలు – కప్పు ; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి ; పసుపు– అర టీ స్పూన్ ; కశ్మీరీ మిరప్పొడి– 2 టీ స్పూన్‌లు ; నూనె– 4 టేబుల్ స్పూన్‌లు.

మసాలా కోసం: జీడిపప్పు – టేబుల్ స్పూన్ ; ఎండు మిర్చి –8 ; జీలకర్ర – టీ స్పూన్ ; సోంపు– టీ స్పూన్ ; లవంగాలు – 3 ; దాల్చిన చెక్క – అంగుళం ముక్క ; మిరియాలు– 2 టీ స్పూన్‌లు ; వెల్లుల్లి తరుగు – టీ స్పూన్ ; ఉల్లి పాయ ముక్కలు – అర కప్పు ; తాజా కొబ్బరి తురుము – 2 టేబుల్ స్పూన్‌లు.

తయారీ: ★ మటన్‌ను శుభ్రంగా కడిగి పెట్టాలి. ★ మసాలా కోసం తీసుకున్న జీడిపప్పు, ఎండుమిర్చి, జీలకర్ర, సోంపు, లవంగాలు, చెక్క, మిరియాలను మందపాటి బాణలిలో సన్న మంట మీద ఒక మోస్తరుగా వేయించాలి. చల్లారిన తర్వాత మిగిలిన మసాలా దినుసులతో పాటు మిక్సీలో గ్రైండ్ చేసి పక్కన పెట్టుకోవాలి. ★ ప్రెషర్ కుక్కర్ పెనంలో నూనె వేడి చేసి అందులో ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి, కరివేపాకు వేసి వేయించాలి. ఉల్లిపాయలు దోరగా వేగిన తరవాత టొమాటో ముక్కలు వేసి రెండు– మూడు నిమిషాల పాటు మీడియం మంట మీద మగ్గనివ్వాలి. ఇందులో పసుపు, కశ్మీరీ మిరప్పొడి వేసి కలపాలి. ఇప్పుడు ముందుగా సిద్ధం చేసుకున్న గరం మసాలా పేస్ట్ వేసి రెండు నిమిషాల సేపు వేయించిన తర్వాత మాంసం ముక్కలు వేసి కలిపి రెండు కప్పుల నీటిని పోసి మూత పెట్టి దాదాపు అరగంట సేపు ఉడికించాలి. ★ కుక్కర్ ప్రెషర్ తగ్గిన తరవాత మెల్లగా మూత తీసి చూడాలి. నీరు మరీ తక్కువగా అనిపిస్తే అరకప్పు నీటిని పోయాలి. ఉప్పు కూడా సరిచూసుకుని అవసరమైతే కలుపుకుని చివరగా కొత్తిమీర తరుగు చల్లాలి. ఒకవేళ నీటిని పోస్తే మళ్లీ స్టవ్ మీద పెట్టి కర్రీ మరిగే స్థితికి వచ్చే వరకు కలుపుతూ ఉడికించాలి.

బ్యూటిప్స్

రోజంతా తాజాగా!

చర్మం కాస్త డల్‌గా... జీవం కోల్పోయినట్టుగా ఉంటే ఇలాంటి జాగ్రత్తలు తీసుకోవచ్చు.



➡ ఒంటికి చెమట పట్టేలా చేసే రన్నింగ్, జాగింగ్, వాకింగ్ వంటివి తప్పనిసరిగా రోజులో 20 నిమిషాలైనా చేయాలి. చెమట ద్వారా స్వేదరంధ్రాలలో చేరిన మురికి విడుదల అవుతుంది. యోగా వల్ల రక్తప్రసరణ మెరుగై చర్మం ఆరోగ్యంగా నిగనిగలాడుతుంది.

➡ చర్మం పొడిబారుతోంది అంటే సరైన నిద్రకు దూరంగా ఉన్నారని అర్థం చేసుకోవాలి. రోజూ ఎనిమిది గంటల నిద్ర లేకపోతే కళ్ల కింద వలయాలు ఏర్పడతాయి. ఉదయం, రాత్రి పడుకునే ముందు వేలి కొసలతో తేనె అద్దుకొని కళ్ల కింద ఉబ్బుగా ఉన్న చోట రాయాలి. అలాగే ముఖమంతా తేనె రాసి, మృదువుగా రుద్దాలి. తర్వాత చల్లటి నీళ్లతో కడిగేయాలి. ఇలా వారంలో మూడు సార్లు చేస్తే చర్మకాంతి పెరుగుతుంది.

➡ రోజూ రాత్రి పడుకునే ముందు ఆలివ్ ఆయిల్‌లో ముంచిన దూది ఉండతో ముఖమంతా రాయాలి. అదే ఉండతో కాస్త ఒత్తిడి పెడుతూ మసాజ్‌లా చేయాలి. దీంతో ముఖంపైన దాగున్న దుమ్ము కణాలు, శుభ్రపరిచినా మిగిలిన మేకప్ సులువుగా వదిలిపోతుంది. తర్వాత ముఖాన్ని ఫేస్ వాష్‌తో శుభ్రపరుచుకొని మాయిశ్చరైజర్ రాసుకోవాలి.

➡ నీటి శాతం ఎక్కువ ఉండే పుచ్చకాయ, దోసకాయ, ఆరెంజ్, స్ట్రాబెర్రీ వంటి పండ్లను తినాలి.

➡ చర్మం జీవం లేనట్టుగా కనిపిస్తే రోజూ తగినన్ని నీళ్లు తాగడం లేదని అర్థం. అందుకని రోజూ 8 గ్లాసుల నీళ్లు తప్పనిసరిగా తాగాలనే నియమం పాటించాలి. అలాగే, రోజులో మూడుసార్లు సబ్బు లేకుండా కేవలం మంచినీళ్లతో ముఖాన్ని శుభ్రపరిచి, మాయిశ్చరైజర్ రాయాలి. ఈ జాగ్రత్తలు పాటిస్తే చర్మం సహజకాంతితో కళకళలాడుతుంది.


'ఎన్ని కరువులనైనా ఎదుర్కోగలగాలి
దీని కోసం ఆర్థికంగా ఎదగాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 29

శుక్రవారం 21-4-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సిరాజ్ సూపర్ షో...

పంజాబ్ కింగ్స్‌ను నాలుగు వికెట్లతో హడలెత్తించిన ఆర్‌సీబీ పేసర్. -13లో



అక్షయకు పుత్తడి మెరిసేనా?


బంగారం ధర పెరగడంతో అక్షయ తృతీయకు విక్రయాలు 20% తగ్గే అవకాశం. -13లో



రాహుల్ గాంధీకి ఎదురుదెబ్బ

పరువు నష్టం కేసులో జైలు శిక్షపై స్టే ఇవ్వాలని కోరుతూ రాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌ను సూరత్ కోర్టు తిరస్కరించింది.

- వివరాలు 6లో



బుద్ధుని బోధనలే మార్గదర్శకాలు

ఎన్నో సమస్యలకు బుద్ధుడి బోధనలు పరిష్కారాలు చూపగలవని గ్లోబల్ బుద్దిస్ట్ సమ్మిట్ సెషన్‌లో ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు.

- వివరాలు 6లో



అమృత్‌పాల్ భార్య అడ్డగింత

ఖలిస్తానీ అనుకూల బోధకుడు అమృత్‌పాల్ సింగ్ భార్య కిరణ్‌దీప్ కౌర్‌ను అమృత్‌సర్ విమానాశ్రయంలో అధికారులు అడ్డుకున్నారు.

- వివరాలు 6లో



గోవాలో ఎస్‌సీవో భేటీకి బిలావల్

మే 4, 5వ తేదీల్లో గోవాలో జరిగే ఎస్‌సీవో విదేశాంగ మంత్రుల భేటీకి పాక్ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో హాజరుకానున్నారు.

- వివరాలు 6లో



పేలిపోయిన 'స్టార్ షిప్'

చంద్రుడు, అంగారకుడిపైకి మానవ సహిత యాత్రల కోసం స్పేస్‌ఎక్స్ సంస్థ అభివృద్ధి చేసిన ప్రపంచంలోనే అతి భారీ రాకెట్ 'స్టార్‌షిప్'.. ప్రయోగాత్మకంగా చేపట్టిన తొలి పరీక్షలో పేలిపోయింది. అమెరికాలోని టెక్సాస్‌లో ఉన్న బొకచికా ల్యాంచ్ ప్యాడ్ నుంచి ప్రయోగించిన కొద్ది నిమిషాల్లోనే.. ప్రధాన బూస్టర్‌లో లోపంతో 40 కిలోమీటర్ల ఎత్తున పేలింది.

- 'స్టార్‌షిప్' ప్రధాన రాకెట్, బూస్టర్లు కలిపి ఎత్తు 120 మీటర్లు (సుమారు 40 అంతస్తుల భవనం ఎత్తు).
- ఇంధనంతో కలిపి రాకెట్ మొత్తం బరువు 5వేల టన్నులు.. అంతరిక్షంలోకి ఏకంగా 100 టన్నుల బరువైన పేలోడ్‌ను తీసుకెళ్లగలిగే సామర్థ్యం ఉంది.
- స్టార్‌షిప్ ప్రయోగాల కోసం చేస్తున్న ఖర్చు సుమారు రూ.80 వేల కోట్లు.



కశ్మీర్‌లో ఉగ్రఘాతుకం..

ఐదుగురు జవాన్ల వీరమరణం..

- జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో ఉగ్రవాదుల దాడిలో ఐదుగురు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. గురువారం మధ్యాహ్నం భింబెర్ గలి నుంచి సింగియోట్ వైపు వస్తున్న సైనిక వాహనంపైకి ఉగ్రవాదులు కాల్పులు జరపడంతో నిప్పంటుకుంది. దీంతో, అందులోని ఐదు గురు జవాన్లు సజీవ దహనం కాగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. - 6లో

బీజేపీలో 'చేరికల' కాక!

అమిత్ షా పర్యటన నేపథ్యంలో రాష్ట్ర నేతల్లో ఆందోళన

కొత్తగా చేరికలు లేకపోవడంపై ఏం చెప్పాలని తర్జనభర్జన

- చేవెళ్ల సభ అనంతరం రాష్ట్ర కోర్ కమిటీతో భేటీ కానున్న షా
- గత కోర్ కమిటీ భేటీ నుంచి నేటిదాకా ప్రోగ్రెస్ రిపోర్ట్ అడిగితే ఎలా?
- నేతల ఇళ్లల్లో 'విందు సమావేశాల'పై ముందుకు పడని అడుగులు
- బూత్ కమిటీల నియామకాలూ పూర్తికాని వైనం
- అమిత్‌షా వద్ద ప్రస్తావించాల్సిన అంశాలపై కుదరని ఏకాభిప్రాయం
- పార్టీకి బలం లేని చేవెళ్లలో ప్రవాసీ యోజన సభ ఎందుకనే సందేహాలు
- బీజేపీలో చేరికపై ఎలాంటి స్పష్టతనివ్వని పొంగులేటి, జూపల్లి



సాక్షి, హైదరాబాద్: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాష్ట్ర పర్యటన ఆ పార్టీ ముఖ్య నేతల్లో కాక రేపుతోంది. 'హార్డ్ టాస్క్ మాస్ట ర్'గా పేరొందిన అమిత్ షా ఇంతకుముందు వచ్చినప్పుడు రాష్ట్ర పార్టీకి పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఆరేడు నెలల్లోనే ఎన్నికలున్న నేపథ్యంలో పూర్తిస్థాయిలో పార్టీ సన్నద్ధత, సంస్థాగత బలోపేతం, ఇతర పార్టీల నుంచి చేరికల వేగవంతానికి చేపట్టాల్సిన చర్యలను సూచించారు. అయితే ఆయా అంశాల్లో ఆశించిన మేర ముందుకు సాగని పరిస్థితిలో అమిత్‌షాకు ఏం చెప్పాలనే దానిపై ముఖ్యనేతల్లో ఆందోళన కనిపిస్తున్నట్టు సమాచారం. దీనికితోడు ఎన్నికలకు పూర్తిస్థాయి సన్నద్ధతలో భాగంగా అమిత్ షా ఎలాంటి కఠిన అసైన్‌మెంట్లు ఇస్తారోనన్న టెన్షన్ రాష్ట్ర ముఖ్యనేతలను కలవరపెడుతోందని పార్టీ వర్గాలు చెప్తున్నాయి.


ఊపందుకోని చేరికల కార్యాచరణ

మునుగోడు ఉప ఎన్నికలకు ముందు మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఆ తర్వాత ఇటీవల కాంగ్రెస్ నుంచి మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి తప్ప ముఖ్య నేతలెవరూ బీజేపీలో చేరలేదు. ఉమ్మడి జిల్లాల స్థాయిలో ప్రభావమున్న నాయకుల చేరికలు కూడా జరగలేదు. జాతీయస్థాయి నేతలు

మిగతా 11వ పేజీలో ▶

కొత్త డిగ్రీలు నాలుగేళ్లు!

- కొత్త కోర్సులన్నీ ఆనర్స్‌వే...
- డిగ్రీతోనూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు వచ్చేలా ఆనర్స్‌లో కంప్యూటర్ కోర్సులు
- ఓయూ పరిధిలో కొత్తగా లైఫ్‌సైన్స్
- డిగ్రీ కోర్సులకు నైపుణ్యం మేళవించి రూపకల్పన
- దశలవారీగా ప్రవేశపెట్టే యోచనలో ఉన్నత విద్యామండలి
- మూడేళ్లు చదివితే డిగ్రీ పట్టా, నాలుగేళ్లు పూర్తి చేస్తే ఆనర్స్ పట్టా ఇచ్చే యోచన



సాక్షి, హైదరాబాద్: ఇక నుంచి డిగ్రీలో కొత్తగా వచ్చే కోర్సులన్నీ నాలుగేళ్ల కాలపరిమితితో ఉండబోతున్నాయి. వచ్చే విద్యాసంవత్సరం నుంచే దీన్ని అమలు చేయబోతున్నారు. ఈమేరకు ఉన్నత విద్యామండలి కీలక నిర్ణయం తీసుకుంది. జాతీయ విద్యా విధానం–2020ని అనుసరించి, ఉన్నత విద్యలో గుణాత్మక మార్పులకు శ్రీకారం చుడుతున్నారు. డిగ్రీ కోర్సులకు నైపుణ్యం మేళవించి రూపొందించాలని భావిస్తున్నారు. సాధారణ డిగ్రీ కోర్సుల స్థానంలో ఆనర్స్ కోర్సులను ప్రవేశపెట్టాల్సిన అవసరాన్ని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) అన్ని రాష్ట్రాలకు తెలిపింది. ఇందులోభాగంగా యూజీసీ చైర్మన్ ఇటీవల పలు రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపి సాధ్యాసాధ్యాలపై నివేదికను కోరినట్టు అధికార వర్గాలు చెప్పాయి. ఈ విషయమై యూజీసీ చైర్మన్ ప్రొఫెసర్ జగదీశ్ కుమార్‌తో మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి చర్చించారు. ఆనర్స్ కోర్సులపై ఉన్నత విద్యామండలి త్వరలో అన్ని విశ్వవిద్యాలయాల వీసీలతో చర్చించాలని నిర్ణయించింది.

ఓయూలో లైఫ్‌సైన్స్ ఆనర్స్

నాలుగేళ్ల డిగ్రీ కోర్సులను దశలవారీగా ప్రవేశపెట్టాలనే యోచనలో మండలి ఉంది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 2.20 లక్షల మంది డిగ్రీ కోర్సుల్లో చేరుతున్నారు. వీరిలో ఎంతవరకు నాలుగేళ్ల కోర్సులను ఇష్టపడతారనే దానిపై అధ్యయనం చేయాలని భావిస్తున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని సదుపాయాలున్న కాలేజీల్లో తొలుత ఆనర్స్ కోర్సులను ప్రవేశపెట్టాలని భావిస్తున్నారు. డిగ్రీలో ఎంచుకునే ఏదైనా సబ్జెక్టును పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా, లోతైన బోధన విధానంతో అమలు చేయడమే ఆనర్స్ కోర్సుల ఉద్దేశం. మహిళా విశ్వవిద్యాలయం, ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో పొలిటికల్ సైన్స్, బీకాం ఆనర్స్ కోర్సులను ఇప్పటికే ప్రవేశపెట్టారు. ఇదే తరహాలో ఓయూ పరిధిలో లైఫ్ సైన్స్ కోర్సును ఆనర్స్‌గా తేవాలనే యోచన ఉంది. కొంతకాలంగా దేశ విదేశాల్లో

మిగతా 5వ పేజీలో ▶

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు అనువైన కోర్సులు

అన్ని దేశాల్లోనూ సాఫ్ట్‌వేర్ రంగం విస్తరిస్తోంది. ఉపాధి అవకాశాలూ ఇందులో ఎక్కువగా ఉంటున్నాయి. ఈ కారణంగా విద్యార్థులు ఇంజనీరింగ్ బాట పడుతున్నారు. అయితే, డిగ్రీతోనూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు వచ్చేలా కంప్యూటర్ కోర్సులను ఆనర్స్‌గా అందించాలని నిర్ణయించారు. బీఎస్సీ ఆనర్స్ పేరుతో తెచ్చే ఈ కోర్సుల్లో కంప్యూటర్ సైన్స్‌ను జోడించబోతున్నారు. సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ కోర్సులను తెచ్చే యోచనలో ఉన్నారు. బీఎస్సీ (ఆనర్స్) కోర్సును రాష్ట్రంలోని ఏడు విశ్వవిద్యాలయాల పరిధిలో పరిమితంగా ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో కోర్సును ప్రారంభించేలా అనుమతులివ్వాలని ఉన్నత విద్యామండలి ప్రతిపాదించింది. ఆనర్స్ కోర్సుల్లో మూడేళ్లు చదివితే డిగ్రీ పట్టా ఇవ్వాలని, నాలుగేళ్లు పూర్తి చేస్తే ఆనర్స్ డిగ్రీ పట్టా ఇవ్వాలని భావిస్తున్నారు.

ఈఎస్ఐలో కొలువుల భర్తీ



ఈఎస్ఐ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో వైద్య కొలువుల భర్తీకి ఈఎస్ఐసీ ఉపక్రమించింది. కాంట్రాక్టు ప్రాతిపదికన డాక్టర్ల నియామకానికి ప్రకటన విడుదల చేసింది. 4 కేటగిరీల్లో 40 పోస్టులు భర్తీ కానున్నాయి.

- వివరాలు 2లో

100 మంది మహిళలతో మిల్లెట్ ఔట్‌లెట్లు



మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా వారిని వ్యాపారవేత్తలుగా మలిచేందుకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలోని టీఎస్ ఆగ్రోస్ చర్యలు చేపట్టింది. చిరుధాన్యాల ఉత్పత్తుల స్టార్టప్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

- వివరాలు 10లో

కాంగ్రెస్‌లో 'ఎంపీలాట'!

- నల్లగొండ నిరుద్యోగ సభ నిర్వహణలో సమన్వయ లోపం
- 21న చేపడతామని తొలుత ప్రకటన.. దానిపై నేతల్లో జగడం
- అధిష్టానం నేతల జోక్యం.. 28న నిర్వహించేందుకు నిర్ణయం
- ఈ నెల 24 నుంచి వరుసగా పలు జిల్లాల్లో సభలు
- మే 4న లేదా 5న సరూర్‌నగర్ స్టేడియంలో ప్రియాంకా గాంధీ సభ



సాక్షి, హైదరాబాద్: నిరుద్యోగ సభల నిర్వహణ విషయంలో కాంగ్రెస్‌లో సమన్వయ లోపం మరోసారి కనిపించింది. నల్లగొండ సభ విషయంలో ముఖ్యనేతల మధ్య వివాదం తలెత్తడంతో.. అధిష్టానం జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. చివరికి శుక్రవారమే జరగాల్సిన ఈ సభ 28వ తేదీకి వాయిదా పడింది. టీఎస్‌పీఎస్సీ పరీక్షల లీకేజీ, నిరుద్యోగుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరిపై నిరసనలు చేపట్టాలని రాష్ట్ర కాంగ్రెస్ నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా పలు జిల్లా కేంద్రాల్లో నిరుద్యోగ సభలతోపాటు వచ్చేనెల మొదటి వారంలో పార్టీ ముఖ్యనేత ప్రియాంకా గాంధీతో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు టీపీసీసీ సిద్ధమైంది. నల్లగొండలో శుక్రవారం నిరుద్యోగ సభ నిర్వహిస్తామని ప్రకటించింది. కానీ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న నల్లగొండలో నిర్వహించే సభ గురించి తనకు సమాచారం లేదని ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఇక రేవంత్ తీసుకునే నిర్ణయాలన్నీ ఏకపక్షంగా ఉంటాయని కొంతకాలంగా విమర్శలు గుప్పిస్తున్న మరో ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నల్లగొండ అసెంబ్లీ స్థానానికి ఇన్‌చార్జిగా ఉండి కూడా.. నల్లగొండ సభ విషయంలో

మిగతా 5వ పేజీలో ▶



ఎండకు వెళ్తే మండిపోతారు!

- తీవ్ర అస్వస్థతకు గురవుతున్న ప్రజలు.. జ్వరాలు, డీహైడ్రేషన్‌తో ఆసుపత్రులపాలు
- జాగ్రత్తలు తీసుకోకపోతే తీవ్ర అనారోగ్యం
- తాజా పండ్లు, కూరగాయలు తినాలంటున్న నిపుణులు
- పలు సూచనలు చేసిన ప్రపంచ ఆరోగ్య సంస్థ - 2లో

నరోడా గామ్ కేసులో 67 మంది నిర్దోషులే

- రెండు దశాబ్దాల క్రితం నాటి నరోడా గామ్ ఊచకోత కేసులో అహ్మదాబాద్‌లోని ప్రత్యేక కోర్టు గురువారం సంచలన తీర్పు వెలువరించింది. అహ్మదాబాద్‌లోని నరోడా గామ్‌లో జరిగిన మత ఘర్షణల్లో మైనార్టీ వర్గానికి చెందిన 11 మంది బలయ్యారు. ఈ కేసులో మొత్తం 67 మంది నిందితులను కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. వీరిలో గుజరాత్ మాజీ మంత్రి మాయా కొద్నానీ, బజరంగ్ దళ్ మాజీ నాయకుడు బాబూ బజరంగీ, వీహెచ్‌పీ మాజీ నేత జయదీప్ పటేల్ ఉన్నారు. - 6లో

ఆవిర్భావ దినోత్సవానికి బీఆర్‌ఎస్ సన్నాహాలు

- 27న తెలంగాణ భవన్‌లో కేసీఆర్ అధ్యక్షతన పార్టీ ప్రతినిధుల భేటీ
- 300 మందికే ఆహ్వానాలు - 11లో
- అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలపై దిశానిర్దేశం చేయనున్న కేసీఆర్

'విశాఖ ఉక్కు'కు తెలంగాణ దూరం

- విశాఖ ఉక్కు ఆసక్తి వ్యక్తీకరణ ప్రక్రియలో పాల్గొనని రాష్ట్ర సర్కారు, సింగరేణి సంస్థ
- సింగరేణి సంస్థ వద్ద నగదు రూపంలో నిధుల లేమి
- ప్రభుత్వ ఖజానా నుంచే ఇవ్వాల్సి ఉంటుందని నివేదిక
- భారంగా మారే అవకాశం ఉండడంతో వెనక్కి తగ్గిన ప్రభుత్వం! - 11లో

'వైజాగ్ స్టీల్‌ప్లాంట్'పై కేసీఆర్ తోక ముడిచాడు

- బిడ్డింగ్‌లోనే పాల్గొనలేదు.. కేసీఆర్‌ను చూసి దేశమంతా నవ్వుతోంది
- అమిత్ షా బహిరంగ సభ సన్నాహక భేటీలో బండి సంజయ్

- వివరాలు 11లో

ఇదీ సంగతి



ప్రపంచంలో అత్యధిక 'ఓటర్లు' మనకే ఉన్నారు

ప్రకృతివనం.. కొరవడిన పచ్చదనం



మోడువారిన లక్ష్మీపురం వనం

ఇది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలంలోని రాఘబోయినగూడెం జీపీ పరిధిలోని లక్ష్మీపురం గ్రామ పల్లె ప్రకృతివనం. 2020–21లో గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఈజీఎస్) కింద ఎకరం విస్తీర్ణంలో 913 మొక్కలు నాటారు. రెండేళ్లపాటు నిర్వహణ ఈజీఎస్ చూడటంతో వర్కర్లకు వేతనం అందింది. గత ఏడాది ఏప్రిల్ నుంచి గ్రామ పంచాయతీకి బాధ్యతలు అప్పగించిన తర్వాత క్రమంగా మొక్కలన్నీ ఎండిపోయాయి. ఇక్కడ నీరందించేందుకు బోరు వేసినా మోటారు బిగించలేదు.

- గ్రామాల్లో ఎండిపోతున్న పల్లె ప్రకృతి వనాలు
- పంచాయతీల్లో సిబ్బందికి నాలుగు నెలలుగా వేతనాలు కరువు
- మొక్కల సంరక్షణపై దృష్టి సారించని వైనం
- కొన్నిచోట్ల బోర్లు లేవు.. పెనుభారంగా ట్యాంకర్ల నిర్వహణ
- నీళ్లు లేక, వేసవి తీవ్రతతో ఎండిపోతున్న పూలు, పండ్ల మొక్కలు

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: పలు జిల్లాల్లో గ్రామపంచాయతీల సిబ్బందికి రెండు నుంచి నాలుగు నెలల వేతనాలు రాకపోవడంతో మొక్కల సంరక్షణపై దృష్టి సారించడం లేదు. ఇంకొన్ని ప్రాంతాల్లో నీటి వసతిలేదు. కొన్నిచోట్ల అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినా పెద్దగా ఫలితం ఉండడం లేదు. వీటికి వేసవి తోడు కావడంతో.. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతివనాలు ఎండిపోతున్నాయి.

12,769 గ్రామపంచాయతీల్లో ఏర్పాటు

ఏటా నిర్వహించే హరితహారంలో భాగంగా ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 12,769 గ్రామపంచాయతీల్లో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. పల్లెవాసులకు పచ్చదనంతో ఆహ్లాదాన్ని పంచేందుకు పూలు, పండ్లు, నీడనిచ్చే మొక్కలను నాటారు. అక్కడ సేద తీరేందుకు వీలుగా బెంచీలు కూడా ఏర్పాటు చేశారు. ఉపాధి హామీ పథకం కింద గత రెండేళ్లు వీటి నిర్వహణ బాగానే సాగింది. నర్సరీల పెంపకం, పల్లె ప్రకృతి వనాల్లో మొక్కలు నాటడం, నీటి వసతి, వన సేవకులకు వేతనం అంతా ఈ పథకం ద్వారా చెల్లించడంతో ఎలాంటి ఇబ్బంది ఎదురుకాలేదు. అయితే గత ఏడాది ఏప్రిల్ నుంచి పల్లె ప్రకృతి వనాల నిర్వహణ బాధ్యతను గ్రామ పంచాయతీ (జీపీ)లకు అప్పగించడంతో పరిస్థితి మారింది.

పలు జిల్లాల్లో పూర్తిగా ఎండిపోయి..

ప్రకృతి వనాల్లో మొక్కల సంరక్షణ చూసుకునే బాధ్యత గ్రామపంచాయతీ వర్కర్లకు అప్పగించారు. అయితే వీరికి రెండు నుంచి నాలుగు నెలలుగా వేతనాలు అందడం లేదు. దీంతో వీరు బాధ్యతలపై దృష్టి సారించడం లేదని తెలుస్తోంది. కొన్నిచోట్ల వనాల్లో బోర్లు లేక కూడా మొక్కలు

మిగతా 5వ పేజీలో ▶

ఇది వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని నెక్కొండ తండాలో ఏర్పాటు చేసిన ప్రకృతి వనం. ప్రస్తుతం విపరీతమైన ఎండలతో మొక్కలు ఎండిపోతున్నాయి. ఇక్కడ సారవంతమైన భూమికి బదులుగా చౌడు భూమిలో మొక్కలు నాటారు. దీంతో మొక్కలు మామూలుగానే సరిగా ఎదగలేదు. ప్రస్తుతం వేసవి తాపానికి తోడు తగిన నీరందకపోవడంతో ఎండిపోతున్నాయి.

అసలే ఎదగలేదు.. ఆపై నీరందక..



క్లుప్తంగా...

కాశీ తెలుగు సంగమానికి ప్రధాని మోదీ

29న తెలుగువారిని ఉద్దేశించి ప్రసంగం



సాక్షి, న్యూఢిల్లీ: గంగా పుష్కరాల్లో భాగంగా వారణాసిలో ఈ నెల 29న శ్రీకాశీ తెలుగు సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న కాశీ తెలుగు సంగమంలో ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా పాల్గొంటారు. ఈ సందర్భంగా తెలుగు యాత్రికులను ఉద్దేశించి ప్రధాని కాశీ తెలుగు సంగమం సభలో ప్రసంగిస్తారని శ్రీకాశీ తెలుగు సమితి అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు తెలిపారు. ఆయన గురువారం ఢిల్లీలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ, ఏప్రిల్ 22 నుంచి మే 3 వరకు 12 రోజులపాటు జరిగే గంగా పుష్కరాల్లో పాల్గొనేందుకు వారణాసికి వచ్చే తెలుగు యాత్రికులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాటు చేశామన్నారు. ఐదు బస్సు రూట్లను ప్రత్యేకంగా గుర్తించి 50 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారని తెలిపారు. గుంటూరు, తిరుపతి, సికింద్రాబాద్, విశాఖపట్నం నుంచి వారణాసికి ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు జీవీఎల్ తెలిపారు.

ఆ రైల్వేస్టేషన్లను ఆధునీకరించండి



సాక్షి, న్యూఢిల్లీ: భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని భువనగిరి, జనగామ రైల్వేస్టేషన్ల ఆధునీకరణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరారు. తెలంగాణలో ప్రముఖంగా రాకపోకలు సాగిస్తున్న రైల్వేస్టేషన్ భువనగిరి అని, యాదాద్రిలోని శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దేవాలయానికి 12 కిలోమీటర్ల దూరంలో ఉందని తెలిపారు. జనగామ నుంచి కూడా హైదరాబాద్‌కు రోజూ విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారస్తులు రాకపోకలు సాగిస్తుంటారని పేర్కొన్నారు. ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న భువనగిరి, జనగామ రైల్వేస్టేషన్లను ఆధునీకరించాల్సిన అవసరం ఉందన్నారు. ఎంఎంటీఎస్‌ను ఘట్‌కేసర్ నుంచి రాయగిరి వరకు పొడిగించాలని ఎంపీ కోమటిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

జేఈఈ మెయిన్-2 కీ విడుదల

సాక్షి, హైదరాబాద్: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఇటీవల నిర్వహించిన జేఈఈ రెండో విడతకు సంబంధించిన సమాధానాలతో కూడిన కీని గురువారం విడుదల చేసింది. ఈ కీ ఆధారంగా అభ్యర్థులు మార్కులు పరిశీలించుకోవచ్చని, కీలో ఏవైనా అభ్యంతరాలుంటే సవాల్ చేయవచ్చని పేర్కొంది. వీటి పరిశీలన పూర్తయిన తర్వాత ఈ నెల 23 లేదా 24 తేదీల్లో ఫలితాలు వెల్లడించే అవకాశం ఉంది. ఇప్పటి వరకూ అందిన సమాచారం ప్రకారం జేఈఈ మెయిన్-2లో హైదరాబాద్‌కు చెందిన సింగవరపు వెంకట కౌండిన్య 300కు 300 మార్కులు సాధించారు.

జూన్ 6న అంబేడ్కర్ వర్సిటీ బీఈడ్ అర్హత పరీక్ష

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం బీఎడ్, బీఎడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ అర్హత పరీక్ష 2022-23కు దరఖాస్తులకు ఆహ్వానిస్తోంది. దరఖాస్తుకు మే 22 చివరి తేదీ అని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత పరీక్ష కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంట్రన్స్ ఫీజు రూ. 1,000, (ఎస్సీ, ఎస్టీ, వికలాంగులకు, రూ. 750)గా నిర్ణయించారు. జూన్ 6న రెండు తెలుగు రాష్ట్రాల్లో బీఎడ్ ప్రవేశ పరీక్ష ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, బీఎడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరగనుంది.

లైబ్రేరియన్ పోస్టు దరఖాస్తులో ఎడిట్ ఆప్షన్

సాక్షి, హైదరాబాద్: సాంకేతిక విద్యాశాఖ కమిషనరేట్‌పరిధిలోని లైబ్రేరియన్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు టీఎస్‌పీఎస్సీ ఎడిట్ అవకాశాన్ని కల్పించింది. వివరాలు సరిచేసుకోవాలనుకునే అభ్యర్థులు ఈ నెల 25 నుంచి 27వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు సవరణను పూర్తి చేసుకోవాలని టీఎస్‌పీఎస్సీ స్పష్టం చేసింది. అనంతరం అభ్యర్థులు వారి దరఖాస్తు పత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది.

సీఎం కప్ క్రీడలకు కార్యాచరణ సిద్ధం చేయండి

సాక్షి, హైదరాబాద్: వచ్చేనెలలో నిర్వహించనున్న సీఎం కప్ ఆటల పోటీలకోసం కార్యాచరణ సిద్ధం చేయాలని రాష్ట్ర క్రీడాశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ క్రీడాకారులలో ఉన్న ప్రతిభను వెలికి తీయాలనే లక్ష్యంతో మే నెలలో ఈ పోటీలను ప్రభుత్వం నిర్వహిస్తోంది. మే నెలాఖరులోగా క్రీడలను ముగించి విజేతలకు జూన్ 2న బహుమతులు అందజేయాలని ఆయన సూచించారు.

ఈఎస్‌ఐలో కొలువుల భర్తీ

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో కాంట్రాక్టు డాక్టర్ పోస్టుల భర్తీకి ప్రకటన

- సీనియర్ రెసిడెంట్, సూపర్ స్పెషలిస్ట్, సీనియర్, జూనియర్ కన్సల్టెంట్ కేటగిరీలో 40 ఖాళీలు
- గరిష్ట వయోపరిమితి 69 ఏళ్లుగా నిర్ధారించిన ఈఎస్ఐసీ, ఏజ్ రిలాగ్జేషన్ అమలు
- ఇంటర్వ్యూ పద్ధతిలో పోస్టుల భర్తీ... నిర్దేశించిన సమయంలో దరఖాస్తుతో హాజరైతే సరి
- ఈనెల 25 నుంచి వరుసగా ఇంటర్వ్యూలు... షెడ్యూల్ విడుదల

సాక్షి, హైదరాబాద్: ఈఎస్ఐ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో వైద్య కొలువుల భర్తీకి ఈఎస్ఐసీ ఉపక్రమించింది. వివిధ కేటగిరీల్లో ఉన్న పోస్టుల్లో కాంట్రాక్టు ప్రాతిపదికన డాక్టర్ల నియామకానికి ప్రకటన విడుదల చేసింది. నాలుగు కేటగిరీల్లో 40 పోస్టులు భర్తీ కానున్నాయి. సీనియర్ రెసిడెంట్ కేటగిరీలో 29 ఖాళీలు, సూపర్ స్పెషలిస్ట్ (సీనియర్ లెవల్)/ సీనియర్ కన్సల్టెంట్ కేటగిరీలో 5 ఖాళీలు, సూపర్ స్పెషలిస్ట్ (ఎంట్రీలెవల్)/జూనియర్ కన్సల్టెంట్ కేటగిరీలో 3 ఖాళీలు, స్పెషలిస్ట్ కేటగిరీలో 3 ఖాళీలున్నాయి. రోస్టర్, రిజర్వేషన్ వారీగా పోస్టులను నోటిఫికేషన్‌లో ప్రకటించారు. ఈ కొలువుల భర్తీ పూర్తిగా మెరిట్, ఇంటర్వ్యూల పద్ధతిలో జరుగుతుంది. సూపర్ స్పెషలిస్ట్ (సీనియర్ లెవల్/ఎంట్రీ లెవల్) గరిష్ట వయోపరిమితి 69 సంవత్సరాలుగా ఖరారు చేయగా.. స్పెషలిస్ట్‌కు 66 సంవత్సరాలు, సీనియర్ రెసిడెంట్‌కు 45 సంవత్సరాల గరిష్ట వయోపరిమితిని నిర్దేశించారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వయోపరిమితి సడలింపు ఉంటుంది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని పూరించాలి. నిర్దేశించిన డాక్యుమెంట్లతో ఆయా తేదీల్లో ఇంటర్వ్యూకు నేరుగా హాజరు కావాల్సి ఉంటుంది. ఇంటర్వ్యూలో చూపిన ప్రతిభ ఆధారంగానే ప్రాధాన్యత ఇస్తారు. ఫలితాలను వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు. అర్హత సాధించిన వైద్యులు వెంటనే విధుల్లో చేరాల్సి ఉంటుంది.



పోస్టుల వారీగా వేతనాలు

సూపర్ స్పెషలిస్ట్ (సీనియర్ లెవల్) / సీనియర్ కన్సల్టెంట్
రూ.2,40,000/-
(కన్సాలిడేట్ రెమ్యునరేషన్)

సూపర్ స్పెషలిస్ట్ (ఎంట్రీలెవల్) / జూనియర్ కన్సల్టెంట్
రూ.2,00,000/-
(కన్సాలిడేట్ రెమ్యునరేషన్)

స్పెషలిస్ట్ రూ.1,27,141/-
(కన్సాలిడేట్ రెమ్యునరేషన్)

సీనియర్ రెసిడెంట్ రూ.67,000/-
+ డీఏ, ఎన్‌పీఏ, హెచ్‌ఆర్‌ఏ, ఇతరాలు

పోస్టుల వారీగా ఖాళీలు, ఇంటర్వ్యూ సమయం

విభాగం	ఖాళీలు	తేదీ / సమయం
సీనియర్ రెసిడెంట్		
అనస్తీషియా	3	ఏప్రిల్ 28 - మధ్యాహ్నం 2.30
రేడియాలజీ	7	ఏప్రిల్ 28 - ఉదయం 10.00
కార్డియాలజీ	3	ఏప్రిల్ 25 - మధ్యాహ్నం 2.30
పీడియాట్రిక్ సర్జరీ	3	ఏప్రిల్ 26 - ఉదయం 10.00
యూరాలజీ	1	ఏప్రిల్ 28 - మధ్యాహ్నం 12.00
న్యూరో సర్జరీ	1	ఏప్రిల్ 27 - ఉదయం 10.00
పీడియాట్రిక్ క్రిటికల్ కేర్	1	ఏప్రిల్ 26 - ఉదయం 10.00
నెఫ్రాలజీ	2	ఏప్రిల్ 26 - మధ్యాహ్నం 2.30
న్యూరాలజీ	5	ఏప్రిల్ 27 - మధ్యాహ్నం 2.30
సీటీవీఎస్	3	ఏప్రిల్ 25 - ఉదయం 10.00
సూపర్ స్పెషలిస్ట్ (సీనియర్ లెవల్)/ సీనియర్ కన్సల్టెంట్		
కార్డియాలజీ	1	ఏప్రిల్ 25 - మధ్యాహ్నం 2.30
సీటీవీఎస్	1	ఏప్రిల్ 25 - ఉదయం 10.00
న్యూరాలజీ	1	ఏప్రిల్ 27 - మధ్యాహ్నం 2.30
పీడియాట్రిక్ సర్జరీ	2	ఏప్రిల్ 26 - ఉదయం 10.00
సూపర్ స్పెషలిస్ట్ (ఎంట్రీలెవల్)/జూనియర్ కన్సల్టెంట్		
కార్డియాలజీ	1	ఏప్రిల్ 25 - మధ్యాహ్నం 2.30
నెఫ్రాలజీ	1	ఏప్రిల్ 26 - మధ్యాహ్నం 2.30
న్యూరోసర్జరీ	1	ఏప్రిల్ 27 - ఉదయం 10.00
స్పెషలిస్ట్		
అనస్తీషియా	1	ఏప్రిల్ 28 - మధ్యాహ్నం 2.30
రేడియాలజీ	2	ఏప్రిల్ 28- ఉదయం 10.00

నేడు నెలవంక కనపడితే 22న రంజాన్ పండుగ

- లేని పక్షంలో ఈ నెల 23న పండుగ
- రుహియతే హిలాల్ కమిటీ ప్రకటన ఆధారంగా పండుగ

సాక్షి, హైదరాబాద్: శుక్రవారం నెలవంక కనిపిస్తే శనివారం రంజాన్ పండుగ ఉంటుందని, లేని పక్షంలో ముస్లింలు ఆదివారం పండుగను జరుపుకోవాలని రుహియతే హిలాల్ కమిటీ ప్రతినిధి ముఫ్తీ మహ్మద్ ఖలీల్ అహ్మద్ చెప్పారు. రుహియతే హిలాల్ కమిటీ (నెలవంక నిర్ధారణ కమిటీ) శుక్రవారం దీనిపై స్పష్టతనిస్తుందని ఆయన పేర్కొన్నారు. కాగా, ఇస్లాంలో రంజాన్ చివరి శుక్రవారానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. ఈ రోజు ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేసి దేవుని ఆశీస్సులు పొందుతారు. జుమ్మతుల్ విదాను పురస్కరించుకుని హైదరాబాద్‌లోని అన్ని మసీదుల్లో తగిన ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రత్యేకంగా మక్కా మసీదు, పబ్లిక్ గార్డెన్స్‌లోని రాయల్ మసీదులో జుమ్మతుల్ విదా ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఆయా జోన్‌లలో మసీదు పరిసరాలను శుభ్రం చేశారు.

ఈద్గాలలో నమాజ్ కోసం ఏర్పాట్లు: శని లేదా ఆదివారం రంజాన్ పండుగ నేపథ్యంతో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని అన్ని ఈద్గాలలో పండుగ రోజు నిర్వహించే సామూహిక ప్రార్థనల కోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు గురువారం రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ మసీవుల్లా ఖాన్ తెలిపారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఈద్గాల కమిటీలకు కూడా సకాలంలో ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. హైదరాబాద్‌లోని మీరాలం, మాదన్నపేట్ ఈద్గాలను సందర్శించి ఏర్పాట్లు సమీక్షించామన్నారు. అలాగే గ్రేటర్ పరిధిలోని పలు మైదానాల్లో కూడా రంజాన్ పండుగ నమాజ్ కోసం ఏర్పాట్లు చేయాలని జీహెచ్ఎంసీ అధికారులకు సూచించామని తెలిపారు.

రెండోరోజూ 'మైత్రి మూవీస్'లో ఐటీ తనిఖీలు

డైరెక్టర్ సుకుమార్ ఇళ్లలోనూ కొనసాగిన సోదాలు

సాక్షి, హైదరాబాద్: అక్రమమార్గాల్లో పెట్టుబడులు తీసుకోవడం, పన్ను ఎగవేత వంటి ఆరోపణలపై మైత్రి మూవీ మేకర్స్ సంస్థ కార్యాలయం, ప్రముఖ సినీదర్శకుడు సుకుమార్ ఇళ్లలో రెండోరోజు గురువారం కూడా ఐటీ సోదాలు కొనసాగాయి. భారీ బడ్జెట్ సినిమాల పెట్టుబడుల కోసం విదేశాల నుంచి నిబంధనలకు విరుద్ధంగా పెద్దమొత్తంలో డబ్బులు తీసుకున్నారన్నది ప్రధాన ఆరోపణ. జీఎస్టీ చెల్లింపులు సైతం సక్రమంగా చేయకపోవడంతోనే ఐటీ అధికారులు రంగంలోకి దిగినట్టు తెలిసింది. జూబ్లీహిల్స్‌లోని కార్పొరేట్ ఆఫీస్‌తోపాటు సుకుమార్ ఇళ్లు, మైత్రి మూవీ మేకర్స్ సంస్థ ప్రతినిధులు రవిశంకర్, నవీన్ ఇళ్లలోనూ ఐటీ బృందాలు తనిఖీ చేసినట్టు తెలిసింది. ముంబైకి చెందిన ఓ ఫైనాన్షియర్ హవాలా మార్గంలో తెచ్చిన డబ్బులను సినిమారంగంలో పెట్టుబడులకు వినియోగిస్తున్నట్టు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఐటీ అధికారులు ముంబైలో తనిఖీ చేశారు. అందులో వెలుగుచూసిన కీలకపత్రాల ఆధారంగా హైదరాబాద్‌లోనూ ఈ సోదాలు మొదలుపెట్టినట్టు తెలుస్తోంది. రెండురోజులుగా జరుగుతున్న తనిఖీల్లో ముంబైకి చెందిన ఫైనాన్సియర్లతో చేసుకున్న ఇన్వెస్ట్‌మెంట్స్ డీల్స్ సైతం వెలుగులోకి వచ్చినట్టు తెలిసింది. టాలీవుడ్‌తోపాటు బాలీవుడ్‌లోనూ భారీ బడ్జెట్ సినిమాలు నిర్మించేందుకు హవాలా మార్గంలో రూ.వందల కోట్లు సేకరించినట్లు తెలుస్తోంది. మైత్రి మూవీ మేకర్స్ సంస్థతో కలిసి దర్శకుడు సుకుమార్ పుష్ప-2 సినిమాను నిర్మిస్తున్నారు. దీంతో ఈ సంస్థకు, సదరు డైరెక్టర్‌కు మధ్య ఉన్న ఆర్థిక లావాదేవీలపైనా ఐటీ అధికారులు దృష్టి పెట్టినట్టు తెలుస్తోంది. సినిమాల్లో వచ్చిన లాభాలు, పన్నుల ఎగవేత ఫలితంగా మిగిల్చిన సొమ్ముతో హైదరాబాద్ నగర శివారుల్లో పెద్ద ఎత్తున భూములు కొనుగోలు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. వీటన్నింటిపైనా దర్యాప్తు ముమ్మరం చేసిన ఐటీ అధికారుల బృందాలు ఇప్పటికే పలు కీలకపత్రాలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. రెండురోజుల తనిఖీల్లో లభించిన ఆధారాలను విశ్లేషించిన తర్వాత ఐటీ అధికారులు తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

24న మహీంద్ర ప్లాంట్ విస్తరణకు భూమిపూజ!

రూ. వెయ్యి కోట్లతో విద్యుత్ వాహనాల తయారీకి సంస్థ ప్రణాళిక



జహీరాబాద్‌లోని మహీంద్ర కర్మాగారం

జహీరాబాద్: ప్రముఖ ఆటోమొబైల్ తయారీ సంస్థ మహీంద్ర అండ్ మహీంద్ర జహీరాబాద్‌లోని తమ ట్రాక్టర్ల తయారీ ప్లాంట్ ప్రాంగణంలో రూ. వెయ్యి కోట్లతో చేపట్టనున్న ఎలక్ట్రిక్ వాహనాల తయారీ ప్లాంట్ నిర్మాణానికి ముహూర్తం ఖరారు చేసింది. ఈ నెల 24న భూమిపూజ నిర్వహించాలని సంస్థ నిర్ణయించినట్లు తెలిసింది. ఈ కార్యక్రమానికి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ హాజరవుతున్నట్లు సమాచారం. జహీరాబాద్ యూనిట్‌లో ఇప్పటికే ట్రాక్టర్లతోపాటు పలు వాహనాలు తయారవుతున్నాయి. అక్కడే ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి మహీంద్ర అండ్ మహీంద్ర ఇటీవల ముందుకొచ్చింది. దేశంలోనే తొలి మొబిలిటీ క్లస్టర్‌గా తెలంగాణ మొబిలిటీ వ్యాలీ (టీఎంవీ) ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన నేపథ్యంలో జహీరాబాద్ ప్లాంట్ విస్తరణలో భాగంగా అక్కడ రూ. వెయ్యి కోట్ల పెట్టుబడితో 3, 4 చక్రాల విద్యుత్ వాహనాలు ఉత్పత్తి చేస్తామని మహీంద్ర సంస్థ ఇప్పటికే ప్రకటించింది. అందులో భాగంగానే ఇప్పుడు భూమిపూజకు సిద్ధమవుతోంది. ఈ ప్లాంట్ పూర్తయితే సుమారు 800 మందికి ప్రత్యక్షంగా, వేలాది మందికి పరోక్షంగా ఉపాధి లభించనుంది.

ఓజా బ్రాండ్ ట్రాక్టర్ల తయారీ కూడా..

జహీరాబాద్‌లోని కర్మాగారంలో త్వరలో ఓజా బ్రాండ్ ట్రాక్టర్లను తయారు చేసి మార్కెట్‌లో ప్రవేశపెట్టేందుకు మహీంద్ర అండ్ మహీంద్ర కసరత్తు ముమ్మరం చేస్తోంది. ఇప్పటికే స్వరాజ్ బ్రాండ్ పేరుతో ట్రాక్టర్లను విక్రయిస్తున్న ఆ సంస్థ... దేశీయ మార్కెట్‌కు మరో బ్రాండ్ అయిన ఓజాను పరిచయం చేయనున్నట్లు పేర్కొంది. ఈ బ్రాండ్ ట్రాక్టర్లను ప్రత్యేకంగా జహీరాబాద్‌లోనే ఉత్పత్తి చేయనుంది. ఈ బ్రాండ్‌లో 40 నూతన మోడళ్లను ఒకేసారి తీసుకొచ్చేందుకు ప్రణాళికలను వేగవంతం చేసింది. తక్కువ బరువుగల ఈ ట్రాక్టర్లను భారత్‌తోపాటు అమెరికా, జపాన్, ఆగ్నేయాసియా దేశాలకు ఎగుమతి చేయాలని యోచిస్తోంది.

మార్నింగ్ సాక్షి న్యూస్

న్యూస్ 06:00AM	న్యూస్ @ 9 09:00AM
ఫ్రెష్ స్టే 06:30AM	బిజినెస్ బ్రేక్ ఫాస్ట్ 09:15AM
న్యూస్ 24 07:00AM	మ్యూజికల్ స్టోర్ 09:30AM
మన ఊరు - మన వార్తలు 07:30AM	పొలిటికల్ కారిడార్ 10:30AM
టాప్ న్యూస్ ఆఫ్ ద డే 08:00AM	న్యూస్ 11:00AM
గరం గరం వార్తలు 08:30AM	న్యూస్ ఫీచర్ 11:30AM

మార్నింగ్ ప్రైమ్‌టైమ్..

నిన్న ఏం జరిగింది.. ఇవాళ ఏం జరగబోతోంది.. మన ఊరు, మన వార్తల విశేషాలేంటి..? ప్రపంచంలో ఏం జరుగుతోంది.. రాజకీయం ఏం చెబుతోంది.. ఇంకా వినోద, వ్యాపార, క్రీడా రంగాలకు సంబంధించిన సమస్త వార్తల సమాహారంగా ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మార్నింగ్ న్యూస్ ప్రైమ్‌టైమ్ మీకందిస్తోంది సాక్షి టీవీ.. ప్రతిరోజూ ఒక ప్రధాన వార్తాంశం ఇన్‌సైడ్, అవుట్‌సైడ్ అనాలసిస్‌తో ప్రత్యేక చర్చా కార్యక్రమం ఉదయం 8 గంటలకు టాప్ న్యూస్ ఆఫ్ ద డే గా మీ ముందుకు తీసుకొస్తోంది సాక్షి టీవీ..

మే 10న కృష్ణా బోర్డు సమావేశం

సాక్షి, హైదరాబాద్: కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సమావేశం మే 10న ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని జలసౌధలో జరగనుంది. ఈ నెల 26న ఈ సమావేశం జరగాల్సి ఉండగా, వచ్చే నెల 10కి వాయిదా వేశారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల నిర్వహణ, నీటి వాటాల వినియోగం తదితర అంశాలపై చర్చించనున్నారు.

త్వరలో దేశవ్యాప్తంగా 100 జిల్లాల్లో ఫుడ్ స్ట్రీట్‌లు

- పైలట్ ప్రాజెక్టు కింద తెలంగాణలో 4, ఏపీలో 4 ఫుడ్ స్ట్రీట్‌లు
- ఒక్కోదానికి కేంద్రం నుంచి రూ.ఒక కోటి ఆర్థిక సహాయం



సాక్షి, న్యూఢిల్లీ: సురక్షితమైన ఆహార పద్ధతులను ప్రోత్సహించడానికి దేశవ్యాప్తంగా 100 ఫుడ్ స్ట్రీట్‌లను ఏర్పాటు చేయాలని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ భావిస్తోంది. ఇందుకోసం కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ సహకారంతో దేశవ్యాప్తంగా 100 జిల్లాల్లో 100 ఫుడ్ స్ట్రీట్‌లను అభివృద్ధి చేయాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను అభ్యర్థించింది. ఇందుకుగాను ఒక్కో ఫుడ్ స్ట్రీట్‌కు ఒకకోటి రూపాయలను రాష్ట్రాలు, యూటీలకు సహాయంగా అందించనున్నారు. కాగా ఇందులో తెలంగాణలో 4, ఆంధ్రప్రదేశ్‌లోని 4 జిల్లాల్లో ఫుడ్ స్ట్రీట్‌లను పైలట్ ప్రాజెక్టులో భాగంగా ప్రారంభించనున్నారు. సురక్షితమైన ఆహార విధానాలు, పద్ధతుల కారణంగా ప్రజలకు ఆరోగ్యం, స్థానిక వ్యాపారులకు ఉపాధి లభించడంతోపాటు, పర్యాటక రంగానికి ఊతం లభిస్తుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు గురువారం కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి రాజేశ్ భూషణ్, కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ కార్యదర్శి మనోజ్ జోషిలు ఆయా రాష్ట్రాలకు పైలట్ ప్రాజెక్టుకు సంబంధించిన లేఖ రాశారు.

తక్షణ స్పందనతో ముప్పు తప్పుతుంది

- అగ్ని ప్రమాదాల నియంత్రణపై హోం శాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్
- ప్రమాదాల నియంత్రణపై 70 వేల మందికి అవగాహన : డీజీ నాగిరెడ్డి
- ముగిసిన అగ్నిమాపక శాఖ వారోత్సవాలు



మాక్‌డ్రిల్‌లో భాగంగా మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

సాక్షి, హైదరాబాద్: అగ్ని ప్రమాదం సంభవించినపుడు ఘటనా స్థలంలో ఉండే వారే తక్షణం స్పందించి మంటలార్పేందుకు ప్రయత్నిస్తే.. ముప్పు తొలగుతుందని హోంశాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్ అన్నారు. రాష్ట్ర ప్రజల భద్రత విషయంలో రాజీ లేదని, అవసరమైన అగ్నిమాపక వాహనాల కొనుగోలుకోసం ప్రభుత్వం తగిన నిధులు కేటాయిస్తుందని తెలిపారు. అగ్నిమాపక శాఖ వారోత్సవాల ముగింపు సందర్భంగా రాష్ట్ర అగ్నిమాపక శాఖ గురువారం తాజ్‌కృష్ణ హోటల్‌లో బిల్డర్లు, హోటల్ యాజమాన్యాలకు ప్రమాదాల నుంచి రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసింది. హోంశాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్, అగ్నిమాపక శాఖ డీజీ వై.నాగిరెడ్డితో కలసి ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జితేందర్ మాట్లాడుతూ, అగ్నిమాపక శాఖ నిబంధనలను వ్యాపార సంస్థలు తప్పక పాటించాలన్నారు. డీజీ నాగిరెడ్డి మాట్లాడుతూ, అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఈనెల 14 నుంచి 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 900కు పైగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. వీటి ద్వారా 70 వేల మందికి ప్రమాదాల నియంత్రణపై అవగాహన కల్పించినట్టు వివరించారు. అగ్ని ప్రమాద సమాచారం అందిన నిమిషాల్లోనే ఘటనా స్థలానికి వెళ్లేలా ఫైర్ సిబ్బంది సదా సన్నద్ధంగా ఉంటారని తెలిపారు. బహుళ అంతస్తుల భవనాలతో పాటు అన్ని ఆసుపత్రులు, హోటళ్లు, పారిశ్రామిక ప్రాంతాలు, నివాస సముదాయాల్లో ఫైర్ సేఫ్టీ పరికరాలు ఏర్పాటు చేసుకోవడంతోపాటు వాటిని ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాలని అగ్నిమాపక శాఖ డైరెక్టర్ లక్ష్మీ ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా తాజ్ కృష్ణ హోటల్‌లో మాక్ డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అదనపు డైరెక్టర్ జీవీ నారాయణరావు, రీజనల్ ఫైర్ ఆఫీసర్ పాపయ్య, హైదరాబాద్ డీఎఫ్ఓ శ్రీనివాస్‌రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎండకు వెళ్తే మండిపోతారు!

తీవ్ర అస్వస్థతకు గురవుతున్న ప్రజలు

- జ్వరాలు, డీహైడ్రేషన్‌తో ఆసుపత్రులపాలు
- జాగ్రత్తలు తీసుకోకపోతే తీవ్ర అనారోగ్యం
- తాజా పండ్లు, కూరగాయలు పుష్కలంగా తినాలంటున్న నిపుణులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రం నిప్పులకొలిమిపై మండుతోంది. తీవ్రమైన ఎండలతో జనం విలవిల్లాడుతున్నారు. ఉదయం 8 గంటలు దాటితేచాలు ఎండ తీవ్రతతో బెంబేలెత్తిపోతున్నారు. ఆరుబయట పని చేసే కూలీలు, ఇతర కార్మికులు, ఉద్యోగులు వడదెబ్బ బారినపడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. నైరుతి రుతుపవనాలు ప్రవేశించే వరకూ ఎండల తీవ్రత ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం చెబుతోంది. ఎంత తీవ్రమైన ఎండ ఉన్నా రోజువారీ పనులు, శుభకార్యాలు, ఇతరత్రా కార్యకలాపాల కోసం ప్రజలు బయటకు రావాల్సిన పరిస్థితి ఉంటుంది. అందుకోసం పేద, మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా ద్విచక్ర వాహనాలు, బస్సులు, ఆటోలను ఆశ్రయిస్తారు. ఎండలు దంచికొడుతున్నా ఉపాధి కూలీలు పని మానుకునే పరిస్థితి ఉండదు. దీంతో వేలాది మంది వడదెబ్బకు గురవుతున్నారు. తీవ్రమైన జ్వరం, వాంతులు, విరోచనాలకు గురవుతున్నారు. తలనొప్పి, వికారం ఉంటాయి. ఇలాంటి రోగాలతో వడదెబ్బ బాధితులు అనేక ఆసుపత్రులకు క్యూలు కడుతున్నారు. వేసవిలో జాగ్రత్తలు తీసుకోకపోతే పిల్లలు వడదెబ్బ, డయేరియా బారిన పడే ప్రమాదముంది. ఆహారం, తాగునీరు కలుషితమైతే పరిస్థితి మరింత తీవ్రంగా ఉంటుంది.

ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిక

అధిక వేడి, వడదెబ్బలతో మానవులపై శారీరక ప్రభావం ఉంటుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) తెలిపింది. కొందరిలో అకాల మరణం, వైకల్యం సంభవిస్తుందని హెచ్చరించింది. అధిక వేడి కారణంగా శ్వాసకోశ, గుండె సంబంధిత వ్యాధులు, దయాబెటిస్, మూత్రపిండ వ్యాధులు కూడా సంభవిస్తాయి. పగటి పూట గది ఉష్ణోగ్రత 32 డిగ్రీల సెల్సియస్, రాత్రి సమయంలో 24 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా ఉండేలా చూసుకోవాలని డబ్ల్యూహెచ్ఓ సూచించింది. ఎండ తీవ్రతకు గురయ్యే వారు కఠినమైన శారీరక శ్రమను నివారించాలి. తప్పనిసరిగా శ్రమతో కూడిన పని చేయాల్సి వస్తే, సాధారణంగా వేకువజామున 4 గంటల నుంచి ఉదయం 7 గంటల మధ్య ఉండేలా చూసుకోవాలి.

వేసవిలో చల్లగా ఉండడం ఎలా...

ఫ్లూయిడ్స్ పుష్కలంగా తాగాలి: వేడి వాతావరణంలో, పనితో సంబంధం లేకుండా ద్రవపదార్థాలు తీసుకోవాలి. దాహం వేసే వరకు వేచి ఉండకూడదు. రోజూ 8-10 గ్లాసుల కంటే ఎక్కువ నీరు తాగాలి. కొబ్బరి నీరు, తాజా పండ్ల రసాలు, మజ్జిగ, లస్సీ, నిమ్మకాయ నీరు, ప్రత్యేకంగా నీటితో ఎలక్ట్రోలైట్ తీసుకోవచ్చు. ఆల్కహాల్ లేదా పెద్ద మొత్తంలో చక్కెర ఉన్న ద్రవాలను తాగవద్దని నిపుణులు చెబుతున్నారు.

మసాలాలు మానుకోవాలి

తాజా పండ్లు, కూరగాయలు పుష్కలంగా తినాలి. వేడి ఆహారాలు తీసుకోవద్దు. అధిక మోతాదులో భోజనం చేయొద్దు. పుచ్చకాయ, ద్రాక్ష, పైనాపిల్, క్యారెట్, దోసకాయ వంటి చల్లని పదార్థాలను తీసుకోవాలి. రోజువారీ వంటలో మసాలాలు, ఆవాలు, ఎర్ర మిరపకాయలను ఉపయోగించడం మానుకోవాలి. ఎందుకంటే ఇవి వేడి లక్షణాలను తీవ్రతరం చేస్తాయి. పుల్లని, మసాలా ఆహారాలకు దూరంగా ఉండాలి.

తగిన దుస్తులు ధరించండి

- తేలికైన, లేత రంగు, వదులుగా ఉండే దుస్తులను ఎంచుకోవాలి. ముదురు రంగు బట్టలను ధరించవద్దు.
- చర్మాన్ని తేమగా ఉంచుకుని సంరక్షించుకోవాలి. ఆరుబయటకి వెళ్లాల్సి వస్తే సన్ గ్లాసెస్‌తోపాటు టోపీని ధరించడం ద్వారా సూర్యుని నుండి రక్షించుకోండి.

సాధారణంగా వేసవిలోవచ్చే వ్యాధులు

- నీటి ద్వారా వచ్చే వ్యాధులు: అతిసారం, విరోచనాలు, టైఫాయిడ్, కలరా, హెపటైటిస్ తదితరాలు
- అంటువ్యాధులు: దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు డెంగీ, మలేరియా, చికున్‌గున్యా
- వేడి సంబంధిత వ్యాధులు: వడదెబ్బ, డీహైడ్రేషన్, తలనొప్పి వంటివి
- చర్మ వ్యాధులు: సన్ బర్న్, టానింగ్, చర్మ కేన్సర్ వంటివి
- కంటి వ్యాధులు: కండ్లకలక వంటివి

రాష్ట్రం మీదుగా తమిళనాడు వరకు ఉపరితల ద్రోణి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ నుంచి రాయలసీమ మీదుగా దక్షిణ తమిళనాడు వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. సముద్రమట్టం నుంచి సగటున 0.9 కి.మీ. ఎత్తులో ఉన్నట్లు వివరించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వానలు కురిసే అవకాశం ఉన్నట్లు చెప్పింది. శుక్రవారం రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 1 నుంచి 3 డిగ్రీ సెల్సియస్ అధికంగా నమోదవుతాయని, శని, ఆదివారాల్లో మాత్రం ఉష్ణోగ్రతలు కాస్త తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. గురువారం రాష్ట్రంలో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే... గరిష్ట ఉష్ణోగ్రత ఆదిలాబాద్‌లో 42.3 డిగ్రీ సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్, నల్లగొండలో 24.0 డిగ్రీలుగా నమోదయ్యాయి. రానున్న రెండ్రోజులు రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు సాధారణ స్థితిలోనే నమోదవుతాయని వాతావరణ శాఖ చెప్పింది. రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక సొసైటీ వెల్లడించిన గణాంకాల ప్రకారం అత్యధికంగా జగిత్యాల జిల్లా గొడురులో 44.2 డిగ్రీ సెల్సియస్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్‌లో 44.1 డిగ్రీ సెల్సియస్, ములుగు జిల్లా లక్ష్మీదేవిపేటలో 43.9 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది.

తెలంగాణ, ఏపీల్లోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
రెంటచింతల	44.2	25.6
అనంతపురం	43.2	22.6
ఆదిలాబాద్	42.3	26.2
కర్నూలు	42.0	28.3
విజయవాడ	41.0	27.0
భద్రాచలం	40.8	26.5
మెదక్	40.8	24.0
నల్లగొండ	40.5	24.0
నిజామాబాద్	40.4	26.8
రామగుండం	40.2	22.6
మహబూబ్‌నగర్	40.0	27.5
ఖమ్మం	39.6	25.6
హనుమకొండ	39.5	24.5
హైదరాబాద్	38.0	27.0
హకీంపేట్	38.0	25.0
దుండిగల్	37.9	25.8

క్లుప్తంగా...

కేసీఆర్ పాలనతో విపక్షాలకు భయం

మంత్రి సత్యవతి రాథోడ్



సాక్షి,మహబూబాబాద్: సీఎం కేసీఆర్ విజన్ చూసి.. ప్రత్యర్థి పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ నేతలకు భయం పట్టుకుందని గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం సాధించిన స్వల్ప కాలంలోనే దేశానికే ఆదర్శంగా ఇక్కడి పాలన సాగుతోందని చెప్పారు. మానుకోట బీఆర్ఎస్‌లో వర్గాలు లేవని మంత్రి స్పష్టం చేశారు. ఎవరెన్ని చేసినా అంతిమంగా కేసీఆర్ చెప్పినట్టే అందరూ నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో శాసనమండలి వైస్ చైర్మన్ బండ ప్రకాశ్, ఎంపీ ఎం.కవిత తదితరులు పాల్గొన్నారు.

లీకేజీ కేసులో సీఎం ముఖం చాటేస్తున్నారు!

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ధ్వజం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్–1 పేపర్ లీకేజీ కేసులో నెలరోజులు గడిచినా పురోగతిలేదని, ఈ వ్యవహారంపై సీఎం కేసీఆర్ స్పందించకుండా ముఖం చాటేస్తున్నారని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ధ్వజమెత్తారు. కేసు దర్యాప్తు చేస్తున్న సిట్ అధికారులు 18 మంది నిందితులను అరెస్టు చేసినట్టే చేసి, వారికి ఏం కాకుండా భద్రంగా చూసుకుంటున్నారని విమర్శించారు. గురువారం బహుజన్ సమాజ్ పార్టీ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. లీకేజీ కేసులో అరెస్టయిన ముఖ్యమైన నిందితుల మీద పీడీ యాక్టు కింద కేసు ఎందుకు నమోదు చేయడంలేదని ప్రశ్నించారు. గ్రూప్–1 పేపర్ లీకేజీ దర్యాప్తులో సిట్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఎద్దేవా చేశారు. కాగా, అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీలో పరీక్షలు రాసి రెండేళ్లు దాటినా, ఫలితాలు ఇవ్వకపోవడంతో విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం లేకుండాపోయిందన్నారు. ఫిజికల్ డైరెక్టర్ ఉద్యోగ నియామకాల్లో హైకోర్టుకు వెళ్లిన అభ్యర్థులకు మాత్రమే అవకాశం ఇచ్చి, మిగతావారికి అర్హత లేదనడం అన్యాయమన్నారు. విద్యామంత్రి స్పందించి సింగిల్ పీజీ గెలిచిన అభ్యర్థులందరికీ అర్హత కల్పించాలన్నారు.

మిడ్ వైఫరీ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు రెట్టింపు
- నాంపల్లి ఏరియా ఆసుపత్రిలో దయాలసిస్, రక్తనిధి కేంద్రాల ప్రారంభం



రోగులతో మాట్లాడుతున్న మంత్రి హరీశ్ రావు

నాంపల్లి: ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించేందుకు మిడ్ వైఫరీ వ్యవస్థను ఏర్పాటు చేశామని, ఈ విధానం దేశానికే ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు అన్నారు. గతంలో 30 శాతం సాధారణ ప్రసవాలుండగా, ప్రస్తుతం వాటి సంఖ్య 65 శాతానికి పెరిగిందన్నారు. ఇందులో భాగంగానే నాంపల్లి ఏరియా ఆసుపత్రిలో మిడ్ వైఫరీ వ్యవస్థపై 18 నెలలుగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. గురువారం నాంపల్లి ఏరియా ఆసుపత్రిలో ఐదు పడకల డయాలసిస్ కేంద్రం, రక్తనిధి కేంద్రాలను (బ్లడ్ బ్యాంక్) ఆయన స్థానిక ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మెరాజ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావానికి ముందు ఉస్మానియా, గాంధీ, నిమ్స్ తదితర మూడు ఆసుపత్రుల్లోనే డయాలసిస్ కేంద్రాలు ఉండేవన్నారు. ప్రస్తుతం వీటి సంఖ్య 102కు చేరుకుందని , ప్రతి నియోజకవర్గంలో ఒక డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించినట్లు తెలిపారు. డయాలసిస్ కేంద్రాల ద్వారా ఆరోగ్య శ్రీ కింద వారానికి రెండు మూడుసార్లు ఉచితంగా డయాలసిస్ చేస్తున్నట్లు తెలిపారు. సింగిల్ యూజ్ ఫిల్టర్‌ను ఉపయోగించి దయాలసిస్ చేస్తున్నామని, తద్వారా ఒకరి నుంచి మరొకరికి ఇన్ఫెక్షన్ రాకుండా కార్పొరేట్ తరహాలో నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. డయాలసిస్ రోగులకు ఆర్థికంగా భరోసా ఇచ్చేందుకు ఆసరా పెన్షన్, ఉచిత బస్‌పాస్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఏటా 150 వరకు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్లు జరుగుతున్నాయని, ఆరోగ్య శ్రీ కింద రూ.10 లక్షల వరకు ప్రభుత్వమే భరిస్తోందన్నారు. ట్రాన్స్‌ప్లాంటేషన్ తర్వాత అవసరమయ్యే మందులను కూడా ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. కిడ్నీ రోగుల కోసం ఏడాదికి రూ.200 కోట్లు ఖర్చు చేస్తుండగా, అందులో డయాలసిస్ రోగుల కోసం ఏటా రూ.100 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ఏర్పడే నాటికి రాష్ట్రంలో 28 ప్రభుత్వ బ్లడ్ బ్యాంకులు ఉండగా, నేడు వాటి సంఖ్య 56కు చేరుకుందన్నారు. 27 బ్లడ్ బ్యాంకులకు కాంపోనెంట్ సపరేటర్స్ ఇచ్చామని, ఫలితంగా ఒక్క యూనిట్ రక్తాన్ని ముగ్గురికి వాడుతున్నట్లు మంత్రి వివరించారు. నగరానికి నలువైపులా టిమ్స్ (టిఐఎంఎస్) పనులు చురుగ్గా జరుగుతున్నాయని, గచ్చిబౌలి టిమ్స్‌ను కూడా వెయ్యి పడకలు, నిమ్స్‌కు అదనంగా రెండు వేల పడకలను మంజూరు చేశామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ వచ్చే నెలలో నిమ్స్ విస్తరణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు. గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్, టీడీపీ హైదరాబాద్‌లో ఒక్క ఆసుపత్రి కూడా నిర్మించలేదన్నారు. రాష్ట్రంలో ట్రామా కేర్ సెంటర్లను లెవల్ వన్, లెవల్ టు, లెవల్ త్రీగా వర్గీకరించి బలోపేతం చేస్తున్నామని, కార్పొరేట్ తరహాలో అత్యవసర సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దేశంలో ఎక్కడా ప్రభుత్వ ఆసుపత్రుల్లో పడకల కోసం మెయింటెనెన్స్ ఇవ్వడం లేదని, తెలంగాణ ప్రభుత్వం ఒక్కో పడకకు ప్రతి నెలా రూ.7500 ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కొత్తగా 9 పౌర సరఫరాల శాఖ పెట్రోల్ బంకులు

- తొమ్మిది జిల్లాల్లో ఏర్పాటుకు మూడు చమురు సంస్థలు సిద్ధం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని తొమ్మిది జిల్లాల్లో 9 పెట్రోల్ బంకులు ఏర్పాటు చేయాలని పౌర సరఫరాల సంస్థ నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ సూచనల మేరకు సంస్థ చైర్మన్‌గా సర్దార్ రవీందర్ సింగ్ మూడు ప్రభుత్వరంగ చమురు సంస్థలతో చర్చలు జరిపారు. కరీంనగర్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో పెట్రోల్ బంక్‌ల ఏర్పాటుకు ఐఓసీ సంస్థ ముందుకు రాగా, కొత్తగూడెం, మేడ్చల్, ఖమ్మంలలో హెచ్‌పీసీఎల్, జగిత్యాల, మెదక్ జిల్లాల్లో బీపీసీఎల్ బంక్‌లు ఏర్పాటు చేయనున్నాయి.

కమిటీ సూచనల మేరకే బంక్‌ల ఏర్పాటు

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇప్పటికే పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో మూడు పెట్రోల్ బంక్‌లు నిర్వహిస్తున్నారు. మిగతా జిల్లాల్లో రిటైల్ పెట్రోల్ స్టేషన్ల ఏర్పాటుకు ఐదుగురు అధికారులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసినట్లు రవీందర్ సింగ్ తెలిపారు. జిల్లాల్లో బంకులకు అనువైన స్థలాలను గుర్తించి ఆయా ఆయిల్ కంపెనీలకు కేటాయించడానికి జనరల్ మేనేజర్లు, ఫైనాన్స్, మార్కెటింగ్, ప్రొక్యూర్‌మెంట్, ఫైనాన్స్ విభాగాల అధికారులతో కూడిన ఈ కమిటీ జిల్లాల్లో పర్యటించింది. వీలైనంత త్వరలో విని యోగదారులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయిల్ కంపెనీలను రవీందర్ సింగ్ ఆదేశించారు. రెండోదశలో మరో 10 జిల్లాల్లో పెట్రోల్ బంక్‌ల ఏర్పాటు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

'వీఆర్వో' పిటిషన్‌లో తీర్పు రిజర్వు

సాక్షి, హైదరాబాద్: వీఆర్వో వ్యవస్థను రద్దు చేసి, వారిని ఇతర శాఖల్లోకి బదిలీచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవోను సవాల్ చేసిన పిటిషన్లపై వాదనలు ముగియడంతో హైకోర్టు తీర్పు రిజర్వు చేసింది. వీఆర్వోలు దాఖలు చేసిన ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం విచారణ చేపట్టింది. నిబంధనలు పాటించకుండా వీఆర్వో వ్యవస్థను ప్రభుత్వం రద్దుచేసిందని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు చిక్కుడు ప్రభాకర్, పీవీ కృష్ణయ్య గురువారం వాదనలు వినిపించారు. వీఆర్వోల వ్యవస్థను రద్దు చేయడంతో వీఆర్ఏలకు రావలసిన పదోన్నతుల విషయంలో వీఆర్ఏలు తమ హక్కులను కోల్పోయారని నివేదించారు. కాగా, అంతకుముందు ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపించారు. ఇంకా ఎవరైనా వాదనలు చెప్పాలని అనుకుంటే రాతపూర్వకంగా ఈనెల 28లోగా నివేదించాలని కోర్టు సూచించింది.

జగన్‌ను చూడాలని..

- వైఎస్ జగన్ వీరాభిమాని కాకా కాకడే సైకిల్ యాత్ర
- మహారాష్ట్ర నుంచి ఆంధ్రప్రదేశ్‌కు..
- జగన్ స్ఫూర్తితో దాదాశ్రీ ఫౌండేషన్ ఏర్పాటు
- 25 రక్తదాన శిబిరాలు, 15 వేల మొక్కలను నాటిన కాకడే



జహీరాబాద్‌కు చేరుకున్న ఏపీ సీఎం జగన్ అభిమాని కాక కాకడే సైకిల్ యాత్ర

జహీరాబాద్ టౌన్: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్ఫూర్తితో దాదాశ్రీ ఫౌండేషన్ ఏర్పాటు చేశాడు. మొక్కలు నాటుతూ.. రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నాడు. ఇప్పుడేకంగా జగన్‌ను చూసేందుకు సైకిల్ యాత్ర ప్రారంభించాడు. ఆయనే ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీరాభిమాని, మహారాష్ట్రకు చెందిన కాకా కాకడే. సీఎం జగన్‌ను కలవాలన్న ఉద్దేశంతో మహారాష్ట్ర నుంచి ఆంధ్రప్రదేశ్ వరకు సైకిల్ యాత్ర చేపట్టాడు. ఆయన సైకిల్‌యాత్ర గురువారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా కాకా కాకడే మాట్లాడుతూ.. తనది మహారాష్ట్రలోని సోలాపూర్ జిల్లా వీటా గ్రామమని, రాజకీయ నేపథ్యం లేని వ్యవసాయ కుటుంబమని తెలిపాడు. వైఎస్ జగన్‌ను కలిసేందుకు ఈ నెల 17వ తేదీన స్వగ్రామమైన వీటా నుంచి సైకిల్‌యాత్ర ప్రారంభించానన్నాడు. జగన్ స్ఫూర్తితో దాదాశ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీ బ్యాంక్ ఏర్పాటు చేశానని చెప్పాడు. ఇప్పటి వరకు 15 వేల మొక్కలు నాటి 25 రక్తదాన శిబిరాలు నిర్వహించానని వివరించాడు. రక్తదానం చేసిన 5 వేల మందికి హెల్మెట్‌లు అందజేశానన్నాడు. కరోనా సమయంలో కరోనా కిట్‌లు పంపిణీ చేశానని, యువత కోసం క్రికెట్ టోర్నీలు నిర్వహించానని పేర్కొన్నాడు. ఇటీవల వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా పాఠశాలల్లో మొక్కలను నాటి ట్రీగార్డ్‌లు ఏర్పాటు చేశానని తెలిపాడు. వైఎస్ జగన్ ప్రధానమంత్రి కావాలన్న ఆకాంక్షతో ఆయన పుట్టిన రోజు తర్వాత 12 జ్యోతిర్లింగాలకు సైకిల్ యాత్ర చేస్తానని కాకా కాకడే వెల్లడించాడు.

ధరణితో అంతటా సమస్యలే!

- ప్రతి పల్లెలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు
- పీపుల్స్ మార్చ్ యాత్రలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క



సాక్షి, పెద్దపల్లి: 'నక్సల్స్ ఎజెండాయే నా ఎజెండా..'అని చెప్పిన ముఖ్యమంత్రి కేసీఆర్, ధరణి పోర్టల్ పేరుతో పేదల భూములను లాక్కుంటున్నారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ధ్వజమెత్తారు. తాను పాదయాత్ర చేసిన ప్రతిపల్లెలో ప్రజలు ధరణితో ఇబ్బంది పడటం గమనించానని తెలిపారు. పీపుల్స్‌మార్చ్‌లో భాగంగా ఆయన చేపట్టిన పాదయాత్ర గురువారం పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలో కొనసాగింది. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. పోడు భూముల సమస్యలను పరిష్కరించి, ఆ భూములపై పేదలకు హక్కులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సింగరేణి బొగ్గు గనులను ప్రైవేటీకరణ చేయకుండా స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జనాభా దామాషా ప్రకారం బీసీలకు బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ అంశం ప్రభుత్వం దృష్టికి వెళ్లేలా లేఖ కూడా రాశానని పేర్కొన్నారు. దానికి సీఎం కేసీఆర్ సమాధానం చెప్పాలన్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఎండాకాలంలో మానేరు నదిలో ఐదు చెక్‌డ్యామ్‌లను నిర్మిస్తే.. వానాకాలంలో కొట్టుకుపోయాయని, అవి ఎవరికోసం నిర్మించారు..? ఎందుకు నిర్మించారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

విద్యావ్యవస్థను నాశనం చేశారు : విద్యార్థులే దేశానికి అతిపెద్ద వనరులని, అటువంటి వారిపై పెట్టే ఖర్చుకు ఎందుకు వెనుకాడుతున్నారని భట్టి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వైఎస్సార్ అధికారంలో ఉన్నప్పుడు ప్రతిఒక్కరూ ఉన్నత చదువులు చదవాలన్న లక్ష్యంతో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం తెచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఆ పథకం సరిగా అమలు కావడం లేదన్నారు. కాగా, 2007లో ఇంగ్లిష్ మీడియం పాఠశాలలను తీసుకొచ్చామని, కేసీఆర్ అధికారంలోకి వచ్చాక ఆ వ్యవస్థను నాశనం చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిఒక్కరికీ ఉన్నత విద్య అందించాలన్న లక్ష్యంతో జిల్లాకో యూనివర్సిటీ తెస్తే.. కేసీఆర్ ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేస్తూ.. మల్లారెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, దాసరి మనోహర్‌రెడ్డి లాంటి వారికి విద్యా వ్యాపారం చేసుకునేందుకు అనుమతి ఇస్తోందని మండిపడ్డారు. కేసీఆర్ డబ్బులతో ప్రజల ఓట్లు కొని మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యా వ్యవస్థలోని లొసుగులను సరిచేస్తామని భట్టి అన్నారు.

ప్రతి మానవుడూ తాను చేసిన కర్మలకు తాకట్టుగా ఉంటాడు.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 21 ఏప్రిల్ 2023

ఈ జనాభాతో లాభమేనా?

కొద్ది నెలలుగా రకరకాల అంచనాలు అంటున్న మాటే... అనుకుంటున్న మాటే... మళ్ళీ ఖరారైంది. ప్రపంచంలో అత్యధిక జనాభా గల దేశమనే కీర్తి ఇక భారత్‌దేనని ఈసారి ఐక్యరాజ్య సమితి నిర్ధారించింది. అంచనాలు పాతవైనా, లబ్ధప్రతిష్ఠులు మరొకరు తొలిసారి అధికారికంగా సమర్థించడం విశేషమే. అందుకే, జనసంఖ్యలో దశాబ్దాలుగా ప్రపంచంలో రెండోస్థానంలో ఉన్న భారత్... ఈ ఏడాది మధ్యకల్లా 142.8 కోట్ల జనాభాతో, 30 లక్షలకు పైగా అధిక్యంతో, 142.5 కోట్ల చైనాను దాటేసి, నంబర్ వన్ అవుతుందన్న వార్త పతాకశీర్షికలకు ఎక్కింది. 'ఐక్యరాజ్యసమితి జనాభా నిధి' (యూఎన్ఎఫ్‌పీఏ) ఈ ఏటి 'ప్రపంచ జనాభా స్థితిగతుల నివేదిక'లో ఈ సంగతి వెల్లడించింది. ఈ ఏడాది ఫిబ్రవరి వరకు ఉన్న సమాచారం మేరకు తాము ఈ అంచనా కట్టినట్టు ఐరాస బుధవారం తెలిపింది. ఇంతకీ ఈ అత్యధిక జనాభా భారత్‌కు లాభమా, నష్టమా అన్నది అసలు పెద్ద చర్చ.

జనాభాలో చైనాను భారత్ దాటేయడం 2020లలో జరుగుతుందన్నది ఎప్పటి నుంచో ఉన్న జోస్యమే. 2027లో ఇది జరుగుతుందని మొదట అంచనా. ఆ తర్వాత 2025కే జరుగుతుందని మాట సవరించారు. తీరా ఇది 2023లోనే జరిగిపోనుందని నిరుటి 'వరల్డ్ పాపులేషన్ ప్రాస్పెక్ట్స్' నివేదిక పేర్కొంది. తాజాగా ఐరాస జనాభా నిధి ఈ ఏడాది మధ్యకల్లా అది నిజమవుతోందని తేల్చింది. ఈ లెక్కల్ని బట్టి 804.5 కోట్ల ప్రపంచ జనాభాలో మూడో వంతు పైగా భారత, చైనాలదే. అయితే, రెండు దేశాల్లోనూ జనాభా పెరుగుదల వేగం గతంతో పోలిస్తే తగ్గుతోంది. ఆ మాటకొస్తే, 1950 నుంచి ఎన్నడూ లేని రీతిలో ఇప్పుడు ప్రపంచ జనాభా పెరుగుదల అతి తక్కువ వేగంతో సాగుతోంది. నిరుడు ఇదే ఐరాస నివేదికతో పోలిస్తే చైనా జనసంఖ్య ఒక్క ఏడాదిలో 2.3 కోట్ల మేర తగ్గింది. ఉన్నట్టుండి పడిపోయిన చైనా జనసంఖ్య వల్లే భారత్ అధిక జనాభా పట్టం దక్కుతోంది.

నిజానికి, భారత సొంత అంచనాల కన్నా ఐరాస నివేదిక తాజా జనాభా అంచనాలు కొంత ఎక్కువే. ఈ పరిస్థితుల్లో దేశంలో లెక్కకట్టి ఇందరే ఉన్నారని అసలు కథ చెప్పడం పదేళ్ళకోసారి చేసే జనగణనతో కానీ సాధ్యం కాదు. అలాగని అదీ పూర్తిగా దోషరహితమేమీ కాదు. 2011 జనగణనలోనూ ప్రతి వెయ్యి మందిలో 23 మందిని లెక్కపెట్టనే లేదట. అసలు 2011 తర్వాత మళ్ళీ ఆ గణన జరగనే లేదు. నిర్ణీత గడువైన 2021లో జరగాల్సిన జనగణన కరోనా పేరిట వాయిదా పడింది. తర్వాత అన్నీ సాధారణ స్థితికి చేరుకున్నా, కేంద్రం మాత్రం 'చేస్తాం చేస్తా'మంటూ ఊరిస్తోందే తప్ప విధాన రూపకల్పనలో అతి కీలకమైన ఈ జనగణనకు నిర్ణీత షెడ్యూల్ ప్రకటించట్లేదు. ఏర్పాట్లూ చేయట్లేదు. ఈ జాప్యం ప్రతికూల పర్యవసానాలకు దారితీసే ప్రమాదం ఉంది.

దేశపౌరులందరికీ ప్రాథమిక జీవన నాణ్యతా ప్రమాణాలను సైతం అందించడానికి ఇప్పటికీ సతమతమవుతున్న దేశానికి ఈ అధిక జనాభా ఒక రకంగా అవకాశం, మరో రకంగా సవాలు! కొందరి వాదన ప్రకారం 142 కోట్ల జనాభా అంటే అన్ని కోట్ల అవకాశాలు. 'జనసంఖ్యతో వచ్చే లబ్ధి' ఉంటుందని వారి మాట. నిజమే. జనాభాలో నూటికి 68 మంది యువత, అందులోనూ శ్రమ చేసే వయసులోని వారు కావడమనేది సానుకూలత. తద్వారా ప్రపంచంలో అతిపెద్ద శ్రామికశక్తి భారత్‌కు ఉన్నట్టవుతుంది. మరోపక్క జపాన్, దక్షిణ కొరియా లాంటి అనేక దేశాల్లో జనాభా తగ్గుతోంది. వయసు పైబడ్డ వారు పెరిగి, శ్రామికశక్తి తగ్గుతోంది! సమీప భవిష్యత్తులో ఆ దేశాల్లో శ్రామికులకు కొరత వస్తుంది. దీన్ని అందిపుచ్చుకొని, మన యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణతో ఆ దేశాల శ్రామికశక్తి అవసరాలను తీర్చాలి. అలా చేయగలిగితే అధిక జనాభా మనకు కలిసొచ్చిన అదృష్టమే.

అలాగని అధిక జనాభాతో వాటంతట అవే ప్రయోజనాలు ఊడిపడవు. ఒకదానికొకటి ముడిపడిన పలు అంశాలపై విధాననిర్ణేతలు దృష్టిపెట్టాలి. 'జనాభా లబ్ధి'కే వస్తే, 2055 వరకు... భారత్‌లో వేరొకరిపై ఆధారపడ్డ వారి వాటాతో పోలిస్తే, 15 నుంచి 64 ఏళ్ళ లోపు వయసు శ్రామికశక్తి జనాభా వేగంగా పెరగనుంది. ఈ పెరిగే జనాభాకు మెరుగైన విద్య, ఉపాధి, ఆరోగ్య, గృహవసతి కల్పన ఒక సవాలు. అంటే పెరిగే జనాభాకు తగ్గట్టు ప్రాథమిక వసతి సౌకర్యాల కల్పన ధ్యేయంగా పాలకులు నడవాలి. కూడు, గూడు, గుడ్డ లాంటి కనీస అవసరాలు తీరాక, అందరికీ ఉపాధి, వయోవృద్ధుల సంరక్షణ, మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడం రెండో అంశం. ఈ ప్రజాకాంక్షలకు తగ్గట్టు ప్రభుత్వాలు అడుగులు వేయలేకపోతే అసంతృప్తి పెచ్చరిల్లుతుంది. అలాగే, కొన్నేళ్ళ తర్వాత ఇప్పటి ఈ యువ జనాభా వృద్ధులవడంతో నేటి సానుకూలత పోయి, కొత్త సమస్య వస్తుందనీ గుర్తించాలి.

సువిశాల భారతంలో సంతాన సాఫల్యతా రేటు మొత్తం మీద తగ్గుతున్నా, ప్రాంతాల్ని బట్టి తేడాలున్నాయి. నిరుపేద ఉత్తరాదిలో జనాభా వేగంగా పెరుగుతుంటే, సంపన్న దక్షిణాదిలో తగ్గుతోంది. ఫలితంగా దక్షిణాదికి వలసలింకా ఎక్కువవుతాయి. ఇది దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వాలు వర్తించాలి. వలస కార్మికుల అనుకూల విధానాలు, పథకాలు చేపట్టాలి. అలాగే, మరో మూడేళ్ళలో మరోసారి నియోజకవర్గాల పునర్విభజన జరగాల్సి ఉంది. ఇప్పుడున్న దాని కన్నా ఉత్తరాది రాష్ట్రాల్లో జనసంఖ్య పెరుగుతున్నందున, జనాభా నియంత్రణే పాపమైనట్టు దక్షిణాది నియోజకవర్గాలు తగ్గిపోకుండా చూడాలి. ప్రాంతీయ, రాజకీయ ప్రాతినిధ్యాల్లో సమతూకం కాపాడాలి. మరోపక్క ఫలానా కులమతాల్లో జనాభా పెరుగుతోందన్న వాట్సప్ అజ్ఞాన అసత్య ప్రచారాలను సహించరాదు. జనాభా నియంత్రణకు కొత్త చట్టాల లాంటి యత్నాలూ చివరకు లింగనిష్పత్తిలో తేడాలకు కారణమవుతాయని గ్రహించాలి. వెరసి... అత్యధిక జనాభా కీర్తి మనదేశానికి ఓ ముళ్ళ గులాబీ.

'ఫిత్రా' పరమార్థం

రుజుమార్గం

పవిత్ర రమజాన్ నెలలో ఆచరించబడే అనేక సత్కార్యాల్లో 'ఫిత్రా' ఒకటి. ఫిత్రా అన్న పదం ఇఫ్తార్ నుండి వచ్చింది. ఫిత్ర్ అంటే శాబ్దిక అర్థం ఉపవాస విరమణ అన్నమాట. 'సదఖయే ఫిత్ర్' అంటే రోజా విరమణకు సంబంధించిన దానం అని అర్థం. ధర్మ శాస్త్ర పరిభాషలో 'సదఖయే ఫిత్ర్' అంటే ఉపవాస దీక్షలు పాటించేటప్పుడు జరిగిన లోపాలకు, పొరపాట్లకు పరిహారంగా రమజాన్ నెలలో విధిగా చెల్లించవలసిన దానం అన్నమాట.

రోజాలు విధిగా నిర్ణయించిన నాటినుండే ఫిత్రాలు కూడా తప్పనిసరిగా చెల్లించాలని ముహమ్మద్ ప్రవక్త (స) ఆదేశించారు. ఆ కాలంలో ప్రజలు ముఖ్య ఆహారంగా వినియోగించే పదార్థాలనే పరిగణనలోకి తీసుకొని ఫిత్రాలు చెల్లించేవారు. హజ్రత్ అబూసయీద్ ఖుద్రీ (ర) ఇలా చెప్పారు: 'ప్రవక్త వారి కాలంలో మేము ఈదుల్ ఫిత్ర్ (పండుగ) దానంగా ఒక 'సా' పరిమాణమంత పదార్థాలను ఇచ్చే వాళ్ళం. ఆ కాలంలో యవలు, ఎండు ద్రాక్ష, ఖర్జూరం, జున్ను తదితరాలు ముఖ్య ఆహార పదార్థాలుగా ఉండేవి' (సహీహ్ బుఖారీ, హ.నం 1510, సహీ ముస్లిం హ. నం 985). 'సా' అంటే పావుతక్కువ రెండు శేర్లు. మారిన కాలాన్నీ, నేటి పరిస్థితుల్నీ దృష్టిలో ఉంచుకొని ఏ రూపంలో అయినా ఫిత్రాలు చెల్లించవచ్చు. ఆహార పదార్థాలు, వస్త్రాలు, నగదు... ఏ రూపంలో అయినా సరే. ఫిత్రాల వల్ల రెండు రకాల లాభాలున్నాయి. ఒకటి... 'రోజా'లలో జరిగే పొరపాట్లకు పరిహారంగా ఈ ఫిత్రాలు ఉపయోగపడతాయి. వీటివల్ల రోజాలు పవిత్ర తను, పరిపూర్ణతను సంతరించుకొని స్వీకార భాగ్యానికి నోచుకుంటాయి. రెండు... ఫిత్రాల వల్ల సమాజంలోని పేద, బలహీనవర్గాలకు కాస్తంత ఆర్థిక వెసులుబాటు కలుగుతుంది. తద్వారా వారు కూడా పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోగలుగుతారు.

అందుకే ఫిత్రాలను ఉపవాసులకే పరిమితం చేయకుండా, ఈ పరిధిని విస్తరించారు. అంటే ఉపవాసం ఉన్నా లేకపోయినా అందరూ ఫిత్రా చెల్లించాలి. కుటుంబంలో ఎంతమంది ఉంటే, వారందరి తరఫున కుటుంబ యజమాని ఫిత్రా చెల్లించాలి. పండుగ నమాజు కంటే ముందు జన్మించిన శిశువు తరఫున కూడా తల్లిదండ్రులు ఫిత్రా చెల్లించాలి. పండుగ కంటే ముందే ఈ బాధ్యత నేరవేర్చుకోవాలి. కనీసం ఈద్ నమాజుకు వెళ్ళే ముందైనా చెల్లించాలి. మూడు నాలుగు రోజుల ముందు చెల్లిస్తే లబ్ధిదారులు పండుగ సామగ్రి కొనుక్కోవడానికి వీలుగా ఉంటుంది. పండుగ సంతోషంలో అందరినీ భాగస్వాములను చేయడమే అసలు ఉద్దేశ్యం.

– మదీహా అర్జుమంద్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం,
తిథి: శు.పాడ్యమి ఉ.8.44 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** భరణి రా.11.33 వరకు, తదుపరి కృత్తిక, **వర్జ్యం:** ఉ.9.10నుండి 10.44 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.34 నుండి 9.04 వరకు, తదుపరి ప.12.23 నుండి 1.11 వరకు, **అమృతఘడియలు:** సా.6.44 నుండి 8.20 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 5.44, **సూర్యాస్తమయం:** 6.12.

వివేకా హంతకుల్ని నడిపిస్తున్నదెవరు?



హత్య అని తెలిస్తే మృతదేహాన్ని ఎవ్వరూ కనీసం తాకి కూడా ఉండేవారు కాదు

కావాలనే ఆ లేఖను దాచి... కథ నడిపించిన ఆదినారాయణరెడ్డి, చంద్రబాబు

- అదే సమయంలో కడప ఎస్పీకి నాటి ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీ పలుమార్లు ఫోన్లు
- బీటెక్ రవితో, ఆదినారాయణరెడ్డితో కూడా సంభాషణలు ; బాబుకు అప్‌డేట్
- అందుకే నాటి నుంచీ బ్యాండేజీలు, రక్తం కడిగారు అంటూ బాబు ఆరోపణలు
- గుండెపోటు కథ ఎవరిది? లేఖ ఎందుకు దాచారు? అనేవి తొక్కిపట్టిన నాటి సర్కారు
- ఈ పచ్చ కుట్రను ఛేదిస్తేనే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం

ఎమ్మెల్సీ ఎన్నికల్లో వివేకానందరెడ్డికి వైఎస్సార్ సీపీ తరఫున టిక్కెట్టిచ్చింది వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి.

గెలిచేంత మెజారిటీ ఉన్నా సరే... కుట్రపూరితంగా ఆయన్ని ఓడించి.. టీడీపీ తరఫున బీటెక్ రవిని గెలిపించింది చంద్రబాబు నాయుడు.

ఆయన ఉంటే జిల్లాలో తాము రాజకీయంగా ఏమాత్రం ఎదగలేమని భావించింది టీడీపీ నేతలు ఆదినారాయణ రెడ్డి, బీటెక్ రవి.

ఆయన్ని ఏకంగా గొడ్డలితో నరికి నేను హత్య చేశాను అని దర్యాప్తు సంస్థల ఎదుటే సాక్ష్యం ఇచ్చిన దస్తగిరి.

వీళ్లంతా ఎవరు? వివేకానందరెడ్డిని వ్యక్తిగతంగా, రాజకీయంగా అంతం చేసిన ముఠా సభ్యులు. మరి వీళ్లంటే వివేకానందరెడ్డి కుటుంబానికి సహజంగానే తీవ్ర ఆగ్రహం ఉండాలి కదా?

కానీ ఏం జరుగుతోంది? చంద్రబాబు నాయుడు, ఆదినారాయణ రెడ్డి, బీటెక్ రవి, దస్తగిరి... బాబు కోసం పనిచేసే 'ఈనాడు'.. దాని తోకలు.. వీళ్లంతా ఇపుడు వివేకానందరెడ్డి కుమార్తె సునీత, అల్లుడు-చిన బావమరిది నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, పెద్ద బావమరిది నర్రెడ్డి శివప్రకాశ్ రెడ్డికి అత్యంత సన్నిహితులైపోయారు. అంతా కలిసే కోర్టులకెళుతున్నారు. 'నేనే నరికి చంపా' అన్న దస్తగిరి బెయిలుకోసం దరఖాస్తు చేస్తే వ్యతిరేకించ లేదు. దర్జాగా బయటే తిరుగుతున్నాడతను. ఎల్లో మీడియాకు పతాక స్థాయి ఇంటర్వ్యూలిస్తున్నాడు. వంకర మాటల ఓపెన్‌హార్టులో బీటెక్ రవి ప్రవచనాలు చెప్తున్నాడు. వీళ్లంతా కలిసి హంతకుడిని కూడా వదిలేసి తమ రాజకీయ ప్రత్యర్థుల్ని దీంట్లో ఇరికించడానికి వెంటాడుతున్నారు. వ్యవస్థలను మేనేజ్ చేస్తున్నారు. ఎవరికి అర్థం కానిది ఈ నాటకం? వివేకానందరెడ్డి హత్యలో ప్రత్యక్షంగా, పరోక్షంగా భాగస్వాములైన ఈ ఎల్లో మాఫియాను ఛేదిస్తే తప్ప హత్య వెనక ఉన్న వాస్తవాలు బయటకు వచ్చే అవకాశం లేదు.

2017లో వివేకాపై చంద్రబాబు రాజకీయ కుట్ర.. మెజార్టీ సభ్యులు ఉన్నా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి

వైఎస్ వివేకానందరెడ్డిని రాజకీయంగా అంతం చేయడమే కాదు భౌతికంగానూ లేకుండా చేయాల్సిన అవసరం కచ్చితంగా టీడీపీకే ఉందన్నది బహిరంగ రహస్యం. వైఎస్సార్ జిల్లాలో టీడీపీ బలోపేతానికి ఆయనే అడ్డంకిగా నిలబడ్డారు. అందుకే 2017లో వైఎస్సార్ జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల్లో వివేకాను కుట్రపూరితంగా ఓడించారు చంద్రబాబు. స్థానిక సంస్థల కోటాలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా వైఎస్ వివేకానందరెడ్డిని అభ్యర్థిగా పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంపిక చేశారు. జిల్లాలో మెజార్టీ ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు వైఎస్సార్‌సీపీకి చెందినవారే ఉండటంతో ఆయన గెలుపు నల్లేరుపై నడకేనని అంతా భావించారు. వివేకాను ఓడిస్తే.. నాటి విపక్ష నేత జగన్‌ను ఓడించినట్లేనని చంద్రబాబు భావించారు. అందుకే వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలను ప్రలోభాలు పెట్టి తమ వైపు లాక్కున్నారు. దీనికి నాటి చంద్రబాబు ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న ఆదినారాయణరెడ్డి పూర్తిగా సహకరించారు. ఎందుకంటే వైఎస్సార్ సీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి నీతిబాహ్యంగా టీడీపీకి అమ్ముడుపోయి చంద్రబాబు ప్రభుత్వంలో మంత్రి అయిన వ్యక్తి ఆదినారాయణ రెడ్డి. ఆదినారాయణరెడ్డి, బీటెక్ రవి, రాజ్యసభ సభ్యుడిగా ఉన్న సీఎం రమేశ్ భారీగా డబ్బులు వెదజల్లి వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలను ప్రలోభపెట్టి దొడ్డిదారిలో వైఎస్ వివేకానందరెడ్డిని ఓడించారు.

2019... వివేకా భౌతికంగా అంతం


2019 సాధారణ ఎన్నికలు సమీపిస్తుండటంతో చంద్రబాబులో మళ్లీ గుబులు మొదలైంది. 2014 ఎన్నికల్లో వైఎస్సార్ జిల్లాలో ఒకే ఒక ఎమ్మెల్యే సీటును గెలిచిన టీడీపీకి ఈ సారి అది కూడా కష్టమేనని అర్థమైంది. కడప సిట్టింగ్ ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డిని ఎంపీ అభ్యర్థిగా ఖరారు చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. ఆ లోక్‌సభ స్థానానికి పార్టీ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా అప్పటికే వైఎస్ వివేకానందరెడ్డిని నియమించారు. పార్టీ గెలుపు కోసం ఎన్నికల వ్యూహాలు పన్నుతూ...అందర్నీ కలుపుకుంటూ వెళ్లారు వివేకా. దాంతో చంద్రబాబు, ఆదినారాయణ రెడ్డి బెంబేలెత్తారు. ఎందుకంటే 2019 ఎన్నికల్లో టీడీపీ ఎంపీ అభ్యర్థిగా ఆదినారాయణ రెడ్డిని చంద్రబాబు ఖరారు చేశారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే టికెట్‌ను కూడా ఆదినారాయణ రెడ్డి కొడుక్కి ఇచ్చారు. వివేకా ఉంటే ఎప్పటికీ తాము రాజకీయంగా పైచేయి సాధించలేమన్నది బీటెక్ రవి, ఆదినారాయణ రెడ్డి ఉద్దేశం. ఈ నేపథ్యంలోనే వివేకా హత్యకు గురయ్యారు. మరి ఇది టీడీపీ కుట్ర కాదా? వివేకా హత్యకు ముందు టీడీపీ నేతలతో కొందరి రహస్య సమావేశాలు... ఆయన హత్య తరువాత టీడీపీ నేతలు వ్యవహరించిన తీరే దీనికి ఊతమిస్తోంది. హత్య అనంతరం... అప్పట్లో ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు పదేపదే కడప ఎస్పీకి ఫోన్ చెయ్యడం... బీటెక్ రవితో కూడా నేరుగా సంభాషించటం... ఎప్పటికప్పుడు జరుగుతున్న వ్యవహారాలను నాటి సీఎం చంద్రబాబుకు అప్‌డేట్ చెయ్యటం.. ఇవన్నీ కాదనలేని వాస్తవాలు. అంటే... అంతా తాము అనుకున్నట్లే జరుగుతోందా? లేదా.. అన్నది బాబుకు ఏబీ అప్‌డేట్ చేశారన్నది నిపుణుల మాట.

హత్యకు ముందు...
వివేకా అనుచరుడితో బీటెక్ రవి భేటీ ఎందుకో...!

తనకు దీర్ఘకాలంగా అనుచరుడిగా ఉన్న కొమ్మారెడ్డి పరమేశ్వరరెడ్డితో వివేకాకు ఆర్థిక వ్యవహారాల్లో విభేదాలు వచ్చాయి. దాంతో పరమేశ్వరరెడ్డి కక్ష పెంచుకుని పులివెందుల నియోజకవర్గంలో వివేకా రాజకీయ ప్రత్యర్థిగా ఉన్న టీడీపీ నేత బీటెక్ రవితో చేతులు కలిపాడు. వివేకా హత్యకు అప్పటికే పన్నాగం సిద్ధం కావడంతో... ముందుగా పరమేశ్వరరెడ్డి ఎలిబీ సృష్టించుకోవడానికి వివేకా హత్యకు కేవలం రెండు రోజుల ముందే అంటే 2019 మార్చి 13న అనారోగ్యం సాకుతో కడపలోని సన్‌రైజ్ ఆస్పత్రి ఐసీయూలో చేరాడు. కానీ ఎవరికీ తెలియకుండా 2019 మార్చి 14 సాయంత్రం టీడీపీ ఎమ్మెల్సీ బీటెక్ రవితో హరిత హోటల్‌లో రెండుసార్లు సమావేశమయ్యాడు. ఈ భేటీలో పాల్గొన్న శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తి... ఆ తర్వాత కొద్ది రోజులకే అనుమానాస్పద రీతిలో మృతి చెందడం గమనార్హం. సిట్ దర్యాప్తులో నార్కో పరీక్ష నిర్వహించాలని నిర్ణయించినా పరమేశ్వరరెడ్డి తిరస్కరించడం సందేహాలకు తావిస్తోంది.

'గుండె పోటు' కథకుడు శివప్రకాశ్ రెడ్డి...

వైఎస్ వివేకానందరెడ్డిని హత్య చేయటమే కాదు. ఆ హత్యలో ఇతరుల్ని ఇరికించడానికి కూడా ఎల్లో గ్యాంగ్ పకడ్బందీ కుట్ర పన్నిందని చెప్పొచ్చు. ఎందుకంటే వివేకానందరెడ్డి గుండెపోటుతో మరణించారనే తప్పుడు ప్రచారం వెనుక ఆయన పెద్ద బావమరిది నర్రెడ్డి శివ ప్రకాశ్‌రెడ్డి, టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న ఆదినారాయణ రెడ్డి ప్రధాన పాత్ర పోషించారు. శివప్రకాశ్‌రెడ్డి మొదట ఆదినారాయణ రెడ్డికి ఫోన్ చేసి వివేకానందరెడ్డి గుండెపోటుతో మరణించారని చెప్పారు. ''సిగరెట్లు ఎక్కువుగా తాగుతారు కదా! అందుకే ఇలా జరిగి ఉండొచ్చు'' అని ఆదినారాయణరెడ్డి ఆయనతో చెప్పారు. ఈ విషయాన్ని ఆదినారాయణ రెడ్డి స్వయంగా టీవీ ఛానెళ్ల ఎదుట వెల్లడించారు. అంతేకాదు. ఆదినారాయణరెడ్డికి చెప్పిన శివప్రకాశ్ రెడ్డే... ఎన్నికల ప్రచారం నిమిత్తం ఉదయాన్నే జమ్మలమడుగు వెళుతున్న ఎంపీ అవినాశ్‌రెడ్డికి కూడా వివేకా గుండెపోటు విషయం చెప్పారు. దాంతో అక్కడి నుంచే వెనుదిరిగి... అవినాశ్ రెడ్డి వివేకా ఇంటికి చేరుకున్నాడు. అప్పటికే అక్కడ వివేకా పీఏ కృష్ణారెడ్డితో పాటు పలువురు ఉన్నారు. ఇలా శివప్రకాశ్ రెడ్డి చెప్పిన గుండెపోటు విషయమే... టీవీల్లో బ్రేకింగ్ న్యూస్‌గా వచ్చింది. ఆయన హత్యకు గురయ్యారనే నిజం బయటపడేలోపే ఈ తప్పుడు ప్రచారాన్ని తీసుకొచ్చారు. మరి శివప్రకాశ్‌రెడ్డి, ఆది నారాయణరెడ్డి ఈ తప్పుడు ప్రచారాన్ని ఎందుకు చేశారు? దీన్ని ఛేదిస్తే హత్య కేసులో అసలు కుట్ర బయటపడుతుంది.



రక్తపు మరకల లేఖ.. గోప్యంగా ఉంచమన్న కుమార్తె, అల్లుడు..

వివేకా గుండెపోటుతో చనిపోయారని ప్రచారం చేసేందుకుగాను ఆయన కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, పెద్ద బావమరిది నర్రెడ్డి శివ ప్రకాశ్‌రెడ్డి పక్కా ప్లాన్‌తోనే వ్యవహరించారు. అదెలాగంటే... వైఎస్ వివేకాపై తీవ్రంగా దాడిచేసిన తరువాత హంతకులు ఆయన చేత బలవంతంగా లేఖ రాయించారు. వాళ్ల బెదిరించడంతో... డ్రైవర్ ప్రసాద్ తనపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడని ఆ లేఖలో వివేకా రాశారు. ఆ లేఖను మొదటగా అంటే ఆ రోజు ఉదయం 6.10లోపే చూసిన ఆయన పీఏ కృష్ణారెడ్డి... ఆ విషయాన్ని సునీత భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డికి చెప్పారు. రక్తపు మరకలున్న ఆ లేఖ చూసినవారెవరికైనా... వివేకాది హత్యేనని తెలిసిపోతుంది. కానీ లేఖ విషయాన్ని కృష్ణారెడ్డి చెప్పగానే... తాము వచ్చే వరకు ఆ లేఖను, వివేకా సెల్‌ఫోన్‌ను ఎవ్వరికీ ఇవ్వవద్దని, దాచి ఉంచాలని కృష్ణారెడ్డితో నర్రెడ్డి రాజశేఖరరెడ్డి చెప్పారు. ఆ తరవాతే అసలు పన్నాగానికి తెరలేచింది. శివ ప్రకాశ్ రెడ్డి ద్వారా అవినాశ్‌రెడ్డికి చెప్పించారు. అవినాశ్ రెడ్డి కాల్ డేటా చూస్తే ఈ విషయం నిర్ధారణ అవుతుంది కూడా. అవినాశ్ అక్కడకు చేరాక కూడా ఆయనకు లేఖ చూపించలేదు. లేఖ ఉందన్న విషయం కూడా చెప్పలేదు. అంటే... అన్నీ పథకం ప్రకారమే చేశారు.

వాస్తవానికి వారు గనక ఆ లేఖను వెంటనే పోలీసులకు ఇవ్వాలని చెప్పి ఉంటే వివేకా హత్యకు గురయ్యారన్నది వెంటనే అందరికీ తెలిసిపోయేది. కనీసం అక్కడకు చేరుకున్న అవినాశ్‌కు చూపించినా హత్య సంగతి అర్థమయ్యేది. హత్య జరిగిందని తెలిస్తే ఎవ్వరూ మృతదేహాన్ని తాకేవారే కాదు. కానీ లేఖను ఉద్దేశపూర్వకంగానే గోప్యంగా ఉంచారు. బహుశా! అంతా తామనుకున్నట్టే జరిగిందనో ఏమో!! ఆ రోజు నుంచీ ఇప్పటివరకూ చంద్రబాబు నాయుడు ఈ హత్య గురించి ఎక్కడ మాట్లాడినా... మృతదేహానికి బ్యాండేజీ ఎవరు కట్టారు? రక్తపు మరకలు ఎవరు తుడిచారు? అనే ప్రశ్నలే వేస్తున్నారు. మొత్తం టీడీపీ, ఎల్లో మీడియా.. అందరూ ఇదే విషయమై దుష్ప్రచారం చేస్తున్నారు. అంతే తప్ప అసలు గుండెపోటు అని చెప్పిందెవరు? వారికెలా తెలిసింది? అసలు లేఖను ఎందుకు గోప్యంగా ఉంచారు? అలా ఎందుకు ఉంచమన్నారు? అనే విషయాలను మాత్రం ప్రచారంలోకి రానివ్వటం లేదు. ఇదీ.. కుట్ర వెనక అసలు కథ. ఆ రోజు మధ్యాహ్నం 1గంట సమయంలో పులివెందుల చేరుకున్న సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డికి ఆ లేఖతోపాటు వివేకా సెల్‌ఫోన్‌ను కృష్ణారెడ్డి ఇచ్చారు. ఆ లేఖను చదివారు కానీ... వెంటనే పోలీసులకు ఇవ్వలేదు. సునీత ఆదేశాలతో సాయంత్రం 5 గంటలకు కృష్ణారెడ్డి ఆ లేఖను, సెల్‌ఫోన్‌ను పోలీసులకు అప్పగించారు. ఆ లేఖను సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డి ఎందుకు గోప్యంగా ఉంచారన్నదే ఈ హత్య కేసులో కీలకం.

చంద్రబాబు మంత్రాంగం...

వైఎస్ వివేకానందరెడ్డి హత్యకు గురైన రోజు అప్పటి సీఎంగా ఉన్న చంద్రబాబు అమరావతి నుంచి పెద్ద కథే నడిపారు. అప్పటి ఇంటలిజెన్స్ చీఫ్‌గా ఉన్న ఏబీ వెంకటేశ్వరరావు కడప ఎస్పీతోనూ టీడీపీ ప్రభుత్వంలో మంత్రి ఆదినారాయణరెడ్డితోను, బీటెక్ రవితోను ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూ కేసు దర్యాప్తును ప్రభావితం చేశారు. కేసు దర్యాప్తును ఉద్దేశపూర్వకంగా తప్పుదారి పట్టించేందుకు ఏబీవీ ఎందుకు అంతగా తాపత్రయ పడ్డారన్నది ఇప్పటికీ ప్రశ్నార్థకమే. అప్పట్లో అధికారంలో ఉన్న టీడీపీ... తాను జరిపిన దర్యాప్తులో అసలు లేఖ విషయమే పట్టించుకోకపోవటం గమనార్హం.

వివేకా మరణిస్తే ఎవరికి ప్రయోజనం... !
ఆయన రెండో వివాహంతో ఆ కుటుంబంలో తీవ్ర విభేదాలు

వివేకానందరెడ్డి మరణిస్తే ఎవరికి లాభం అన్నది ఈ కేసులో కీలకం. దాంతో అన్ని వేళ్లూ వివేకా రెండో వివాహంతో ఆ కుటుంబంలో తలెత్తిన విభేదాలపైకే వెళ్తున్నాయి. తాను రెండో వివాహం చేసుకున్న షమీమ్ అనే మహిళకు పుట్టిన కుమారుడికి ఆస్తిలో భాగం ఇవ్వాలని ఆయన భావించారు. తన రాజకీయ వారసుడిగా చేస్తానన్నది ఆ జిల్లాలో అందరికీ తెలుసు. అందుకే ఆ కుటుంబంలో ఆస్తి వివాదాలు, రాజకీయ వారసత్వ వివాదాలు తీవ్రస్థాయికి చేరాయి. వివేకా మొదటి భార్య సౌభాగ్యమ్మ, కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి తీవ్రంగా గొడవపడి ఆయన్ని విడిచిపెట్టి హైదరాబాద్‌లో ఉంటున్నారు. సునీత, ఆమె భర్త రాజశేఖరరెడ్డి, బావగారు శివ ప్రకాశ్‌రెడ్డి షమీమ్ ఇంటికి వెళ్లి ఘర్షణ పడ్డారు. వివేకానందరెడ్డి అప్పటికే ఆమెకు ఇచ్చిన ఓ ఇంటి పత్రాలను బలవంతంగా తీసుకున్నారు. షమీమ్, వైఎస్ సునీత పరస్పరం దూషించుకుంటూ చేసుకున్న వాట్సాప్ చాటింగ్‌ను కూడా అప్పట్లోనే సిట్ బృందం వెలికితీసింది. షమీమ్‌కు ఓ ఇల్లు ఇవ్వాలని... ఆమె కుమారుడిని హైదరాబాద్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో చదివించాలని అనుకుంటున్నా...అవ్వడం లేదని వివేకా సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు కూడా. ఈ నేపథ్యంలో వివేకానందరెడ్డి జీవించి లేకపోతే ఆయన కుమార్తె, అల్లుడు, పెద్ద బావమరిదికే ఎక్కువ లాభమన్నది గమనించాల్సిన అంశం. ఆస్తితో పాటు రాజకీయ వారసత్వం కూడా తమకే వస్తుందన్నది వారి ఉద్దేశంగా తెలుస్తుంది.

ఏది నిజం?

హంతకుడు దస్తగిరిని అప్రూవర్‌గా మార్చింది ఎవరు...!?

వైఎస్ వివేకాను గొడ్డలితో స్వయంగా నరికాను అని చెప్పిన దస్తగిరి అప్రూవర్‌గా మారడంతోనే ఈ కేసు దర్యాప్తు దారితప్పింది. అతన్ని అప్రూవర్‌గా మార్చింది ఎవరనే అంశమూ ఇక్కడ కీలకం. దస్తగిరి తరచు వివేకా కుమార్తె సునీత, ఆమె భర్త నర్రెడ్డి రాజశేఖరరెడ్డితో భేటీ అవుతున్నారు. మరోవైపు టీడీపీ నేతలు ఆదినారాయణ రెడ్డి, బీటెక్ రవితో సన్నిహితంగా ఉంటున్నారు. ఎల్లో మీడియాకు ఇంటర్వ్యూలిస్తున్నాడు. అంటే వివేకా కుటుంబం, టీడీపీ నేతల పన్నాగంలో భాగంగానే దస్తగిరి అప్రూవర్‌గా మార్చినట్టు స్పష్టమవుతోంది. అప్పటివరకు పేదరికంలో కొట్టుమిట్టాడిన దస్తగిరి.. అప్రూవర్‌గా మారిపోగానే ఒక్కసారిగా ధనవంతుడైపోయాడు. కారు, బంగ్లా, డ్రైవర్... అన్నీ వచ్చేశాయి. మరి వీటిని ఇస్తున్నదెవరు? ఎందుకు ఇస్తున్నారు? సీబీఐ అధికారులు దస్తగిరిని ఢిల్లీకి తీసుకువెళ్లి మరీ అప్రూవర్‌గా మార్చి వాంగ్మూలం నమోదు చేశారు. అందులో వాస్తవం ఎంతన్నది పట్టించుకోకుండా ఆ వాంగ్మూలం ఆధారంగానే ఏకపక్షంగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హంతకుడు ఎల్లో గ్యాంగ్ హీరోనా...!

వివేకాను హత్య చేసిన దస్తగిరిని అటు టీడీపీ ఇటు టీడీపీ అనుకూల పచ్చ మీడియా హీరోగా చూపించేందుకు బరితెగించి వ్యవహరిస్తున్నాయి. ఈనాడు,ఆంధ్రజ్యోతి, ఏబీఎన్, టీవీ 5 చానళ్లు దస్తగిరిని ఇంటర్వ్యూలు చేస్తూ అతన్ని ఓ సెలబ్రిటీగా చూపిస్తున్నాయి. వైఎస్సార్ కుటుంబంపై అక్కసుతో పాత్రికేయ విలువలను దిగజారుస్తూ ఓ హంతకుడిని హీరోగా చూపించేందుకు పడరానిపాట్లు పడుతున్నాయి. తన తండ్రి హంతకుడిని ఓ సంఘ సంస్కర్తగా టీడీపీ, ఎల్లో మీడియా చూపిస్తూ ఉంటే సునీత కనీసం అభ్యంతరం వ్యక్తం చేయకపోవటమే ఇక్కడ దారుణం.

ఇదే బాబు మార్కు పన్నాగం...

చంద్రబాబు ఎవరినైనా అడ్డుతొలగించుకోవాలంటే తనదైన శైలిలో పన్నాగం పన్నుతారు. లక్ష్యంగా చేసుకున్న వ్యక్తి సొంతం కుటుంబంలోనే చిచ్చుపెట్టి సొంతవారితోనే కథ నడిపిస్తారని ఎన్టీఆర్ విషయంలో రుజువైంది. ఎన్టీ రామారావును ఆయన సొంత పిల్లలతోనే ఛీకొట్టించి మరీ పదవి నుంచి దించేసి తాను అడ్డదారిలో సీఎం అయ్యారు. అదే రీతిలో వివేకానందరెడ్డికి ఆయన కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, పెద్ద బావమరిది శివ ప్రకాశ్ రెడ్డిలతోనే పొగ పెట్టించారు. టీడీపీ నేతలు ఆదినారాయణరెడ్డి, బీటెక్ రవిల సహకారంతో కుటుంబ సభ్యులే పాత్రధారులుగా గుట్టుచప్పుడు కాకుండా కథ ముగించారు.

కీలక అంశాలను విస్మరిస్తున్న సీబీఐ

సున్నితమైన వివేకా హత్య కేసు దర్యాప్తులో సీబీఐ ఆది నుంచీ దారి తప్పింది. వివేకా రెండో వివాహంతో ఆ కుటుంబంలో తలెత్తిన ఆస్తి, రాజకీయ వారసత్వ విభేదాలు...ఆయన లైంగిక అక్రమ సంబంధాలతో ఆయనపై కక్ష పెంచుకున్నవారు... వివేకాను సెటిల్‌మెంట్లకు వాడుకున్న స్నేహితులు, అనుచరులు...వివేకాను అడ్డుతొలగించుకుంటేనే రాజకీయంగా మనుగడ అని భావించిన చంద్రబాబు, ఆది నారాయణ రెడ్డి, బీటెక్ రవి... ఇలా ఈ కేసులో పచ్చ కుట్రను స్పష్టం చేస్తున్న అనేక కోణాలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. కానీ సీబీఐ మాత్రం హంతకుడిని ఎవరో వ్యూహాత్మకంగా అప్రూవర్‌గా మారిస్తే... ఆ వాంగ్మూలం పట్టుకునే ఈ కేసు దర్యాప్తు గోదారిని ఈదేందుకు యత్నిస్తుండటం సీబీఐ తీరునే ప్రశ్నార్థకంగా మారుస్తోంది.

బీడీల పగార్ పెరిగింది

- వెయ్యి బీడీలకు రూ.11.04 వేతనం పెంపు
- ఈ నెల నుంచి అమలు
- రాష్ట్రంలో 6,23,786 మందికి ప్రయోజనం

సిరిసిల్ల: రాష్ట్రంలో రెక్కలు ముక్కలు చేసుకుంటూ బీడీలు చేసే కార్మికుల పగార్ (వేతనం) స్వల్పంగా పెరిగింది. బీడీ కంపెనీలు ప్రతీ వెయ్యి బీడీలకు ఇప్పటి వరకు రూ.221 చెల్లిస్తుండగా.. ఏప్రిల్ నుంచి రూ.232.04 చెల్లించనున్నాయి. అంటే పగార్ రూ.11.04 పెరగనుంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రావిడెంట్ ఫండ్ ఉన్న బీడీ కార్మికులు 6,23,786 మంది ఉండగా.. వీరికి పెరిగిన వేతనం వర్తించనుంది. ఒక్కో మహిళ ప్రతి నెలా సగటున 23 వేల బీడీలు చేస్తే ప్రతి నెలా అదనంగా రూ.254 రానుంది. ప్రావిడెంట్ ఫండ్ లేని బీడీ కార్మికులు రాష్ట్రంలో 2,29,639 మంది ఉన్నారు. వీరికి ఈ పెరిగిన వేతనం అమలుకాదు. బీడీ కంపెనీలు వీరికి నగదు రూపంలో డబ్బులు ఇస్తాయి. పీఎఫ్ లేని కార్మికులంతా నగదు (వర్ధి) బీడీ అంటారు.

పొరుగు రాష్ట్రాలకు మన బీడీలు

మన రాష్ట్రంలో తయారయ్యే బీడీలు పొరుగు రాష్ట్రాల్లో ఎక్కువగా వినియోగం అవుతున్నాయి. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, బిహార్, పశ్చిమ బెంగాల్, గుజరాత్‌లకు ఎగుమతి అవుతున్నాయి. రాజన్న సిరిసిల్ల, నిజామాబాద్, కామారెడ్డి, జగిత్యాల, కరీంనగర్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లో బీడీ కార్మికులు అధికంగా ఉన్నారు. బీడీలు చేసే వారిలో మహిళలే ఎక్కువ. ప్రతి వెయ్యి బీడీలకు బీడీ సైజును బట్టి 500 గ్రాముల నుంచి 700 గ్రాముల తునికాకును, 210 గ్రాముల నుంచి 250 గ్రాములు తంబాకును బీడీ కంపెనీ ఇస్తుంది. మహిళలు బీడీలు చేసిన తరువాత కంపెనీలకు పంపిస్తారు. ఒక్కో కార్మికురాలు రోజుకు సగటున 800 నుంచి 1000 బీడీలు చేస్తారు. రాష్ట్రంలో బీడీ కంపెనీలు పెద్దవి 40 వరకు ఉండగా, చిన్నవి దాదాపు 150 ఉన్నాయి.



బీడీలు చేస్తున్న మహిళలు.

బీడీ కార్మికుల వేతనం ఇలా (ప్రతీ వెయ్యి బీడీలకు)...
కనీస వేతనం: రూ.114.60
కరువు భత్యం: రూ.86.60
బోనస్: రూ.16.76
సెలవుతో కూడిన వేతనం: రూ.10.06
పండగ సెలవుల వేతనం: రూ.4.02
అన్నీ కలిపి మొత్తం: రూ.232.04

ఆసరా పెన్షన్లు ఆధారం

రాష్ట్రంలో 2014 వరకు పీఎఫ్ ఉన్న బీడీ కార్మికులకు ప్రభుత్వం ఆసరా పెన్షన్లు ఇస్తోంది. దీని కింద వీరికి ప్రతి నెలా రూ.2,016 జీవనభృతి ఇస్తుండటంతో కొంతమేరకు ఆర్థికంగా కలిసి వస్తోంది. పీఎఫ్‌లేని కార్మికులకు ఆసరా పెన్షన్ రావడం లేదు. దీంతో 2020 వరకు పీఎఫ్ కటాఫ్ తేదీని పెంచాలని బీడీ కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ఇది ప్రభుత్వ పరిశీలనలో ఉంది.

పొద్దు తిరుగుడు

కొనుగోళ్లకు పచ్చజెండా

- మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోళ్లు
- అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ



సాక్షి, హైదరాబాద్: పొద్దు తిరుగుడు పంట కొనుగోళ్లకు రాష్ట్ర సర్కారు పచ్చాజెండా ఊపింది. మార్క్‌ఫెడ్ ద్వారా పంట కొనుగోళ్లు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో పొద్దు తిరుగుడు ఎక్కువగా సాగు చేసిన సిద్దిపేట, కామారెడ్డి, సంగారెడ్డి జిల్లా రైతులకు ఊరటనిచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా 18 వేల ఎకరాల్లో పొద్దు తిరుగుడు సాగైంది. ఎకరానికి 8.39 క్వింటాళ్ల చొప్పున పంట దిగుబడి అంచనాలతో 15 వేల టన్నులు పంట మార్కెట్‌కు వస్తుందని అంచనాలున్నాయి. కాగా కేంద్ర ప్రభుత్వం 25 శాతం కొనుగోలు చేసేందుకు అనుమతించడంతో మిగిలిన పంట పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. దీంతో రైతుల అభ్యర్థన మేరకు రాష్ట్ర సర్కారు స్పందించింది. తాజాగా గురువారం మరో 5,800 టన్నుల పొద్దు తిరుగుడు పంటను కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. దీనికి రూ.41 కోట్ల బ్యాంకు గ్యారెంటీని సర్కారు మార్క్‌ఫెడ్‌కు ఇచ్చి కొనుగోలు చేయడానికి అనుమతించింది. ఈ మేరకు వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు.

మేక తలలు..కాళ్లకు ఎగబడిన జనం

మటన్ లోడు లారీ బోల్తా



మేక తల, కాళ్లను పట్టుకెళ్తున్న జనం

తూప్రాన్: లారీ బోల్తా పడటంతో.. అందులోని మేక తలకాయలు, కాళ్ల కోసం జనం ఎగబడ్డారు. మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణం సమీపంలోని నాగులపల్లి చౌరస్తా వద్ద 44వ జాతీయ రహదారిపై నాగపూర్ నుంచి హైదరాబాద్‌కు మేక తలకాయలు, కాళ్లు, తోళ్ల లోడుతో వెళ్తున్న లారీ గురువారం ప్రమాదవశాత్తు బోల్తా పడింది. దీంతో లారీలోని ప్లాస్టిక్ డబ్బాల్లో ఉన్న మేక తలకాయలు, కాళ్లు, తోళ్లు రహదారిపై చెల్లాచెదురుగా పడిపోయాయి. లారీ డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఇదే అదను భావించిన జనం రహదారిపై చెల్లాచెదురుగా పడిఉన్న మేక తలకాయలు, కాళ్లు తీసుకెళ్లేందుకు ఎగబడ్డారు. వాహనదారులు సైతం తమ వాహనాలను రహదారి పక్కన నిలిపి అందినకాడికి తీసుకెళ్లారు. గంట వ్యవధిలో లారీలో ఉన్న సరుకు పూర్తిగా ఖాళీ అయ్యింది. కాగా ఈ ఘటనకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ సురేష్ కుమార్ తెలిపారు

బీసీ సంక్షేమ కార్యక్రమాలకు భారీగా నిధులు

సాక్షి, హైదరాబాద్: వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ పరిధిలోని వివిధ కార్యక్రమాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసింది. ఇందులో భాగంగా మహాత్మాజ్యోతిబా పూలే సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీకి రూ. 237.18 కోట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బి.వెంకటేశం పరి పాలన అనుమతులు జారీ చేశారు. ఇంకా, తెలంగాణ వాషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్‌కు రూ.23 లక్షలు, నాయీబ్రాహ్మణ కోఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్‌కు రూ.26లక్షలు, టాడీటాపర్స్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు రూ. 1.63 కోట్లు, అత్యంత వెనుకబడిన తరగతుల అభివృద్ధి కార్పొరేషన్‌కు రూ.67 లక్షలు, తెలంగాణ స్టడీ సర్కిల్‌కు రూ.39.85 లక్షలు మంజూరయ్యాయి.

ప్రీతి ఆత్మహత్య కేసులో జైలు నుంచి విడుదలైన సైఫ్



జైలు నుంచి బయటకు వస్తున్న డాక్టర్ సైఫ్

ఖమ్మం రూరల్: వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాల పీజీ విద్యార్థిని ధరావత్ ప్రీతి ఆత్మహత్య కేసులో నిందితుడైన డాక్టర్ సైఫ్ ఖమ్మం జిల్లా జైలు నుంచి విడుదలయ్యాడు. ఆయన గత 56 రోజులుగా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. బుధవారం వరంగల్ ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి సత్యేంద్ర.. సైఫ్‌కు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేయడంతో గురువారం రాత్రి అతడిని జైలు నుంచి విడుదల చేశారు. జైలు నుంచి బయటకు వచ్చిన సైఫ్‌తో మీడియా ప్రతినిధులు మాట్లాడేందుకు ప్రయత్నించగా ఆయన నిరాకరించాడు. అక్కడకు వచ్చి సైఫ్ తల్లిదండ్రులతో విలేకరులు మాట్లాడగా.. 'మా కుమారుడు ఏ తప్పూ చేయలేదు, అనవసరంగా ఈ కేసులో చేర్చారు'అని వ్యాఖ్యానించారు.

కలెక్టరేట్ వద్ద దివ్యాంగుడి ఆత్మహత్యాయత్నం

- లక్కీడిప్‌లో డబుల్ బెడ్రూం వచ్చినా ఇల్లు ఇవ్వలేదని కలత
- జోగుళాంబ గద్వాలలో ఘటన



ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నిస్తున్న శాలీమియాను అడ్డుకుని ఒంటిపై నీళ్లు పోస్తున్న పోలీసులు

గద్వాల రూరల్: లక్కీడిప్‌లో తనకు డబుల్ బెడ్రూం ఇల్లు వచ్చిందన్న ఆనందం ఆవిరి కావడంతో ఓ దివ్యాంగుడు తీవ్ర కలత చెందాడు. గురువారం జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టరేట్ వద్ద ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. అక్కడే ఉన్న పోలీసులు, కార్యాలయ సిబ్బంది అడ్డుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. బాధితుడి కథనం ప్రకారం ఈ నెల 15న స్థానిక పాత ఎంపీడీఓ కార్యాలయంలో దివ్యాంగుల కోటాకు సంబంధించి కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్ నేతృత్వంలో లక్కీడిప్ నిర్వహించారు. మొత్తం 65 మంది అర్హులైన దివ్యాంగుల్లోంచి 39 ఇళ్లకు లక్కీడిప్ తీయాల్సి ఉండగా అధికారుల మధ్య సమన్వయలోపంతో 40 ఇళ్లకు లక్కీడిప్ తీశారు. స్థానిక 15వ వార్డుకు చెందిన శాలీమియా 40వ లక్కీడిప్ కింద ఎంపిక కావడంతో డబుల్ బెడ్రూం ఇల్లు వచ్చిందని సంబరపడ్డాడు. కానీ ఆ తర్వాత జరిగిన పొరపాటును అధికారులు గ్రహించి అతన్నుంచి ధ్రువపత్రాలు తీసుకోవడానికి నిరాకరించారు. దీంతో మనస్థాపానికి గురైన శాలీమియా ఆత్మహత్యాయత్నం చేశాడు. తనకు న్యాయం చేయకపోతే కుటుంబ సభ్యులతో కలసి ఆత్మహత్యకు పాల్పడతానని హెచ్చరించాడు. కాగా, కలెక్టరేట్ వద్ద అధికారుల విధులకు ఆటంకం కలిగించడంతోపాటు సందర్శకుల రాకపోకలకు ఇబ్బంది కలిగించారంటూ శాలీమియాతోపాటు అతని వెంట వచ్చిన మరో ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

కాంగ్రెస్‌లో 'ఎంపీలాట'!

▶ మొదటి పేజీ తరువాయి




సైలెంట్ అయిపోయారు. ఇలా ముగ్గురు కీలక నేతల మధ్య నల్లగొండ సభ జగడం పార్టీలో గందరగోళానికి దారితీసింది. దీనితో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, ఏఐసీసీ కార్యదర్శి నదీం జావేద్ జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. వారు ఎంపీలతో చర్చించి 21న జరగాల్సిన నల్లగొండ సభను 28కి వాయిదా వేయించారు. మిగతా జిల్లా కేంద్రాల్లో ప్రకటించిన నిరుద్యోగ సభలు యథాతథంగా జరగనున్నాయి. 24న ఖమ్మం, 26న ఆదిలాబాద్, 28న నల్లగొండ, 30న పాలమూరు, మే 1న రంగారెడ్డి జిల్లాలో నిరుద్యోగ సభలు జరుగుతాయి.

మే 4న లేదా 5న తేదీల్లో ప్రియాంక సభ

నిరుద్యోగ సభల అనంతరం మే 4న లేదా 5న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో రాష్ట్రస్థాయిలో సభ నిర్వహించాలని టీపీసీసీ నిర్ణయించింది. ఆ సభకు పార్టీ కీలకనేత ప్రియాంకా గాంధీ హాజరుకానున్నారు. అయితే ఏ రోజున ప్రియాంక పర్యటన ఉంటుందన్నది ఒకట్రెండు రోజుల్లో ఖరారు అవుతుందని టీపీసీసీ వర్గాలు చెప్తున్నాయి. ప్రియాంక సభతో రాష్ట్రపార్టీలో కొత్త ఉత్సాహం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశాయి.

మల్లన్న లడ్డూ బరువు తగ్గింది

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జునస్వామి లడ్డూ బరువు తగ్గింది. 100 గ్రాములకు బదులుగా 90 గ్రాములే తయారు చేస్తున్నారు. ఇంతకుముందు రూ.20కు 100 గ్రాముల లడ్డూ, రూ.20కు 200 గ్రాముల పులిహోర, రూ.20కు 200 గ్రాముల సిరా అందజేసేవారు. గురువారం హైదరాబాద్‌కు చెందిన ఓ భక్తుడు రూ.60 చెల్లించి మూడు లడ్డూలు కొనుగోలు చేశాడు. అనుమానం రావడంతో వాటిని తూకం వేయించగా ఒక్కొక్కటి 90 గ్రాములే ఉన్నాయి. ఈ విషయమై ఆలయ ఏఈవో శ్రీనివాస్‌ను వివరణ కోరగా లడ్డూ తయారు చేసిన సమయంలో 100 గ్రాములు ఉంటుందని, ఒకటి రెండు రోజుల్లో బరువు తగ్గే అవకాశం ఉందని తెలిపారు.



బరువుతగ్గిన మల్లన్న లడ్డూ ప్రసాదం

23 నుంచి 'బీసీల పోరుబాట'

సాక్షి, హైదరాబాద్: బీసీ కుల గణన సాధన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచడానికి ఈనెల 23 నుంచి నల్లగొండ నుంచి నడిగడ్డ వరకు 'బీసీల పోరుబాట'చేపట్టనున్నామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. 33 జిల్లా కేంద్రాల్లో పోరుబాట సభలు నిర్వహిస్తామని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల దేశంలో ఉన్న పెద్ద పులుల సంఖ్యను లెక్కించారు తప్ప, బీసీల లెక్కల నమోదుకు కేంద్రానికి మనసు రావడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

డిగ్రీ నాలుగేళ్లు!

▶ మొదటి పేజీ తరువాయి

పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ కోర్సును ఎంపిక చేసినట్టు అధికారులు తెలిపారు.

పారిశ్రామిక అనుభవం తప్పనిసరి

ఆనర్స్ కోర్సులకు పారిశ్రామిక శిక్షణ తప్పనిసరి చేయాలని ప్రతిపాదించారు. విదేశాల్లో సైతం ఉపాధి లభించేలా నైపుణ్యాలను తీర్చిదిద్దనున్నారు. బీఎస్సీ ఆనర్స్‌లో ప్రవేశం పొందిన విద్యార్థులు కచ్చితంగా పరిశ్రమల్లో శిక్షణ పొందాల్సి ఉంటుంది. ఈ మేరకు ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలతో విశ్వవిద్యాలయాలు అవగాహన ఒప్పందం చేసుకోవాల్సి ఉంటుంది. మూడేళ్ల కోర్సు తర్వాత నాలుగో ఏట విద్యార్థులు అమెరికా, యూకే, సింగపూర్, కెనడా వంటి దేశాలకు వెళ్లి అక్కడి సంస్థల్లో కోర్సు చేసేలా డిజైన్ చేస్తున్నారు.

ఉపాధికి ఊతం



నాలుగేళ్ల ఆనర్స్ కోర్సులు వృత్తి విద్య కోర్సులకు పోటీనిస్తాయి. డిగ్రీతో మంచి ఉద్యోగాలు పొందడమే కాదు... సాఫ్ట్‌వేర్ రంగంలోకి అడుగుపెట్టేలా తీర్చిదిద్దాలన్నదే లక్ష్యం. ఈ దిశగా ఉన్నత విద్యామండలి కసరత్తు చేస్తోంది. వచ్చే విద్యాసంవత్సరం నుంచి కొన్ని కాలేజీల్లో వీటిని తెచ్చే లక్ష్యంతో ఉన్నాం.

– ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, ఉన్నత విద్యామండలి చైర్మన్

అదుపు తప్పి.. కల్వర్టును ఢీ కొట్టి..

- కారులో వెళ్తున్న తండ్రీ కొడుకులు దుర్మరణం
- నకిరేకల్ మండలం నెల్లిబండ శివారులో జాతీయ రహదారిపై ఘటన
- మృతులు భద్రాది కొత్తగూడెం జిల్లా రుద్రంపూర్ వాసులు



కల్వర్టు గోడను ఢీకొని దెబ్బతిన్న కారు ముందుభాగం



మల్లేశ్ (ఫైల్)



అవినాశ్ (ఫైల్)

నకిరేకల్: కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న కల్వర్టును ఢీకొట్టడంతో తండ్రీకొడుకులు దుర్మరణం పాలైన ఘటన నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం నెల్లిబండ గ్రామశివారులో గురువారం ఉదయం చోటుచేసుకుంది. భద్రాది కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం రుద్రంపూర్ మార్కెట్ ఏరియాకు చెందిన కుసుమ మల్లేశ్(59) సింగరేణి జీకే విభాగంలో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఇంజనీరింగ్ పూర్తి చేసిన కుమారుడు అవినాశ్(34)తో కలిసి మల్లేశ్ కోర్టు పని నిమిత్తం గురువారం తెల్లవారుజామున రుద్రంపూర్ నుంచి కారులో హైదరాబాద్ బయల్దేరారు. మహబూబాబాద్ మీదుగా 365వ నంబర్ జాతీయ రహదారిపై వెళ్తుండగా మార్గమధ్యంలో ఉదయం 6.30 గంటల సమయంలో నెల్లిబండ శివారులో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో కారు అదుపు తప్పింది. కుడివైపు ఉన్న కల్వర్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం నుజ్జునుజ్జు కాగా, డ్రైవింగ్ చేస్తున్న అవినాశ్ అక్కడిక్కడే మృతిచెందాడు. పక్కనే కూర్చున్న మల్లేశ్ తీవ్ర గాయాలతో ప్రాణాపాయస్థితిలో ఉండగా స్థానికులు గమనించి 108లో నకిరేకల్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మృతిచెందారు. పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు మల్లేశ్ కుమార్తె శాలినీ, భార్య, బంధువులు నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి చేరుకున్నారు. ఇంటికి పెద్ద దిక్కు అయిన మల్లేశ్‌తోపాటు చేతికి అందివచ్చిన కుమారుడు మృతిచెందడంతో కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

కడుపులో కర్చీఫ్‌పై పునర్విచారణ

- త్రిసభ్య కమిటీ అస్పష్ట నివేదిక
- మళ్లీ విచారణకు కలెక్టర్ ఆదేశం
- కేసును సుమోటోగా స్వీకరించిన ఎంసీఐ!



విచారణ జరుపుతున్న అధికారులు

జగిత్యాల: జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నమిలికొండ గ్రామానికి చెందిన నవ్యశ్రీ మూడోకాన్పు కోసం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేరగా సిజేరియన్ చేసిన వైద్యులు.. కడుపులోనే కర్చీఫ్ మర్చిపోయారన్న వార్తపై మళ్లీ విచారణకు కలెక్టర్ యాస్మిన్‌బాషా ఆదేశించారు. ఈ సంఘటనపై కలెక్టర్ ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ బుధవారం ఉదయం నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ విచారణ జరపడం తెలిసిందే. తొలుత శస్త్రచికిత్స చేసిన వేములవాడ నందిని ఆస్పత్రి డాక్టర్ హారిక.. నవ్యశ్రీ కడుపులో 10 ఇంచీల పొడవు, 10 ఇంచీల వెడల్పుతో కూడిన మాప్(గుడ్డ) బయటపడిందని వివరించారు. మరోవైపు ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్ శిరీష ఆధ్వర్యంలో శస్త్రచికిత్స చేసిన పీజీ డాక్టర్ మీనా వివరణ ఇస్తూ.. తమ ఆస్పత్రిలో 6 ఇంచీల పొడవు, 6 ఇంచీల వెడల్పు మాప్(గుడ్డ) మాత్రమే వినియోగిస్తామని స్పష్టం చేశారు. నవ్యశ్రీ కడుపులోంచి బయటకు తీసిన గుడ్డ పెద్దగా ఉండటంతో.. అది అంతకుముందే ఉండి ఉండొచ్చని త్రిసభ్య కమిటీ తేల్చి కలెక్టర్‌కు నివేదిక అందజేసింది. నివేదిక అస్పష్టంగా ఉండటంతో మరోసారి సమగ్ర విచారణ జరిపి వారంరోజుల్లోగా నివేదిక అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. దీంతో త్రిసభ్య కమిటీ గురువారం పూర్వపు నిజామాబాద్ జిల్లా బాన్సువాడలో ఉంటున్న నవ్యశ్రీ వద్దకు వెళ్లింది. కాగా, ఈ సంఘటన సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సుమోటోగా స్వీకరించినట్లు తెలిసింది. శస్త్రచికిత్స చేసిన వైద్యుల సర్వీస్ రికార్డులు, కేస్ షీట్స్ అందజేయాలని ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించినట్లు తెలిసింది.

ప్రకృతి వనం.. కొరవడిన పచ్చదనం



జీతాలు లేక.. పనికి రాక

నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలంలోని అమ్రాద్ తండాలో నాలుగైదు నెలలుగా జీతాలు లేక పంచాయతీ కార్మికులు పనికి రావడం మానేశారు. ఇక నీళ్ల ట్యాంకర్‌కు అవసరమైన డీజిల్ డబ్బు కూడా లేకపోవడంతో వనంలో మొక్కలకు నీరందక ఎండిపోతున్నాయి.

▶ మొదటి పేజీ తరువాయి

ఎండిపోయాయి. ఆయా ప్రాంతాల్లో పంచాయతీల ట్యాంకర్లతో నీళ్లు పట్టినా.. ట్యాంకర్ల నిర్వహణ జీపీలకు పెనుభారమైన నేపథ్యంలో ఆ దిశగా చర్యలు తీసుకోవడంలేదు. భద్రాద్రి కొత్తగూడెం, నిజామాబాద్, ఆదిలాబాద్ తదితర జిల్లాల్లోని గ్రామ పంచాయతీల్లో పల్లె ప్రకృతివనాలు ఇప్పటికే పూర్తిగా ఎండిపోయాయి.

అన్నిచోట్లా వేతనాల సమస్యే..

- ➤ ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 42 మండలాల్లో 1,070 జీపీలు ఉండగా, 3,851 మంది మల్టీపర్పస్ వర్కర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి సంబంధించి రూ.2 కోట్ల వరకు వేతనాలు అందాల్సి ఉంది. ఈ జిల్లాలో 2,088 వనాలు ఏర్పాటు చేయగా, చాలా చోట్ల బోర్లు వేయకపోవడం, ట్యాంకర్లపైనే ఆధారపడి నీళ్లు పోయాల్సి రావడంతో వేసవిలో మొక్కలు ఎండిపోతున్నాయి.
- ➤ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం 1,509 జీపీలకు గాను 3,406 వనాలు ఏర్పాటు చేశారు. ఇక్కడ పనిచేస్తున్న 4,924 మంది మల్టీ పర్పస్ వర్కర్లకు 2 నుంచి 4 నెలల వరకు వేతనాలు రూ.10.11 కోట్ల మేర పెండింగ్‌లో ఉన్నాయి. ఒక్క ఆదిలాబాద్ జిల్లాలోనే రూ.6 కోట్ల వేతనాలు అందాలి. ఈ క్రమంలో వేసవిలో నీరు అందకపోవడంతో అధికారుల దృష్టికి వచ్చిన చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినా మిగతా చోట్ల ప్రకృతి వనాలు ఎండిపోయాయి.
- ➤ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 1,056 జీపీలకు గాను 1,338 వనాలు ఉన్నాయి. నిధులు లేక వారానికోసారి పడుతున్నారు. కొన్నిచోట్ల పూర్తిగా వదిలేశారు. ఐదారు నెలలుగా డబ్బు అందక పోవడంతో వన సేవకులకు పని మానేశారు.
- ➤ ఉమ్మడి వరంగల్ జిల్లాలో 963 గ్రామ పంచాయతీలు ఉండగా 965 పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. నీరు లేక ఇప్పటికే 92 వనాలు ఎండిపోయే స్థితికి చేరాయి. మొత్తం 3,998 మంది మల్టీపర్పస్ వర్కర్లకు రెండు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి.
- ➤ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నాగర్‌కర్నూల్‌లో రెండు నెలల నుంచి, వనపర్తి, గద్వాల, నారాయణ్‌పేట జిల్లాల్లో నాలుగు నెలల నుంచి మల్టీపర్పస్ వర్కర్లకు వేతనాలు రావడం లేదు. మొత్తంగా 5,786 మందిమల్టీపర్పస్ వర్కర్లకు సంబంధించి సుమారు రూ.13 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 4 నెలలుగా 5,666 మంది మల్టీపర్పస్ వర్కర్లకు వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో వారు ప్రకృతి వనాల నిర్వహణపై దృష్టి సారించడం లేదు.

మూడు నెలల డబ్బులు రావాలి..



ప్రకృతి వనంలో మొక్కలను కాపాడేందుకు ఎండనక, వాననక కష్టపడ్డా. నెలకు రూ.3 వేల చొప్పున మూడు నెలల వేతనం రాలేదు. అధికారులను అడిగితే వస్తుందనే సమాధానం తప్ప బ్యాంకులో జమ అయిందే లేదు. –పార్నంది గౌరమ్మ, శివునిపల్లి, స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ జిల్లా

నెల నెలా ఎదురుచూపులే..

వన సేవకుడిగా పనిచేస్తున్నా. గత ఐదు నెలలుగా వేతనాలు రావడం లేదు. ఎప్పటికప్పుడు ఈనెల వస్తాయంటూ ఎదురుచూస్తున్నా. చేసిన పనికి ప్రతినెలా డబ్బులిస్తే మాకు ఇబ్బందులు ఉండవు.

– బోసి ధర్మయ్య, బజార్ కొత్తూర్, నందిపేట్ మండలం, నిజామాబాద్ జిల్లా



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం లంబాడిపల్లెలో ఎండిపోయిన ప్రకృతివనం

క్లుప్తంగా...

కర్ణాటకలో రూ.25 కోట్ల సొత్తు సీజ్

బెళగావి: కర్ణాటకలో ఎన్నికల వేళ 1.54 కోట్ల నగదుతోపాటు 40 కిలోల బంగారం, 20 కిలోల వెండిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బెళగావి జిల్లా పోలీసులు బుధవారం రాత్రి ఓ కారులో తరలిస్తున్న లెక్కల్లో చూపని నగదు రూ.1.54 కోట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, ఆదాయ పన్ను శాఖకు సమాచారమిచ్చినట్లు పోలీసు అధికారి ఒకరు చెప్పారు. అదేవిధంగా, చిక్కమగళూరు జిల్లా తరికెరె అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఎన్నికల నిఘా అధికారులు 40.59 కిలోల బంగారంతోపాటు 20.7 కిలోల వెండిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సొత్తు విలువ రూ.23.51 కోట్లుంటుందని చెప్పారు. మార్చి 29వ తేదీన నిబంధనావళి అమల్లోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో రూ.204 కోట్లను సీజ్ చేసి, ఇందుకు సంబంధించి 1,714 కేసులు నమోదు చేశారు.

ఒడిశాలో గిరిజన బాలికలపై గ్యాంగ్ రేప్

భవానీపట్న: ఒడిశాలోని కలహండి జిల్లాలో జరిగిన ఘోరం ఆలస్యంగా వెలుగుచూసింది. ఈనెల 16వ తేదీ రాత్రి జాతరకు వెళ్లివస్తున్న 14–17 ఏళ్లలోపు ముగ్గురు బాలికలను ఐదుగురు వ్యక్తులు అడ్డగించారు. వీరిలో ఒక బాలిక తప్పించుకోగా మిగతా ఇద్దరిపై దుండగులు అత్యాచారానికి పాల్పడ్డారు. నిందితుల కోసం గాలిస్తున్నట్లు బిజెపూర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జి లింగరాజ్ సేథి చెప్పారు. ఈ ఘటనపై బాధితుల కుటుంబీకులు గ్రామపెద్దలను ఆశ్రయించారు. అయితే, నిందితులు వేరే వర్గానికి చెందినవారు కావడంతో తమకు ఫిర్యాదు చేశారని సేథి అన్నారు. ఇక్కడి అటవీ ప్రాంతంలో మావోయిస్టుల సంచారం ఎక్కువగా ఉంటుందన్నారు.

గోవాలో ఎస్‌సీవో భేటీకి బిలావల్

పాకిస్తాన్ విదేశాంగ శాఖ వెల్లడి

ఇస్లామాబాద్: భారత్‌లో జరిగే షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీవో) సమావేశానికి పాక్ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో హాజరుకానున్నారు. మే 4, 5వ తేదీల్లో గోవాలో జరిగే ఎస్‌సీవో విదేశాంగ మంత్రుల భేటీలో పాల్గొనే పాక్ బృందానికి ఆయన నాయకత్వం వహిస్తారు. ఈ విషయాన్ని పాక్ విదేశాంగ శాఖ గురువారం వెల్లడించింది. భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ఆహ్వానం మేరకు మంత్రి బిలావల్ గోవా వెళ్తున్నారని పాక్ విదేశాంగ శాఖ ప్రతినిధి ముంతాజ్ జహ్రా బలోచ్ చెప్పారు. బిలావల్ పర్యటన ఖరారుతో రెండు దేశాల మధ్య సంబంధాల్లో ఉద్రిక్తతలు కొంతైనా తగ్గుతాయనే ఆశలు చిగురిస్తున్నాయి. పాక్ నేత ఒకరు భారత్‌కు రావడం గత ఆరేళ్ల తర్వాత ఇదే తొలిసారికావడం గమనార్హం.

ఇద్దరి అధికారదాహం.. అంతర్యుద్ధం

ఇద్దరు మిలటరీ నాయకుల మధ్య ఆధిపత్య పోరాటం సూడాన్‌లో సామాన్యుల ఆకలి కేకలకు దారితీస్తోంది. అధికారం కోసం వారు చేస్తున్న పోరాటంతో సామాన్యులు సమిధలుగా మారుతున్నారు. తినడానికి తిండి లేక, తాగడానికి నీళ్లు దొరక్క, కటిక నేలపై నిద్రిస్తూ ఎప్పుడే తూటా తమ ప్రాణాల్ని హరిస్తుందో తెలీని పరిస్థితుల్లో బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. సూడాన్‌లో ఎందుకీ ఘర్షణలు ?

సూడాన్ ఆధిపత్య పోరాటంలో మిలటరీ జనరల్స్.. బతుకు పోరాటంలో సమిధలుగా మారుతున్న సామాన్యులు

దశాబ్దాల తరబడి నియంత పాలనలో మగ్గిపోయిన సూడాన్‌లో 2019లో ఆర్మీ తిరుగుబాటు జరిగి ఆనాటి అధ్యక్షుడు, నియంత ఒమర్ అల్–బషీర్‌ని సైన్యం గద్దె దింపడంతో ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పాటైంది. ప్రజలు కాస్త ఊపిరి పీల్చుకున్నారో లేదో రెండేళ్లకే 2021లో ఆ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి కొదమసింహాల్లాంటి ఇద్దరు జనరల్స్ చేతులు కలిపారు. అధికారాన్ని చేజిక్కించుకున్నారు. ఈ క్రమంలో ఘర్షణలు చెలరేగి వందల మంది ప్రాణాలు కోల్పోయారు. మళ్లీ రెండేళ్లకే అధికార బదలాయింపులో సమస్యలు మిత్రులైన ఆ మిలటరీ జనరల్స్‌ను శత్రువులుగా మార్చింది. వారే సూడాన్ ప్రస్తుత పాలకుడు, ఆర్మీ చీఫ్ జనరల్ అబ్దుల్ ఫత్తా అల్ బుర్హాన్, ఉపాధ్యక్షుడు, ఆర్‌ఎస్‌ఎఫ్ చీఫ్ జనరల్ మొహమద్ హమ్దాన్ దగలో (హెమెడ్తీ) . వీరిద్దరి మధ్య ఆధిపత్య పోరాటం తారస్థాయికి చేరుకుంది. ముందుగా జరిగిన ఒప్పందం ప్రకారం గత ఏడాది చివర్లో ప్రజాస్వామ్య పద్ధతుల్లో దేశంలో ఎన్నికలు జరగాలి. కానీ బుర్హాన్ అనుకున్నట్టుగా ఆ పని చేయలేదు. ఈలోగా అధికారాన్ని తన గుప్పిట్లో తీసుకోవడానికి హెమెడ్తీ పౌర పార్టీల కూటమైన ఫోర్సెస్ ఫర్ ఫ్రీడమ్ అండ్ ఛేంజ్ (ఎఫ్ఎఫ్‌సీ)తో సత్సంబంధాలు పెట్టుకున్నారు. వ్యూహాత్మకంగా అడుగులు వేస్తూ తనని తాను ఒక రాజనీతిజ్ఞుడిగా చూపించుకునే ప్రయత్నం మొదలుపెట్టారు. బంగారం గనులు, ఇతర వెంచర్ల ద్వారా హెమెడ్తీ, ఎఫ్ఎఫ్‌సీలు బాగా సంపద పోగేసుకున్నారు. మాజీ అధ్యక్షుడు బషీర్ అనుచరులు, ఇతర సీనియర్లు, ఆర్మీలో చాలా రోజులుగా పాతుకుపోయి ఉన్న వారిని పక్కకు తప్పించాలని ప్రణాళికలు రచించారు. ఆర్‌ఎస్‌ఎఫ్‌ను దేశవ్యాప్తంగా చాప కింద నీరులా విస్తరించడం ప్రారంభించారు. ఈలోగా లక్ష మంది బలగం ఉన్న ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్ (ఆర్‌ఎస్‌ఎఫ్)ను సైన్యంలో విలీనం చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. తర్వాత సైన్యాధ్యక్షుడుగా ఎవరు ఉంటారన్నది సవాల్‌గా మారాయి. ఈ పరిణామాలన్నీ తన పదవికి ఎసరు పెడతాయని అధ్యక్షుడు బుర్హాన్ భావించారు. ఫలితంగా ఈ నెల 15న ఇరు వర్గాల మధ్య పోరు మొదలైంది.

ఎవరిది పై చేయి?

బుర్హాన్, హెమెడ్తీ మధ్య హోరాహోరీ పోరు కొనసాగుతోంది. ఇద్దరికి ఇద్దరూ తగ్గేదేలే అంటున్నారు. ఆర్‌ఎస్‌ఎఫ్‌ను ఒక తిరుగుబాటు సంస్థగా ముద్రవేసిన బుర్హాన్ వెంటనే దానిని రద్దు చేయాలని పట్టు బడుతున్నారు. మరోవైపు హెమెడ్తీ బుర్హాన్‌ను క్రిమినల్‌గా అభివర్ణిస్తున్నారు. బషీర్ పాలన నుంచి విముక్తి పొందినా దేశంలో శాంతి స్థాపన జరగకపోవడానికి ఆయనే కారణమని నిందిస్తున్నారు. సూడాన్ ఆర్మీలో 3 లక్షల మంది సైనికులతో వైమానిక బలగం కూడా దాని సొంతం. ఆర్‌ఎస్‌ఎఫ్‌లో లక్ష మంది సైనికులే ఉన్నారు. అయితే ఆర్‌ఎస్‌ఎఫ్‌కు సూడాన్ పశ్చిమ ప్రాంతంలో గిరిజన తెగల అండదండలు ఉన్నాయి. అంతర్జాతీయ సమాజం కూడా ఇద్దరు బలవంతులు కొట్టుకుంటూ ఉంటే ఎలా స్పందించాలో తెలీక మౌనం వహిస్తోంది. మానవీయ సంక్షోభం రాకుండా చర్యలు తీసుకోవాలని వారికి సలహా ఇవ్వడం మినహా మరేమీ చేయలేకపోతోంది.



సూడాన్ జనాభా	4.6 కోట్లు
కాల్పులు జరుగుతున్న ప్రాంతంలో నివసిస్తున్నవారు	1.2 కోట్లు
మానవీయ సాయం కావాల్సిన వారు	1.6 కోట్లు
ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న వారు	1.17 కోట్లు

అయిదు రోజులుగా నరకం

సూడాన్‌లో వారం రోజులుగా సాగుతున్న హింసాకాండలో ఇప్పటివరకు 200 మందికి పైగా మరణించారు. వేలాది మంది గాయపడ్డారు. పోరాటమంతా రాజధారి ఖర్టూమ్ పరిసరాల్లో జనావాస ప్రాంతాల్లో జరుగుతోంది. సూడాన్ జనాభా 4.6 కోట్లు అయితే రాజధాని పరిసర ప్రాంతాల్లోనే 1.2 కోట్ల మంది నివసిస్తారు. ఈ ప్రాంతాలన్నీ కాల్పుల మోతతో దద్దరిల్లిపోతున్నాయి. వీధుల్లోనే శవాలు పడి ఉన్నా పట్టించుకునే వారే లేరు. విద్యుత్ సదుపాయం నిలిచిపోయింది. బేకరీలో బ్రెడ్ కొనుక్కొని తెచ్చుకోవడానికి 3 గంటలు క్యూ లైన్‌లో నిల్చోవాల్సి వస్తోంది. కిలోమీటర్ దూరంలో ఉండే ఆఫీసుకి వెళ్లడం కూడా అందరికీ కష్టమవుతోంది. ఇల్లు కదిలి కాలు బయట పెడితే ప్రాణాలతో బతికి ఉంటారన్న నమ్మకం లేదు. అత్యవసరంగా ఆస్పత్రికి వెళ్లాలన్నా వీధుల్లో వినిపిస్తున్న కాల్పుల మోతలతో బయటకి అడుగుపెట్టే ధైర్యం చేయడం లేదని 65 ఏళ్ల వయసున్న అబ్బాస్ చెప్పారు. సూడాన్ పాలకులకు ప్రజల ప్రాణాలపై కనీస గౌరవం కూడా లేదని ఆయన మండిపడ్డారు ''వేలాది మంది ప్రజలు ప్రాణాలు కాపాడుకోవడానికి ఇళ్లకే పరిమితమయ్యారు. ఇంట్లో సరుకులు అయిపోతున్నా, మంచినీరు, కరెంట్, మందులు వంటివి లేకపోయినా బయటకు వచ్చే పరిస్థితి లేదు''అని ఐక్యరాజ్య సమితి మానవహక్కుల హై కమిషనర్ వోల్కర్ టర్క్ చెప్పారు. కొన్ని దశాబ్దాల పాటు బషీర్ పాలనలో అంతర్యుద్ధంలోనే ప్రజలు గడిపారు. పేదరికం, అణచివేతను ఎదుర్కొంటూ దుర్భర పరిస్థితుల్ని చూశారు. ఇప్పుడైనా ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పడుతుందన్న వారి ఆశలు అడియాసలుగా మారాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

నరోడా గామ్ కేసులో 67 మంది నిర్దోషులే

ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు • గుజరాత్ హైకోర్టులో సవాలు చేస్తామన్న బాధితులు

అహ్మదాబాద్: రెండు దశాబ్దాల క్రితం నాటి నరోడా గామ్ ఊచకోత కేసులో అహ్మదాబాద్‌లోని ప్రత్యేక కోర్టు గురువారం సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో మొత్తం 67 మంది నిందితులను నిర్దోషులుగా ప్రకటించింది. వీరిలో గుజరాత్ మాజీ మహిళా మంత్రి మాయా కొద్నానీ, బజరంగ్ దళ్ మాజీ నాయకుడు బాబూ బజరంగీ, విశ్వ హిందూ పరిషత్(వీహెచ్‌పీ) మాజీ నేత జయదీప్ పటేల్ ఉన్నారు. ప్రత్యేక కోర్టు తీర్పుతో 67 మంది నిందితులకు కేసు నుంచి విముక్తి లభించినట్లయ్యింది. గుజరాత్‌లో 2002లో గోధ్రా రైలు దహనం అనంతరం రాష్ట్రమంతటా భారీగా హింసాకాండ చోటుచేసుకుంది. అహ్మదాబాద్‌లోని నరోడా గామ్‌లో జరిగిన మత ఘర్షణల్లో మైనార్టీ వర్గానికి చెందిన 11 మంది బలయ్యారు. ఈ కేసులో పోలీసులు 86 మందిని నిందితులుగా గుర్తించారు. ఈ ఊచకోతపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) విచారణ కొనసాగింది. నిందితుల్లో 18 మంది విచారణ కొనసాగుతుండగానే మృతి చెందారు. మరొకరు నిర్దోషిగా బయటపడ్డారు. మిగిలిన 67 మందికి బెయిల్ లభించింది. కేసుపై ప్రత్యేక జడ్జి ఎస్.కె.బాక్సీ తుది తీర్పు వెలువరించారు. నిందితులంతా నిర్దోషులేనని వెల్లడించారు. తమకు న్యాయం జరగలేదని, ప్రత్యేక కోర్టు తీర్పును గుజరాత్ హైకోర్టులో సవాలు చేస్తామని బాధిత కుటుంబాల తరపు లాయర్ చెప్పారు. మాయా కొద్నానీ 2002లో గుజరాత్‌లో నరేంద్ర మోదీ కేబినెట్‌లో మంత్రిగా ఉన్నారు.




తీర్పు వేళ కోర్టు వద్ద మాయా, మరో నిందితుడు

వితరణ వేళ విషాదం

- యెమెన్‌లో రంజాన్ సందర్భంగా పేదలకు నగదు పంచే కార్యక్రమంలో తొక్కిసలాట
- 78 మంది దుర్మరణం
- మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం

సనా: యెమెన్ దేశంలో పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని స్థానికులకు తలో 7 డాలర్లమేర ఉచిత నగదు పంపిణీ కార్యక్రమం చివరకు ఘోర విషాదంతో ముగిసింది. వందల సంఖ్యలో జనం తరలిరావడం, వారిని అదుపుచేసేందుకు సాయుధ హౌతీ తిరుగుబాటుదారులు గాల్లోకి కాల్పులు జరపడం, ఆ తూటాలు తగిలి విద్యుత్ తీగల వద్ద పేలిన శబ్దాలతో భయపడిన పేదజనం పరుగెత్తారు. దీంతో హఠాత్తుగా తొక్కిసలాట చోటుచేసుకుంది. యెమెన్ రాజధాని సనా సిటీలోని ఓ పాఠశాల ఆవరణలో జరిగిన ఈ తొక్కిసలాటలో చిన్నారులు, మహిళలుసహా 78 మంది ప్రాణాలుకోల్పోయారు.73 మంది గాయపడ్డారు. 13 మంది పరిస్థితి విషమంగా ఉంది. మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని ఈ ప్రాంతాన్ని పాలిస్తున్న హౌతీ తిరుగుబాటుదారులు తెలిపారు. ఓల్డ్‌సిటీ పరిధిలోని బాబ్ అల్–యెమెన్ ప్రాంతంలోని మయిన్ స్కూల్‌లో బుధవారం అర్ధరాత్రివేళ ఈ ఘోరం సంభవించింది. నగదు పంపిణీ కార్యక్రమం నిర్వహణలో విఫలమవడంతో దాతలైన ఇద్దరు స్థానిక వ్యాపారవేత్తలను అరెస్టుచేశామని హౌతీ రెబల్స్ నేతృత్వంలోని అంతర్గత మంత్రిత్వ శాఖ తెలిపింది.



సంఘటనా స్థలంలో దృశ్యం

దారుణ మానవ విపత్తు

2014లో యెమెన్ ఉత్తర ప్రాంతంపై పట్టు కోల్పోయిన హౌతీ తిరుగుబాటుదారులు ఆ తర్వాతి ఏడాదే దేశ రాజధానిని తమ వశంచేసుకుని ఆ ప్రాంతాన్ని పాలిస్తున్నారు. అదే ఏడాది గత ప్రభుత్వాన్ని పునరుద్ధరించేందుకు సౌదీ అరేబియా నేతృత్వంలోని కూటమి ప్రయత్నించినా ఇంతవరకూ సాధ్యపడలేదు. ఆ ఆగ్రహమే పలు మలుపులు తిరిగి నాటి నుంచి సౌదీ అరేబియా, ఇరాన్‌ల మధ్య శత్రుత్వాన్ని కొనసాగించింది. ఇన్నాళ్లలో అక్కడి ఘర్షణల్లో 1,50,000 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. పెద్ద సంఖ్యలో పౌరులు, సైనికులను పొట్టనబెట్టుకున్న ఈ సంఘర్షణ ప్రపంచంలోనే అత్యంత దారుణ మానవసంక్షోభాల్లో ఒకటిగా నిలిచింది. 2.1 కోట్ల దేశజనాభాలో మూడింట రెండొంతుల మంది పేదలు అంతర్జాతీయ సాయంకోసం అర్రులుచాస్తున్నారు.

నీటి నిల్వలు తగ్గుతున్నాయ్..!

సాక్షి, న్యూఢిల్లీ: ఎండలు మండిపోతున్న వేళ...ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు క్రమంగా అడుగంటుతున్నాయి. ఇప్పటికే ఖరీఫ్ పంటలకు పెరిగిన వినియోగం, లోటు వర్షపాతం, ఎల్‌నినో ప్రభావం కారణంగా రిజర్వాయర్లలో నీటి మట్టాలు పడిపోతున్నాయి. దేశ వ్యాప్తంగా కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) పర్యవేక్షణలో 146 ప్రధాన జలాశయాలున్నాయి. వీటిల్లో నీటి నిల్వలు గత ఏడాది కన్నా 5శాతం తక్కువగా ఉన్నట్లు సీడబ్ల్యూసీ తాజా నివేదిక వెల్లడించింది. ఈ రిజర్వాయర్ల వాస్తవ నిల్వ సామర్థ్యం 178 బిలియన్ క్యూబిక్ మీటర్లు (బీసీఎం) కాగా ప్రస్తుతం 70 బీసీఎంల నిల్వలు ఉన్నాయని, ఇవి గత ఏడాది నిల్వ 74 బీసీఎంలతో పోలిస్తే 5 శాతం తక్కువని సీడబ్ల్యూసీ వెల్లడించింది. దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడుల్లో సీడబ్ల్యూసీ పర్యవేక్షణలో మొత్తం 53 బీసీఎంల నిల్వ సామర్థ్యం కలిగిన 40 రిజర్వాయర్లుండగా, ప్రస్తుతం అందుబాటులో ఉన్న మొత్తం ప్రత్యక్ష నిల్వ కేవలం 16.737 బీసీఎంలని వివరించింది. రిజర్వాయర్ల మొత్తం ప్రత్యక్ష నిల్వ సామర్థ్యంలో ఇది 32 శాతం కాగా, గత ఏడాది కన్నా 7% తక్కువని తెలిపింది. ఇక ఏపీ, తెలంగాణలలోని 11 ప్రధాన రిజర్వాయర్లలో 20 బీసీఎంల నీటి నిల్వలకు గాను కేవలం 5.5 బీసీఎంల నిల్వలు మాత్రమే ఉన్నాయని, ఇవి గత ఏడాది నిల్వ 8 బీసీఎంలతో పోలిస్తే 11శాతం తక్కువని వెల్లడించింది. ముఖ్యంగా రెండు తెలుగు రాష్ట్రాల పరిధిలో ఉన్న శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల్లో 11.12 బీసీఎంల నిల్వలకు గానూ కేవలం 1.65 బీసీఎంల నిల్వలు మాత్రమే ఉన్నాయని, ఇవి గత ఏడాదితో పోలిస్తే 9% తక్కువని తెలిపింది.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించండి

న్యూఢిల్లీ: న్యాయవాదుల అసలైన సమస్యల పరిష్కారంపై హైకోర్టులు దృష్టి పెట్టాలని సుప్రీంకోర్టు ధర్మాసనం సూచించింది. ఇందులో భాగంగా ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలో రాష్ట్రస్థాయిలో ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార కమిటీ ఏర్పాటు చేయాలని దేశవ్యాప్తంగా అన్ని హైకోర్టులకు తేల్చిచెప్పింది. కేసుల ఫైలింగ్ తదితరాల కోసం జిల్లా కోర్టు స్థాయిలో ప్రత్యేక కమిటీ ఏర్పాటుచేయాలని సూచించింది.

రాహుల్‌కు ఎదురుదెబ్బ

- పరువు నష్టం కేసులో జైలుశిక్షపై 'స్టే' పిటిషన్‌ను తిరస్కరించిన సూరత్ కోర్టు
- గుజరాత్ హైకోర్టును ఆశ్రయించనున్న కాంగ్రెస్ నేత

సూరత్: కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పరువు నష్టం కేసులో తనను దోషిగా తేలుస్తూ కింది కోర్టు విధించిన జైలు శిక్షపై స్టే ఇవ్వాలని కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను గుజరాత్‌లోని సూరత్ అదనపు సెషన్స్ కోర్టు గురువారం తిరస్కరించింది. ఒకవేళ కోర్టు స్టే విధిస్తే రాహుల్ ఎంపీగా మళ్లీ లోక్‌సభలో అడుగుపెట్టేందుకు అవకాశం దక్కేది. దొంగలందరి ఇంటిపేరు మోదీ అని ఎందుకుంటుంది? అని కర్ణాటక ఎన్నికల ప్రచారంలో ప్రశ్నించిన రాహుల్‌పై గుజరాత్ బీజేపీ ఎమ్మెల్యే పూర్ణేష్ మోదీ ఫిర్యాదు చేశారు. దీంతో గుజరాత్ పోలీసులు రాహుల్‌పై పరువు నష్టం కేసు నమోదు చేశారు. అభియోగాలు నిరూపితం కావడంతో రాహుల్‌కు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ సూరత్‌లోని మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు మార్చి 23న తీర్పు వెలువరించింది. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యుడిగా అర్హత కోల్పోయారు. ఆయనపై అనర్హత వేటు పడింది. పరువు నష్టం కేసులో కింది కోర్టు విధించిన శిక్షపై స్టే ఇవ్వాలని, బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ రాహుల్ సూరత్‌లోని అదనపు సెషన్స్ కోర్టును ఆశ్రయించారు. రెండు పిటిషన్లు దాఖలు చేశారు. ఏప్రిల్ 3న అదనపు సెషన్స్ కోర్టు రాహుల్‌కు బెయిల్ మంజూరు చేసింది. స్టే ఇవ్వాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌పై అదనపు సెషన్స్ జడ్జి ఆర్‌పీ మొగేరా గురువారం తన నిర్ణయాన్ని ప్రకటించారు. ఆ పిటిషన్‌ను తిరస్కరిస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఉత్తర్వు జారీ చేశారు. జైలుశిక్షపై స్టే విధించకపోవడం వల్ల వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం దక్కపోతే రాహుల్ గాంధీకి వాటిల్లే నష్టం ఏమిటో వివరించడంలో ఆయన తరపు న్యాయవాది విఫలమయ్యారని పేర్కొన్నారు.

హైకోర్టును ఆశ్రయిస్తాం..

సూరత్ సెషన్స్ కోర్టు ఉత్తర్వులను సవాలు చేస్తూ గుజరాత్ హైకోర్టును ఆశ్రయిస్తామని రాహుల్ గాంధీ తరపు న్యాయవాది కిరీట్ పాన్‌వాలా చెప్పారు. తమ ప్రధాన అప్పీల్‌ను కోర్టు పూర్తిగా తోసిపుచ్చేదాకా రాహుల్ గాంధీ బెయిల్‌పై ఉంటారని తెలిపారు. సూరత్ సెషన్స్ కోర్టు ఉత్తర్వుపై కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ స్పందించారు. చట్ట ప్రకారం అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను ఉపయోగించుకుంటామని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. రాహుల్‌పై రాజకీయ దురుద్దేశంతో కేసు నమోదు చేశారని కాంగ్రెస్ నేత భూపీందర్‌సింగ్ హుడా విమర్శించారు. న్యాయ వ్యవస్థపై తమకు పూర్తి నమ్మకం ఉందని వెల్లడించారు. కోర్టు అన్ని అంశాలనూ పరిగణనలోకి తీసుకొని రాహుల్ గాంధీ పిటిషన్ తిరస్కరించిందని పూర్ణేష్ మోదీ తరపు లాయర్ హర్షిల్ తోలియా వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ పిటిషన్ విషయంలో సూరత్ కోర్టు నిర్ణయంపై బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా హర్షం వ్యక్తం చేశారు.



ఢిల్లీ వర్సిటీ వద్ద యూపీఎస్‌సీ అభ్యర్థులతో మాట్లాడుతున్న రాహుల్

గౌతమ్ అదానీతో పవార్ భేటీ

ముంబై: హిండెన్‌బర్గ్ నివేదిక తర్వాత అదానీ షేర్ల విషయంలో ఓవైపు సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) దర్యాప్తునకు విపక్షాలు పట్టుబడుతుంటే మరోవైపు కుబేరుడు గౌతమ్ అదానీతో మరో విపక్ష పార్టీ చీఫ్ శరద్ పవార్ భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. గురువారం ముంబైలో ఎన్సీపీ అధ్యక్షుడు పవార్ ఇంట్లో వీరిద్దరూ కలిసి దాదాపు రెండు గంటలపాటు మాట్లాడుకున్నారని విశ్వసనీయ వర్గాల సమాచారం. దేశీయ దిగ్గజ సంస్థ అదానీ గ్రూప్‌పై అదేదో అమెరికా కంపెనీ ఇచ్చిన నివేదికకు అంత ప్రాధాన్యత ఇవ్వడం అవసరమా ? అంటూ గతంలో పరోక్షంగా అదానీకి మద్దతు పలికిన పవార్‌తో గౌతమ్ అదానీ చర్చలకు దిగడం విపక్ష పార్టీల్లో చర్చనీయాంశమైంది.

ఎయిర్‌పోర్టులో అమృత్‌పాల్ భార్య అడ్డగింత

అమృత్‌సర్: పరారీలో ఉన్న ఖలిస్తానీ అనుకూల బోధకుడు అమృత్‌పాల్ సింగ్ భార్య కిరణ్‌దీప్ కౌర్ విదేశాలకు వెళ్లేందుకు చేసిన యత్నాన్ని అధికారులు అడ్డుకున్నారు. గురువారం మధ్యాహ్నం ఆమె అమృత్‌సర్‌లోని శ్రీగురు రాందాస్ ఇంటర్నేషనల్ విమానాశ్రయానికి వచ్చింది. మధ్యాహ్నం 1.20 గంటలకు ఎయిరిండియా విమానంలో లండన్ వెళ్లే విమానం ఎక్కాల్సి ఉంది. ఆమెపై లుకౌట్ నోటీసు ఉండటంతో ఇమిగ్రేషన్ తదితర విభాగాల అధికారులు ఎయిర్‌పోర్టులోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఆమెను అదుపులోకి తీసుకుని, మూడు గంటలపాటు ప్రశ్నించి, తిరిగి వెనక్కి పంపించారు. ఈ ఘటనపై మీడియా ప్రశ్నలపై పంజాబ్ పోలీసులు స్పందించలేదు. అయితే, ఎయిరిండియా విమానం ఈ ఘటన కారణంగా గంట ఆలస్యంగా బయలుదేరిందని అధికారులు తెలిపారు. యూకే పౌరురాలైన కిరణ్‌దీప్ కౌర్‌ను ఈ ఏడాది ఫిబ్రవరిలో అమృత్‌పాల్ నిరాడంబరంగా సొంతూరులోని గురుద్వారాలో వివాహం చేసుకున్నాడు.



ఎయిర్‌పోర్టు వద్ద కిరణ్‌దీప్ కౌర్

జాతీయ స్థాయిలో పెద్ద పార్టీల కూటమి అసాధ్యమే

పీపుల్స్ డెమొక్రసీలో సీపీఎం స్పష్టీకరణ

న్యూఢిల్లీ: జాతీయ స్థాయిలో పెద్ద పార్టీలు చేతులు కలిపే అవకాశం లేదని సీపీఎం తన పత్రిక 'పీపుల్స్ డెమొక్రసీ' సంపాదకీయంలో పేర్కొంది. బడా రాజకీయ పార్టీలతో కూడిన కూటమి ఏర్పడడం అసాధ్యమేనని పేర్కొంది. ముఖ్యమైన జాతీయ, రాజకీయ అంశాలపై ఉమ్మడి వైఖరి ఉంటే తప్ప కొత్త కూటమిని ఊహించలేమని స్పష్టం చేసింది. కొన్ని పార్టీలు జాతీయ స్థాయిలో ఉమ్మడి వేదికపైకి వచ్చినా రాష్ట్రాల్లో ఒక్కటై కలిసి పని చేసే పరిస్థితి లేదని గుర్తుచేసింది. కేంద్రంలో అధికార బీజేపీ విధానాలపై పోరాటం కోసం కొన్ని పార్టీలు పిలుపునిస్తే ఇతర పార్టీలు పెద్దగా స్పందించడం లేదని తెలియజేసింది.

ఆలోగా విశ్వభారతి స్థలాన్ని ఖాళీ చేయాలి

నోబెల్ గ్రహీత అమర్త్యసేన్‌కు విశ్వవిద్యాలయం నోటీసు

కోల్‌కతా: విశ్వభారతి విశ్వవిద్యాలయంలోని స్థలాన్ని ఖాళీ చేయాలంటూ నోబెల్ గ్రహీత అమర్త్యసేన్‌కు అధికారులు నోటీసులిచ్చారు. యూనివర్సిటీలోని అనధికారికంగా ఆక్రమించుకున్న సుమారు 5,660 అడుగుల(13 డెసిమల్) స్థలాన్ని మే 6వ తేదీలోగా లేదా 15 రోజుల్లోగా ఖాళీ చేయాలని అందులో కోరారు. అమర్త్యసేన్, సంబంధీకులెవరైనా ఆ స్థలంలో ఉంటే ఖాళీ చేయిస్తామని పేర్కొన్నారు. అవసరమైతే బలప్రయోగానికీ వెనుకాడమని తెలిపారు. అమర్త్యసేన్‌కు 1.25 ఎకరాల భూమిపై మాత్రమే లీజు హక్కులున్నాయని జాయింట్ రిజిస్ట్రార్ అశోక్ మహతో బుధవారం జారీ చేసిన నోటీసులో పేర్కొన్నారు. అయితే, తన తండ్రి 1.25 ఎకరాల స్థలాన్ని లీజుకు తీసుకున్నారని, మరో 13 డెసిమల్ స్థలాన్ని కొనుక్కున్నట్లు ఆధారాలున్నాయని అమర్త్య సేన్ అంటున్నారు.

కర్ణాటకలో 20 ప్రాంతాల్లో ప్రధాని మోదీ ప్రచారం!

బెంగళూరు: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ విజయమే లక్ష్యంగా అధికార బీజేపీ వ్యూహాలు రచిస్తోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రంలో 20 ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొనే అవకాశం ఉందని కర్ణాటక ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మై గురువారం వెల్లడించారు. మోదీ ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని రూపొందిస్తున్నామని చెప్పారు. రోడ్డు షోలలో మోదీ పాల్గొంటారని, ర్యాలీలు, బహిరంగ సభల్లో ప్రసంగిస్తారని తెలిపారు. స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో మొత్తం 40 మందికి చోటు కల్పించారు.



అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం బొకాచికా వైమానిక కేంద్రం నుంచి నింగిలోకి ప్రయోగించిన కొద్దిసేపటికే కుప్పకూలిపోతున్న స్పేస్‌ఎక్స్ సంస్థ వారి స్టార్‌షిప్ అంతరిక్ష నౌక. స్టార్‌షిప్ పైకెళ్లాక మొదటి దశలో నిర్ణీత సమయంలో రాకెట్ బూస్టర్ విడిపోవాల్సి ఉండగా అలా జరగలేదు. ఆ తర్వాత ఇలా పేలింది.

ఐదుగురు జవాన్ల వీరమరణం

పూంచ్: జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో ఉగ్రవాదుల దాడిలో ఐదుగురు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. భారీ వర్షం, తక్కువ వెలుతురు మాటున ఉగ్రవాదులు ఘాతుకానికి పాల్పడినట్లు అధికారులు తెలిపారు. గురువారం మధ్యాహ్నం భింబెర్ గలి నుంచి సింగియోట్ వైపు వస్తున్న సైనిక వాహనంపైకి ఉగ్రవాదులు కాల్పులు జరపడంతో నిప్పంటుకుంది. దీంతో, అందులోని ఐదుగురు జవాన్లు సజీవ దహనం కాగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారని అధికారులు తెలిపారు. రాష్ట్రీయ రైఫిల్స్ విభాగానికి వీరంతా ఆ ప్రాంతంలోని ఉగ్రవాదుల ఏరివేతలో పాల్గొంటున్నారని చెప్పారు. వారి వాహనంపైకి ఉగ్రవాదులు గ్రనేడ్లు విసిరి ఉంటారని భావిస్తున్నామన్నారు. ఘటన అనంతరం ఆ రహదారిపై రాకపోకలను నిలిపివేసి, భారీ ఎత్తున కూంబింగ్ చేపట్టారు.



మంటల్లో ఆర్మీ వాహనం

భవ్య ప్రగతికి బుద్ధుని బోధనలే మార్గదర్శకాలు

- గ్లోబల్ బుద్ధిస్ట్ సమ్మిట్‌లో ప్రధాని మోదీ ఉద్బోధ

న్యూఢిల్లీ: గౌతమ బుద్ధుని బోధనలను ఆచరించి సుస్థిరాభివృద్ధిని సాధించవచ్చని ప్రధాని మోదీ అభిలషించారు. నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలకు బుద్ధుడి బోధనలు చక్కని పరిష్కారాలు చూపగలవని మోదీ వ్యాఖ్యానించారు. గురువారం ఢిల్లీలో గ్లోబల్ బుద్ధిస్ట్ సమ్మిట్ సెషన్‌లో మోదీ ప్రారంభోపన్యాసం చేశారు. 'యుద్ధాలు, ఆర్థిక అస్థిరత, ఉగ్రవాదం, మత అతివాదం, వాతావరణ మార్పులు.. ఇలా ఎన్నో అంతర్జాతీయ సమస్యలు ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్నాయి. వీటికి గౌతముని సద్గుణ బోధనలు పరిష్కార మార్గాలు చూపుతాయి' అని అన్నారు. పర్యావరణ మార్పు సమస్యకు సంపన్న దేశాలే కారణమంటూ విమర్శించారు. బుద్ధుడు చూపిన మార్గం భవిష్యత్, సుస్థిర పథం. గతంలోనే ఆయన చూపిన మార్గంలో వెళ్లిఉంటే ఇప్పుడీ ప్రపంచానికి ప్రకృతి విపత్తులు దాపురించేవే కాదు. సంకుచిత భావన నుంచి విస్తృత సమ్మిళిత ప్రపంచ భావన దిశగా మళ్లడం అత్యావశ్యకం.



బుద్ధుని నుంచే భారత్ స్ఫూర్తి

గౌతముడి ఉపదేశాలను భారత్ ఆచరిస్తోంది. పెను భూకంపంతో కుప్పకూలిన తుర్కియేసహా పలు దేశాలకు ఆపన్నహస్తం అందించింది. బుద్ధుడు చూపిన మార్గాన్ని అనుసరించడమంటే సమస్యల నుంచి సమాధానం వైపునకు పయనించడమే' అని అన్నారు. సదస్సుకు 30 దేశాల నుంచి బౌద్ధ సన్యాసులు తదితరులు వచ్చారు.

'ఛార్‌ధామ్'కు మంచు తిప్పలు

గోపేశ్వర్: ఛార్‌ధామ్ యాత్ర మొదలుకానున్న నేపథ్యంలో విచ్చేసే లక్షలాది మంది భక్తులు, సందర్శకుల సౌకర్యార్థం చేపట్టిన మౌలికసదుపాయాలు తదితర సన్నాహక కార్యక్రమాలకు మంచు అడ్డుపడుతోంది. గురువారం భద్రీనాథ్, కేదార్‌నాథ్ పర్వతప్రాంతాల్లో విపరీతంగా మంచు కురిసింది. లోయ ప్రాంతాలను వర్షం ముంచెత్తింది. ఈ ఆలయాలు కొలువుతీరిన ఛమోలీ, రుద్రప్రయాగ్ జిల్లాల్లో మంచు, వర్షం, అతిశీతల గాలులు ఉష్ణోగ్రతలను తగ్గించేస్తున్నాయని అధికారులు తెలిపారు. మరో నాలుగు రోజుల్లో భక్తులను కేదార్‌నాథ్ ఆలయ దర్శనానికి అనుమతించనున్న ఈ తరుణంలో గుడికి వెళ్లే ట్రెక్ మార్గంలో మంచు పడుతోంది. అక్షయ తృతీయను పురస్కరించుకుని ఈనెల 22వ తేదీన గంగోత్రి, యమునోత్రి ఆలయాలు తెరుచు కోనున్నాయి. కేదార్‌నాథ్ ఆలయాన్ని 25వ తేదీన, భద్రీనాథ్ ఆలయాన్ని ఈనెల 27వ తేదీన భక్తుల సందర్శనార్థం తెరుస్తారు. లక్షలాది మంది ఛార్‌ధామ్ యాత్రకు తరలివస్తున్న ఈ సమయంలో మంచు ముంచుకురావడంపై స్థానిక అధికారులు ఆందోళన వ్యక్తంచేశారు.

సాక్షి
కరీంనగర్
శుక్రవారం | 21 | ఏప్రిల్ | 2023



నాణ్యమైన వైద్యం అందించాలి

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో లలితాదేవి వైద్యులకు సూచించారు. హుజూరాబాద్‌లో వైద్యాధికారులతో సమీక్షించారు. 8లో▸



ప్రజల కష్టాలు తీర్చేలా పథకాలు

ప్రజల కష్టాలు తీర్చేవిధంగా పథకాలు అమలు చేస్తున్నామని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య అన్నారు. 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
40.0/24.0

వాతావరణం

ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి వేళలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.

అహంభావి, ప్రగల్భాలు పలికే మనిషికి దైవానుగ్రహం లభించదు.
– మహమ్మద్ ప్రవక్త

ఇఫ్తార్: శుక్ర 6:37

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

స్పాట్‌కేంద్రం వద్ద ఎస్‌జీటీయూ ధర్నా



కరీంనగర్: 'పది' మూల్యాంకనంలో స్పెషల్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్లకు టీఏ, డీఏలు వర్తింపజేయాలని గురువారం ఎస్‌ఎస్‌సీ స్పాట్ సెంటర్ వద్ద ఎస్‌జీటీయూ జిల్లాశాఖ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. రాష్ట్ర అధ్యక్షుడు కరివేద మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. స్పెషల్ అసిస్టెంట్లకు టీఏ,డీఏ వర్తింపజేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు విజేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులను మూల్యాంకన విధుల నుంచి మినహాయించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. అనంతరం అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందించారు. సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చిందం రమేశ్, రాష్ట్ర కార్యదర్శుడు మాధవ్, నర్సయ్య, చంద్రారెడ్డి ఆంజనేయులు, వీరన్న, ప్రవీణ్, సునీల్ కుమార్, తిరుపతయ్య, రత్నాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంట్రాక్టు లెక్చరర్లను త్వరలోనే క్రమబద్ధీకరిస్తాం



కరీంనగర్: కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్ధీకరణ ప్రక్రియను త్వరలోనే పూర్తి చేస్తామని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ హామీ ఇచ్చారు. గురువారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం (475)ప్రతినిధులు కరీంనగర్‌లోని ఆయన నివాసంలో వినతిపత్రం ఇచ్చారు. వినోద్‌కుమార్ మాట్లాడుతూ కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్ధీకరణకు సీఎం కేసీఆర్ చిత్తశుద్ధితో ఉన్నారని, ఎలాంటి అనుమానాలకు గురికావద్దని సూచించారు. సాధ్యమైనంత త్వరలో క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తి చేస్తామని అన్నారు. కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం 475 రాష్ట్ర ఉపాధ్యక్షుడు లింగంపల్లి దేవేందర్, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు సునీల్, ప్రేమ్‌సాగర్, పవన్ కుమార్, విక్రమాదిత్య, నరసింగం, శ్రీకాంత్, శ్రీనివాస్, కొండయ్య, వెంకట్‌రెడ్డి, మంజుల, రమాదేవి, తిరుపతి, దేవయ్య, అయిలయ్య, రాజేందర్ పాల్గొన్నారు.

ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్‌గా అనూష

కరీంనగర్ అర్బన్: ప్రజల ఆరోగ్య రక్షణలో కీలకమైన గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం అలంకారప్రాయమవుతోంది. మళ్లీ ఇన్‌చార్జినే నియమించడం జిల్లావాసులను ఆందోళనకు గురి చేస్తోంది. సిరిసిల్ల ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్(ఎఫ్‌ఎస్‌వో)గా ఆర్.అనూష నియామకం కాగా ఆమెనే కరీంనగర్ ఇన్‌చార్జిగా నియమించారు.

23న గురుకుల పరీక్ష

కరీంనగర్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 23న పరీక్ష నిర్వహిస్తున్నట్లు చింతకుంట గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జేజే థెరిసా తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పరీక్ష ఉంటుందని, విద్యార్థులు హాల్ టికెట్ తీసుకొని, ఉదయం 10 గంటల వరకు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. హాల్‌టికెట్‌లో ఏమైనా తప్పులుంటే సంబంధిత ధ్రువపత్రాలతో ప్రిన్సిపాల్‌ను కలవాలని పేర్కొన్నారు.

25న ఇంటర్వ్యూ

కరీంనగర్‌టౌన్: నేషనల్ హెల్త్ మిషన్ ప్రోగ్రాం (ఎన్‌హెచ్‌ఎం) కింద జిల్లాలో 19 మంది మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ)లను కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేసేందుకు నియమించనున్నట్లు డీఎంహెచ్‌వో లలితాదేవి తెలిపారు. ఈ నెల 25న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఇంటర్వ్యూ ఉంటుందన్నారు. ఎంబీబీఎస్, బీఏఎంఎస్ అర్హత కలిగిన అభ్యర్థులు తమ వయస్సు, కుల ధ్రువీకరణ పత్రాలు, లోకల్ స్టేటస్, 1 నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, ఎంబీబీఎస్, బీఏఎంఎస్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ కాపీ నకలు ధ్రువపత్రాలతో కావాలని సూచించారు.

'ముక్కోటి'కి ముందురోజే ముహూర్తం..!

- 'అరుణ్ తలకోస్తా' అని సాయి శపథం
- 'సాక్షి' చేతిలో సాయి వార్నింగ్ వీడియో
- సాయి గ్యాంగ్ కాల్పులతో ఉలిక్కిపడిన మానకొండూర్
- గురితప్పిన రెండు రౌండ్లు, పేలని రౌండ్ స్వాధీనం
- పొరుగింట్లోకి దూరి ప్రాణాలు కాపాడుకున్న అరుణ్
- అడ్డొచ్చిన మొత్తం ఏడుగురిని చావబాదిన దుండగులు
- సోదరి మరణానికి ప్రతీకారంగానే హత్యాయత్నం
- రెండు నెలల క్రితమే బిహార్ నుంచి ఆయుధం..?



అరుణ్‌పై దాడి జరిగిన ఇల్లు ఇదే..



శపథం చేస్తున్న సాయితేజ్



గాయపడిన అరుణ్



మరో నిందితుడు చంటి



వివరాలు వెల్లడిస్తున్న అరుణ్ భార్య, కూతురు



ఘటనాస్థలంలో దొరికిన బుల్లెట్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/మానకొండూరు: బుధవారం అర్ధరాత్రి కాల్పుల మోతతో మానకొండూరు ఉలిక్కిపడింది. ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే పల్లెలో తుపాకులు గర్జన విని జనం భీతిల్లారు. రౌడీషీటర్ అరుణ్‌పై కత్తులు, తుపాకులతో జరిగిన హత్యాయత్నం జిల్లాలోనే కాదు, రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. నేరచరిత్ర కలిగిన అరుణ్ ఆది నుంచి వివాదాస్పదుడే. వరుసగా ఇతనిపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో గత సీపీ సత్యనారాయణ కమిషరేట్ నుంచి బహిష్కరణ విధించారు. ఇటీవల బహిష్కరణ పూర్తిచేసుకుని వచ్చిన అరుణ్‌పై తుపాకులతో హత్యాయత్నం జరగడం గమనార్హం. వాస్తవానికి ఈ ఘటనకు బీజం ఇప్పుడు పడింది కాదు, పాత కక్షల నేపథ్యంలో ఈ ఏడాది వైకుంఠ ఏకాదశికి ముందురోజు పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని జీఎం కాలనీలో ప్రధాన నిందితుడు సాయితేజ్ హనుమాన్ ఆలయంలోనే అరుణ్‌ని చంపుతానని ప్రతినబూనాడు.

వస్తూనే దాడి.. కాల్పులు

- పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని జీఎం కాలనీలో ఉండే వీణవంక సాయితేజ్ ఈ ఏడాది వైకుంఠ ఏకాదశి ముందురోజు రాత్రి (నూతన సంవత్సరం రోజు) జీఎం కాలనీలోని హనుమాన్ గుడిలో తన సోదరి మరణానికి కారణమైన 'మానకొండూరు అరుణ్ గాని తలకాయ కోసి.. జీఎం కాలనీ చౌరస్తాలో పెట్టకపోతే నేను సూరి కొడుకునే కాదు' అని శపథం చేశాడు.
- ఈ విషయాన్ని పలువురు స్థానికులు వీడియో కూడా తీశారు. ఇప్పుడు ఈ వీడియో కోసం పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఈ వీడియో 'సాక్షి' చేతికి చిక్కింది. అప్పటి నుంచి సమయం కోసం ఎదురుచూస్తున్న సాయి.. బుధవారం అర్ధరాత్రి తన మిత్రులు భువనగిరి జిల్లా దత్తారుపల్లికి చెందిన పాల మల్లేశ్, మానకొండూరు మండలం కెల్లెడ గ్రామానికి చెందిన బైరగోని మధు, గోదావరిఖనికి చెందిన చంటితో కలిసి రాత్రి 9 గంటల సమయంలో వాహనంలో మానకొండూరుకు వచ్చాడు.
- వెల్దికి వెళ్లే మార్గం నుంచి వీరు గ్రామంలోకి తుపాకీ, కత్తులతో వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. దాదాపు 9.30 గంటల సమయంలో అరుణ్ తన ఇంటి ముందు సోదరులతో కలిసి మద్యం తాగుతుండగా.. వీరికి తారసపడ్డాడు. వారిని చూడగానే భయంతో అరుణ్ పారిపోయేందుకు యత్నించాడు.
- అతడిని వెంబడించిన నలుగురు బీరు బాటిళ్లతో దాడిచేశారు. అడ్డువచ్చిన అరుణ్ భార్య సుమ, పెద్ద కూతురు వైష్ణవిని తుపాకీ చూపించి తీవ్రంగా కొట్టారు. పారిపోతున్న అరుణ్‌పై రెండు రౌండ్లు కాల్పులు జరపగా గురితప్పాయి. ఓ ఇంట్లోకి వెళ్లి తలుపులు పెట్టుకున్నాడు. అరుణ్‌పై కోపంతో సదరు ఇంట్లోని ఐదుగురు కుటుంబసభ్యులను విచక్షణారహితంగా, రక్తాలు కారేలా కొట్టారు.
- వీరి అరుపులు విన్న స్థానికులు వచ్చారు. వారిని తుపాకీ చేతబూనిన వ్యక్తి బెదిరించి పంపాడు. తరువాత చాలామంది రావడంతో సాయితేజ్ పరారు కాగా.. పాలమల్లేశ్, మధును పట్టుకున్న స్థానికులు పోలీసులకు అప్పగించారు.
- ఘటనాస్థలంలో పేలని బుల్లెట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు వాడింది కంట్రీమేడ్ తుపాకీ (తపంచా) అని తూటా ఆధారంగా నిర్ధరణకు వచ్చారు. మరో నిందితుడు చంటి కూడా పోలీసుల అదుపులోనే ఉన్నాడని సమాచారం.

మాట్లాడకుండానే.. దాడి చేశారు



మానకొండూర్‌లో ఉన్న మా అత్త గారింటికి నా పిల్లలను చూసేందుకు వచ్చాను. బుధవారం రాత్రి అన్నం తిని బయట ఉండగా గొడవ అవుతోంది. ఈ లోగానే అరుణ్ మా ఇంటి వైపు వచ్చాడని కొందరు మా ఇంటివైపు పరుగు తీసుకుంటూ వచ్చారు. వాడేడి అంటూ ఆగ్రహంతో నాపై స్టీలు ప్యాల క్యాన్‌తో దాడి చేశారు. తల పగిలి రక్తస్రావం జరిగింది. ఇంట్లో వాళ్లపై దాడి చేశారు. ఏం జరుగుతుందో అర్థం కాలేదు. తర్వాత భయాందోళనతో చాలా సేపు తలుపు వేసుకుని ఇంట్లోనే ఉన్నాం, పోలీసులు వచ్చాక బయటకు వచ్చా.

– బీరం శ్రీనివాస్, గాయపడ్డ వ్యక్తి

బిహార్ నుంచి ఆయుధం..?

ఈ కేసులో ప్రధాన నిందితుడు సాయికి ఆయుధం ఎక్కడిది..? అన్న విషయంపై పోలీసులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. తుపాకీ కాల్చడంలో నిందితులకు అనుభవం లేదని తాజా ఘటనతో తేలిపోయింది. బుల్లెట్లు వేగంగా లోడు చేయలేకపోవడం.. గురిచూసి కాల్చలేకపోయిన విధానాన్ని బట్టి నిందితులు ఇటీవలే తుపాకీ కొనుగోలు చేసి ఉంటారని పోలీసులు అంచనాకు వచ్చారు. రెండు నెలల క్రితం ఓ కేసు విషయంలో సాయి సెల్‌లోకేషన్ బిహార్‌లో చూపించిందని గోదావరిఖని పోలీసులు తెలిపారు. అదే సమయంలో అతను కాశీయాత్రకు వెళ్లి వచ్చాడని గుర్తుచేసుకుంటున్నారు. దీంతో సాయికి బిహార్‌లో మిత్రులు ఉండి ఉంటారని, వారి ద్వారానే ఆయుధం కొని ఉంటాడని అనుమానిస్తున్నారు.

తనకు సంబంధం లేదంటున్న అరుణ్

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అరుణ్‌ను మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. నిందితులు గోదావరిఖనికి చెందిన సాయితేజ్, చంటి, మరో ఇద్దరు మిత్రులు అని వెల్లడించాడు. ఎందుకు దాడి చేశారు..? అని అడిగిన ప్రశ్నకు.. తాను ఒక ప్రభుత్వ ఉద్యోగిని అని, తనకువారితో ఎలాంటి సంబంధమూ లేదని, వారు గంజాయి విక్రయిస్తారని తెలిపాడు. సంబంధం లేని వ్యక్తి చేసే పని, చిరునామా, పేరుతో సహా ఎలా తెలపగలిగాడు..? అన్న విషయంపై పోలీసులు దృష్టి సారించారు. అతనికి సాయితేజకు ఉన్న వైరం ఏంటీ..? అతని సోదరి మరణంలో అరుణ్ ప్రమేయం ఎంతవరకు ఉంది..? అనే విషయాలపై ఆరా తీస్తున్నారు. నిందితులకు, బాధితుడికి నేరచరిత ఉన్న విషయం వాస్తవమేనని, అన్ని కోణాల్లోనూ కేసు దర్యాప్తు చేస్తున్నామని కరీంనగర్ సీపీ ఎల్.సుబ్బారాయుడు 'సాక్షి'కి తెలిపారు. నిందితుల కోసం మొత్తం మూడు బృందాలు సాయి కోసం గాలిస్తున్నాయి. ఇందులో రెండు హైదరాబాద్‌కు వెళ్లగా.. ఒక టీం గోదావరిఖనికి వెళ్లినట్లు సమాచారం.

'దళితబంధు'తో పదివేల మంది వ్యాపారులుగా ఎదిగారు

- వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ ఆర్వీ.కర్ణన్

కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో చిరు పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని వ్యాపారవేత్తలుగా రాణించాలని కలెక్టర్ ఆర్వీ.కర్ణన్ సూచించారు. గురువారం కరీంనగర్ రెవెన్యూగార్డెన్‌లో నిర్వహించిన ఫుడ్‌ప్రాసెసింగ్ మిషనరీ ప్రదర్శన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వివిధ రకాల ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను పరిశీలించారు. ప్రభుత్వం పరిశ్రమ మిషనరీ కొనుగోలుకు 35శాతం సబ్సిడీ ఇస్తున్నందున లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దళితబంధు పథకంతో పదివేల మంది వ్యాపారవేత్తలుగా ఎదిగారన్నారు. జిల్లా పరిశ్రమ కేంద్రం జనరల్ మేనేజర్ నవీన్‌కుమార్, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు, డీఆర్డీవో శ్రీలత, మెప్మా పీడీ బి.రవీందర్, నాబార్డ్ ఏజీఎం, ఫుడ్ ప్రాసెసింగ్ మేనేజర్ కృష్ణ, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నర్సింగరావు, సెక్రెటరీ గణపతి పాల్గొన్నారు.



ఫుడ్ ప్రాసెసింగ్ మిషనరీ గురించి తెలుసుకుంటున్న కలెక్టర్ కర్ణన్

కేబుల్ బ్రిడ్జి,అప్రోచ్ రోడ్డు పూర్తి చేయాలి

కేబుల్ బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు పనులు త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ కర్ణన్ అన్నారు. గురువారం కేబుల్ బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు పనులు పరిశీలించారు. కేబుల్ బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులను పూర్తిచేసి అతిత్వరగా అందుబాటులోకి తీసుకువచ్చేలా చూడాలన్నారు. డైనమిక్ లైట్ల పనులు, అప్రోచ్ రోడ్డు పనులు చివరిదశలో ఉన్నాయని తెలిపారు.

వయోవృద్ధుల డేకేర్ సెంటర్‌ను అభివృద్ధి చేయాలి

వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌ను అద్భుతంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ కర్ణన్ ఆదేశించారు. జెడ్పీ క్వార్టర్స్‌లో వృద్ధులకోసం ఏర్పాటు చేస్తున్న డేకేర్ సెంటర్‌ను పరిశీలించారు. మెడికల్ కేర్, లైబ్రరీ, ఆధునిక సదుపాయాలు కల్పిస్తూ ఆహ్లాదకరమైన వాతావరణంలో డే కేర్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జెడ్పీ సీఈవో ప్రియాంక, స్త్రీ శిశు సంక్షేమ అధికారి సబిత ఉన్నారు.

అనుమతి లేకుండా ప్రైవేటు ఆస్పత్రులు నిర్వహిస్తే కఠిన చర్యలు

కరీంనగర్‌టౌన్: జిల్లాలో ప్రతీ ప్రైవేటు ఆసుపత్రి అన్నిరకాల అనుమతులను పొంది ఉండాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆర్వీ.కర్ణన్ తెలిపారు. గురువారం నిర్వహించిన జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. జిల్లాలో 20 బెడ్లు, పైస్థాయి గల అన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో తప్పనిసరిగా ఫైర్ సేఫ్టీ నిబంధనలను పాటించాలని, సరైన అర్హతలు, అనుమతులు లేకుండా ఆసుపత్రులను నిర్వహిస్తే చట్టరీత్యా కఠినచర్యలను తీసుకోవడం జరుగుతుందని అన్నారు. సీపీ ఎల్.సుబ్బారాయుడు, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి వెంకన్న, డీఎంహెచ్‌వో లలితాదేవి, డిప్యూటీ వైద్యాధికారి రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతుల న్యాయ సహాయార్థమే అగ్రిలీగల్ ఎయిడ్ క్లినిక్

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ప్రతిమ

గన్నేరువరం: భూ సమస్యలు, వ్యవసాయరంగ సమస్యలు ఎదుర్కొంటున్న పేద రైతులు, వ్యవసాయ కూలీల న్యాయ సహాయార్థమే అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ఏర్పాటు చేస్తున్నామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ప్రతిమ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సుజయ్‌తో కలిసి గురువారం మండలకేంద్రంలోని రైతువేదికలో అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు సూచనల మేరకు గుర్తించబడిన గ్రామాల్లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ క్లినిక్‌లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ దృష్టికి వచ్చిన అనేక సమస్యలను చట్టబద్ధంగా పరిష్కరించామని తెలిపారు. పారిశుధ్య నిర్వహణలో జాతీయ పురస్కారాన్ని అందుకున్న గన్నేరువరం గ్రామపంచాయతీ పాలకవర్గానికి, గ్రామ ప్రజలకు అభినందనలు తెలిపారు. అంతకుముందు కాసింపేట మానసదేవీ ఆలయం, పారువెల్ల శ్రీ లక్ష్మీగణపతి ఆలయం ప్రధాన అర్చకులు జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ప్రతిమకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జి శ్రీనిజ కోహీర్కార్, జిల్లా వ్యవసాయ అధికారి వాసిరెడ్డి శ్రీధర్, రైతు సమన్వయ సమితి జిల్లా సమన్వయకర్త గూడెల్లి తిరుపతి, ఏవో కిరణ్మయి, గన్నేరువరం సర్పంచ్ పుల్లెల లక్ష్మి, కరీంనగర్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లింగంపల్లి నాగరాజు, సభ్యుడు జక్కనపల్లి గణేశ్, ఆర్‌ఎస్‌ఎస్ మండల సమన్వయకర్త తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా జడ్జి బి.ప్రతిమ

దేశ సంపదను కార్పొరేట్లకు పంచుతున్న మోదీ

- ప్రజాచైతన్యయాత్రలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

చిగురుమామిడి/సైదాపూర్/తిమ్మాపూర్/గన్నేరువరం: ప్రధాని మోదీ దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు పంచుతున్నాడని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ఆరోపించారు. బీజేపీ హటావో, దేశ్‌కి బచావో పేరిట గురువారం చిగురుమామిడి, సైదాపూర్, తిమ్మాపూర్, గన్నేరువరం మండలాల్లో ప్రజాచైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన బహిరంగసభల్లో మాట్లాడుతూ.. దేశంలోని సంపదను అదానీ, అంబానీలకు కట్టబెడుతున్నాడని ధ్వజమెత్తారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, మందులపై 12శాతం జీఎస్టీ విధించిన ఘనత బీజేపీకే దక్కుతుందని ఎద్దేవా చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రతిపక్షాల గొంతునొక్కే ప్రయత్నం చేస్తున్నాడని ఆరోపించారు. ఈడీ, సీబీఐ, తదితర దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పుతున్నాడని అన్నారు. కేంద్ర ప్రభుత్వంపై తిరుగుబాటు చేసే సమయం వచ్చిందని, అందరూ సిద్ధంగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలో తెలంగాణ ప్రభుత్వం అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇవ్వలేకపోయిందన్నారు. ఇంటి స్థలాలు ఉన్నవారికి రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ బహిరంగసభలకు ముందు చిగురుమామిడిలో సీపీఐ కార్యకర్తలు ఊరేగింపు నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, సిద్దిపేట్, పెద్దపల్లి, రాజన్నసిరిసిల్ల, జగిత్యాల జిల్లాల కార్యదర్శులు మంద పవన్, సదానందం, మాజీ జెడ్పీటీసీ అందె స్వామి, సర్పంచ్‌లు అందె స్వరూప, నాగెల్లి వకుళ, శ్రీమూర్తి రమేశ్, గోలి బాపురెడ్డి, నాయకులు బోయిని అశోక్, గడిపె మల్లేశ్, తేరాల సత్యనారాయణ పాల్గొన్నారు.



చిగురుమామిడిలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

భూ పోరాటానికి సిద్ధం కావాలి

తిమ్మాపూర్ మండలంలో భూ సమస్యల పరిష్కారానికి, అన్యాక్రాంతమైన భూములను కాపాడుకోవడానికి పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. సీపీఐ ప్రజా చైతన్య యాత్ర తిమ్మాపూర్‌కు చేరుకోగా.. బోయిని తిరుపతి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. మొగిలిపాలెం, పర్లపల్లి గ్రామాలలో ర్యాలీ నిర్వహించారు. గన్నేరువరం మండలంలో ప్రధాన రోడ్లు బాగాలేవని, మండలం అభివృద్ధిలో వెనకబడి ఉందని, పనులకోసం పాలకులను ప్రశ్నించాలని సూచించారు.

లీకేజీలు, స్కాంలు దేశ భవిష్యత్తుకు గొడ్డలిపెట్టు

- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అన్ని వర్గాలకు ఉజ్వల భవిష్యత్తు
- పీపుల్స్ మార్చ్‌లో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

కాల్వశ్రీరాంపూర్: లీకేజీలు, స్కాంలు దేశ భవిష్యత్‌కు గొడ్డలి పెట్టు అని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. ఆయన చేపట్టిన పీపుల్స్‌మార్చ్ గురువారం గంగారంలో ప్రారంభమై.. కాల్వశ్రీరాంపూర్, ఇప్పలపల్లి, మల్యాలకు చేరుకుంది. కాల్వశ్రీరాంపూర్ బహిరంగసభలో భట్టి మాట్లాడుతూ.. ప్రాజెక్టులు నిర్మించి సాగునీరు రైతుకు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. మధ్యాహ్నం పలువురు విద్యార్థులు భట్టిని కలిసి తమ సమస్యలు వివరించారు. ఫీజురీయంబర్స్‌మెంట్ విడుదల చేయలేదని, స్కాలర్‌షిప్‌లు అందక విద్యాభ్యాసం చేయలేకపోతున్నామని తెలిపారు. కాంగ్రెస్ సర్కార్ వచ్చాక అన్నివర్గాలకు మేలు చేస్తామని భట్టి హామీ ఇచ్చారు. కూలీబంధు తెచ్చి వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12 వేలు అందిస్తామన్నారు. రాష్ట్రంలో మంత్రులు, ఎమ్మెల్యేలు ఇష్టారీతిన దోచుకుంటున్నారని, అక్రమ దందాలు, లిక్కర్ స్కాంలతో ప్రజాధనాన్ని గుల్ల చేస్తున్నారని విమర్శించారు.

క్రీడాప్రాంగణంలోనే శ్మశాన వాటికలా..

ఇప్పలపల్లిలో క్రీడాప్రాంగణం, శ్మశాన వాటికను పరిశీలించారు. రెండూ ఒకేచోట నిర్మాణం చేయడంపై విస్మయం వ్యక్తం చేశారు. శ్మశానవాటికలో ఆడుకునేందుకు ఎవరైనా సుముఖత వ్యక్తం చేస్తారా..? ఇదేనా బంగారు తెలంగాణ అన్నారు.



కాల్వశ్రీరాంపూర్‌లో బజ్జీలు వేస్తున్న భట్టి విక్రమార్క

పలకరిస్తూ.. ముందుకుసాగుతూ..

భట్టి విక్రమార్క తన పాదయాత్రలో ప్రజలతో మమేకమయ్యారు. వారి ఇబ్బందులు తెలుసుకుంటూ భరోసా ఇస్తూ.. ముందుకుసాగారు. మండల కేంద్రంలోని ఓ హోటల్ వద్ద ఆగి బజ్జీలు, పునుగులు వేశారు. రోజు కష్టపడితే ఎంత వస్తోందని, కుటుంబపోషణకు సరిపోతున్నాయా..? అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం వస్తే గ్యాస్ ధర తగ్గిస్తామన్నారు. మత్స్యకార్మికులు చేపలవల, బుట్ట బహూకరించారు. గొర్రెలకాపరులతో మాట్లాడుతూ.. సబ్సిడీపై గొర్రెలు ఇవ్వడంతోపాటు అనుబంధ పరిశ్రమలు, మటన్ మార్కెట్లు ఏర్పాటు చేస్తామన్నారు.

నక్సలైట్లకు పునరావాసం కింద భూములిచ్చి లాక్కున్నారు

అభివృద్ధి అంటే పేదలకిచ్చిన అసైన్డ్ భూములు, లొంగిపోయిన నక్సల్స్ పునరావాసానికి ఇచ్చిన భూములు లాక్కోవడమేనా..? ఇదేనా బంగారు తెలంగాణ..? అని భట్టి ప్రశ్నించారు. మల్యాలలో మాట్లాడుతూ అంతర్గాంలో అసైన్డ్‌భూములు లాక్కొని ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ఇసుక, మట్టిమాఫియా రాజ్యమేలుతోందన్నారు. బినామీ పేర్లతో జిల్లాలో 21 ఇసుకరీచ్‌లు నడుపుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ములుగు ఎమ్మెల్యే సీతక్క, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు, డీసీసీ అధ్యక్షుడు మక్కాన్ సింగ్, నాయకులు ఈర్ల కొమురయ్య, మాజీ ఎంపీపీ సారయ్య గౌడ్, నాయకులు లంక సదయ్య, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర చైర్మన్ అన్వేష్ రెడ్డి, జెడ్పీటీసీ గంట రాములు, సర్పంచ్ కొమురయ్య గౌడ్, లంక రాజేశ్వరి, ఎంపీటీసీ సదానందం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మునీర్, కట్కూరి సుధాకర్ రెడ్డి, మనోహర్ రావు, ఇంద్రకరణ్ రెడ్డి, మానిక రెడ్డి, మహేందర్ పాల్గొన్నారు.

జిల్లాలో ముగిసిన భట్టి పాదయాత్ర

ఓదెల: మంచిర్యాల మీదుగా రామగుండం మండలం ఎల్లంపల్లి వద్ద జిల్లాలోకి ప్రవేశించిన భట్టి పాదయాత్ర.. గురువారం రాత్రి ఓదెల మండలం గుంపుల వద్ద ముగిసింది. మానేరు నది దాటి జమ్మికుంట మండలం తనుగులకు చేరుకుంది. ముందుగా గుంపుల గ్రామంలోనే ఆయన బస చేయాల్సి ఉండగా.. తనుగులకు చేరుకుని అక్కడ బస చేశారు.

క్లుప్తంగా

మద్యం మత్తులో వాహనాలు నడపొద్దు

• ట్రాఫిక్ ఏసీపీ విజయ్‌కుమార్



కరీంనగర్‌క్రైం: మద్యం మత్తులో వాహనాలు నడపొద్దని కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ విజయ్‌కుమార్ అన్నారు. సీపీ ఎల్.సుబ్బారాయుడు ఆదేశాల మేరకు గురువారం కరీంనగర్ ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన 23 మందికి వారి కుటుంబసభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. నగరంలో ప్రతీరోజు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు కొనసాగుతున్నాయని తెలిపారు. రెండోసారి పట్టుబడితే కోర్టు జైలుశిక్ష విధిస్తుందని హెచ్చరించారు. మద్యం సేవించి, రోడ్డు ప్రమాదానికి కారణమైతే వాహనదారుడే కాదు అతని కుటుంబం కూడా రోడ్డున పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ జి.తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

పేపర్ లీకేజీలో మంత్రి కేటీఆర్ హస్తం



విద్యానగర్(కరీంనగర్): టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలో మంత్రి కేటీఆర్ హస్తం ఉందని, దీనిపై విచారణ చేయించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు మల్యాల రాకేశ్ ఆరోపించారు. గురువారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేపర్ లీకేజీ వల్ల 30 లక్షల మంది అభ్యర్థుల ఆశయాలు అడియాసయ్యాయని అన్నారు. ఈ ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి, నిరుద్యోగులకు న్యాయం చేయాలని, బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జోనల్ ఇన్‌చార్జిలు నితీష్, భామండ్ల నందు, శివ, నగర సంయుక్త కార్యదర్శులు వంశీ, నాగరాజు, సాకేత్, ఉపాధ్యక్షులు శివ తదితరులు పాల్గొన్నారు.

గంద్ర హన్మంతరావు సాహితీ పురస్కారానికి ఎంపిక



కరీంనగర్‌కల్చరల్: సాహిత్యంలో ఏటా కవిత్వేతర ప్రక్రియలకు ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న గంద్ర హన్మంతరావు స్మారక సాహితీ పురస్కారం–2021, 2022 సంవత్సరాలకు గాను జీవన హిందోళం, ఝోళీ పుస్తకాలు ఎంపికైనట్లు పురస్కార ట్రస్టు కన్వీనర్ గంద్ర లక్ష్మణరావు, సభ్యులు వారాల ఆనంద్, గాజుల రవీందర్, బీవీఎన్ స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. అష్టావధాని, కవి గుమ్మన్నగారి లక్ష్మీనరసింహశర్మ సాహితీ జీవన చరిత్ర జీవన హిందోళం రచయిత డాక్టర్ జి.బాలశ్రీనివాసమూర్తికి, గిరిజనుల జీవితాలను చిత్రించిన కథాసంకలనం ఝోళీ రచయిత్రి డాక్టర్ సూర్యా ధనుంజయ్‌లకు పురస్కారం అందిస్తామని పేర్కొన్నారు.

మద్యం తాగించి.. నరికి చంపారు

• జయశంకర్ భూపాలపల్లి జిల్లా వెంకట్రావ్‌పల్లివాసిది హత్యే
• వివాహేతర సంబంధమే ఘాతుకానికి కారణం
• చంపేసి, ఆత్మహత్యగా చిత్రీకరించారు
• హంతకులు నలుగురిని అరెస్టు చేశాం
• ఏసీపీ వెంకట్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకట్‌రెడ్డి

జమ్మికుంట(హుజూరాబాద్): జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని వెంకట్రావ్‌పల్లికి చెందిన పోలోజు రమేశ్‌ది హత్యేనని హుజూరాబాద్ డివిజన్ ఏసీపీ వెంకట్ రెడ్డి తెలిపారు. వివాహేతర సంబంధమే ఇందుకు కారణమన్నారు. హంతకులు నలుగురిని అరెస్టు చేశామని పేర్కొన్నారు. జమ్మికుంట పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గురువారం సీఐ రమేశ్‌తో కలిసి కేసు వివరాలు వెల్లడించారు. వెంకట్రావ్‌పల్లికి చెందిన పోలోజు రమేశ్ ఎలక్ట్రీషియన్‌గా పని చేసేవాడు. అదే గ్రామానికి చెందిన రజితకు కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలంలోని కనగర్తికి చెందిన కంచవ రమేశ్‌తో 15 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. తర్వాత రజిత తన భర్తతో కలిసి తల్లిగారి ఊరైన వెంకట్రావ్‌పల్లి వెళ్లింది. అక్కడే దంపతులిద్దరూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. కొన్నేళ్లకు స్వగ్రామమైన కనగర్తికి వచ్చారు. రజిత గ్రామంలో కూలి పనులకు వెళ్తుండగా ఆమె భర్త రమేశ్ వరంగల్‌లో డ్రైవర్‌గా పని చేసేవాడు. కాగా పోలోజు రమేశ్‌కు, రజితకు వెంకట్రావ్‌పల్లిలో ఉన్నప్పటి నుంచే వివాహేతర సంబంధం ఉంది. కనగర్తికి వచ్చిన తర్వాత కూడా దాన్ని కొనసాగించారు. విషయం తెలిసి ఆమె భర్త హెచ్చరించాడు. రజిత వారించినా అతను వినలేదు. దీంతో పోలోజు రమేశ్‌ను హత్య చేయాలని రజిత, ఆమె భర్త రమేశ్, మరిది కంచం ఓదెలు, తమ్ముడు దేవేందర్‌లు పథకం వేశారు.



రమేశ్ (ఫైల్)

ఫోన్ చేయించి, రప్పించారు..

రజితతో పోలోజు రమేశ్‌కు ఫోన్ చేయించి, పిలిపించారు. అతనికి మద్యం తాగించి, ఆ మత్తులో ఉండగా గొడ్డలితో నరికి, హత్య చేశారు. మృతదేహాన్ని దుప్పట్లతో కప్పి, ద్విచక్రవాహనంపై తీసుకెళ్లి జమ్మికుంట మండలంలోని మడిపల్లి, ఉప్పల్ రైల్వే ట్రాక్‌పై పడేసి, ఆత్మహత్యగా చిత్రీకరించారు. మృతుడి తల్లి కవిత ఫిర్యాదు మేరకు రామగుండం రైల్వే పోలీసులు 13 జనవరి 2023న అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

జమ్మికుంట పోలీసులకు కేసు బదిలీ..

తర్వాత రైల్వే పోలీసులు కేసును జమ్మికుంట సివిల్ పోలీసులకు బదిలీ చేశారు. ఎస్సై యూనిస్ అహ్మద్ అలీ రెండు నెలలుగా కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి సెల్‌ఫోన్ ద్వారా టెక్నికల్ ఆధారాలు సంపాదించారు. అతను చివరి కాల్ చేసిన కనగర్తికి చెందిన బాలకృష్ణను అదుపులోకి తీసుకొని, విచారణ జరుపగా పోలోజు రమేశ్‌ను నలుగురు కలిసి హత్య చేశారని చెప్పాడు. జమ్మికుంట పట్టణ సీఐ రమేశ్ ఆధ్వర్యంలో పోలీసులు గత రెండు రోజులుగా కనగర్తి, మడిపల్లి గ్రామాల్లో ఆధారాలు సేకరించారు. రజిత, రమేశ్, ఓదెలు, దేవేందర్‌లను అదుపులోకి తీసుకొని, విచారించగా నేరాన్ని ఒప్పుకున్నారు. హత్యకు ఉపయోగించిన గొడ్డలి, వాహనం, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. వారిని రిమాండ్ తరలించినట్లు ఏసీపీ తెలిపారు. కేసును చాకచక్యంగా ఛేదించిన సీఐ రమేశ్, ఎస్సై యూనిస్ అహ్మద్ అలీ, పోలీసు సిబ్బంది మోహన్, రాజేశ్వర్‌రావు, అమీర్‌పాషా, విద్యాసాగర్, సురేందర్, ప్రవళిక, సౌజన్యలను అభినందించారు. రివార్డు కోసం సీపీకి సిఫారసు చేయనున్నట్లు పేర్కొన్నారు.

సకాలంలో డబ్బు చెల్లించకుంటే చర్యలు

• కరీంనగర్ సీపీ ఎల్.సుబ్బారాయుడు
• ప్రైవేటు చిట్‌ఫండ్ ప్రతినిధులతో సమావేశం

కరీంనగర్‌క్రైం: జిల్లాపరిధిలోని ప్రయివేటు చిట్‌ఫండ్ సంస్థలు గడువు ముగిసిన, అవసరమైన సమయాల్లో చిట్‌గ్రూప్‌లోని సభ్యులకు డబ్బు చెల్లించడంలేదని తమదృష్టికి వచ్చిందని, అలాంటివారిపై చర్యలు తప్పవని కరీంనగర్ సీపీ ఎల్.సుబ్బారాయుడు హెచ్చరించారు. కమిషనరేట్ కేంద్రంలో ప్రైవేట్ చిట్‌ఫండ్ యాజమాన్య ప్రతినిధులతో గురువారం సమావేశం అయ్యారు. సీపీ మాట్లాడుతూ.. ప్రజలు తమ భవిష్యత్ అవసరాల కోసం చిట్‌ఫండ్ సంస్థలను నమ్మి, డబ్బులు కూడపెట్టుకుంటారని, వారికి అవసరానికి అందించకుండా పలు ఇబ్బందులకు గురిచేస్తున్నారని అనేక ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. కొన్ని సంస్థలు ఏకంగా డబ్బుకు బదులు తక్కువ ధర గల భూములను ఎక్కువగా చూపిస్తూ బలవంతపు రిజిస్ట్రేషన్ చేయించి గ్రూప్ సభ్యులకు కట్టబెడుతున్నారని తెలిసిందన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా, బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగేంతవరకు కరీంనగర్ పోలీసులు వెంటఉంటామని స్పష్టం చేశారు. అన్ని ప్రైవేట్ చిట్‌ఫండ్ యాజమాన్యాలకు వారం రోజులు గడువు ఇస్తున్నామని, ఈలోగా వారి సంస్థల పూర్తి వివరాలను కోరిన విధంగా అందజేయాలని తెలిపారు. ఆ వివరాల ఆధారంగా పూర్తిస్థాయిలో విచారణ చేపడతామన్నారు. విచారణ అనంతరం సమావేశం నిర్వహిస్తామని దానికి అన్ని యాజమాన్యాలు తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు. పరిమితులను ఉల్లంఘించిన లేదా గ్రూపు సభ్యులకు సకాలంలో డబ్బు చెల్లించక ఇబ్బందులకు గురిచేసే సంస్థల యాజమాన్యాలపై కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా రిజిస్ట్రార్ ప్రసూన, చిట్ రిజిస్ట్రార్ దిలీప్ చంద్రగోపాల్, స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజల కష్టాలు తీర్చేలా పథకాల అమలు

• బీజేపీ, కాంగ్రెస్ నేతలు గ్రామాల్లో తిరిగితే అభివృద్ధి కనిపిస్తుంది
• ఎమ్మెల్యే రసమయి బాలకిషన్
• కొత్తపల్లిలో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

తిమ్మాపూర్(మానకొండూర్): రాష్ట్రంలో పేదలకు బీజేపీ నేతలు తంబాకు చేతిలో పెడితే.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాత్రం సంక్షేమ ఫలాలు అందిస్తోందని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. తిమ్మాపూర్ మండలం కొత్తపల్లిలోని ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో గురువారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేశ్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆత్మీయ సమ్మేళనాల జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, పార్టీ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవీ.రామకృష్ణారావు, గ్రంథాలయ చైర్మన్ అనిల్‌కుమార్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రజల కష్టాలు తీర్చేలా పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. మానకొండూర్ నియోజకవర్గంలో 15 వేల ఎకరాలకు సాగు నీరిచ్చారని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ నేతలు గ్రామాల్లో తిరిగితే అభివద్ధి కనిపిస్తుందని పేర్కొన్నారు. జిల్లా ఇన్‌చార్జి సారయ్య మాట్లాడుతూ.. కార్యకర్తలే బీఆర్‌ఎస్‌కు బలమన్నారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకునే పార్టీ బీఆర్‌ఎస్ అని తెలిపారు. రసమయి వచ్చే ఎన్నికల్లో 60 వేల మెజారిటీతో గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఇనుకొండ శైలజ, ఎంపీపీ కేతిరెడ్డి వనిత, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, ఉల్లెంగుల ఏకానందం, కీర్తి లత, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు ఇనుకొండ జితేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ల్యాగల వీరారెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి హెల్ప్‌లైన్



సమావేశంలో మాట్లాడుతున్న జనార్దన్‌రావు

విద్యానగర్(కరీంనగర్): వయోవృద్ధులు ఎలాంటి సమస్యలున్నా హెల్పేజ్ ఇండియా వారి ఎల్డర్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేస్తే పరిష్కారానికి కృషి చేస్తారని సీనియర్ సిటిజన్స్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సముద్రాల జనార్దన్‌రావు తెలిపారు. గురువారం కరీంనగర్‌లోని కృషిభవన్‌లో గూగుల్ సహకారంతో హెల్పేజ్ ఇండియా వారు నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరై, మాట్లాడారు. వయోవృద్ధులు ఎల్డర్ హెల్ప్‌లైన్ నంబర్ 1800 180 1253కు ఫోన్ చేస్తే సమస్యల పరిష్కారానికి సూచనలు, సలహాలు ఇస్తారని చెప్పారు. హెల్పేజ్ ఇండియా ఆఫీసర్ పులి శ్యాంకుమార్ మాట్లాడుతూ.. సెల్‌ఫోన్ పాస్‌వర్డ్, ఐఎంఈఐ నంబర్లను డైరీలో రాసుకొని, రహస్యంగా ఉంచుకోవాలని చెప్పారు. వుచ్చిడి మోహన్‌రావు, భూంపల్లి మోహన్ రెడ్డి, పీకేజీ స్వామి, ముదుగంటి నర్సింహారెడ్డి, రాపోలు శ్రీధర్ స్వామి, రాజేంద్రప్రసాద్ రావు, చింతల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యసేవలు అందించాలి

• జిల్లా వైద్యాధికారి లలితాదేవి

హుజూరాబాద్: ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారులు, సిబ్బంది పనివేళలను పాటించి, రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌వో లలితాదేవి కోరారు. గురువారం హుజూరాబాద్ ప్రాంతీయ ఆసుపత్రిని ఆమె సందర్శించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజేందర్‌రెడ్డితో కలిసి గర్భిణులకు సంబంధించిన లేబర్ రూములు సందర్శించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హుజూరాబాద్ డివిజన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. కంటి వెలుగు, ఆరోగ్య మహిళా కార్యక్రమాల విజయవంతానికి కృషి చేయాలని సూచించారు. మళ్లీ కోవిడ్ కేసులు పెరుగుతున్నాయని, ముందు జాగ్రత్తగా ప్రతిఒక్కరూ ప్రికాషన్ డోస్ వేసుకోవాలని కోరారు. గర్భిణులకు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో వైద్య పరీక్షలు చేసి, సాధారణ ప్రసవాలు పెంచాలని ఆదేశించారు. సూపరింటెండెంట్ డాక్టర్ రాజేందర్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

బిల్లుల కోసం సర్పంచ్, ఉపసర్పంచ్ వాగ్వాదం

శంకరపట్నం(మానకొండూర్): గ్రామంలో చేసిన అభివృద్ధి పనుల బిల్లుల కోసం రాజాపూర్ సర్పంచ్, ఉపసర్పంచ్ వాగ్వాదానికి దిగారు. గురువారం మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్న సర్పంచ్ వసంత, ఉపసర్పంచ్ ఓదెలుతో ఎంపీడీవో బషీరొద్దీన్ మాట్లాడుతుండగానే తాను చేసిన పనులకు బిల్లులు రావాలని ఇద్దరూ అన్నారు. డ్రైనేజీ, వీధి దీపాలు, ట్రీగార్డుల కోసం అప్పులు చేసి ఖర్చు చేశానని సర్పంచ్ ఎంపీడీవోకు మొరపెట్టుకున్నారు. తాను చేసిన పనులకు బిల్లులు రావాలని ఉపసర్పంచ్ పట్టుబట్టడంతో ఇద్దరినీ సముదాయించారు. చేసిన పనుల కంటే ఎక్కువ మొత్తంలో బిల్లులు రాసుకున్నారని ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. పనులకు సంబంధించి ఫిర్యాదు చేసుకుంటే విచారణ జరుపుతామని ఎంపీడీవో పేర్కొన్నారు.

అత్యుత్తమ సేవా పురస్కారం ప్రదానం



పురస్కారం అందుకుంటున్న కేదార్ రెడ్డి

సప్తగిరికాలనీ(కరీంనగర్): అంతర్జాతీయ అవార్డు గ్రహీత, ప్రముఖ ఫొటోగ్రాఫర్ మహిమల కేదార్ రెడ్డి బుధవారం రాత్రి హైదరాబాద్‌లోని శిల్ప కళా వేదికలో అత్యుత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ కోసం, ఫొటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమానికి కృషి చేస్తున్నందుకు శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా కేదార్ రెడ్డిని పలువురు అభినందించారు.


పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



బాధితుడికి ఫోన్ అందిస్తున్న సీఐ నటేశ్

కరీంనగర్ క్రైం: నగరంలో ఓ వ్యక్తి సెల్‌ఫోన్ పోగొట్టుకోగా వన్‌టౌన్ పోలీసులు వెతికి, అతనికి అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే.. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలోని మల్లాపూర్‌కు చెందిన ఆకుల మోహన్ గురువారం తన సెల్‌ఫోన్‌ను కరీంనగర్ వన్‌టౌన్ పరిధిలో పోగొట్టుకున్నాడు. ఫోన్ పోయిందని పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు సీఈఐఆర్ యాప్ ద్వారా గుర్తించారు. సీఐ నటేశ్ చేతులమీదుగా ఫోన్‌ను బాధితుడికి అందించారు. మోహన్ వారికి కృతజ్ఞతలు తెలిపాడు.

న్యాలకొండపల్లి వాసికి కేంద్ర ప్రభుత్వ సేవాపతకం



చంద్రమౌళి

గంగాధర(చొప్పదండి): విధినిర్వహణలో ఉత్తమసేవలు అందించినందుకు గంగాధర మండలం కొండన్నపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని న్యాలకొండపల్లి గ్రామానికి చెందిన పూదరి చంద్రమౌళికి కేంద్ర ప్రభుత్వ పురస్కారం లభించింది. హైదరాబాద్‌లోని పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న చంద్రమౌళికి 2022సంవత్సరానికిగానూ కేంద్రం ప్రకటించిన ఉత్కృష్ట సేవాపతక్ అవార్డుకు ఎంపికయ్యారు.

ఒడిశా కూలీ ఆత్మహత్య

కొత్తపల్లి(కరీంనగర్): మండలంలోని చింతకుంట వైఎంకే ఇటుకల బట్టీలో కూలి పని చేసే ఒడిశా రాష్ట్రానికి చెందిన కూలీ జుగిగె శాండ(58) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై బి.ఎల్లయ్యగౌడ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. వలస కూలీ దైరు శాండ కుటుంబం ఉపాధి నిమిత్తం చింతకుంటలోని వైఎంకే ఇటుకల బట్టీలో పని చేస్తోంది. ఈ క్రమంలో ఆయన భార్య జుగిగె శాండ కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతోంది. గురువారం ఇటుకల బట్టీ ఆవరణలోని రేకుల షెడ్డులో ఉరేసుకుంది. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రాష్ట్రంలో త్వరలో బీసీలదే రాజ్యం

• బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్



మాట్లాడుతున్న సురేశ్, పక్కన సమితి బాధ్యులు

విద్యానగర్(కరీంనగర్): రాష్ట్రంలో త్వరలో బీసీలదే రాజ్యమని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ అన్నారు. గురువారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి, 75 ఏళ్లు గడుస్తున్నా దేశాన్ని నడిపే మూల స్తంభాలైన న్యాయ వ్యవస్థ, మీడియా, అధికార వ్యవస్థ, చట్టసభల్లో బీసీలకు సరైన ప్రాతినిధ్యం లేదన్నారు. ప్రస్తుత వ్యవస్థను ప్రక్షాళన చేయాలంటే బీసీలు, అణగారిన వర్గాలు తమ చేతిలో ఉన్న ఓటు ద్వారా అధికారాన్ని చేపట్టాలని పేర్కొన్నారు.

జిల్లా కమిటీ నియామకం..

సమితి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా కదారి అయిలయ్య, కార్యనిర్వాహక అధ్యక్షులుగా రాచకొండ విట్టలేశ్వర్, గడ్డం శ్రీరాములు, ప్రధాన కార్యదర్శులుగా బండి మల్లయ్య యాదవ్, బుర్ర కుమార్ గౌడ్, ఉపాధ్యక్షులుగా వంగ వెంకటేశ్వర్లు, మంద మల్లారెడ్డి, కొండ రవీందర్, జంగా కొమురయ్య, కోశాధికారిగా బెజ్జంకి రామబ్రహ్మం, కార్యదర్శులుగా దూడం చంద్రశేఖర్, వీరబోయిన మల్లయ్య యాదవ్, ఈరెళ్ల విజయ్ కుమార్, ఎండీ.చాంద్ పాషా, చిలుక నరసప్ప, దత్తాత్రేయ రాజేందర్‌లను నియమించారు.

వరుస నేరాలు.. యువకుడిపై పీడీయాక్టు



పీడీయాక్టు ఉత్తర్వులు ఇస్తున్న సీఐ దామోదర్‌రెడ్డి

కరీంనగర్‌క్రైం: జులాయిగా తిరుగుతూ వరుస నేరాలకు పాల్పడుతున్న ఓ యువకుడిపై కరీంనగర్ త్రీటౌన్ పోలీసులు పీడీయాక్టు అమలు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లి మండలంలోని రేకుర్తి విజయపురి కాలనీకి చెందిన కృష్ణసాయి అలియాస్ బబ్లూ ఎలాంటి పని చేయకుండా జులాయిగా తిరుగుతూ దురలవాట్లకు బానిసయ్యాడు. సహచరులతో కలిసి చోరీలు చేస్తూ, గంజాయి అమ్మి సులభంగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో పలు నేరాలు చేసి, రెండుసార్లు జైలుకు వెళ్లి వచ్చాడు. అయినా అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. 2018 నుంచి ఇప్పటివరకు 9 నేరాలు చేశాడు. గంజాయి విక్రయించడం, ఇళ్లలో చోరీలు, ఆస్తి ధ్వంసం చేశాడు. గతేడాది అక్టోబర్‌లో త్రీటౌన్ పరిధిలో కరీంనగర్ కోర్టు చౌరస్తా వద్ద పోలీసులు అతన్ని అరెస్టు చేశారు. బంగారు ఆభరణాలు, నగదు, మోటార్‌సైకిల్ స్వాధీనం చేసుకొని, జైలుకు పంపించారు. తన ప్రవర్తనతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న కృష్ణసాయిపై పీడీయాక్టు అమలు చేసి, సంబంధిత ఉత్తర్వులను కరీంనగర్ జైలర్ రమేశ్ సమక్షంలో గురువారం అతనికి అందించినట్లు సీఐ దామోదర్‌రెడ్డి తెలిపారు. అనంతరం చెర్లపల్లి సెంట్రల్ జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు.

బీజేపీ జెండా ఎగరడం ఖాయం

• బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు గీతామూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న గీతామూర్తి

హుజూరాబాద్: రానున్న ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు గీతామూర్తి అన్నారు. గురువారం హుజూరాబాద్ పట్టణంలో మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు చంద్రిక అధ్యక్షతన కోటి సెల్ఫీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో బీజేపీలో పెద్ద ఎత్తున చేరికలుంటాయని తెలిపారు. ప్రధాని మోదీ మహిళల కోసం ఎన్నో పథకాలు తీసుకువచ్చారని, సీఎం కేసీఆర్ వాటిని ఇక్కడ అమలు చేయడం లేదన్నారు. లబ్ధిదారులను ఏకం చేయడమే లక్ష్యంగా ఈ సెల్ఫీ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. కేంద్ర పథకాలతో లబ్ధి పొందిన మహిళలందరూ ఎక్కడికక్కడ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని కోరారు. మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ, ప్రధాన కార్యదర్శి ఉమారాణి, ఉపాధ్యక్షురాలు కల్లపు రేణుక, బీజేపీ పట్టణ అధ్యక్షుడు గంగిశెట్టి రాజు, మహిళా మోర్చా పట్టణ ప్రధాన కార్యదర్శి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మహిళలపై అరాచకాలు

తిమ్మాపూర్(మానకొండూర్): బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రంలో మహిళలపై అరాచకాలు పెరిగిపోయాయని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు గీతామూర్తి ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందినవారితో పార్టీ ఆధ్వర్యంలో కోటి సెల్ఫీ కార్యక్రమాన్ని గురువారం తిమ్మాపూర్ మండలంలోని మక్తపల్లిలో ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. కేంద్రం అమలు చేస్తున్న ఎన్నో సంక్షేమ పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం అడ్డుపడుతోందని ఆరోపించారు. బీజేపీ కార్యకర్తలు వాటిపై విస్తృత ప్రచారం చేయాలని కోరారు. లబ్ధిదారులతో సెల్ఫీ దిగి, నమో యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. జిల్లా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ మాట్లాడుతూ.. పార్టీ పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా కోటి సెల్ఫీ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకుకృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రమాదేవి, గొట్టిముక్కల ఉమారాణి, చంద్రకళ, ప్రేమలత, మాలతి, ఇంద్రాణి, సుగుర్తి జగదీశ్వరాచారి, జిల్లా ఈసీ మెంబర్ తమ్మిశెట్టి మల్లయ్య, మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు చింతం వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌వోలకు సహాయకారులుగా ఉండాలి

• అడిషనల్ డీసీపీ జి.చంద్రమోహన్
• ఠాణాల ఏవోలకు ఒక్కరోజు శిక్షణ



మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ చంద్రమోహన్

కరీంనగర్ క్రైం: వివిధ రకాల కేసుల పరిష్కారంలో పోలీస్‌స్టేషన్లకు చెందిన పరిపాలన అధికారులు(ఏవోలు) ఎస్‌హెచ్‌వోలకు సహాయకారులుగా ఉండాలని కరీంనగర్ అడిషనల్ డీసీపీ(పరిపాలన) జి.చంద్రమోహన్ అన్నారు. గురువారం కమిషనరేట్ కేంద్రంలో వివిధ పోలీస్‌స్టేషన్లలో ఏవోలుగా పని చేస్తున్న పోలీసులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్‌హెచ్‌వోలు అందుబాటులో లేకున్నా తమ దృష్టికి వచ్చిన సమస్యలు, ఫిర్యాదులను స్వీకరిస్తూ వేగవంతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్‌స్టేషన్లలోని అన్ని విభాగాల పనితీరుపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని, ఏదైనా నేర ఛేదనకు సంబంధించిన సమాచారం ఉన్నట్లయితే క్రైం బృందాలకు సహకారం అందించాలని పేర్కొన్నారు. నేరాల ఛేదనలో కీలక పాత్ర పోషించే వారికి రివార్డులు అందజేస్తామన్నారు. 5 ఎస్ కార్యక్రమం అమలు తీరును ప్రతీరోజు పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ జి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జిల్లాలో నేటి కంటి వెలుగు శిబిరాలు

కరీంనగర్‌టౌన్: జిల్లాలో శుక్రవారం 44 ప్రాంతాల్లో కంటి వెలుగు శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ లలితాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ పట్టణంలోని 3, 9, 19, 21, 24, 25, 29, 34, 48, 50, 52, 59వ డివిజన్లలో, హుజూరాబాద్ పట్టణంలో 20వ వార్డులో, మండలంలోని సింగాపూర్, రాంపూర్‌లలో, జమ్మికుంట పట్టణంలోని 14వ వార్డు, మండలంలోని పాపయ్యపల్లి, మాచినపల్లి గ్రామాల్లో, వీణవంక మండలంలోని గన్ముక్కుల, వల్బపూర్ గ్రామాల్లో, చిగురుమామిడి మండలంలోని ఉల్లంపల్లి, నవాబుపేటల్లో, చొప్పదండి మండలంలోని ఆర్నకొండ, చిట్యాలపల్లిల్లో, ఇల్లందకుంట మండలంలోని సీతంపేటలో, గంగాధర మండలంలోని నాగిరెడ్డిపూర్, కాసారంలలో, రామడుగు మండలంలోని వెలిచాల, దత్తోజిపేటల్లో, కొత్తపల్లి మండలంలోని చింతకుంట, మల్కాపూర్‌లలో, కరీంనగర్ రూరల్ మండలంలోని దుర్శేడ్ గ్రామంలో, మానకొండూరు మండలంలోని శంషాబాద్, అన్నారం, రంగంపేట, కల్లెడ గ్రామాల్లో, సైదాపూర్ మండలంలోని జాగీర్‌పల్లి, రాయికల్ గ్రామాల్లో, కేశవపట్నం మండలంలోని గద్దపాక, కరీంపేట్‌లలో, తిమ్మాపూర్ మండలంలోని మొగిలిపాలెం, పోలంపల్లి, గొల్లపల్లి గ్రామాల్లో కంటి వెలుగు బృందాలు పని చేస్తాయన్నారు.

దివ్యాంగ బైక్ యాత్రికులకు సన్మానం



యాత్రికులను సన్మానిస్తున్న నాయకులు

తిమ్మాపూర్(మానకొండూర్): సమాజంలోని దివ్యాంగులను సమాన దృష్టితో ఆదరించాలన్న ఆద్దేశంతో మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన దివ్యాంగులు చేపట్టిన బైక్ యాత్ర గురువారం తిమ్మాపూర్ మండలంలోని రామకృష్ణకాలనీకి చేరింది. ఈ సందర్భంగా స్థానిక నాయకులు వారిని సన్మానించారు. మధ్యప్రదేశ్‌లో కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న బసంత్‌నగర్‌వాసి పరికిపండ్ల నరహరి సహకారంతో ఈ యాత్ర చేస్తున్నట్లు యాత్రికులు సత్యేంద్ర సింగ్, ప్రమోద్‌లు తెలిపారు. అవయవాల లోపం ఉన్నవారు బాధపడుతూ జీవితాన్ని వృథా చేసుకోరాదన్నారు. దివ్యాంగులను ఆదరించినవారు ఉన్నత స్థాయిలో ఉంటారని పేర్కొన్నారు. వారికి మనోధైర్యం ఇవ్వాలే తప్ప అవమానించొద్దని కోరారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండేషన్ ప్రతినిధులు తీట్ల రమేశ్, మిట్టపెల్లి రాజేందర్, గ్రామస్తులు దావు సంపత్ రెడ్డి, సుగుర్తి జగదీశ్వరాచారి, పండుగ రాజయ్య, కొమ్మెర వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆహ్వాన పత్రిక అందజేత



మంత్రి గంగులకు ఆహ్వాన పత్రిక ఇస్తున్న గౌడ కులస్తులు, నాయకులు

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్‌లో ఈనెల 25న గౌడ కులస్తుల ఆధ్వర్యంలో జరుగనున్న ఎల్లమ్మతల్లి బోనాలకు హాజరు కావాలని గౌడ కులస్తులు గురువారం మంత్రి గంగుల కమలాకర్‌ను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణగౌడ్, లక్ష్మణ్‌గౌడ్, హరికృష్ణ గౌడ్, గుగ్గిళ్ల శ్రీనివాస్‌గౌడ్, వొల్లాల శ్రీనివాస్‌గౌడ్, సుదగోని ఆంజనేయగౌడ్, బత్తిని రాజు, బత్తిని శ్రీనివాస్, బత్తిని కన్నయ్య, నాగుల కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

విట్స్‌లో క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్



ఎంపికైన విద్యార్థులు

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్ బైపాస్‌లోని విట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 55 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. బెంగుళూరుకు చెందిన మెన్‌టెక్ సాఫ్ట్‌వేర్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో 140మంది విద్యార్థులు హాజరు కాగా వ్రాత పరీక్ష, మౌఖిక పరీక్షల్లో ఎంపికైన 55మంది విద్యార్థులకు కంపెనీ హెచ్‌ఆర్ ప్రవళిక అపాయిమెంట్ లెటర్లు అందించారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ ఎంఎస్ ఆనందరావు, వైస్ చైర్మన్ అరవింద రావు, అడిషనల్ డైరెక్టర్ బి.గోవిందరావు, ప్రిన్సిపాల్ మురళీ, ఏవో సుధాకర్‌రావు, డీన్ ప్రదీప్‌కుమార్, టీపీవో శ్రీనివాస్, కె.లక్ష్మణ్ అభినందించారు.

చలివేంద్రాలు ప్రారంభం



సప్తగిరికాలనీ(కరీంనగర్): వేసవిలో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు మైత్రి గ్రూప్ చైర్మన్ కొత్త జయపాల్‌రెడ్డి మిత్ర మండలి ఆధ్వర్యంలో నగరంలోని కమాన్‌చౌరస్తా, రాంనగర్‌లలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను మైత్రి ఛానల్ ఎండీ సుజన్‌రావు, ఒలింపిక్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డిలు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో అనూప్, విజయేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, మిత్ర మండలి సభ్యులు నాగరాజు, వెంకట్‌రెడ్డి, అనిత రెడ్డి, అడిచర్ల శ్రీనివాస్, రామానుజం, వాసవేని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



కరీంనగర్: కాలికి గాయమై తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్‌ను గురువారం ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ జిల్లా ఇన్‌చార్జి బస్వరాజు సారయ్య, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చల్మెడ నర్సింహరావుతో పాటు పలువురు వేర్వేరుగా పరామర్శించారు. పలు విషయాలపై చర్చించారు.

చిత్ర కథ







వడగాలులతో జనం ఉక్కిరిబిక్కిరి

వారం రోజులుగా ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. నగరంలో వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లాలంటే సాహసంతో కూడుకున్న పనవుతోంది. ఉదయం పది దాటిందంటే కాలు బయట పెట్టాలంటే జంకాల్సిన పరిస్థితి. దీంతో ఉష్ణ తాపానికి ఉపశమనంగా పండ్ల రసాలను ఆశ్రయిస్తున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

కోవిడ్‌ను ఎదుర్కొనేలా..

- అప్రమత్తమైన వైద్య ఆరోగ్యశాఖ
- కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో మౌలిక వసతులపై దృష్టి
- ఇప్పటికే పూర్తయిన మాక్‌డ్రిల్
- కోవిడ్ ఐసోలేషన్‌కు సిద్ధంగా 100 బెడ్లు



కరీంనగర్‌లోని ప్రభుత్వ ప్రధానాసుపత్రి



ఆసుపత్రిలోని కోవిడ్ ఐసోలేషన్ వార్డు

కరీంనగర్‌టౌన్: దేశంలోని పలు రాష్ట్రాల్లో కోవిడ్ కేసులు పెరుగుతున్నందున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. ప్రజలు తప్పనిసరిగా కోవిడ్ నిబంధనలు పాటించేలా చర్యలు చేపట్టాయి. ఈనేపథ్యంలో కోవిడ్ ముప్పును ఎదుర్కొనేందుకు వైద్య ఆరోగ్యశాఖ సిద్ధమైంది. కరీంనగర్‌లోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఇటీవల మాక్ డ్రిల్ సైతం నిర్వహించింది. ఆక్సిజన్ సౌకర్యం, సరిపడా పడకలు, కోవిడ్ చికిత్సకు అవసరమైన మందులు తదితర వసతుల సమకూర్పుపై చర్యలు చేపట్టింది.

ఇబ్బందులు అధిగమించేలా...

కోవిడ్ మూడో దశ కోసం కరీంనగర్‌లోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో 100 పడకలు సిద్ధం చేశారు. అన్ని పడకలకు ఆక్సిజన్ సౌకర్యం కల్పించారు. మొదటి సారి కన్న రెండో దశలో కేసుల తీవ్రత, పడకల కొరతతో కొద్ది మందికి ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆక్సిజన్ సరిగా అందక పోవడంతో అవస్థలు పడ్డారు. ఈ సమస్యలన్నీ అధిగమించి 20 వేల లీటర్ల లిక్విడ్ ఆక్సిజన్ ట్యాంక్‌తో పాటు రెండు ఆక్సిజన్ కాన్సంట్రేటర్ మిషన్లను ఏర్పాటు చేశారు. దీంతో ఏకంగా ఒకేసారి 500 బెడ్లకు ఆక్సిజన్ అందించే సామర్థ్యాన్ని సిద్ధం చేశారు. అప్పటి నుంచి ఆక్సిజన్‌కు ఎలాంటి కొరత ఏర్పడలేదు.

సౌకర్యాల కల్పనపై దృష్టి

కరీంనగర్‌లోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో కోవిడ్ పరీక్షల నిమిత్తం నిర్ధారణ కిట్లు అందుబాటులో ఉంచారు. ఇందులో ఆర్టీపీసీఆర్, ర్యాపిడ్ యాంటిజెన్ పరీక్షలు చేసేలా రెండు రకాల కిట్లను సిద్ధం ఉంచాలని నిర్ణయించారు. ఈమేరకు పరీక్షల మాక్ డ్రిల్ చేసి నివేదికను రాష్ట్ర శాఖకు పంపించారు. పీపీఈ కిట్లు, ఎన్95 మాస్కులు, మందులను సమకూర్చుకున్నారు. అన్ని బెడ్లను ఆక్సిజన్ సపోర్టు ఉండేలా లోటుపాట్లు ఉంటే మరమ్మతులు చేపట్టారు. మౌలిక వసతుల కల్పనలో నిమగ్నమయ్యారు.

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం



కోవిడ్ ముప్పు ముంచుకొచ్చినా సమస్యను అధిగమించేలా తగిన ఏర్పాట్లు చేస్తున్నాం. మాక్ డ్రిల్‌లో భాగంగా ఆసుపత్రిలో వసతులపై నివేదిక సిద్ధం చేసి వైద్య ఆరోగ్యశాఖకు పంపించాం. కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు అన్ని రకాలుగా సిద్ధంగా ఉన్నాం.

– డాక్టర్ రత్నమాల, ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్

రూ.130 కోట్లతో అభివృద్ధి పనులు

- మేయర్ సునీల్‌రావు



సమస్యలు పరిశీలిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్‌సిటీ: నగరంలో మరో రూ.130 కోట్ల నిధులతో అభివృద్ధి పనులకు టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మేయర్ సునీల్‌రావు అన్నారు. గురువారం 31వ డివిజన్‌తో పాటు శివారు ప్రాంతాల్లో పర్యటించి డ్రైనేజీ, సీసీ రోడ్ల సమస్యలు పరిశీలించారు. మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ సూచనల మేరకు శివారు ప్రాంతాలు, విలీన గ్రామాల డివిజన్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని అన్నారు. నగరంలోని అన్ని డివిజన్లను సమానంగా అభివృద్ధి చేసేందుకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తూ దశలవారీగా పనులు చేస్తున్నామని తెలిపారు. రూ.1300 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల్లో 80 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను జూన్ నెలలోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నగరంలో సమానంగా శివారు ప్రాంతాలు, విలీన గ్రామాల డివిజన్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ లెక్కల స్వప్న, నగరపాలక సంస్థ అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

రంజాన్ కానుకలు అందజేత

కరీంనగర్‌కల్చరల్: రంజాన్ పండుగను పురస్కరించుకొని కరీంనగర్‌లోని 33వ డివిజన్ భగత్‌నగర్ క్యాంపు కార్యాలయం వద్ద గురువారం మేయర్ యాదగిరి సునీల్‌రావు ముస్లింలకు రంజాన్ కానుకలు పంపిణీ చేశారు. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న డివిజన్‌లోని ముస్లిం కుటుంబాలకు ఇంట్లో చేసుకునే సేమియా స్వీట్, వివిధ ఆహార పదార్థాల తయారీ కోసం కావల్సిన నిత్యవసర సరుకులతో పాటు నగదును అందజేశారు. రంజాన్ పండగను సంతోషంగా జరుపుకోవాలని కోరుతూ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ఎస్.మల్లేష్

శాతవాహనయూనివర్సిటీ: యూజీసీ విడుదల చేసిన నెట్(నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్) ఫలితాల్లో అర్హత సాధించిన శాతవాహన యూనివర్సిటీ విద్యార్థులు బాదవత్ రంజిత్‌కుమార్, బి.బాలాజీ, డి.రాజేశ్‌లను వీసీ ప్రొఫెసర్ ఎస్.మల్లేశ్ గురువారం అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ వరప్రసాద్, ఎగ్జామినేషన్ కంట్రోలర్ డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగప్రసాద్, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జాఫర్ జారీ, కామర్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరికాంత్‌లు పాల్గొన్నారు.

25నుంచి వ్యక్తిత్వ వికాస నైపుణ్యంపై ఉచిత శిక్షణ

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్‌లోని వి–కన్వెన్షన్ హాల్‌లో ఈనెల 25, 26 తేదీల్లో వెంకట్ ఫౌండేషన్ సహకారంతో యువతకు ఉచితంగా వ్యక్తిత్వ వికాస నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు మెగా ఇంపాక్ట్ సంస్థ కోర్ కమిటీ ఇన్‌చార్జి వెంకట్ అప్పన్న తెలిపారు. గురువారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమానికి ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు యండమూరి వీరేంద్రనాథ్, గంపా నాగేశ్వర్‌రావు తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు. విద్యార్థులు, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఇంపాక్ట్ మోటివేటర్, ట్రైనర్ శ్రీనివాస్, బాధ్యులు వీరేశం, నాగరాజు పాల్గొన్నారు.

నేడు అల్విదా జుమ్మా

కరీంనగర్‌కల్చరల్: రంజాన్ మాసంలో జరుపుకునే అల్విదా జుమ్మాను శుక్రవారం జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా మసీదులన్నీ ముస్లింల ప్రార్థనలతో కిటకిటలాడనున్నాయి. మసీదులు, దర్గాలను విద్యుత్‌దీపాలతో అలంకరించారు. ఖురాన్ పఠనం ముగించడంతో పాటు గతించిన కుటుంబ సభ్యులు, పెద్దల సమాదుల వద్దకు వెళ్లి ప్రార్థనలు, జకాత్ ఫిత్రా దానాలు చేయనున్నారు.

కొనుగోలు కేంద్రాలకు వరి ధాన్యం

- కేంద్రాల ప్రారంభమే ఆలస్యం
- ఊపందుకున్న కోతలు.. దంచికొడుతున్న ఎండలు
- వరిగింజ పగలకముందే కొంటే మేలంటున్న రైతులు



నాగులమల్యాల కొనుగోలు కేంద్రంలో వరిధాన్యం ఆరబెట్టిన రైతులు

కొత్తపల్లి: యాసంగి వరిధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరుకుంటోంది. ఇక వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడమే ఆలస్యంగా మారింది. గత సీజన్లతో చూస్తే ఈసారి ఎండలు తీవ్రంగా మారాయి. దీంతో కోతలు కోసిన కొన్ని రోజులకే మాయిశ్చర్ వచ్చే అవకాశం ఉన్నందున కొనుగోళ్ల వేగాన్ని పెంచాల్సి ఉంటుంది. కొనుగోళ్లలో జాప్యం జరిగితే దంచికొడుతున్న ఎండ తీవ్రతకు వరిగింజ పగిలే ప్రమాదం ఉంది. తద్వారా రైతులు నష్టపోవాల్సిన పరిస్థితులు ఏర్పడనున్నాయి. అంతేగాకుండా ప్రతీ సంవత్సరం అకాల వర్షాలు అన్నదాతను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. వాటన్నంటినీ అధిగమించాలంటే యంత్రాంగం పకడ్బందీగా కొనుగోళ్లు చేపట్టాల్సిన అవసరం ఉంది.

కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు కసరత్తు

కొత్తపల్లి మండలంలో యాసంగి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు కసరత్తు మొదలైంది. ఇప్పటికే కరీంనగర్‌రూరల్ మండలంలో కొనుగోలు కేంద్రాలను మంత్రి గంగుల కమలాకర్ ప్రారంభించారు. అయితే కాలికి గాయం కారణంగా విశ్రాంతి తీసుకుంటున్న మంత్రి కొనుగోలు కేంద్రాల ప్రారంభంపై దృష్టి సారించినట్లు తెలిసింది. కొత్తపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో యాసంగి వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. కొత్తపల్లి మండలంలో డీసీఎంఎస్ ద్వారా కొత్తపల్లిలో రెండు, మల్కాపూర్, బద్దిపల్లి, చింతకుంట గ్రామాలు, కరీంనగర్ సింగిల్‌విండో ద్వారా కమాన్‌పూర్, నాగులమల్యాల, ఎలగందుల, రేకుర్తి గ్రామాలు, ఐకేపీ ద్వారా ఆసిఫ్‌నగర్ గ్రామంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు కసరత్తు మొదలైంది. గతంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల మాదిరిగానే ఈసారి ఏర్పాటు చేసి రైతుల వరిధాన్యాన్ని కొనేందుకు సిద్ధమవుతున్నారు.

పెరిగిన వరిసాగు.. ఊపందుకున్న కోతలు

కొత్తపల్లి మండలంలో వరిసాగు విస్తీర్ణం పెరిగింది. ఏడాదికేడాది వరిసాగు పెరుగుతోంది. మండలంలోని 7,400 ఎకరాల్లో 1.40 లక్షల క్వింటాళ్ల వరిధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తుండగా ఇప్పటి వరకు పది శాతం కోతలు జరగగా సుమారు 8 వేల క్వింటాళ్ల వరిధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరుకున్నట్లు తెలుస్తోంది. కోతలు పూర్తి చేసుకున్న రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పోసి మాయిశ్చర్ కోసం ఆరబెడుతున్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో మాయిశ్చర్ త్వరగానే వచ్చే అవకాశం ఉన్నందున్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

రైతుల సమస్యలు తీరేనా..?

యాసంగిలో తాలు సమస్య తలెత్తే అవకాశం ఉంది. ఈ తాలుపై రైతులు ఆందోళనకు గురవుతున్నారు. గత సీజన్లలో నాణ్యమైన రకం వడ్లు వస్తేనే తీసుకుంటామని రైస్‌మిల్లర్లు తిరకాస్తు పెట్టడంతో రైతులు ఇబ్బందిపడ్డారు. అంతేగాకుండా తాలు కింద క్వింటాల్‌కు 2 కిలోల చొప్పున తరుగు తీసి కాంటా వేయాలన్నప్పటికీ మిల్లర్లు ఒప్పుకోకపోవడంతో ఖచ్చితంగా వడ్లు పట్టాల్సి వచ్చింది. రైతుల సమస్యలపై అధికార యంత్రాంగం దృష్టిసారించి కొనుగోళ్లు త్వరితగతిన చేపట్టడంతో పాటు అకాల వర్షాల నుంచి గట్టెకించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అగ్నిప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం



బాధితుడితో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బహుదూర్‌ఖాన్‌పేటలో ఇటీవల అగ్నిప్రమాదంలో దగ్ధమైన కిరాణ దుకాణం యజమాని ఆకుల మల్లయ్యకు గురువారం ఎంపీ బండి సంజయ్‌కుమార్ పంపించిన రూ.20వేల ఆర్థిక సాయాన్ని బీజేపీ నాయకులు అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తాళ్లపల్లి శ్రీనివాస్, దాసరి రమణారెడ్డి, గుర్రం కమలాకర్‌రెడ్డి, గుర్రం చంద్రయ్య, బుర్ర మారుతి, భూంరెడ్డి, విజయ్, ఆదర్శ్, తిరుపతి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

పండుగలను సోదరభావంతో జరుపుకోవాలి



ఇఫ్తార్ విందులో పాల్గొన్న కలెక్టర్, సీపీ



రేకుర్తిలో..

- కలెక్టర్ ఆర్వీ కర్ణన్

కరీంనగర్‌కల్చరల్: రాష్ట్రంలో బతుకమ్మ, రంజాన్, క్రిస్మస్ పండుగలన్నీ సమానత్వం, సోదరభావంతో జరుపుకోవాలని కలెక్టర్ ఆర్వీ కర్ణన్ అన్నారు. రంజాన్ పండుగ ఉపవాస దీక్షల సందర్భంగా గురువారం 47వ డివిజన్‌లోని మధుగార్డెన్‌లో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపవాస దీక్షలో ఉన్న వారు వేసవిని దృష్టిలో పెట్టుకొని వారి ఆరోగ్యాన్ని కాపాడుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ కమిషనర్ ఎల్.సుబ్బారాయుడు మాట్లాడుతూ ఇఫ్తార్ విందులో అందరూ సోదరభావంతో మెదలాలని, ఎంతో నిష్టతో నిర్వహించే ఉపవాస దీక్షలను ప్రశాంతవాతావరణంలో నిర్వహించుకోవాలని అన్నారు. అనంతరం ప్రభుత్వం తరపున రంజాన్ పండుగ కానుకలను ముస్లింలకు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో ఆనంద్‌కుమార్, జిల్లా మైనారిటీ అభివృద్ధి అధికారి పులి మధుసూదన్, తహసీల్దార్లు సుధాకర్, నారాయణ, వెంకట్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రేకుర్తిలో..

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం తరపున రేకుర్తిలోని 19వ డివిజన్‌లో గల మసీద్‌లో గురువారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. డివిజన్ కార్పొరేటర్ రాజశేఖర్, మైనారిటీ నాయకులు ఫహద్, జకీర్, నవాజ్, హనీఫ్, పాషా, హుస్సేన్, ఇబ్రహీం, వాలీ, రఫీ, హుస్సేన్, బురాన్, యూసుఫ్, చాంద్ పాల్గొన్నారు.

శాస్త్రీరోడ్డులో..

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని శాస్త్రీ రోడ్డులో గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గోపాల్, వేణు, కరుణకర్, హరికుమార్, ముస్లింలు పాల్గొన్నారు.

ముస్లిం ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో..

కరీంనగర్‌టౌన్: ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. గురువారం ముస్లిం ఉపాధ్యాయులు ఇచ్చిన ఇఫ్తార్ విందుకు హాజరై మాట్లాడారు. హిందూ ముస్లింల ఐక్యతకు ఇఫ్తార్ విందులు దోహదం చేస్తాయని అన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముసుగు తిరుపతిరెడ్డి, మూల జైపాల్‌రెడ్డి, మాజీ రాష్ట్ర నాయకులు నరహరి లక్ష్మారెడ్డి, రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు అబ్దుల్ జమీల్, ముజీబ్, అంజద్, ఉమర్ అలీ, జాలి మహేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రావు, నాగేశ్వరరావు, రాజ భాను, వెంకట్రాజం, ఎల్వీ రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల సంక్షేమానికి కృషి



ఏఎంసీ చైర్మన్ మధును సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం ప్రతినిధులు

కొత్తపల్లి: ముదిరాజ్‌ల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు అన్నారు. కొత్తపల్లి మండలం మల్కాపూర్‌లో గురువారం జరిగిన ముదిరాజ్ సంఘం ఆత్మీయ సమ్మేళనంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మధు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని కులాల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు ప్రభుత్వం సంఘ భవనాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ముదిరాజ్ కుల సంఘ భవన నిర్మాణానికి మంత్రి గంగుల కమలాకర్ రూ. 5 లక్షలు కేటాయించారన్నారు. చెక్‌డ్యాం, మత్స్యకారుల సొసైటీ ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఏఎంసీ డైరెక్టర్ గంగాధర లస్మయ్య, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కాసారపు శ్రీనివాస్‌గౌడ్, ముదిరాజ్ సంఘం గ్రామ అధ్యక్షుడు పి.మహదేవ్, ముదిరాజ్ సంఘం నాయకులు కూన రంజిత్, కొక్కు భరత్. కూన నాగరాజు, కంకణాల రమేశ్ బొండ్ల శ్యామ్, గంగాధర చందు, నాయకులు బొమ్మ ఈశ్వర్‌గౌడ్, గొట్టె పోచయ్య, పండుగ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి దుర్గాభవానీ ఆలయ వార్షికోత్సవం



ఆలయంలోని దుర్గాభవానీ అమ్మవారు

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ మండలం నగునూర్‌లోని శ్రీదుర్గాభవానీ ఆలయ వార్షికోత్సవాన్ని ఈనెల 22 నుంచి 25 వరకు వేదపండితులు, ఆలయ ధర్మాధికారి పురాణం మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగళ లక్ష్మణ్ తెలిపారు. వార్షికోత్సవంలో భాగంగా శనివారం ఉదయం గణపతిపూజ, పుణ్యాహవాచనం, శతచండీ సంకల్పం, గణేశ సహస్ర మోదకం, భాష్యపారాయణారంభం, సప్తశతీపారాయణాలు జరుగుతాయని అన్నారు. 23న ఉదయం అమ్మవారికి అభిషేకం, జగత్ప్రసూతికాలంకరణ, శతచండీ యాగం, పూర్ణాహుతి, నీరాజనం, మహారుద్ర పునశ్చరణ, ధర్మాధికారిగా నియమితులైన పురాణం మహేశ్వరశర్మకు కమిటీ సభ్యులతో సత్కారం, సాయంత్రం దుర్గాభవానీ సుందరేశ్వర స్వామి వారల ఎదుర్కోలు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. 24న మహారుద్ర అనుష్టానం, భవానీ సుందరేశుల కల్యాణం. 25న శంకర జయంతి సందర్భంగా ఉదయం ఆలయ ప్రాంగణంలోని ఆదిశంకరాచార్యుల ఆలయంలోని శంకరాచార్యులకు విశేషపూజ, మహారుద్ర పూర్ణాహుతి, భాష్యపారాయణాలు, సౌందర్యలహరి శివానందలహరి పారాయణాలు, ఆశీర్వచనం, అన్నప్రసాద వితరణ జరుగుతుందని అన్నారు. సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మ ఆశీస్సులు పొందాలని కోరారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరు



జైలు నుంచి విడుదల అయిన ఏబీవీపీ నాయకులను కలిసిన కార్యకర్తలు

కరీంనగర్‌క్రైం: విద్యార్థి నాయకులను అక్రమ అరెస్టులు చేసి జైల్లో పెట్టించినంత మాత్రాన ఉద్యమాలను ఆపలేరని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ రంజిత్ అన్నారు. గురువారం కరీంనగర్ జైలు నుంచి రంజిత్‌తో పాటు సిరిసిల్ల జిల్లా కన్వీనర్ నాగరాజులు విడుదలయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనలో ప్రభుత్వం విఫలమైందని, టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ పై ప్రశ్నించిన విద్యార్థి గళాన్ని నొక్కి పట్టాలని ఉద్దేశపూర్వకంగా విద్యార్థి నాయకులపై అక్రమ కేసులు పెట్టి రిమాండ్ చేశారన్నారు. పేపర్ లీకేజీలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు జైలు వద్దకు చేరుకొని వీరిని కలిశారు.

గౌడ న్యాయవాదుల సమావేశం

కరీంనగర్‌క్రైం: నగరంలోని గౌడ న్యాయవాదులు గురువారం జిల్లా కోర్టు ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈనెల 25న కరీంనగర్‌లో జరుగనున్న రేణుక ఎల్లమ్మ జాతరలో గౌడ కులస్తులందరూ హాజరై విజయవంతం చేయాలని నిర్ణయించుకున్నట్లు వారు తెలిపారు. సమావేశంలో ఆరెల్లి రాములుగౌడ్, పంజాల విజయభాస్కర్‌గౌడ్, దూలం తిరుపతిగౌడ్, సుదగాని జనార్దన్‌గౌడ్, బత్తిని తిరుపతిగౌడ్, ఆకులు నాగరాజుగౌడ్, మంద రమేశ్ గౌడ్, పులి శ్రీధర్‌గౌడ్, కుమారస్వామి గౌడ్, పులి శ్రీకాంత్‌గౌడ్, పురుషోత్తం ఆజనేయులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు

బస్టాండ్‌లో యువకుడి ఆత్మహత్యాయత్నం

కరీంనగర్‌క్రైం: నగరంలోని బస్టాండ్‌లో ఓ యువకుడు గురువారం ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు, ఆర్టీసీ విభాగం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్‌కు చెందిన కంటాల సాగర్ బుధవారం రాత్రి తన స్నేహితులతో పార్టీ చేసుకున్నాడు. గురువారం ఉదయం ఒక బస్సు పైకి ఎక్కి రేలింగ్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకునేందుకు యత్నిస్తుండగా కొందరు ప్రయాణికులు గుర్తించి ఆర్టీసీ విభాగం పోలీసులకు సమాచారం అందించారు. అతడిని రక్షించి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియరాలేదు.

క్లుప్తంగా...

అన్ని ప్రశ్నలకు అవినాశ్‌రెడ్డి సమాధానాలు

- రెండో రోజు సీబీఐ విచారణకు హాజరైన ఎంపీ

సాక్షి, హైదరాబాద్ : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో భాగంగా సీబీఐ అధికారులు ఎంపీ అవినాశ్‌రెడ్డిని గురువారమూ విచారించారు. అధికారులు అడిగిన అన్ని ప్రశ్నలకు ఎంపీ అవినాశ్‌రెడ్డి సమాధానాలు ఇచ్చినట్టు సమాచారం. హైకోర్టు ఆదేశాల మేరకు వరుసగా రెండో రోజు సీబీఐ అధికారుల దర్యాప్తునకు ఎంపీ అవినాశ్‌రెడ్డి హాజరయ్యారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం అధికారులు ఆయనకు లిఖిత పూర్వకంగా ప్రశ్నలు అందించారు. వాటన్నింటికీ ఎంపీ సమాధానాలు ఇచ్చినట్టు తెలిసింది. ఈ ప్రక్రియ మొత్తాన్ని ఆడియో, వీడియో రికార్డు చేశారు. శుక్రవారం సైతం ఆయన సీబీఐ ఎదుట విచారణకు హాజరుకానున్నట్టు సమాచారం. మరోవైపు వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో భాగంగా సీబీఐ అధికారులు వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డిలను గురువారం రెండో రోజు ఆరు గంటల పాటు ప్రశ్నించారు. దర్యాప్తు సందర్భంగా న్యాయవాదిని అనుమతించి, సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం ఆడియో, వీడియో రికార్డింగ్‌పై హైకోర్టు గురువారం జారీ చేసిన ఆదేశాల మేరకు సీబీఐ అధికారులు చర్యలు తీసుకున్నట్టు తెలిసింది. అనంతరం భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ రెడ్డిని చంచల్‌గూడ జైలుకు తరలించారు. కాగా, వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ రెడ్డి విచారణ పూర్తయ్యే వరకు వారి న్యాయవాదులను అనుమతించాలని తెలంగాణ హైకోర్టు సీబీఐని ఆదేశించింది. సుప్రీంకోర్టు తీర్పు మేరకు విచారణ జరపాలని, ఆడియో, వీడియో రికార్డింగ్ చేయాలని స్పష్టం చేసింది. న్యాయవాదిని ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకే సీబీఐ అనుమతించిందని, విచారణ ముగిసే దాకా ఉండేలా ఆదేశాలివ్వాలని భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె.సురేందర్ గురువారం విచారణ జరిపారు.

బీఈడీలో ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్

సాక్షి, హైదరాబాద్: బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్, ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో ప్రవేశాలకు షెడ్యూల్డ్ ట్రైబ్ కేటగిరీల రిజర్వేషన్‌ను పెంచారు. గతంలో ఉన్న 6శాతం రిజర్వేషన్‌ను 10శాతానికి పెంచారు. ఈమేరకు విద్యాశాఖ కార్యదర్శి కరుణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎంసెట్ సహా వివిధ సెట్స్ ద్వారా జరిగే ప్రవేశాలకు ఈ తరహా రిజర్వేషన్ ఇస్తూ ప్రభుత్వం గతంలోనే ఉత్తర్వులిచ్చింది.

100 మంది మహిళలతో మిల్లెట్ ఔట్‌లెట్లు



- త్వరలోనే ఔత్సాహికుల ఎంపిక.. ఔట్‌లెట్ల కేటాయింపు
- పూచీకత్తు లేకుండా బ్యాంకు రుణాలు ఇప్పించనున్న టీఎస్ ఆగ్రోస్
- చిరుధాన్యాల ఉత్పత్తులు సరఫరా చేయనున్న అక్షయపాత్ర ఫౌండేషన్
- ఔత్సాహికులకు ఐఐఎంఆర్‌లో అవగాహన కల్పించిన ఇరు సంస్థలు

సాక్షి, హైదరాబాద్: మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా వారిని వ్యాపారవేత్తలుగా మలిచేందుకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలోని టీఎస్ ఆగ్రోస్ చర్యలు చేపట్టింది. మార్కెట్లో డిమాండ్‌గల చిరుధాన్యాల ఉత్పత్తుల వ్యాపారంలో మహిళలను భాగస్వాములను చేయాలని, స్టార్టప్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా వారితో రాష్ట్ర వ్యాప్తంగా చిరుధాన్యాలు, వాటి ఉత్పత్తులను విక్రయించేందుకు ఔట్‌లెట్స్ ఏర్పాటు చేయించనుంది. ఈ దిశగా కసరత్తులో భాగంగా గురువారం హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి పలు జిల్లాల నుంచి వంద మందికిపైగా ఔత్సాహిక మహిళలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆగ్రోస్ చైర్మన్ విజయసింహారెడ్డి, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, ప్రత్యేక కమిషనర్ హనుమంతు, ఆగ్రోస్ ఎండీ రాములు, అక్షయపాత్ర, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నారు.

తొలి దశలో...

మిల్లెట్ ఔట్‌లెట్లను తొలిదశలో జిల్లా కేంద్రాల్లో ఒక్కొక్కటి చొప్పున, జీహెచ్‌ఎంసీ పరిధిలో పది ఔట్‌లెట్లను ఏర్పాటు చేయాలని టీఎస్ ఆగ్రోస్, అక్షయపాత్ర నిర్ణయించాయి. త్వరలోనే ఔత్సాహిక మహిళల్ని ఎంపిక చేసి వారికి ఔట్‌లెట్లు కేటాయించేలా కసరత్తు జరుగుతోంది. మిల్లెట్ ఔట్‌లెట్లలో అక్షయపాత్ర కీలకపాత్ర పోషించనుంది. వ్యాపారానికి అవసరమైన చిరుధాన్యాలను, వాటి ఉత్పత్తులను ఈ సంస్థనే సరఫరా చేయనుంది. దీంతోపాటు ప్రత్యేకంగా షాప్ అద్దెకు తీసుకోలేని వారి కోసం ప్రత్యేకంగా కంటెయినర్ షాప్‌లను కూడా అక్షయపాత్ర రూపొందించింది. ఇందుకు సంబంధించి ఇప్పటికే టీఎస్ ఆగ్రోస్, అక్షయపాత్ర మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. చిన్నారులు మొదలుకొని దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వృద్ధుల వరకు అవసరమైన చిరుధాన్యాల ఆహారాలను ఈ సంస్థ అందించనుంది. మొత్తం 68 రకాల ఉత్పత్తులను అందుబాటులో ఉంచనుంది. ముఖ్యంగా చిన్నపిల్లల కోసం చిరుధాన్యాలతో నూడుల్స్, బిస్కెట్స్ వంటి వాటిని కూడా తయారు చేస్తోంది. ఔత్సాహిక మహిళలు పూచీకత్తు సమర్పించాల్సిన అవసరం లేకుండానే హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ద్వారా టీఎస్ ఆగ్రోస్ రుణాలు ఇప్పించనుంది. సదస్సులో పాల్గొన్న బ్యాంక్ ప్రతినిధులు ఈ విషయాన్ని స్పష్టం చేశారు. ఒక్కొక్కరికీ వ్యాపార విస్తరణ, పెట్టుబడిని బట్టి రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు రుణాలు అందించేందుకు బ్యాంకు ముందుకొచ్చింది. ఈ కార్యక్రమం అనంతరం ఔత్సాహిక మహిళలకు ఏర్పాటు చేసిన భోజనంలో మిల్లెట్ పులిహోర, మిల్లెట్ సాంబార్ ఫుడ్, మిల్లెట్ కర్డ్ ఫుడ్, మిల్లెట్ రోటీ, మిల్లెట్ ఐస్‌క్రీం వంటి వాటిని అందించారు.

ఆడిటర్‌ను నియమించే అధికారం ఉంది

- మార్గదర్శి పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో ఏపీ సర్కార్ వాదనలు
- మార్గదర్శి బ్యాలెన్స్ షీట్‌ను ఫైల్ చేయడం లేదు
- లోపాలున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది

సాక్షి, హైదరాబాద్: 'చిట్‌ఫండ్స్‌కు సంబంధించిన అవకతవకలపై ప్రాథమిక ఆధారాలున్నప్పుడు నిశితంగా పరిశీలించి నిగ్గు తేల్చేందుకు ప్రైవేట్ ఆడిటర్‌ను నియమించుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుంది. చిట్‌ఫండ్ చట్టంలోని సెక్షన్లు ఈ విషయాన్ని స్పష్టంగా చెబుతున్నాయి. అసలు ఈ పిటిషన్‌పై విచారణ జరిపే పరిధి ఈ కోర్టుకు లేదు' అని తెలంగాణ హైకోర్టుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నివేదించింది. మార్చి 13, 15, 18న ఏపీ స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ – ఐజీ ఇచ్చిన ఆదేశాలను కొట్టి వేయడంతోపాటు ఆడిటర్ వేములపాటి శ్రీధర్ నియామకాన్ని, తమ సంస్థలో ఆయన ద్వారా ఆడిటింగ్ చేపట్టడాన్ని రద్దు చేయాలంటూ మార్గదర్శి చిట్‌ఫండ్స్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై గురువారం విచారణ చేపట్టిన న్యాయమూర్తి జస్టిస్ మమ్మినేని సుధీర్‌కుమార్ సుదీర్ఘంగా వాదనలు విన్న అనంతరం తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించారు.

హైకోర్టుల పరిధిని సుప్రీం స్పష్టంగా చెప్పింది

'తనిఖీలు నిర్వహించిన 37 బ్రాంచీలు ఆంధ్రప్రదేశ్‌లోనే ఉన్నాయి. కేసులు అక్కడే నమోదయ్యాయి. విచారణ అధికారులు కూడా అక్కడివారే. అలాంటప్పుడు తెలంగాణ హైకోర్టులో పిటిషన్ వేయడం సరికాదు. పరిధి కాకున్నా మార్గదర్శి ప్రతిసారీతెలంగాణ హైకోర్టులోనే పిటిషన్లు దాఖలు చేస్తోంది. వీటిపై విచారణ జరిపే పరిధి ఈ కోర్టుకు లేదు. మార్గదర్శి నుంచి స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్లు, రిజిస్టర్లను పరిశీలించగా అనేక అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో వీటిపై క్షుణ్నంగా పరిశీలన జరిపేందుకు ఆడిటర్‌ను నియమించాం. చిట్‌ఫండ్స్ చట్టం సెక్షన్ 61 సబ్ సెక్షన్ 2 ప్రకారం ప్రైవేట్ ఆడిటర్‌ను నియమించుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. సబ్ సెక్షన్ 4 ప్రకారం డాక్యుమెంట్లను ఆడిట్ చేసే అధికారం కూడా ఉంది. ఒకటి రెండు అంశాల్లో మినహా ఏపీ హైకోర్టు పరిధిలోని అంశాల్లో తెలంగాణ హైకోర్టు కలుగజేసుకునే అవకాశం లేదు. హైకోర్టుల పరిధికి సంబంధించి సుప్రీంకోర్టు కూడా పలు సందర్భాల్లో స్పష్టంగా నిర్వచించింది. ఒక హైకోర్టు పరిధిలో మరో హైకోర్టు పరిధి దాటి కలుగజేసుకోరాదని ఆదేశించింది' అని ఏపీ ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ గోవింద్‌రెడ్డి నివేదించారు.

60 ఏళ్లైనా తప్పు తప్పే అవుతుంది

'సేకరించిన నగదును అక్రమ మార్గాల్లో సొంత కంపెనీలకు, షేర్ మార్కెట్లకు, మ్యూచువల్ ఫండ్స్‌కు మార్గదర్శి మళ్లిస్తోంది. దాదాపు 46 రోజుల తర్వాత కోర్టును ఆశ్రయించడం సమర్థనీయంకాదు. దాదాపు 6 దశాబ్దాలుగా చిట్‌ఫండ్స్ నడుపుతున్నామని పిటిషనర్ చెబుతున్నారు. 60 దశాబ్దాలుగా నడుపుతున్నా.. తప్పు తప్పే అవుతుంది కానీ ఒప్పు కాదన్న విషయం గ్రహించాలి. కొన్ని సంవత్సరాలుగా మార్గదర్శి బ్యాలెన్స్ షీట్ ఫైల్ చేయడం లేదు. లాభ నష్టాలకు సంబంధించి దీన్ని ఏటా ప్రభుత్వానికి తప్పకుండా సమర్పించాలి. రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీ వద్ద ఫైల్ చేస్తున్నామంటూ తప్పించుకునే ప్రయత్నం చేస్తోంది. ఇది చట్టాలను ఉల్లంఘించడమే. వీటిని పరిగణనలోకి తీసుకుని పిటిషన్‌ను కొట్టివేయాలి' అని స్పెషల్ జీపీ గోవింద్‌రెడ్డి కోరారు. కాగా, ఈ కేసులో ప్రభుత్వం నియమించిన ఆడిటర్ కౌంటర్ దాఖలు చేయకుండా ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వవద్దని ఆడిటర్ తరఫు న్యాయవాది పట్టాభి పేర్కొన్నారు.

మరో వంద ప్రాథమిక సహకార సంఘాలు

- గ్రామానికో సంఘం ఏర్పాటు చేయాలని రాష్ట్రాలకు కేంద్ర సహకార శాఖ సూచన
- అలాగైతే రాష్ట్రంలో 12 వేలకు పైగా ఏర్పాటు చేయాలి
- కానీ, సాధ్యంకాదని తెలంగాణ వాదన
- ప్రస్తుతం 906 ఉండగా, మరో 100 పెంచాలని నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: దేశంలో సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని కేంద్ర సహకారశాఖ నిర్ణయించింది. అందులో భాగంగా ప్రతీ గ్రామానికి ఒక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (ప్యాక్స్) ఉండాలని రాష్ట్రాలకు సూచించింది. ప్రస్తుతం రాష్ట్రంలో 906 సహకార సంఘాలున్నాయి. కేంద్రం సూచనను అమలు చేయాల్సి వస్తే, ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 12,769 గ్రామాల్లోనూ ప్యాక్స్‌ను ఏర్పాటు చేయాలి. అయితే అలా చేయడం వాణిజ్యపరంగా ఏమాత్రం లాభదాయకం కాదని, పైగా వాటిని నడిపించడం సాధ్యం కాదని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి తేల్చిచెప్పింది. ప్రస్తుతం రాష్ట్రంలో మండలానికో ప్యాక్స్ ఉండగా, కొన్ని జిల్లాల్లో మండలానికో రెండు చొప్పున ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం ప్రకారం గ్రామానికో ప్యాక్స్ సాధ్యం కాకున్నా, ఇప్పుడున్న ప్యాక్స్ సంఖ్యను రెట్టింపు చేయాలన్న ఆలోచనలో ఉన్నట్లు టెస్కాబ్ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతానికి మాత్రం కొత్తగా 100 ప్యాక్స్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అక్కడి నుంచి అనుమతి వస్తే త్వరలో ఏర్పాటు చేస్తారు.

రైతులకు మరిన్ని సేవలు...

రైతులకు రుణాలతోపాటు పలు రకాల సేవలు అందించడంలో ప్యాక్స్ కృషి చేస్తున్నాయి. కొత్త ప్యాక్స్ ఏర్పాటుతో రైతులకు సేవలు మరింత చేరువకానున్నాయి. రాష్ట్రంలోని మెజార్టీ ప్యాక్స్ ప్రస్తుతం రైతులకు రుణాలు ఇవ్వడం, ధాన్యం కొనుగోలు చేయడం వంటి మూడు నాలుగు సేవలకే పరిమితమయ్యాయి. ఈ నేపథ్యంలో ప్యాక్స్‌ను కామన్ సర్వీస్ సెంటర్(సీఎస్సీ)గా మార్చి రైతులకు సుమారు 25–30 సేవల్ని అందించే విధంగా టెస్కాబ్ కసరత్తు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటుతో పాటు కొత్త మండలాలను, కొత్త గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కొత్తగా ఏర్పాటు చేసిన మండలాలు, గ్రామ పంచాయతీల్లో ప్యాక్స్‌ను ఏర్పాటు చేయలేదు. దీంతో అక్కడి రైతులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం వంద ప్యాక్స్‌లను ఏర్పాటు చేయనున్నారు. కాగా, 2005కు ముందు తెలంగాణ ప్రాంతంలో 1800 వరకు ప్యాక్స్ ఉండేవి. కానీ వైద్యనాథన్ కమిషన్ సిఫార్సులతో ప్యాక్స్‌ల సంఖ్యను కుదించారు. దీంతో వాటి సంఖ్య 906కు పడిపోయిందని టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు తెలిపారు. రైతులకు ఉత్తమ, నాణ్యమైన సేవల్ని అందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

'మార్గదర్శి'లో కొనసాగుతున్న సోదాలు

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో వరుసగా రెండో రోజు గురువారం కూడా సీఐడీ సోదాలు కొనసాగాయి. విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, నరసరావుపేట, అనంతపురంలోని మార్గదర్శి బ్రాంచి కార్యాలయాల్లో సోదాలు జరిపి కీలక ఆధారాలను సేకరిస్తున్నారు. అక్రమ డిపాజిట్లు, అక్రమ పెట్టుబడులు, హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి నిధుల మళ్లింపునకు సంబంధించిన రికార్డులను అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. బ్రాంచి కార్యాలయాలు, ప్రధాన కార్యాలయంలోని రికార్డుల్లో వివరాలకు ఏమాత్రం పొంతన లేదన్న విషయాన్ని సీఐడీ గుర్తించింది. దీనిపై బ్రాంచి మేనేజర్లు, సిబ్బందిని ప్రశ్నించి వారి స్టేట్‌మెంట్లను నమోదు చేస్తున్నారు. దాదాపు 15 అంశాలకు సంబంధించి అవకతవకలను గుర్తించినట్లు తెలిసింది. మార్గదర్శి బ్రాంచి కార్యాలయాల్లో శుక్రవారం కూడా సీఐడీ సోదాలు కొనసాగనున్నాయి. ఈ సమాచారాన్ని విశ్లేషించిన అనంతరం తదుపరి కార్యాచరణను వేగవంతం చేయాలని సీఐడీ భావిస్తోంది.

అరెస్టు భయంతో అందుబాటులో లేని మేనేజర్లు..
ఏలూరు మార్గదర్శి చిట్‌ఫండ్స్ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్లు కార్యాలయంలో అందుబాటులో లేరని చెబుతున్నారు. ఇప్పటికే ముందస్తు బెయిల్ తీసుకున్నారని, అయినా అరెస్టు చేస్తారనే భయంతో కార్యాలయానికి రావడం లేదని అంటున్నారు. మార్గదర్శిలో చిట్స్‌కు సంబంధించి ఖాతాదారుల వివరాలు, చిట్ల చెల్లింపులు, జమలకు సంబంధించి రికార్డులన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్టు చెబుతున్నారు. సీఐడీ డీఎస్పీ స్థాయి అధికారులతో పాటు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్‌కు సంబంధించి పలువురు అధికారులు ఈ సోదాల్లో పాల్గొంటున్నట్టు సమాచారం.

ఏడాదిగా నిరీక్షణ!

- గతేడాది ఏప్రిల్‌లో కుమురంభీం జిల్లాకు రెండు డయాలసిస్ సెంటర్లు మంజూరు
- ఇప్పటివరకు ఆసిఫాబాద్‌లో ప్రారంభం కాని వైనం..
- కేవలం కాగజ్‌నగర్‌లోనే సేవలు..
- ఆర్థిక, దూరభారంతో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు తప్పని తిప్పలు



మంచిర్యాలలోని ప్రైవేట్ కేంద్రంలో డయాలసిస్ చేయించుకుంటున్న బాధితుడు

ఆసిఫాబాద్: వయస్సుతో సంబంధం లేకుండా కిడ్నీ సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయి. కిడ్నీలు చెడిపోతే బాధితులకు డయాలసిస్ తప్పనిసరి. వారానికి రెండు, మూడు సార్లు డయాలసిస్ చేసుకోవాల్సి వస్తుంది. కుమురంభీం జిల్లాకు రెండు కేంద్రాలు మంజూరు కాగా, ఇటీవల కాగజ్‌నగర్‌లో ప్రారంభించారు. జిల్లా కేంద్రంలో డయాసిస్ సెంటర్ ప్రారంభంలో మాత్రం తీవ్ర జాప్యం జరుగుతోంది.

జిల్లా కేంద్రంలో ఏర్పాటు ఎప్పుడో..?
జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాలతో పాటు 330 పడకల జిల్లా ఆసుపత్రి మంజూరైంది. అయినా జిల్లా వాసులకు మెరుగైన వైద్యం అందడం లేదు. అత్యవసర సమయాల్లో రోగులకు ప్రాథమిక చికిత్స చేసి మంచిర్యాలకు రెఫర్ చేస్తున్నారు. కుమురంభీం జిల్లాలో సుమారు 500కు పైగా కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఉన్నారు. ఇటీవల నాలుగుపదులు దాటిన వారు కూడా కిడ్నీ సమస్యలతో బాధపడుతున్నారు. వీరి కోసం జిల్లా కేంద్రంతోపాటు కాగజ్‌నగర్‌లో డయాలసిస్ కేంద్రం మంజూరు చేస్తున్నట్లు గతేడాది ఏప్రిల్‌లో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఒక్కో కేంద్రంలో ఐదు యంత్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఓ ప్రైవేటు కంపెనీ టెండర్ దక్కించుకుంది. కాగజ్‌నగర్‌లో ఇటీవల డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించారు. అయితే జనరేటర్ లేకపోవడంతో అక్కడ కూడా పూర్తి స్థాయిలో సేవలందడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. జిల్లా కేంద్రానికి ఐదు యంత్రాలు వచ్చినా డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు వసతులతో కూడిన గది లేకపోవడంతో ప్రారంభానికి నోచులేదు. ఇక్కడికి వచ్చిన యంత్రాలను సైతం వేరే జిల్లాకు తరలించినట్లు సమాచారం. తప్పనిసరి పరిస్థితుల్లో వ్యాధిగ్రస్తులు మంచిర్యాలలోని ప్రైవేటు కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు.

వారానికి మూడుసార్లు మంచిర్యాలకు..



వారానికి మూడురోజులు డయాలసిస్ చేసుకునేందుకు మంచిర్యాలకు వెళ్తున్న. ప్రైవేటులో చేయిస్తే రూ.9 వేలు అవుతుండగా, ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా డయాలసిస్ చేస్తున్నారు. వాహనం, మందులు, ఇతర ఖర్చులు రూ.3 వేల వరకు ఖర్చవుతుంది. తరచూ మంచిర్యాలకు వెళ్లిరావడం ఇబ్బందిగా ఉంటుంది. నాలాంటి వాళ్లు జిల్లాలో చాలా మంది ఉన్నారు. ఆసిఫాబాద్‌లో డయాలసిస్ కేంద్రం ప్రారంభించకపోవడంతో అవస్థలు తప్పడం లేదు. జిల్లా కేంద్రంలో మంజూరైన డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలి.
– గాజర్ల వెంకటేశం, ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి, జన్కాపూర్

రెండు వారాల్లో ఏర్పాటు

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన వసతులతో గది సిద్ధం చేస్తున్నాం. ఇందులో భాగంగా ప్రస్తుతం సివిల్ ఎలక్ట్రికల్ పనులు జరుగుతున్నాయి. రెండు వారాల్లో ప్రభుత్వాసుపత్రిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.
– డాక్టర్ స్వామి, డీసీహెచ్, ఆసిఫాబాద్

నిత్యం వేరే ప్రాంతాలకు..

వ్యాధిగ్రస్తులకు స్థానికంగా డయాలసిస్ కేంద్రాలు లేకపోవడంతో నిత్యం మంచిర్యాల, కరీంనగర్, హైదరాబాద్‌కు వెళ్లాల్సి వస్తోంది. ఒక్కోసారి డయాలసిస్ చేయాలంటే సుమారు రూ.6 వేలు వెచ్చించాలి. వారానికి రెండుసార్లు అంటే నెలకు ఎనిమిదిసార్లు డయాలసిస్ చేయించుకోవాల్సిన పరిస్థితి. బాధితులకు నెలకు సుమారు రూ.50 వేలు ఖర్చవుతోంది. ప్రస్తుతం మంచిర్యాల జిల్లాలో స్థానిక ప్రభుత్వాసుపత్రితోపాటు మరో ప్రైవేటు డయాలసిస్ కేంద్రం ఉంది. ఒక్కో కేంద్రంలో రెండు చొప్పున యంత్రాలు ఉండగా, షిఫ్టుల వారీగా డయాలసిస్ చేస్తున్నారు. ప్రభుత్వాసుపత్రిలో ఆరోగ్యశ్రీ అప్‌లోడ్ అయిన వారికి మాత్రమే చికిత్స అందిస్తున్నారు. మిగిలిన వారు ప్రైవేటుకు వెళ్తున్నారు. అపాయింట్‌మెంట్ దొరకని వారు కూడా ప్రైవేటునే ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలో కిడ్నీ వ్యాధిగ్రస్తుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి ఆసిఫాబాద్‌లో డయాలసిస్ కేంద్రం ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

మలేషియాలో మనోళ్లు విలవిల


- ఏజెంట్ల మోసం.. బలైన కార్మికులు
- 44 మంది తెలంగాణవాసుల ఆవేదన
- కాపాడాలంటూ సీఎంకు లేఖ



మలేషియాలో చిక్కుకున్న తెలంగాణ వాసులు

సిరిసిల్లక్రైం: ఉపాధి కోసం నిరీక్షిస్తున్న తెలంగాణవాసులను విదేశాల్లో పని కల్పిస్తానని ఏజెంట్లు మోసానికి పాల్పడ్డారు. అక్కడ పని లేక సొంతూరికి రాలేక 44 మంది వలసజీవులు పరాయి దేశంలో విలవిల్లాడుతున్నారు. బాధితులు సామాజిక మాధ్యమంలో 'సాక్షి'కి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, కరీంనగర్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన 44 మంది బతుకుదెరువు కోసం ఎనిమిది నెలల క్రితం మలేషియాకు వెళ్లారు. వీసా తెప్పించిన ఏజెంట్లు ఇక్కడ చెప్పిన పనికి అక్కడికి వెళ్లాక చేస్తున్న పనికి సంబంధం లేదని బాధితులు వాపోతున్నారు. కనీస వేతనం రూ.50వేలు ఉంటుందని ఏజెంట్లు నమ్మబలికి ఒక్కొక్కరిని నుంచి రూ.1.25 లక్షలు తీసుకున్నారని వారు తెలిపారు. అయితే నెలకు రూ.25వేలు కూడా వస్తలేవని వాపోయారు. వీసాకు అంతమొత్తం చెల్లించి వస్తే అప్పులు కూడా తీర్చుకోలేని పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంత తక్కువ వేతానికి పనిచేయలేకపోతున్నామని ఇండియాకు వస్తామంటున్నారు. అయితే మలేషియా దేశపు నిబంధనల ప్రకారం ఏదేని పనిలో చేరిన తర్వాత నిర్ణీత ఒప్పంద కాలం ముగియకముందు స్వదేశానికి వెళ్లాలంటే రూ.60 వేలు చెల్లించాల్సి ఉంటుందని.. అంత సొమ్ము చెల్లించే పరిస్థితిలో లేమని రోదిస్తున్నారు. తగిన వేతనం లేక ఇబ్బందులు పడుతున్న తమను ఇండియాకు తీసుకెళ్లడానికి దారిచూపాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సోషల్‌మీడియా వేదికగా లేఖ రాశారు.

మలేషియాలో చిక్కుకున్న వారు..
రాజన్నసిరిసిల్ల జిల్లాకు చెందిన వారు బానోత్ అనిల్, గుగులోతు లాలు, బానోత్ నరేశ్, బానోత్ గణేశ్, బానోత్ నవీన్, మాలోత్ హరిలాల్, బానోత్ తిరుపతి, యాదరపు శ్రీరాం, గాదం మహేశ్, అనిల్, చలమయ్య ఉన్నారు. జగిత్యాల జిల్లాకు చెందిన ఉమేశ్‌కుమార్, మహేశ్, రాజేశ్, అనిల్, వంశీ, సాయి, రమేశ్, హర్షవర్ధన్, నిజామాబాద్ జిల్లాకు చెందిన ఎం.శ్రీనివాస్, మల్లేశ్, లక్ష్మణ్, రమేశ్, మహ్మద్ గౌస్, రవితేజ, నరేశ్, సాయికిరణ్, కరస్‌కుమార్, రాజలింగో, వంశీ, సాగర్, పోచయ్య ఉన్నారు. కరీంనగర్ జిల్లాకు చెందిన అనిల్, మహేశ్, ఎస్టీ అనిల్‌కుమార్, జె.శ్రీను, దుర్గసాయి, గంగయ్య, ఇంతియాజ్, ఇఫ్తికర్, బుచ్చయ్య, కామారెడ్డి జిల్లాకు చెందిన కిరణ్‌తేజ ఉన్నారు.



ఇండియాకు తీసుకెళ్లాలంటూ బాధితుల లేఖ

రాజధానికి చేరిన 'రామగుండం' పంచాయితీ

- అసంతృప్తులందరూ కలిసికట్టుగానే..
- కోలేటి దామోదర్, మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కలిసిన వైనం



కోలేటితో సమావేశమైన ఆశావహులు

సాక్షి, పెద్దపల్లి: పెద్దపల్లి జిల్లాలోని రామగుండం నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీలో రాజకీయం రోజురోజుకూ వేడెక్కుతోంది. అసంతృప్తితో ఉన్న నాయకులను బుధవారం పార్టీ జిల్లా ఇన్‌చార్జి ఎర్రోళ్ల శ్రీనివాస్ పిలుపించుకుని మాట్లాడగా.. వారందరూ ఎమ్మెల్యేగా కోరుకంటి చందర్ తప్ప తమలో ఎవరికి టికెట్ ఇచ్చినా తమకు సమ్మతమేనని తేల్చి చెప్పిన విషయం తెల్సిందే. తాజాగా గురువారం రామగుండం టికెట్ ఆశిస్తున్న రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్‌ను కలిసి తమ ఐక్యతను చాటుకున్నారు. హైదరాబాద్‌లోని కోలేటి నివాసంలో సమావేశమై కోరుకంటికి తప్ప మిగితా ఆశావహుల్లో ఎవరికి టికెట్ ఇచ్చినా మద్దతు తెలపాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. అనంతరం అందరూ కలిసి మంత్రి కొప్పుల ఈశ్వర్ పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపే పేరుతో తమ మనుసులో మాటను మంత్రి చెవిలో వేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ అంశం రామగుండం నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది.

చెత్త నిర్వహణ.. మొక్కల సంరక్షణ

- ప్రజల సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేశాం
- ఢిల్లీలో సుస్తులాపూర్ సర్పంచ్ వెంకటేశ్వర్‌రావు



మాట్లాడుతున్న సర్పంచ్ వెంకటేశ్వర్ రావు

ఎలిగేడు(పెద్దపల్లి): మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామం క్లీన్ అండ్ గ్రీన్ విభాగంలో జాతీయస్థాయిలో 3వ స్థానం సాధించిన విషయం విధితమే. ఈ నెల 18న ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌ల చేతులమీదుగా అవార్డుతోపాటు రూ.50 లక్షల నగదు పురస్కారాన్ని సర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు అందుకున్నారు. గురువారం ఢిల్లీలోని సుబ్రహ్మణ్యం ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో సుల్తాన్‌పూర్ అవార్డుకు ఎంపికైన తీరును సర్పంచ్ వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 1,200 మంది ప్రజాప్రతినిధులు, అధికారులకు వివరించారు. గ్రామంలో రోడ్లు, డ్రైనేజీలను శుభ్రం చేయించి, స్వశక్తి సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయించినట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా చూశామని, తడి, పొడి చెత్త వేరుచేసి, జీపీ ట్రాక్టర్‌కు అందించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. హరితహారంలో భాగంగా గ్రామాల్లో మొక్కలను నాటి, వాటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామని, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పల్లెప్రగతి కార్యక్రమంలో ప్రజల సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకున్నామని తెలిపారు.

ట్రాన్స్ జెండర్స్ ఔదార్యం



చలివేంద్రం ప్రారంభిస్తున్న సీఐ మల్లేశ్

నిర్మల్‌చైన్‌గేట్: మండుతున్న ఎండలకు ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసి ట్రాన్స్‌జెండర్స్ తమ ఔదార్యం చాటుకున్నారు. ట్రాన్స్‌జెండర్స్ కమ్యూనిటీ అధ్యక్షురాలు భాగ్యశ్రీ ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లా కేంద్రంలోని శివాజీచౌక్‌లో చలివేంద్రం ఏర్పాటు చేశారు. గురువారం పట్టణ సీఐ మల్లేశ్ చేతుల మీదుగా చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి వి విధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు ఈ చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ట్రాన్స్ జెండర్స్‌ను సమాజంలో అవహేళన చేయకుండా వారిని కూడా అన్నివర్గాలు సమభావంతో చూడాలన్నారు. పలుచోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు. ఎండాకాలంలో వడదెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్ ఫెల్లోషిప్‌కు ట్రిపుల్‌ఐటీ విద్యార్థిని ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న డైరెక్టర్

భైంసా(ముధోల్): బాసర ఆర్జీయూకేటీ థర్డియర్ విద్యార్థిని షేక్ షమీమున్ టీఆర్ అనంతరామయ్య ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ ఇంటర్న్‌షిప్ ఫెల్లోషిప్‌కు ఎంపికైంది. గురువారం వర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ సతీశ్‌కుమార్ విద్యార్థినిని అభినందించారు. కార్యక్రమంలో మెటలర్జీ అండ్ మెటీరియల్ ఇంజినీరింగ్ హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంట్ డాక్టర్ రేవల్లి అజయ్, అసోసియేట్ డీన్ సృజన పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ఒక్క ఎకరానికైనా పోడుపట్టా ఇచ్చారా?

- వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల
- ఇంద్రవెల్లి అమరవీరులకు నివాళులు



సాక్షి, ఆదిలాబాద్: దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి మరణానంతరం అప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం, తర్వాత కేసీఆర్.. ఒక్క ఎకరా పోడు భూమిని కూడా గిరిజనులు, ఆదివాసీలకు పట్టా చేసి ఇవ్వలేదని వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి అమరవీరుల 42వ సంస్మరణ దినోత్సవానికి షర్మిల హాజరై నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడు 3.50 లక్షల ఎకరాలకు పట్టాలు ఇచ్చారని తెలిపారు. ఆయన బతికి ఉంటే అప్పట్లో మిగిలి ఉన్న 4 లక్షల ఎకరాలకు కూడా పట్టాలు ఇచ్చేవారని పేర్కొన్నారు. కేసీఆర్ గత ఎన్నికల్లో పోడు భూములకు హక్కులు కల్పిస్తానని మాట ఇచ్చారని, కానీ గత తొమ్మిదేళ్లలో ఒక్క ఎకరానికి కూడా పట్టా ఇవ్వలేదని ధ్వజమెత్తారు. రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం ఒక్క శాతం నిధులను కూడా గిరిజనుల కోసం ఖర్చు చేయడం లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎస్టీ సామాజికవర్గం అట్టడుగున ఉందని విచారం వ్యక్తంచేశారు. గిరిజనుల చదువులు, ఉపాధి, సంక్షేమం కోసం కేసీఆర్ ఏమైనా చేశారా అని ప్రశ్నించారు. షర్మిల వెంట వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గట్టు రాంచందర్‌రావు, రాష్ట్ర నాయకులు పిట్ట రాంరెడ్డి, ఖమ్మం జెడ్పీ మాజీ చైర్మన్ గడిపల్లి కవిత తదితరులు ఉన్నారు.

ఘన నివాళులు..

ఇంద్రవెల్లి అమరవీరుల 42వ సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్తూపం వద్ద గురువారం ఉదయం నుంచే ఆదివాసీలు పెద్ద ఎత్తున తరలివచ్చి నివాళులర్పించారు. ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి, మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచయ్య, జిల్లా అధ్యక్షుడు గొడం గణేశ్ తదితరులు నివాళులర్పించారు. సంస్మరణ సభ వేదికపై వైఎస్ షర్మిలను ఎంపీ సోయం బాపూరావు కలసి ఆదివాసీ సమస్యలపై చర్చించారు.

విద్యుత్ ఉద్యోగుల గ్రాట్యుటీ రూ.16 లక్షలకు పెంపు

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగ విరమణానంతరం విద్యుత్ ఉద్యోగులకు అందజేసే గ్రాట్యుటీ మొత్తాన్ని రూ.12 లక్షల నుంచి రూ.16 లక్షలకు పెంచారు. ఈ మేరకు ట్రాన్స్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్ రావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సవరించిన గ్రాట్యుటీ మొత్తాన్ని 2020 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి తెచ్చారు. బకాయిలను 2023 జూన్ నుంచి 4 సమాన వాయిదాల్లో చెల్లించనున్నారు.

చంద్రబాబు జన్మదిన వేడుక

సాక్షి, హైదరాబాద్: టీడీపీ అధినేత చంద్రబాబు 73వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం టీటీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ నేతృత్వంలో ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పొలిట్ బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'సెల్ఫీ విత్ హాష్ ట్యాగ్ సీబీఎన్ డెవలప్డ్ తెలంగాణ'పోస్టర్ విడుదల చేశారు. అనంతరం చంద్రబాబు 40 ఏళ్ల రాజకీయ జీవితం ఆధారంగా కిరణ్‌కుమార్ దర్శకత్వంలో రూపొందిస్తున్న 'లోక నాయకుడు'సినిమా ట్రైలర్ విడుదల చేశారు.

ఆర్టిజన్లపై ఎస్మా!

- సమ్మెకు దిగితే కఠిన చర్యలని డిస్కంల హెచ్చరిక
- సబ్ స్టేషన్లు, విద్యుత్ కేంద్రాలకు రక్షణ కల్పించాలని డీజీపీకి లేఖ

సాక్షి, హైదరాబాద్: వేతన సవరణతోపాటు పలు డిమాండ్లపై ఈ నెల 25న ఉదయం 8 గంటల నుంచి సమ్మె చేపట్టాలనే ఆర్టిజన్ల నిర్ణయంపై విద్యుత్ పంపిణీ సంస్థలు భగ్గుమన్నాయి. ఇప్పటికే సమ్మె నోటీసు ఇచ్చిన తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ జేఏసీతో ఈ నెల 19న పారిశ్రామిక వివాదాల చట్టాన్ని అనుసరించి ఒప్పందం చేసుకున్నామని, సమ్మె నోటీసును వారు వెనక్కి తీసుకున్నారని యాజమాన్యాలు గుర్తుచేశాయి. అలాగే కార్మికులతో ఎలాంటి వివాదం లేదని స్పష్టం చేశాయి. అయితే సమ్మెకు దిగనున్నట్లు తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ (హెచ్-82), ఇతేహాద్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్లు నోటీసు ఇవ్వడం, రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా ఆర్టిజన్లు ఉండటంతో డిస్కంలు ఉలిక్కిపడ్డాయి. ఈ నేపథ్యంలో విద్యుత్ సంస్థల్లో ఎస్మా అమల్లో ఉందని, ఏ ఉద్యోగి సమ్మెకు దిగినా చట్టవిరుద్ధమే అవుతుందని యాజమాన్యాలు స్పష్టం చేశాయి. సమ్మె నేపథ్యంలో సబ్ స్టేషన్లు, విద్యుత్ జనరేటింగ్ కేంద్రాలు, విద్యుత్ లైన్లకు రక్షణ కల్పించాలని డీజీపీకి లేఖ రాశాయి. విధులు నిర్వర్తించే ఉద్యోగులు/ఆర్టిజన్లకు రక్షణ కల్పించాలని కోరాయి.

వనరుల పొదుపు.. కాలుష్యం అదుపు

సర్క్యులర్ ఎకానమీతో సాకారం!

2030కి దీని విలువ 4.5 లక్షల కోట్ల డాలర్లు



టవల్ మసి గుడ్డగా మారడం... వంటింట్లో వ్యర్థాలు మొక్కలకు పోషకాలుగా వినియోగించడం... అవసరం మేరకే విద్యుత్, నీరు, సామాన్లు వాడటం.. ఇలాంటి వాటికి మనం పెట్టుకునే పేరు.. పొదుపు. ఆ తరహా పనులే ప్రపంచం మొత్తం మీద అన్ని రంగాల్లో చేపడితే..? అదే.. సర్క్యులర్ ఎకానమీ!

ప్రపంచం మొత్తం మీద ఏటా వినియోగిస్తున్న వస్తువులు 10,000 కోట్ల టన్నులు. ఇందులో ఒకసారి మాత్రమే వాడగలిగిన ప్లాస్టిక్, లోహాలు, కలప, కాంక్రీట్, రసాయనాలు ఏకంగా 92 శాతం. కాంక్రీట్‌ను పక్కనబెడితే మిగిలినవన్నీ చెత్తకుప్పల్లోకి చేరి మనల్ని ఇబ్బంది పెట్టేవి, ఆరోగ్యాన్ని సైతం నాశనం చేసేవే. ఈ విపత్కర పరిస్థితికి తరుణోపాయం సర్క్యులర్ ఎకానమీ అని నిపుణులు అంటున్నారు.

కంచర్ల యాదగిరిరెడ్డి

భూమి మీద ముడి చమురు, ఫాస్పరస్ వంటి రసాయనాలు, సాగుభూమి, తాగు నీరు ఇలా అన్నీ పరిమితమైనవే. కానీ మనం ఈ వనరులను వృథా చేస్తున్నాం. ఎంత వృథా అంటే.. అవసరానికి మించి 1.6 రెట్లు వాడేస్తున్నామని ప్రపంచ ఆర్థిక వేదిక స్పష్టం చేసింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తు తరాలకు అన్నిరకాల ఇబ్బందులూ తప్పవని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ఉన్న వనరులను జాగ్రత్తగా వాడుకునేందుకు సర్క్యులర్ ఎకానమీ దోహదపడుతుంది.

వాడుకుని వదిలేయకుండా..

ఇప్పటివరకు మనం వస్తువులను తయారు చేసి వాడుకున్న తర్వాత వదిలేయడం అనే సూత్రాన్ని అనుసరిస్తున్నాం. ఇంగ్లిషులో దీనిని 'లీనియర్ ఎకానమీ మోడల్'అని పిలుస్తారు. దీనివల్ల ఎన్నో సమస్యలు ఎదురవుతున్నాయని, కాలుష్యం పెరుగుతోందని, వనరుల దుర్వినియోగం జరుగుతోందని 1970 దశకంలోనే కొంతమంది ఆర్థిక వేత్తలు, నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు.



దానికి విరుగుడుగా సర్క్యులర్ ఎకానమీ మోడల్‌ను ప్రతిపాదించారు. ఎలన్ మెకార్థర్ ఫౌండేషన్ వంటివి ఈ ఆలోచనకు మరింత పదును పెట్టి అన్ని రంగాల్లోనూ అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. కొత్త సర్క్యులర్ ఎకానమీ మోడల్‌ను అమలు చేస్తే కేవలం కాలుష్యం, పర్యావరణ సమస్యలకు పరిష్కారం లభించడం మాత్రమే కాకుండా, ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికీ దోహదపడుతుందని నిపుణులు చెబుతున్నారు.

వ్యవస్థ మొత్తం మారితేనే..

ఇందుకోసం వ్యవస్థ మొత్తం మారాలి. వినియోగదారులు, వ్యాపారవేత్తలు, రాజకీయ నేతలు అందరూ తమవంతు పాత్ర పోషించాలి. సులువుగా రీసైకిల్ చేయగలిగేలా, విడదీసేలా వస్తువులను డిజైన్ చేయడం ఒక పద్ధతి. దీనివల్ల తయారీకి ముడిసరుకులు తక్కువగా అవసరమవుతాయి. ఫెయిర్ ఫోన్ అనే స్మార్ట్‌ఫోన్ తయారీ కంపెనీ ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఓ ఆండ్రాయిడ్ స్మార్ట్ ఫోన్‌ను తయారు చేసింది. పాడైపోయిన భాగాలను తీసేసి కొత్తవి వేసుకోవడం ఈ స్మార్ట్ ఫోన్‌లో సాధ్యమవుతుంది.

తక్కువ వనరుల వినియోగం.. ఎక్కువ మన్నిక

సర్క్యులర్ ఆర్థిక వ్యవస్థలో వస్తువులను వీలైనంత తక్కువ వనరుల వినియోగంతో తయారు చేస్తారు. వ్యర్థాలను, కర్బన ఉద్గారాలను వీలైనంతగా తగ్గించడం అనేది వీటి రూపకల్పనలో ముఖ్యాంశం. పైగా ఏ వస్తువైనా వీలైనంత ఎక్కువ సమయం ఉపయోగపడేలా ఉంటుంది. కొత్త మోడల్ వచ్చినప్పుడల్లా పాత స్మార్ట్‌ఫోన్లను పడేసినట్లు కాకుండా.. చెడిపోతే మరమ్మతు చేయడం, డిజైన్లను మార్చడం ద్వారా సదరు వస్తువు జీవితకాలం పెంచడం, పూర్తిగా పనికిరాకుండా పోయిన తర్వాత రీసైకిల్ చేయడం సర్క్యులర్ ఎకానమీలో భాగం. ఉదాహరణకు.. యూరప్ దేశాలు ఏటా సుమారు 250 టన్నుల వ్యర్థాలను ఉత్పత్తి చేస్తున్నాయి. వీటిని మళ్లీ వాడుకునేలా చేయడం ద్వారా కొత్త వాటిని కొనుక్కునే అవసరాన్ని తప్పిస్తారన్నమాట. ఇలా చేయడం వల్ల బోలెడు డబ్బు ఆదా అవుతుంది. అలాగే అవి తిరిగి పనిచేసేలా తయారు చేసేందుకు, మరమ్మతులు చేసేందుకు మానవ వనరులు అవసరమవుతాయి. అంటే కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయన్నమాట. ఇది ప్రపంచ వ్యాప్తంగా అమల్లోకి వస్తే 2030 నాటికి సర్క్యులర్ ఎకానమీ విలువ దాదాపు 4.5 లక్షల కోట్ల డాలర్లుగా ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇంకోరకంగా చెప్పాలంటే 4.5 లక్షల కోట్ల డాలర్ల మొత్తాన్ని ఆదా చేయవచ్చని వారు చెబుతున్నారు.

కేవలం వాడుకున్నందుకే డబ్బులు..!

కొత్తరకం బిజినెస్ మోడల్ ద్వారా కూడా సర్క్యులర్ ఎకానమీ అమలు చేసేందుకు వీలవుతుందని నిపుణులు చెబుతున్నారు. ల్యాప్‌టాప్, మోటార్ సైకిల్, ఏసీ, ఫ్రిజ్ వంటి వాటిని కొనడం కాకుండా.. కేవలం వాడుకునేందుకు మాత్రమే కంపెనీలకు డబ్బులు చెల్లించడం ఈ కొత్తరకం బిజినెస్ మోడల్‌కు ఒక ఉదాహరణ. ఈ మోడల్‌లో ఆయా వస్తువుల జీవితకాలం ముగిసిన తర్వాత సదరు కంపెనీ వెనక్కి తీసుకుంటుంది. వాటిల్లోని పరికరాలను రీసైకిల్ చేస్తుంది. ఉపయోగపడే వస్తువులన్నింటినీ మళ్లీ మళ్లీ వాడుతుంది. వాడి పారేసే ప్లాస్టిక్ వాడకాన్ని 2040 నాటికల్లా దశలవారీగా తగ్గించాలని ఫ్రాన్స్ నిర్ణయించింది. ఈ క్రమంలోనే పునర్వినియోగాన్ని, రీసైక్లింగ్‌నూ ప్రోత్సహించడం ద్వారా ఈ రంగంలో సర్క్యులర్ ఎకానమీని అమల్లోకి తెచ్చింది.

వ్యర్థాల మోతాదు తగ్గాలి

ఈ ఏడాది ఫ్రిబవరిలో ప్రపంచవ్యాప్తంగా సర్క్యులర్ ఎకానమీ అమలుపై ఒక నివేదిక వెలువడింది. 'ద సర్క్యులేటరీ గ్యాప్ రిపోర్ట్'గా పిలిచే ఈ నివేదిక ప్రకారం.. 1970తో పోలిస్తే మన వస్తు వినియోగం మూడు రెట్లు అంటే ఏడాదికి 10,000 కోట్ల టన్నులకు పెరిగింది. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయిలో సర్క్యులర్ ఎకానమీని కనుక అమలు చేయగలిగితే ఇందులో మూడొంతుల మేరకు వస్తు వినియోగాన్ని తగ్గించవచ్చు. సర్క్యులర్ ఎకానమీ అమల్లో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యం మరింత పెరగాలని, అన్ని రకాల పరిశ్రమల్లో వ్యర్థాల మోతాదును తగ్గించేందుకు ప్రయత్నాలు జరగాలని నివేదిక సూచించింది.

నియోమ్‌లో వ్యర్థాలన్నీ రీసైకిల్

సౌదీ అరేబియా కడుతున్న సరికొత్త నగరం 'నియోమ్'లో సముద్రపు నీటిని మంచినీటిగా మార్చే అత్యాధునిక డీశాలినేషన్ ప్లాంట్లను ఉపయోగించనున్నారు. ఆ దేశంలో ఇది కొత్త కాదు కానీ.. నియోమ్‌లోని ప్లాంట్ల వ్యర్థాల నుంచి విలువైన రసాయనాలను వెలికితీసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తుండటం విశేషం. బ్యాటరీల్లో వాడే లిథియంతో పాటు పొటాషియం, సోడియం వంటి అనేక లవణాలు, ఖనిజాలు సముద్రపు నీటిలో ఉంటాయన్నది తెలిసిన విషయమే. నియోమ్ ప్లాంట్ల వ్యర్థాల నుంచి జిప్సమ్‌ను వేరు చేసి దాన్ని సిమెంట్ తయారీలో వాడాలన్న ఆలోచన సాగుతోంది. కాగా నియోమ్‌లో వ్యర్థాలన్నింటినీ పూర్తిగా రీసైకిల్ చేయనున్నారు. ఘన వ్యర్థాల రీసైక్లింగ్ ద్వారా ఎరువులు, మురుగునీటి లోంచి నైట్రోజన్, ఫాస్పరస్ (సబ్బులు, డిటర్జెంట్ల వాడకంతో కలుస్తుంటాయి) వంటి వనరులను వెలికితీయనున్నారు.

వాడేసిన వంట నూనెలతో వాహనాల పరుగు



ఇంగ్లండ్‌లోని బౌర్న్‌మౌత్ ప్రాంతంలో చెత్తను సేకరించే వాహనాలన్నీ వాడేసిన వంటనూనెలతో నడుస్తున్నాయి. ఈ నూనెలను రీసైకిల్ చేసి తయారు చేసిన హైడ్రోట్రీటెడ్ వెజిటబుల్ ఆయిల్ (హెచ్‌వీఓ)ను ఉపయోగిస్తున్నారు.

ఆమ్‌స్టర్‌డ్యామ్‌లో మెక్‌డొనాల్డ్స్ కేంద్రాల్లో వాడేసిన నూనెలను రీసైకిల్ చేసి చెత్త సేకరించే వాహనాలకు, స్విగ్గీ, జొమాటో వంటి ఆహారం సరఫరా చేసే కంపెనీలకు అందిస్తున్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలను ప్రత్యేక రసాయనాల ద్వారా విడగొట్టి ఆ ద్రావణాన్ని కొత్త ప్లాస్టిక్ తయారీకి వాడేలా సింగపూర్ ఇటీవలే ప్రయత్నాలు మొదలుపెట్టింది.

'విశాఖ ఉక్కు'కు తెలంగాణ దూరం

- ఆసక్తి వ్యక్తీకరణ ప్రక్రియలో పాల్గొనని రాష్ట్ర సర్కారు, సింగరేణి సంస్థ
- సింగరేణి సంస్థ వద్ద నగదు రూపంలో నిధుల లేమి
- ప్రభుత్వ ఖజానా నుంచే ఇవ్వాల్సి ఉంటుందని నివేదిక
- భారం కావడంతో వెనక్కి తగ్గిన ప్రభుత్వం!


సాక్షి, హైదరాబాద్: సంస్థ నిర్వహణకు అవసరమైన మూలధనం సమీకరణ కోసం విశాఖ ఉక్కు పరిశ్రమ జారీ చేసిన ఆసక్తి వ్యక్తీకరణ (ఈఓఐ) ప్రక్రియలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పాల్గొనలేదు. గురువారంతో ఈఓఐ ప్రక్రియ గడువు ముగిసిపోగా, సింగరేణి బొగ్గు గనుల సంస్థ గానీ మరే ఇతర రాష్ట్ర ప్రభుత్వ శాఖ/సంస్థ గానీ బిడ్ దాఖలు చేయలేదు. ఈఓఐలో అవకాశం చేజిక్కించుకుంటే సంస్థ పెట్టాల్సిన పెట్టుబడులు, ఇతర అంశాలను సింగరేణి డైరెక్టర్ల బృందం రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించింది. నిర్వహణ మూలధనంగా విశాఖ ఉక్కు పరిశ్రమకు ఏడాదికి రూ.3,500 కోట్ల నుంచి రూ.5 వేల కోట్ల వరకు అందించాల్సి ఉంటుందని తేల్చినట్టు సమాచారం. అయితే సింగరేణి సంస్థ వద్ద బాండ్లు, డిపాజిట్ల రూపంలో నిధులున్నా, నగదు రూపం (లిక్విడ్ రిజర్వ్స్)లో లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వ ఖజానా నుంచే నిధులు అందించాల్సి ఉంటుందని పేర్కొన్నట్టు తెలిసింది. అయితే ఇది ప్రభుత్వానికి భారంగా మారే అవకాశం ఉండటంతో సర్కారు వెనక్కి తగ్గినట్టు సమాచారం. మరోవైపు సింగరేణి సంస్థలో రాష్ట్ర ప్రభుత్వానికి 51 శాతం, కేంద్రానికి 49 శాతం వాటాలుండడం, ఈఓఐ నిబంధనల ప్రకారం కేంద్ర ప్రభుత్వ అనుమతి తప్పనిసరి కావడంతోనూ బిడ్డింగ్‌కి దూరంగా ఉండిపోయినట్టు తెలుస్తోంది. కాగా బిడ్డింగ్‌లో పాల్గొనకపోవడానికి కారణాలను రాష్ట్ర ప్రభుత్వం/సింగరేణి యాజమాన్యం వెల్లడించలేదు.

స్టీల్‌ప్లాంట్ ఈఓఐకు 29 బిడ్లు

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ప్రతిపాదించిన ఆసక్తి వ్యక్తీకరణ (ఈఓఐ)ప్రక్రియ గడువు గురువారం ముగిసింది. మొత్తం 29 బిడ్లు దాఖలైనట్లు సమాచారం. మార్చి 27న బిడ్‌లు ఆహ్వానించగా తొలి గడువు ఏప్రిల్ 15 నాటికి 22 సంస్థలు బిడ్లు దాఖలు చేశాయి. మరికొన్ని సంస్థల విజ్ఞప్తి మేరకు గడువును ఈ నెల 20 వరకు పొడిగించారు.

'వైజాగ్ స్టీల్‌ప్లాంట్'పై కేసీఆర్ తోక ముడిచారు

- బిడ్డింగ్‌లోనే పాల్గొనలేదు.. కేసీఆర్‌ను చూసి దేశమంతా నవ్వుతోంది
- అమిత్ షా బహిరంగ సభ సన్నాహక సమావేశంలో బండి సంజయ్



సాక్షి, హైదరాబాద్: కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేవెళ్లలో ఈ నెల 23న నిర్వహించనున్న బహిరంగ సభ సన్నాహాలపై చర్చించేందుకు గురువారం రాత్రి మొయినాబాద్ సమీపంలోని అజీజ్‌నగర్‌లో స్థానిక లోక్‌సభ నియోజకవర్గ ముఖ్య నేతలతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకుంటామని కోతలు కోసిన కేసీఆర్ తోక ముడిచాడు. కనీసం ఆసక్తి వ్యక్తీకరణ (ఈవోఐ) బిడ్డింగ్‌లోనే పాల్గొనలేదు. చెప్పిన మాట ఒక్కటీ నిలబెట్టుకోని కోతల రాయుడు కేసీఆర్. సాగు చట్టాల రద్దు ఉద్యమంలో అమరులైన పంజాబ్ రైతు కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున గతంలో ఆయన ఇచ్చిన చెక్కులు బౌన్స్ అయ్యాయి. బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, రేయాన్ ఫ్యాక్టరీ, నిజాం షుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణ హామీలన్నీ కోతలేనని తేలిపోయింది. సొంత రాష్ట్రంలో ఇచ్చిన హామీలనే అమలు చేయనోడు వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను కాపాడతానంటే నమ్మేదెవరు? కేసీఆర్‌ను చూసి దేశమంతా నవ్వుకుంటోంది. ఇట్లాంటోడు సీఎంగా కొనసాగుతున్నందుకు తెలంగాణ ప్రజలు తలదించుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు.

అమిత్ షా సభను విజయవంతం చేయాలి...

అమిత్ షా సభకు 'విజయ సంకల్ప సభ'గా నామకరణం చేస్తున్నామని నేతలకు చెప్పారు. భారీగా జనసమీకరణ చేసి సభను విజయవంతం చేయాలని నేతలకు సంజయ్ సూచించారు. సమావేశానికి ఈటల రాజేందర్, ఎ.చంద్రశేఖర్, విశ్వేశ్వర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

ఆవిర్భావ దినోత్సవానికి బీఆర్‌ఎస్ సన్నాహాలు

27న తెలంగాణ భవన్‌లో కేసీఆర్ అధ్యక్షతన పార్టీ ప్రతినిధుల భేటీ

- వేసవి తీవ్రత దృష్ట్యా 300 మందికే ఆహ్వానాలు
- అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలపై దిశానిర్దేశం చేయనున్న కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: భారత్ రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని తెలంగాణ భవన్‌లో ఈ నెల 27న నిర్వహించేందుకు పార్టీ ఏర్పాట్లు ముమ్మరం చేసింది. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని పరిమిత సంఖ్యలోనే పార్టీ ప్రతినిధులను ఈ వేడుకకు ఆహ్వానించనుంది. బీఆర్‌ఎస్ జాతీయ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ అధ్యక్షతన జరిగే పార్టీ జనరల్ బాడీ సమావేశంలో 300 మంది (మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ కార్పొరేషన్లు, జెడ్పీ, మున్సిపల్ కార్పొరేషన్లు, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు, పార్టీ కార్యవర్గం, అనుబంధ సంఘాల అధ్యక్షులు) నేతలు పాల్గొననున్నారు. గతంలో జరిగిన జనరల్ బాడీ సమావేశానికి పార్టీ ప్రతినిధులను మౌఖికంగా ఆహ్వానించగా ఆవిర్భావ దినోత్సవానికి మాత్రం వ్యక్తిగతంగా అటు పార్టీ, ఇటు శాసనసభాపక్షం, పార్లమెంటరీ పార్టీ నుంచి ఆహ్వానపత్రాలు పంపుతున్నారు.



ఎల్బీ స్టేడియంలో సుమారు 6 వేల మంది ప్రతినిధులతో ఆవిర్భావ దినోత్సవం నిర్వహించాలని తొలుత భావించినా వరికోతలు ముమ్మరంగా సాగుతుండటం, వేసవి తీవ్రత పెరగడంతో పార్టీ జనరల్ బాడీ సమావేశాన్ని మాత్రమే నిర్వహించాలని నిర్ణయించారు.

ప్రస్తుత పరిణామాలపై ఐదు తీర్మానాలు...

బీఆర్‌ఎస్‌గా మారాక జరుగుతున్న తొలి ఆవిర్భావ దినోత్సవం కావడంతో ఏప్రిల్ 27న తెలంగాణ భవన్‌లో జరిగే జనరల్ బాడీ సమావేశంలో ఐదు రాజకీయ తీర్మానాలు ఉంటాయని పార్టీ వర్గాలు వెల్లడించాయి. జాతీయ, తెలంగాణలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై బీఆర్‌ఎస్ వైఖరిని వెల్లడించేందుకు వీలుగా ఐదు రాజకీయ తీర్మానాలు రూపుదిద్దుకుంటున్నట్లు సమాచారం. జాతీయ రాజకీయాల్లో బీఆర్‌ఎస్ పాత్ర, భావసారూప్య పార్టీలతో కలసి పనిచేయడం, కేంద్రంలోని అధికార బీజేపీ విధానాలను ఎండగట్టడం, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, రాష్ట్ర రాజకీయాల్లో బీఆర్‌ఎస్ పాత్ర తదితర అంశాలు ఈ రాజకీయ తీర్మానాల్లో ఉండనున్నాయి. పార్టీ ఆత్మీయ సమ్మేళనాల తీరుతెన్నులపై ఎమ్మెల్సీ మధుసూదనాచారి నేతృత్వంలోని కమిటీ ఎప్పటికప్పుడు పార్టీ అధినేతకు నివేదికలు అందిస్తోంది. ఆవిర్భావ దినోత్సవంలో ఆత్మీయ సమ్మేళనాల తీరుతెన్నులను విశ్లేషించడంతోపాటు యువజన, విద్యార్థి సమ్మేళనాల నిర్వహణపై దిశానిర్దేశం చేసే అవకాశముంది.

అక్టోబర్ 10న వరంగల్‌లో పార్టీ మహాసభ

ఈ ఏడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండటంతో కేడర్‌తోపాటు యువజన, విద్యార్థి, వివిధ సామాజిక వర్గాలతో భేటీకి ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించింది. అక్టోబర్ 10న వరంగల్‌లో పార్టీ మహాసభను నిర్వహించడంతోపాటు ఆ తర్వాత వరుసగా బహిరంగ సభల నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికలతోపాటు రాబోయే పార్లమెంటు ఎన్నికల సన్నద్ధతకు సంబంధించి 27న జరిగే ఆవిర్భావ సభలో దిశానిర్దేశం చేసే అవకాశముంది.

బీజేపీలో 'చేరికల' కాక!

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర పర్యటనకు వస్తున్న ప్రతీసారి చేరికలపై ఊహాగానాలు వెలువడుతున్నా అవి సాకారం కావడం లేదు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నుంచి చాలా మంది తమతో టచ్‌లో ఉన్నారని రాష్ట్ర నాయకులు తరచూ చెప్పడమే తప్ప.. ఆ మేరకు కార్యాచరణ ముందుకు పడలేదు. ఈ క్రమంలో చేరికలపై అమిత్‌షాకు ఏం చెప్పాలని ముఖ్యనేతల్లో ఆందోళన నెలకొన్నట్టు తెలిసింది.

సమన్వయం, విందు భేటీలపై..

గత నెలన్నర రోజుల్లో ఢిల్లీలో, హైదరాబాద్‌లో జరిగిన సమావేశాల్లో రాష్ట్ర పార్టీ ముఖ్యనేతల మధ్య సమన్వయం అవసరాన్ని, సమష్టిగా ముందుకు సాగాల్సిన ఆవశ్యకతను అమిత్‌షా నొక్కిచెప్పారు. వారం, రెండు వారాలకోసారి నేతల నివాసాల్లో అల్పాహారం, లంచ్, డిన్నర్ వంటివి ఏర్పాటు చేసుకోవాలని.. అంతా కలుసుకుని, ఆలోచనలు పంచుకోవాలని, సమన్వయం పెంచుకోవాలని సూచించారు. ఇది కూడా అమలైన దాఖలాలు లేవు. ఈ విషయంలో అమిత్‌షా ప్రశ్నిస్తే ఏమని చెప్పాలనే తర్జనభర్జన రాష్ట్ర నేతల్లో కనిపిస్తోందని పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

బూత్ కమిటీల నియామకాలపై..

రాష్ట్రంలోని అన్ని లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల పరిధిలో పోలింగ్ బూత్ కమిటీలను నియమించాలని బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా, అమిత్‌షా ఇంతకుముందే ఆదేశించారు. ఈ అంశంలో రాష్ట్ర సంస్థాగత ఇన్‌చార్జి సునీల్ బన్సల్ వరుస సమీక్షలతో రాష్ట్ర నేతల వెంటపడుతున్నారు. అయినా కొన్ని నియోజకవర్గాల్లో ఈ ప్రక్రియ ఇంకా పూర్తికాలేదు. అసలు అమిత్‌షా సభ జరగనున్న చేవెళ్ల లోక్‌సభ స్థానం పరిధిలోని చేవెళ్ల, పరిగి అసెంబ్లీ నియోజకవర్గాల్లో బూత్ కమిటీల నియామకం పూర్తి కాలేదు. అంతేగాకుండా ఈ అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీకి బలమైన నేతలు కూడా లేరు. సమీక్ష సందర్భంగా ఈ అంశంపై అమిత్‌షాకు ఎలా సమాధానం చెప్పాలన్న దానిపై పార్టీ నాయకులు మీమాంసలో పడినట్టు తెలిసింది. ఒక దశలో చేవెళ్లలో అమిత్‌షా సభ వద్దని స్థానిక నేతలు పట్టుబట్టినట్టు సమాచారం. కానీ పార్టీ పెద్దల ఆదేశాలతో ప్రవాసీ యోజన, సభకు ఏర్పాట్లు మొదలుపెట్టినట్టు తెలిసింది. చేవెళ్ల సభను విజయవంతం చేసి అమిత్‌షా మెప్పు పొందాలని భావిస్తున్నట్టు సమాచారం.

సభ తర్వాత విస్తృత సమీక్ష

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో అన్నీ తానై పార్టీని ముందుండి నడిపిస్తున్న అమిత్‌షా ఆదివారం హైదరాబాద్‌కు రానున్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి నేరుగా చేవెళ్లకు చేరుకుని 'పార్లమెంట్ ప్రవాసీ యోజన' కార్యక్రమం, సభలో పాల్గొంటారు. తర్వాత హైదరాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌కు చేరుకుని.. బీజేపీ రాష్ట్ర కోర్ కమిటీ, ఇతర ముఖ్య నేతలతో విస్తృతంగా సమీక్షించనున్నారు. పార్టీపరంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలు, వాటిద్వారా ప్రజలకు ఏమేరకు చేరువయ్యారు? పోలింగ్ బూత్ కమిటీల నియామకం, శక్తి కేంద్రాల ఏర్పాటు (3, 4 బూత్‌లు కలిపి ఒకటి), సంస్థాగతంగా వివిధ కమిటీల ఏర్పాటు తదితర అంశాలపై చర్చించనున్నారు.



రాజకీయంగానూ హీట్

అమిత్‌షా తెలంగాణ పర్యటన అటు రాష్ట్ర రాజకీయాల్లో హీట్ పెంచబోతోంది. అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ అధికార బీఆర్‌ఎస్‌తోపాటు బీజేపీ, కాంగ్రెస్, ఇతర చిన్న పార్టీలు దూకుడు పెంచాయి. ఇలాంటి సమయంలో 23న చేవెళ్ల సభలో అమిత్‌షా ఏం మాట్లాడుతారన్నది ఆసక్తిగా మారింది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లను సవాల్ చేస్తూ.. బీజేపీ తరఫున ఎన్నికల ప్రచార శంఖారావాన్ని పూరించేలా ఈ సభ ఉండొచ్చని బీజేపీ వర్గాలు చెప్తున్నాయి.


పేర్లు వినిపిస్తున్నా.. చేరికలేవి?

బీఆర్‌ఎస్‌పై విమర్శలు గుప్పిస్తూ, ఖమ్మం జిల్లాలో ఆత్మీయ సమ్మేళనాలతో రాష్ట్ర రాజకీయాల్లో వేడి పుట్టించిన పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.. బీఆర్‌ఎస్‌ను ధిక్కరించి మాట్లాడుతూ పార్టీ నుంచి సస్పెండైన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ముఖ్య నేత జూపల్లి కృష్ణారావు.. ఈ ఇద్దరిని చేర్చుకోవడానికి అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నాయి. అయితే కేంద్రంలో అధికారంలో ఉండి, రాష్ట్రంలోనూ గెలుస్తామంటున్న బీజేపీలో చేరికపై వారు ఎలాంటి సంకేతాలు ఇవ్వలేదు. ఈ విషయంలో బీజేపీ నేతలు వెనుకబడ్డారేమోనన్న అభిప్రాయం పార్టీ వర్గాల్లోనే వ్యక్తమవుతోంది. అమిత్‌షా చేవెళ్ల సభ సందర్భంగా వారిని బీజేపీలో చేర్చుకుని ఉంటే.. పార్టీకి ఊపు వచ్చేదని అంటున్నారు. మరోవైపు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ముఖ్యనేత, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి తాను బీఆర్‌ఎస్‌ను వీడి వేరే పార్టీలో చేరనున్నట్టు జరుగుతున్న ప్రచారాన్ని గురువారం ఖండించారు. బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతానని ప్రకటించారు.

సర్కారు నుంచి సబ్సిడీ రాబట్టాలి

డిస్కమ్‌లకు కేంద్రం స్పష్టీకరణ

- ఆ కేటగిరీ వినియోగదారుల వాస్తవ వినియోగం ఆధారంగా బిల్లులు తయారు చేయాలి
- 21 రోజుల్లోగా రాష్ట్రాలు అభిప్రాయాలు తెలియజేయాలి
- ముసాయిదా విద్యుత్ సవరణ నిబంధనలు–2023 విడుదల



సాక్షి, హైదరాబాద్: సబ్సిడీ కేటగిరీ విద్యుత్ వినియోగదారుల వాస్తవ వినియోగం ఆధారంగా బిల్లులు తయారు చేసి, ఆ మేరకు సబ్సిడీని ప్రభుత్వం నుంచి రాబట్టుకోవాలని విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కమ్)లకు కేంద్రం స్పష్టం చేసింది. ఈ మేరకు గురువారం ముసాయిదా విద్యుత్ సవరణ నిబంధనలు–2023ను విడుదల చేసింది. ఈ ముసాయిదాపై 21 రోజుల్లోగా అంటే.. మే 11వ తేదీలోగా అభిప్రాయాలు తెలియజేయాలని రాష్ట్రాలను కోరింది. తాజా సవరణల ప్రకారం'సబ్సిడీ కేటగిరీ వినియోగదారులు– వ్యవసాయ వినియోగదారులు ఏప్రిల్‌లో 250 యూనిట్లు వాడితే, దానికి తగ్గట్టుగా డిస్కమ్‌లోని క్షేత్రస్థాయి అధికారి లెక్క తేల్చి సబ్సిడీని రాబట్టుకోవాలి. లేనిపక్షంలో సంబంధిత అధికారిపై చర్యలు తీసుకోవాలి'అని కేంద్రం స్పష్టం చేసింది.

ప్రతి త్రైమాసికానికి ఈఆర్సీకి నివేదిక

'సబ్సిడీ వినియోగదారుల వాస్తవ వినియోగం, ఆ మేరకు ప్రభుత్వం నుంచి సబ్సిడీ అందడంపై ప్రతి త్రైమాసికానికి ఒక నివేదికను తయారు చేయాలి. ఏప్రిల్, మే, జూన్ తొలి త్రైమాసికానికి ఆగస్టు 15వ తేదీలోగా నివేదికను సిద్ధం చేసి, రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ)కి సమర్పించాలి.

రుణాల షరతులు అమలు చేయాలి

ఆర్‌ఈసీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్(పీఎఫ్సీ)) నుంచి రుణాలు తీసుకునే క్రమంలో డిస్కమ్‌లు వివిధ షరతులతో కూడిన ఒప్పందాలపై సంతకాలు చేస్తాయి. ఈ క్రమంలో పంపిణీ, సరఫరా, వాణిజ్య నష్టాలతో పాటు బిల్లింగ్ వసూళ్లలో కలిగే నష్టాలు) తగ్గించుకోవాలని షరతులు పెడితే.. అవి కచ్చితంగా అమలు చేయాలి. ఏటీ అండ్ సీ నష్టాలు తగ్గించుకునేలా చర్యలు తీసుకుని, టారిఫ్ ఆర్డర్‌లో వాటిని అమలు చేయాలి. ఆ ఆర్డర్‌తో మిగిలే నిధుల్లో సగం వినియోగదారులకు బదలాయించాలి..'అని కేంద్రం పేర్కొంది.

25లోగా బూత్ కమిటీలు పూర్తి చేయాలి

బీజేపీ రాష్ట్రనేతలకు తరుణ్‌ఛుగ్ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ఈ నెల 25లోగా పోలింగ్ బూత్ కమిటీల నియామకాలను పూర్తి చేయాలని బీజేపీ రాష్ట్ర నేతలను ఆ పార్టీ జాతీయ నేతలు తరుణ్ ఛుగ్, శివ ప్రకాశ్, అర్వింద్ మీనన్ ఆదేశించారు. గురువారం రాత్రి దాకా 10 ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జీలు, ఇతర నాయకులతో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేసినట్లు పార్టీ వర్గాల సమాచారం. 'బూత్ సశక్తికరణ్ అభియాన్'పైనే నేతల రాజకీయ భవితవ్యం ఆధారపడి ఉందని తరుణ్‌ఛుగ్ స్పష్టం చేశారు. ఈ విషయాన్ని కింది స్థాయి నాయకుల వరకు స్పష్టం చేసి ఆయా అంశాలను తూ.చ. తప్పకుండా పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ బూత్ కమిటీలను ఏర్పాటు చేసి జాబితాలు రూపొందించడంతోపాటు ఆయా కమిటీల్లోని వారి ఫోన్ల నుంచి మిస్డ్ కాల్ ఇవ్వాల్సిందేనని ఆదేశించారు. సరళ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయాలని సూచించారు. ఒక్కో పోలింగ్ బూత్‌లో కనీసం 11 మంది, గరిష్టంగా 31 మంది ఉండాలన్నారు. 11 మంది కమిటీ, 21 మంది ఓటర్ల జాబితాల్లోని ఒక్కో పేజీకి ఒక పన్నా ప్రముఖ్‌ల నియామకం చేపట్టాలన్నారు.

● సక్సెస్ స్టోరీ



అష్రఫ్

స్టార్టప్ స్టార్ట్ చేయగానే 'సక్సెస్' అందరి దగ్గరికీ రాకపోవచ్చు. చేదుఫలం మిగలవచ్చు. 'మన వల్ల కాదు' అని వచ్చిన దారినే వేగంగా వెళ్లే వాళ్లు కొందరైతే... 'ఎక్కడో ఏదో పొరపాటు జరిగింది. అదేమిటి?' అని లోతుగా విశ్లేషించుకునేవారు కొందరు. బిహార్‌లోని నలందా జిల్లాకు చెందిన అష్రఫ్ రెండో కోవకు చెందిన యువకుడు. బ్యాక్-టు-బ్యాక్ ఫెయిల్డ్ వెంచర్స్ నుంచి గుణపాఠాలు నేర్చుకొని 'జార్' అనే ఫిన్‌టెక్‌తో తిరుగులేని విజయం సాధించాడు...

జార్ స్టార్

మిస్‌బహ్ అష్రఫ్ తండ్రి టీచర్. ఆయనకు నెమ్మదిగా నడిచే అలవాటు ఉంది. ఒకరోజు తండ్రిని అడిగాడు...

'ఎందుకలా నెమ్మదిగా నడుస్తారు?' అని.

'వేగంగా నడిచి పడడం కంటే నెమ్మదిగా నడవడం మంచిదే కదా! ఉరుకులు పరుగులు లేకుండా నెమ్మదిగా ఉన్నప్పుడే తెలివైన ఆలోచనలు వస్తాయి' అని ఆయన సమాధానం ఇచ్చాడు.

చాలా సంవత్సరాలకు తండ్రి చెప్పిన మంచి మాటకు అష్రఫ్‌కు అర్థం తెలిసింది.

ఐఐటీ–దిల్లీ మిత్రులతో కలిసి 'సీబోల' అనే పేమెంట్ వెంచర్‌ని స్టార్ట్ చేశాడు అష్రఫ్. సంవత్సరం తిరగకుండానే 'ఇక సెలవా మరీ' అంటూ ఆ వెంచర్ మూతపడింది. మూతపడడానికి ఎన్నో కారణాలు ఉన్నా ప్రధాన కారణం మాత్రం కాలం కంటే ముందు ఉండడం. ఒక రకంగా చెప్పాలంటే తొందరపడి ఒక కోయిల ముందే కూసింది!

'మార్కెట్ తీరుతెన్నులు గమనించి జాగ్రత్తగానే వెంచర్ స్టార్ట్ చేశాము. అయితే స్పీడ్ ఆఫ్ చేంజ్ అంచనా వేయడంలో పొరపాటు జరిగింది' అని గతాన్ని గుర్తు చేసుకున్నాడు అష్రఫ్.

నాలుగు సంవత్సరాల విరామం తరువాత...

రెండో వెంచర్ స్టార్ట్ చేశాడు.

ఫ్యాషన్ అండ్ బ్యూటీకి సంబంధించి ఈ కమ్యూనిటీ కామర్స్ ప్లాట్‌ఫామ్ సక్సెస్‌కు దగ్గరలో ఉన్నప్పుడు కరోనా కోరలు తెరిచింది. డబ్బులకు ఇబ్బంది పడే పరిస్థితులలో ఈ కంపెనీని అమ్మకతప్పలేదు.

> కారణమంతా కరోనా మీద నెట్టకుండా ఈ ఫెయిల్యూర్‌ని కూడా లోతుగా విశ్లేషించుకున్నాడు అష్రఫ్. బ్యాక్–టు–బ్యాక్ ఫెయిల్డ్ వెంచర్స్ నుంచి ఎన్నో గుణపాఠాలు నేర్చుకున్నాడు.

కారణమంతా కరోనా మీద నెట్టకుండా ఈ ఫెయిల్యూర్‌ని కూడా లోతుగా విశ్లేషించుకున్నాడు అష్రఫ్.

బ్యాక్–టు–బ్యాక్ ఫెయిల్డ్ వెంచర్స్ నుంచి ఎన్నో గుణపాఠాలు నేర్చుకున్నాడు.

పరుగెత్తి పాలు తాగడం కంటే నిలబడి నీళ్లు తాగడమే బెటర్ అనుకున్నాడు.

కొంత విరామం తరువాత...

ఏజీ మిష్‌రెతో కలిసి 'జార్' అనే వెంచర్ స్టార్ట్ చేశాడు. యూజర్స్‌కు సేవ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ విషయంలో సహాయపడే ఈ ప్రాడక్ట్ తిరుగులేని సక్సెస్ అయింది. పద్దెనిమిది నెలల వ్యవధిలో పదకొండు మిలియన్‌ల యూజర్‌ల స్థాయికి చేరింది.

రోజుకు వేల సంఖ్యలో ట్రాన్సాక్షన్‌లు జరిగేవి. టైగర్ గ్లోబల్, రాకెట్‌షిప్, ఆర్కమ్ వెంచర్స్ లాంటి పెద్ద సంస్థలు 'జార్'కు ఫండింగ్ చేశాయి.

చాలామందికి ఇన్వెస్ట్ చేయాలని ఉంటుంది. అయితే ఎలా మొదలుపెట్టాలో తెలియదు. ఈలోపు రకరకాల సందేహాలు చుట్టుముడుతాయి. పెట్టుబడి గురించి ఆలోచిస్తున్నప్పుడు వందల సంఖ్యలో ఆప్షన్‌లు ముందుకు వచ్చి గందరగోళానికి గురిచేస్తుంటాయి.

ఆ గందరగోళం తప్పించి సేవ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ విషయంలో పారదర్శకమైన దారిని ఏర్పాటు చేయడంలో 'జార్' విజయం సాధించింది.

'అపజయం అనేది అంతిమం కాదు. అది నీ అడుగుల్లో ఒకటి మాత్రమే. ఇంకా ఎన్నో అడుగులు మిగిలే ఉన్నాయి' అనే సత్యాన్ని 'జార్' విజయం యువతరానికి చెప్పకనే చెప్పింది.

'ఆర్థిక ఇబ్బందులు ఉండే మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చాను. ఎందుకు రిస్క్ చేస్తున్నావు? చక్కగా ఏదో ఒక ఉద్యోగం చేసుకోవచ్చు కదా. స్టార్టప్‌లలో ఏ కొద్దిమందో సక్సెస్ అవుతారో... ఇలాంటి మాటలను ఎన్నోసార్లు విన్నాను. అయితే ఎప్పుడూ వెనకడుగు వేయాలనిపించలేదు. సక్సెస్ అయిన వాళ్లకు వరాలు ఇచ్చే అద్భుత దీపాలేవీ దొరకలేదు. వాళ్లు నాలాంటి వాళ్లే. వాళ్లు సక్సెస్ అయినప్పుడు నేనెందుకు కాలేను అని సీరియస్‌గా ఆలోచించాను. నా నమ్మకం వృథా పోలేదు. జార్ ద్వారా ఈతరంలో పొదుపు అలవాటు పెరిగేలా కృషి చేస్తాం' అంటున్నాడు 29 సంవత్సరాల అష్రఫ్.

● ఇంగ్లిష్ ఇడియమ్



సాట్ ఆన్ ది ఫెన్స్

ఏదీ నిర్ణయించుకోలేని, ఎటు వైపు మొగ్గుచూపని పరిస్థితుల్లో ఉపయోగిస్తారు.

కమ్ రెయిన్ ఆర్ షైన్

'ఎలాంటి పరిస్థితులలో అయినా జరిగితీరుతుంది' అని చెప్పే సందర్భంలో ఉపయోగిస్తారు.

ఉదా: ఐ విల్ బి ఎట్ యువర్ ఫుట్‌బాల్‌గేమ్. కమ్ రెయిన్ ఆర్ షైన్

జంప్ ఆన్ ది బ్యాండ్‌వ్యాగన్

పాపులర్ ట్రెండ్‌లో భాగం అయ్యే సందర్భంలో ఉపయోగించే మాట.

యాజ్ రైట్ యాజ్ రెయిన్

'పర్‌ఫెక్ట్' అని చెప్పే సందర్భంలో ఉపయోగిస్తారు.

యువర్స్

సాంగ్ ఈటర్

● మ్యూజిక్ వరల్డ్



దావనీ భానుశాలి

పాప్ ఆర్టిస్ట్‌గా దేశ, విదేశాల్లో గుర్తింపు పొందింది దావనీ భానుశాలీ. ఆమె పాట 'వాస్తే'కు యూట్యూబ్‌లో 'బిలియన్' వ్యూస్ వచ్చాయి. మరో విశేషం తన రెండో పాట 'దిల్బార్' ఒకే రోజులో 25 మిలియన్‌ల వ్యూస్ సొంతం చేసుకుంది. పాప్, హిప్–హప్, రాక్... జానర్ ఏదైనా తనదైన గాన ప్రతిభతో ప్రేక్షకులను మెప్పిస్తోంది 25 సంవత్సరాల దావనీ భానుశాలీ.

చిన్న వయసులోనే సంగీతానికి దగ్గరైన దావనీని ఉపాధ్యాయులు ప్రోత్సహించి ఉత్సాహపరిచేవారు.


శాస్త్రీయ సంగీతం నేర్చుకున్న దావనీ వారి నుంచి నైపుణ్యాలను నేర్చుకోవడమే కాదు, వారిలోని అంకిత భావంతో స్ఫూర్తి పొందింది.

దావనికి పాటలు ఎంత ఇష్టమంటే, తనను తాను 'సాంగ్ ఈటర్'గా పిలుచుకుంటుంది. చిన్న వయసులోనే సింగర్‌గా పెద్ద సక్సెస్‌ను చూసిన దావనీ భానుశాలీ ఇలా అంటోంది...

'సక్సెస్‌ను సరదాగా ఎంజాయ్ చేయాలేగానీ సీరియస్‌గా తలకెక్కించుకుంటే ముందుకు అడుగు వేయలేము. ఇక ఔత్సాహిక గాయకుల విషయానికి వస్తే ఇతరుల నుంచి స్ఫూర్తి మాత్రమే పొందాలి. పాటపై మనదైన సంతకాన్ని ఎప్పుడూ మరచిపోవద్దు' అంటుంది.


● ఆర్ట్ అండ్ కల్చర్

అయ్‌బాబోయ్... ఇలా అయిపోనదేటీ!



ఆస్ట్రియన్ కార్టూనిస్ట్ క్లాస్ పీటర్ గీసిన కార్టూన్ ఇది. 74 సంవత్సరాల పీటర్ కార్టూన్ చిత్రాలు యూరప్‌లో ఎన్నో చోట్ల ప్రదర్శించబడ్డాయి. గ్రాఫిక్ డిజైన్‌లో మాస్టర్స్ డిగ్రీ చేసిన పీటర్ పిల్లల కోసం ఎన్నో కామిక్‌బుక్స్ రూపొందించాడు. తన కళాయాత్రలో భాగంగా రెండు సంవత్సరాల క్రితం మన దేశానికి వచ్చాడు పీటర్. అతడి చిత్రప్రదర్శన కూడా జరిగింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఆర్‌కె లక్ష్మణ్ నుంచి యువ ఆర్టిస్‌ల వరకు ఆయనకు ఎంతోమంది సుపరిచితమే.

టెక్.. టాక్



అసూస్ రోగ్ ఫోన్ 7

డిస్‌ప్లే: 6.78 అంగుళాలు
రిజల్యూషన్: 1080×2448 పిక్సెల్స్; మెమోరీ: 512 జీబి 16 జీబి ర్యామ్ బ్యాటరీ: 6000 ఎంఏహెచ్; బరువు: 239 గ్రా.

- ఫింగర్‌ప్రింట్ రీడర్
- స్టీరియో స్పీకర్స్
- వోఎస్: ఆండ్రాయిడ్ 13



షావోమి బ్యాండ్ 8

ఫ్యాషన్ యాక్సెసరీగా ఆకట్టుకునే షావోమి బ్యాండ్‌లో ఉపయోగపడే ఫీచర్‌లు కూడా ఉన్నాయి. దీన్ని రెండు వైపులా ధరించవచ్చు. డిఫరెంట్ స్టైలిష్ స్ట్రాప్స్ ఉన్న ఈ బ్యాండ్‌ను నెక్లెస్‌లా మెడలో కూడా వేసుకోవచ్చు.

- ఇన్‌బిల్ట్ జీపిఎస్
- ఆల్ డే–హార్ట్ ట్రాకింగ్ ఫీచర్స్, స్లీప్ ట్రాకింగ్, స్ట్రెస్ మానిటరింగ్, బ్లడ్ ఆక్సిజన్ మానిటరింగ్... మొదలైన యాక్టివేట్ ఫీచర్స్ ఉన్నాయి.

మెటా యానిమేషన్ టూల్

మనం గీసిన బొమ్మలు, డూడుల్స్‌ను మెటా వారి 'యానిమేషన్ డ్రాయింగ్' టూల్‌తో యానిమేట్ చేయవచ్చు. ఎలా అంటే ఇలా...

- స్కెచ్.మెటాడెమోల్యాబ్.కామ్ లోకి వెళ్లాలి.
- యానిమేట్ చేయాలనుకున్న ఇమేజ్‌లను అప్‌లోడ్ చేయాలి.
- అప్‌లోడ్ చేసిన తరువాత 'అప్‌లోడ్ ఫొటో' బటన్ నొక్కాలి.
- డ్రాయింగ్స్‌ను మెరుగుదిద్దడానికి పెన్ అండ్ ఎరేజర్ సదుపాయం ఉంది.
- వాకింగ్, డ్యాన్స్, జంపింగ్, ఫన్నీ అనే నాలుగు రకాల యానిమేషన్స్ ప్రీసెట్స్, ఎన్నో రకాల యాక్షన్స్ ఉన్నాయి.





'రీల్స్' కోసం కొత్త ఫీచర్

ఫొటో షేరింగ్ అప్లికేషన్ ఇన్‌స్టాగ్రామ్ తన 'రీల్స్' కోసం ఎక్సైటింగ్ ఫీచర్స్‌ను తీసుకురానుంది. అందులో ఒకటి... డెస్టినేషన్. ఈ ఫీచర్ సహాయంతో రీల్స్‌లో టాప్ ట్రెండింగ్ సాంగ్స్ చూడవచ్చు. సింగిల్ స్క్రీన్‌లో వీడియో క్లిప్‌లు, స్టిక్కర్లు, ఆడియో వీడియోలు ఎడిటింగ్ చేసుకోవచ్చు. 'రీల్స్'ను సులభంగా ఎడిట్ చేయవచ్చు. ప్రస్తుతం ఇది ఐవోఎస్, ఆండ్రాయిడ్ యూజర్‌లకు అందుబాటులో ఉంది. 'రీల్స్' ఇన్‌సైట్స్‌ను మెరుగుపరచడానికి రెండు మెట్రిక్‌లను జత చేశారు. టోటల్ వాచ్‌టైమ్, యావరేజ్ వాచ్ టైమ్‌లను సులభంగా తెలుసుకోవచ్చు.

సినిమా

గౌరవంగా భావిస్తున్నా

- సమంత



● సమంత, హాలీవుడ్ యాక్టర్ స్టాన్లీ టుచీ

''లండన్‌లో ఇటీవల జరిగిన 'సిటాడెల్' వరల్డ్ ప్రీమియర్‌కి హాజరవడం గౌరవంగా భావిస్తున్నాను. ఈ ఈవెంట్‌లో హాలీవుడ్ స్టార్స్‌ని కలవడం ఆనందంగా ఉంది'' అని సమంత అన్నారు. ప్రియాంకా చోప్రా, రిచర్డ్ మాడాన్ కీలక పాత్రల్లో నటించిన హాలీవుడ్ వెబ్ సిరీస్ 'సిటాడెల్'. రూసో బ్రదర్స్ సృష్టించిన ఈ ఫిక్షన్ డ్రామా సిరీస్ ఈ నెల 28నుంచి అమెజాన్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా ఈ నెల 18న లండన్‌లో 'సిటాడెల్' ప్రీమియర్ షో వేశారు. ఈ ప్రీమియర్‌కి ప్రియాంకా చోప్రా, రిచర్డ్ మాడాన్‌తో పాటు 'సిటాడెల్' ఇండియన్ వెర్షన్ (బాలీవుడ్) సిరీస్‌లో నటిస్తున్న సమంత, వరుణ్ ధావన్, దర్శకులు రాజ్–డీకే హాజరయ్యారు. బ్లాక్ డ్రెస్‌లో ట్రెండీ లుక్‌లో తళుక్కున మెరిసిన సమంత ఆ ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ''రూసో బ్రదర్స్ విజన్‌కి వెన్నుదన్నుగా నిలిచిన అమెజాన్‌కి థ్యాంక్స్. భారతీయ వెర్షన్‌ని త్వరలో మీ ముందుకు తీసుకురావడానికి ఆసక్తిగా ఉన్నాం. 'సిటాడెల్' ఇండియన్ వెర్షన్‌లో నటించడం సంతోషంగా ఉంది. ఆరోగ్యపరంగా కాస్త ఇబ్బందులు ఉన్నా ఈ షూటింగ్‌లో పాల్గొనడం హ్యాపీ. ఇందులో చాలా ఇంటెన్స్ యాక్షన్ సీన్స్ ఉన్నాయి. ఇప్పటికే కొంత షూటింగ్ చేశాం. త్వరగా పూర్తి చేసి ఈ సిరీస్‌ని ప్రపంచానికి చూపించేందుకు సంతోషంగా ఎదురు చూస్తున్నాను. నాతో ఓపికగా, దయతో వ్యవహరిస్తున్న యూనిట్‌కి ధన్యవాదాలు'' అని సమంత పోస్ట్ చేశారు.

శ్రీవిష్ణు హీరోగా 'వివాహ భోజనంబు' ఫేమ్ రామ్ అబ్బరాజు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'సామజవరగమన'. రెబా మోనికా జాన్ హీరోయిన్. అనిల్ సుంకర సమర్పణలో ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి హాస్య మూవీస్‌పై రాజేష్ దండా నిర్మిస్తున్న ఈ చిత్రం మే 18న విడుదల కానుంది. గోపీ సుందర్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని తొలి పాట 'వాట్ టు డూ..' ని రిలీజ్ చేసి, మ్యూజికల్ జర్నీని స్టార్ట్ చేశారు మేకర్స్. శ్రీమణి సాహిత్యం

ఏం చేయాలి?

అందించిన ఈ పాటను జెస్సీ గిఫ్ట్ పాడారు. ''పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'సామజవరగమన'. ఇప్పటికే విడుదలైన మా సినిమా ఫస్ట్ గ్లింప్స్‌కి అద్భుత స్పందన వచ్చింది. తనలోని ఫ్రస్ట్రేషన్‌ని చెబుతూ కథానాయకుడు పాడుకునే 'వాట్ టు డూ..' (ఏం చేయాలి?) పాటలో శ్రీవిష్ణు చేసిన మాస్ మూమెంట్స్ ప్రేక్షకుల్ని అలరిస్తాయి'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సహనిర్మాత: బాలాజీ గుత్తా, కెమెరా: రాంరెడ్డి.



● శ్రీ విష్ణు

చిత్ర పరిశ్రమ సమస్యలను పరిష్కరిస్తాం

- కేంద్ర మంత్రి అనురాగ్ సింగ్ ఠాగూర్



● చిరంజీవి అవార్డును అందుకుంటున్న సుహాసిని

''చిత్ర పరిశ్రమకు చెందిన చిన్న చిన్న సమస్యలను ఈ వేదికపై చెప్పారు. వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటాం. పైరసీని అరికట్టే విధంగా నూతన చట్టాన్ని తీసుకొచ్చాం. అదే విధంగా జీఎస్టీ విషయంలో ఒకే పన్ను విధానాన్ని చట్టం చేసే ప్రయత్నం చేస్తున్నాం. చిత్ర పరిశ్రమ సమస్యలను పరిష్కరిస్తాం'' అని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అనురాగ్ సింగ్ ఠాగూర్ అన్నారు. సీఐఐ దక్షిణ్ సమ్మిట్ ముగింపు కార్యక్రమం గురువారం సాయంత్రం చెన్నైలోజరిగింది. సీఐఐ చైర్మన్ టీజీ త్యాగరాజన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఫెప్సీ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి, నటుడు ధనుష్, నటి శోభన, కమల్‌బాలి తదితరులు పాల్గొన్నారు. ఇందులో ముఖ్య అతిథిగా కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అనురాగ్ సింగ్ ఠాగూర్ పాల్గొన్నారు. కాగా సీఐఐ దక్షిణ్ నిర్వాహకులు చిరంజీవికి ఐకాన్ అవార్డును, తమిళ నటుడు ధనుష్‌కు యూత్ ఐకాన్ అవార్డును ప్రకటించారు. చిరంజీవి హాజరు కాకపోవడంతో ఆయన అవార్డును సుహాసిని అందుకున్నారు. ఈ వేడుకలో పాల్గొనలేకపోయినందుకు క్షమాపణ తెలుపుతూ చిరంజీవి వీడియోను షేర్ చేశారు.

కమల్‌కు జోడీ?

విలక్షణ నటుడు కమల్‌హాసన్‌కి జోడీగా దక్షిణాది స్టార్ హీరోయిన్స్‌లో ఒకరైన నయనతార నటించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి కోలీవుడ్ వర్గాలు. ప్రస్తుతం శంకర్ దర్శకత్వం వహిస్తున్న 'ఇండియన్ 2' సినిమాతో బిజీగా ఉన్న కమల్‌హాసన్ ఆ తర్వాతి చిత్రాన్ని ప్రముఖ దర్శకుడు మణిరత్నంతో చేయనున్నారు. మణిరత్నం–కమల్ కాంబినేషన్‌లో వచ్చిన తొలి చిత్రం 'నాయగన్' 1987 అక్టోబర్ 21న విడుదలై, మంచి హిట్‌గా నిలిచింది. దాదాపు 36 ఏళ్ల తర్వాత వీరి కాంబినేషన్ రిపీట్ అవుతోంది. ఈ చిత్రానికి 'కేహెచ్ 234' అనే వర్కింగ్ టైటిల్ నిర్ణయించారు. ప్రీ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ చిత్రంలో హీరోయిన్‌గా తొలుత త్రిష పేరు వినిపించింది. 'మన్మథన్ అంబు', 'తూంగావనం' చిత్రాల తర్వాత కమల్–త్రిష ముచ్చటగా మూడోసారి 'కేహెచ్ 234' కోసం పని చేయనున్నారంటూ తమిళ చిత్ర సీమలో వార్తలొచ్చాయి. తాజాగా నయనతార పేరు తెరపైకి వచ్చింది. కథానాయిక పాత్ర కోసం ఆమెతో చర్చలు జరుపుతున్నారట మేకర్స్. చర్చలు సఫలమైతే కమల్‌తో నయనతార నటించే తొలి చిత్రం ఇదే అవుతుంది. మరి 'కేహెచ్ 234'లో కమల్‌తో నటించే అవకాశం త్రిష, నయనతారలో ఎవర్ని వరిస్తుంది? వీరిద్దరూ కాకుండా వేరే కొత్త హీరోయిన్ తెరపైకి వస్తారా? అనే వివరాలు తెలియాలంటే వేచి చూడాలి. కాగా మణిరత్నం ప్రస్తుతం 'పొన్నియిన్ సెల్వన్ 2' ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నారు. ఈ నెల 28న ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ కానుంది. మరోవైపు కమల్‌హాసన్ కూడా 'ఇండియన్ 2' తో బిజీగా ఉన్నారు. ఇటీవల దక్షిణాఫ్రికా షెడ్యూల్‌ను పూర్తి చేసి, ఇండియాకి తిరిగొచ్చింది యూనిట్.



● నయనతార

హిట్ బోణీ

మంచి బోణీ కొట్టారు... ముగ్గురు దర్శకుల గురించి ఇటీవల వినిపిస్తున్న మాట ఇది. ఫస్ట్ హిట్ ఇచ్చిన ఆ ముగ్గురు దర్శకులు సెకండ్ హిట్ ఇచ్చే పని మీద కథ రెడీ చేసుకుంటున్నారు. ఈ ఏడాది (2023) ఆరంభంలో తొలి చిత్రంతోనే హిట్ బోణీ కొట్టారు దర్శకులు షణ్ముఖ ప్రశాంత్, వేణు ఎల్దండి, శ్రీకాంత్ ఓదెల. ఈ ముగ్గురి గురించి తెలుసుకుందాం.



● షణ్ముఖ ప్రశాంత్ ● వేణు ఎల్దండి ● శ్రీకాంత్ ఓదెల

షణ్ముఖ ప్రశాంత్

సినిమాపై ఉన్న ఇష్టంతో బీటెక్ పూర్తయిన తర్వాత హైదరాబాద్ వచ్చారు ప్రశాంత్. సొంతంగా రాసిన కథలతో షార్ట్ ఫిల్మ్స్ చేశారు. సుహాస్ నటించిన 'కలర్ ఫోటో' చిత్రంలో డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో కొద్ది రోజులు పని చేశారు. ఆ తర్వాత 'ఫ్యామిలీ డ్రామా' (సుహాస్ హీరో) చిత్రానికి రైటర్‌గా చేశారు. ఆ టైమ్‌లో 'రైటర్ పద్మభూషణ్' కథని సుహాస్‌కి చెప్పడం, ఆయనకి నచ్చడంతో సినిమా పట్టాలెక్కింది. సుహాస్, టీనా శిల్పరాజ్ జంటగా నటించిన 'రైటర్ పద్మభూషణ్' ఫిబ్రవరి 3న విడుదలైంది. ఎప్పటికైనా పెద్ద రచయిత కావాలనుకునే పద్మభూషణ్ కథని, ఓ మధ్య తరగతి కుటుంబంలోని ప్రేమ, ఆప్యాయతలు, ఇబ్బందుల్ని చక్కగా తెరపై ఆవిష్కరించారు షణ్ముఖ. ఈ సినిమా హిట్‌తో ప్రస్తుతం రెండు మూడు పెద్ద బ్యానర్ల నుంచి అవకాశాలు అందుకున్నారు. అతి త్వరలో తన తర్వాతి ప్రాజెక్టులపై అధికారిక ప్రకటన వస్తుందని పేర్కొన్నారు షణ్ముఖ ప్రశాంత్.

వేణు ఎల్దండి

వెండితెరపై కామెడీ పాత్రలతో మెప్పించిన వేణు ఎల్దండిలో ఓ సీరియస్ డైరెక్టర్ ఉంటాడని 'బలగం' సినిమా చూసేవరకూ ఎవరూ ఊహించి ఉండరు. నిర్మాత 'దిల్' రాజు ప్రొడక్షన్ హౌస్‌లో దర్శకునిగా తొలి అవకాశం అందుకుని 'బలగం' సినిమాతో అనూహ్య విజయం అందుకున్నారు వేణు. వెండితెరపై నవ్వులు పంచిన ఆయన 'బలగం'తో ప్రేక్షకులను ఏడిపించారు. ప్రియదర్శి, కావ్యా కల్యాణ్ రామ్ జంటగా నటించిన 'బలగం' సినిమా మార్చి 3న విడుదలైంది. ఎలాంటి అంచనాలు లేకుండా రిలీజైన ఈ చిత్రం కేవలం మౌత్ టాక్‌తో అద్భుతమైన విజయం సాధించి, బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను రాబట్టింది. కుటుంబ సమేతంగా ఈ చిత్రాన్ని చూసేందుకు జనాలు థియేటర్స్‌కి వచ్చారు. ఈ సినిమాలోని భావోద్వేగ సన్నివేశాలకు కంటతడి పెట్టని ప్రేక్షకులు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. తొలి మూవీతో మంచి బోణీ కొట్టిన వేణు ఎల్దండి తన తర్వాతి చిత్రాన్ని కూడా 'దిల్' రాజు బ్యానర్‌లోనే చేయనుండటం విశేషం.

శ్రీకాంత్ ఓదెల

కథ నచ్చితే చాలు కొత్త దర్శకులకు చాన్స్ ఇవ్వడంలో హీరో నాని ఎప్పుడూ ముందుంటారు. అలా ఆయన అవకాశం ఇచ్చిన దర్శకుల్లో శ్రీకాంత్ ఓదెల ఒకరు. తొలి చిత్రం 'దసరా'తో నాని వంటి హీరోతో పని చేసే అవకాశం అందుకుని, సూపర్ హిట్ అందుకున్నారు శ్రీకాంత్ ఓదెల. సుకుమార్ దర్శకత్వం వహించిన 'జగడం' చూసి, సినిమాలపై ఆసక్తి పెంచుకున్నారు శ్రీకాంత్. ఇంజినీరింగ్ పూర్తయ్యాక సుకుమార్ వద్ద సహాయ దర్శకుడిగా చేరేందుకు నాలుగేళ్లు కష్టపడ్డారు. 'నాన్నకు ప్రేమతో', 'రంగస్థలం' సినిమాలకి సుకుమార్ వద్ద దర్శకత్వ శాఖలో పని చేశాక 'దసరా' కథ రాసుకున్నారు. అది నానీకి నచ్చడంతో ఈ మూవీ పట్టాలెక్కింది. ఎమోషనల్ డ్రామా, స్నేహం నేపథ్యంలో తెరకెక్కిన 'దసరా' మార్చి 30న విడుదలై హిట్ అందుకుంది. నాని నటించిన తొలి పాన్ ఇండియా సినిమా 'దసరా'నే కావడం విశేషం. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు రాబట్టడంతో నిర్మాత సుధాకర్ చెరుకూరి ఖరీదైన ఓ లగ్జరీ కారుని శ్రీకాంత్ ఓదెలకి బహుమతిగా ఇవ్వడం విశేషం. తన తర్వాతి సినిమా కోసం రెండు మూడు కథలను సిద్ధం చేసుకున్నారు శ్రీకాంత్. ప్రస్తుతం ఆ ప్రాజెక్ట్స్ చర్చల దశలో ఉన్నాయి.

ఈ ఏడాది మూడు నెలలు ముగిశాయి.. 2023 ఇప్పటికి ముగ్గురు హిట్ డైరెక్టర్లను ఇచ్చింది. మరి ఈ ఏడాది ఇంకా ఎంతమంది కొత్త దర్శకులు వస్తారు? ఫస్ట్ హిట్‌తోనే టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా ఎవరు నిలుస్తారు? అనేది వేచి చూడాలి.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	66	59,632
నిఫ్టీ ▲	6	17,624

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి సెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	12,144	▽	12
డోజోన్స్	33,853	▽	44
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,903	▲	4
డాక్స్	15,776	▽	99
షాంఘై	3,367	▽	3
నికాయ్	28,658	▲	51

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై			
బంగారం (24 క్యారట్)	60,616	▲	695
బంగారం (22 క్యారట్)	60,373	▲	692
వెండి (కిలో)	75,419	▲	1,644

యాపిల్ ఢిల్లీ స్టోర్ ప్రారంభం



భారత్‌లో రెండోది

న్యూఢిల్లీ: అమెరికన్ టెక్ దిగ్గజం యాపిల్ తాజాగా ఢిల్లీలో తమ రిటైల్ స్టోర్‌ను గురువారం ప్రారంభించింది. భారత్‌లో యాపిల్‌కి ఇది రెండోది కాగా, ఢిల్లీలో మొదటిది. తొలి స్టోర్‌ను మంగళవారమే ముంబైలో ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఢిల్లీలోని సెలెక్ట్ సిటీవాక్ మాల్‌లో 'యాపిల్ సాకేత్' స్టోర్‌ను కంపెనీ సీఈవో టిమ్ కుక్ ప్రారంభించారు. ఇది ముంబై స్టోర్‌తో పోలిస్తే దాదాపు సగం ఉంటుంది. స్టోర్ విక్రయాల్లో నిర్దిష్ట భాగాన్ని లేదా నెలకు రూ. 40 లక్షలు (ఏది ఎక్కువైతే అది) అద్దె కింద కంపెనీ చెల్లించనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. సాకేత్ స్టోర్‌లో 18 రాష్ట్రాల నుంచి 70 మంది పైగా సుశిక్షితులైన సిబ్బంది ఉంటారు. వీరు 15 భాషల్లో సేవలు అందిస్తారు. భారత్‌లో తొలిసారిగా తమ స్టోర్స్‌ను ప్రారంభిస్తున్న సందర్భంగా దేశీయంగా పర్యటిస్తున్న టిమ్ కుక్ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులను కూడా కలిశారు. భారత్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు కట్టుబడి ఉన్నామని ఆయన తెలిపారు.

ఇక్కడ తమ కాంట్రాక్టు తయారీ సంస్థల్లో ఉద్యోగాలను రెట్టింపు స్థాయి (2 లక్షలకు) పెంచాలని యాపిల్ భావిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. విడిభాగాల సరఫరా సంస్థల సంఖ్యను పెంచుకునేందుకు ప్రభుత్వపరమైన తోడ్పాటు అందించాలని కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్‌లతో భేటీ సందర్భంగా కుక్ కోరినట్లు వివరించాయి. అలాగే, తయారీ కేంద్రాలు, బెంగళూరులో యాప్ డిజైన్, డెవలప్‌మెంట్ యాక్సిలరేటర్ తదితర అంశాలను కూడా చర్చించినట్లు పేర్కొన్నాయి.

హెచ్‌సీఎల్ టెక్ లాభం ప్లస్



- క్యూ4లో రూ. 3,983 కోట్లు
- రూ. లక్ష కోట్లను దాటిన ఆదాయం

న్యూఢిల్లీ: ఐటీ సేవల దేశీ దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 11 శాతం బలపడి రూ. 3,983 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2021–22) క్యూ4లో రూ. 3,599 కోట్లు ఆర్జించింది. అయితే త్రైమాసికవారీగా అంటే గతేడాది క్యూ3(అక్టోబర్–డిసెంబర్)లో సాధించిన రూ. 4,096 కోట్లతో పోలిస్తే నికర లాభం 3 శాతం తగ్గింది. కాగా.. ఈ క్యూ4లో మొత్తం ఆదాయం 18 శాతం ఎగసి రూ. 26,606 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాది క్యూ4లో రూ. 22,597 కోట్ల ఆదాయం నమోదైంది. ఇక మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం 10 శాతం మెరుగై రూ. 14,845 కోట్లను తాకింది. 2021–22లో రూ. 13,499 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. లక్ష కోట్లను దాటి రూ. 1,01,456 కోట్లకు చేరింది! అంతక్రితం ఏడాది రూ. 85,651 కోట్ల ఆదాయం అందుకుంది.

భారీ డీల్స్ అప్

క్యూ4లో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 13 భారీ డీల్స్ గెలుచుకుంది. వీటి విలువ 207.4 కోట్ల డాలర్లుకాగా.. వార్షికంగా 18 శాతం క్షీణించింది. ఈ కాలంలో కంపెనీ 3,674 మంది ఉద్యోగులను కొత్తగా నియమించుకుంది. దీంతో మొత్తం సిబ్బంది సంఖ్య 2,25,944కు చేరింది. ఉద్యోగ వలసల(అట్రిషన్) రేటు 19.5 శాతంగా నమోదైంది. డీల్ పైప్‌లైన్ దాదాపు కంపెనీ చరిత్రలోనే గరిష్టస్థాయికి చేరినట్లు కంపెనీ సీఈవో విజయ్‌కుమార్ పేర్కొన్నారు.

గైడెన్స్ గుడ్

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24)లో ఆదాయం 6–8 శాతం వృద్ధి చెందగలదని హెచ్‌సీఎల్ టెక్ తాజాగా అంచనా(గైడెన్స్) వేసింది. వాటాదారులకు షేరుకి రూ. 18 చొప్పున డివిడెండును ప్రకటించింది. వరుసగా 81వ త్రైమాసికంలోనూ డివిడెండును చెల్లిస్తున్నట్లు తెలియజేసింది.

ఫలితాల నేపథ్యంలో హెచ్‌సీఎల్ టెక్ షేరు నామమాత్ర నష్టంతో రూ. 1,037 వద్ద ముగిసింది.

టీటీకే ప్రెస్టీజ్ ఎనీథింగ్ ఫర్ ఎనీథింగ్ ఎక్స్ఛేంజీ ఆఫర్



ముంబై: వంటగది ఉపకరణాల తయారీ సంస్థ టీటీకే ప్రెస్టీజ్ 'ఎనీథింగ్ ఫర్ ఎనీథింగ్' ఎక్స్ఛేంజ్ ఆఫర్‌ను మళ్లీ అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రెస్టీజ్ ఉత్పత్తుల ధరపై 24–66% వరకు తగ్గింపుతో ఈ ఆకర్షణీయమైన ఎక్స్ఛేంజీ ఆఫర్‌ను పొందేందుకు కస్టమర్లు తమ పాత వంట సామాగ్రిని తీసుకొచ్చి వాటిని మార్పిడి చేసుకోవచ్చు. ఇప్పటికే ప్రారంభమైన ఈ అద్భుతమైన ఆఫర్ జూన్ 30 వరకు కొనసాగుతుంది. ''మా కస్టమర్లు బ్రాండ్‌కు విధేయులు. ఈ బంపర్ ఆఫర్ ద్వారా వారితో బంధాన్ని బలోపేతం చేసుకునేందుకు ఆకర్షణీయమైన డీల్స్‌లో అత్యుత్తమ ఉత్పత్తులు అందిస్తున్నాము'' అని కంపెనీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ దినేష్ గార్గ్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

21-4-2023	
విశాఖ	375–00
చిత్తూరు	408–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	345–00
విజయవాడ	345–00
రిటైల్ ధర (డజను)	60.00
20-4-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	353–00
వరంగల్	355–00
రిటైల్ ధర	4.10

'అక్షయ'కు పుత్తడి మెరిసేనా?

- అమ్మకాలపై అధిక ధరల ప్రభావం
- అక్షయ విక్రయాల్లో క్షీణతకు చాన్స్



ముంబై: ఈ అక్షయకు పుత్తడి వెలుగులు విరజిమ్మేనా? ప్రస్తుత ధరలు అమ్మకాలను ప్రభావితం చేస్తాయా? అవుననే అంటున్నాయి పరిశ్రమ వర్గాలు. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే పరిమాణం పరంగా విక్రయాలు 20 శాతం తగ్గే అవకాశం ఉందని చెబుతున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్ మార్కెట్లో గురువారం 10 గ్రాముల పుత్తడి ధర 24 క్యారెట్లు రూ.60,930, అలాగే 22 క్యారెట్లు అయితే రూ.55,850 పలికింది. 'ఇటీవల 10 గ్రాములకు రూ.60 వేలు దాటడంతో వినియోగదార్లు పుత్తడి కొనుగోలు చేయకుండా జాగ్రత్త పడుతున్నారు. ఆ తర్వాత ధర స్వల్పంగా తగ్గినప్పటికీ.. ధరలు మాత్రం బుల్లిష్‌గానే ఉన్నాయి. విలువైన లోహాలను కొనుగోలు చేయడం శుభప్రదంగా భావించే అక్షయ తృతీయ సమయంలో ఇది అమ్మకాలపై ప్రభావం చూపుతుంది' అని ఆల్ ఇండియా జెమ్, జ్యువెల్లరీ డొమెస్టిక్ కౌన్సిల్ (జీజేసీ) చైర్మన్ సైయమ్ మెహ్రా తెలిపారు. ఈ ఏడాది అక్షయ తృతీయ ఏప్రిల్ 22న వస్తోంది.

దక్షిణాది వాటాయే అధికం..

అక్షయ విక్రయాల్లో దక్షిణాది రాష్ట్రాల వాటా ఏకంగా 40 శాతం ఉంది. పశ్చిమ భారత్ 25 శాతం, తూర్పు 20, ఉత్తరాది రాష్ట్రాలు 15 శాతం వాటా కైవసం చేసుకున్నాయి. ధరలు అధికంగా ఉండడం డిమాండ్‌పై ప్రభావం చూపనుందని జీజేసీ మాజీ చైర్మన్, ఎస్‌ఏపీ జ్యువెల్లర్స్ ఎండీ అనంత పద్మనాభన్ తెలిపారు. ధరలు పెరిగిన ప్రభావం ఇప్పటికే కనపడుతోంది. 2022తో పోలిస్తే విలువ పరంగా అక్షయ అమ్మకాల్లో ఈ ఏడాది 10 శాతం తగ్గుదల నమోదు కావొచ్చని చెప్పారు. పరిమాణం పరంగా 20 శాతం క్షీణతకు చాన్స్ ఉందన్నారు. అకస్మాత్తుగా పుత్తడి ధర తగ్గితే అమ్మకాలకు బూస్టనిస్తుందని వివరించారు.

స్థిరంగా పసిడి ధర..

ప్రస్తుతం కొనసాగుతున్న బంగారం ధరలు బుల్లిష్‌గా ఉన్నప్పటికీ.. కొంతకాలం స్థిరంగా ఉండే అవకాశం ఉందని కామ్‌ట్రెండ్జ్ రిస్క్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ సీఈవో జ్ఞానశేఖర్ త్యాగరాజన్ తెలిపారు. 'ప్రస్తుతం యూఎస్ ఆర్థిక పరిస్థితుల మాదిరిగా పసిడి ధరలను అస్థిరంగా మార్చడానికి కారణాలేవీ లేవు. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, చమురు ధరల వంటి ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితులు కూడా ఇటీవల పుత్తడి ధరలను ప్రభావితం చేయలేదు. భారత్‌లోని వినియోగదార్లకు బంగారం ధరల పెరుగుదలకు అలవాటుపడటానికి ఎల్లప్పుడూ సమయం పడుతుంది. కాబట్టి ఈ సవత్సరం అక్షయ తృతీయ సమయంలో డిమాండ్ తక్కువగా ఉండే అవకాశం ఉంది' అని వివరించారు.

విడదీయలేని బంధం..

లక్షలాది మంది భారతీయులకు అక్షయ తృతీయ వేడుకల్లో బంగారం కొనుగోళ్లు విడదీయరాని భాగం అని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ భారత్ సీఈవో సోమసుందరం పీఆర్ వివరించారు. 'పుత్తడిని సంపద చిహ్నంగా భావిస్తారు. అక్షయకు కాలానుగుణ కొనుగోలు ప్రారంభాన్ని సూచిస్తుంది. ప్రధాన బంగారం కొనుగోలు పండుగ అయినప్పటికీ.. ఈ సంవత్సరం అక్షయ తృతీయ పసిడి జీవితకాల అధిక ధరలను ఎదుర్కొంటోంది. గత కొన్ని వారాలుగా వినియోగదారుల నుండి మోస్తరు స్పందన ఉంది' అని తెలిపారు. మహమ్మారి కారణంగా రెండేళ్ల మందకొడి పనితీరు తర్వాత బంగారు పరిశ్రమకు తిరిగి మెరుపు వచ్చిందని కామా జ్యువెల్లరీ ఎండీ కోలిన్ షా అన్నారు. 'కొంతకాలంగా పసిడి ధరలు గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. ఈ సంవత్సరంలో పెరుగుతున్న ధరలు, ఆర్థిక అనిశ్చితి నేపథ్యంలో వినియోగదారులు తమ కొనుగోళ్లతో మరింత జాగ్రత్తగా ఉండాలని భావిస్తున్నారు. అయితే పెట్టుబడిదారుల వర్గం రాబోయే కాలంలో పుత్తడి ధరలు పెరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నారు' అని చెప్పారు.

ఆఖరి గంటలో కొనుగోళ్లు

- రాణించిన ఇంధన, టెలికం షేర్లు
- సెన్సెక్స్ లాభం 66 పాయింట్లు



ముంబై: ట్రేడింగ్ చివర్లో ఇంధన, టెలికాం, వినిమయ షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు గురువారం స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. ట్రేడింగ్ ప్రారంభం తర్వాత కొద్దిసేపు ఒడిదుడుకులను ఎదుర్కొన్న సూచీలు మిడ్ సెషన్ తర్వాత సానుకూలంగా కదిలాయి. అమ్మకాల ఒత్తిడితో చివరి గంట వరకు ఊగిసలాట ధోరణి ప్రదర్శించి పరిమిత లాభాలతో ట్రేడింగ్‌ను ముగించాయి. ఉదయం సెన్సెక్స్ 19 పాయింట్ల స్వల్ప లాభంతో 59,587 వద్ద, నిఫ్టీ 20 పాయింట్లు బలపడి 17,653 వద్ద మొదలయ్యాయి. రోజంతా పరిమిత శ్రేణిలో కదలాడాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 347 పాయింట్ల పరిధిలో 59,490 వద్ద కనిష్టాన్ని, 59,837 గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 66 పాయింట్లు లాభపడి 59,632 వద్ద నిలిచింది. నిఫ్టీ 17,584 – 17,684 శ్రేణిలో ట్రేడైంది. ఆఖరికి ఆరు పాయింట్లు స్వల్ప లాభంతో 17,624 వద్ద నిలిచింది. రియల్టీ, ఎఫ్‌ఎంసీజీ, మెటల్, కమోడిటీ, ఐటీ, షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ 11 పైసలు బలపడి 82.14 వద్ద స్థిరపడింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,169 కోట్ల షేర్లను విక్రయించగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.833 కోట్ల షేర్లను అమ్మేశారు. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- మ్యూచువల్ ఫండ్ నిర్వహణకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ నుంచి సూత్రప్రాయ ఆమోదం లభించడంతో బ్రోకరేజ్ దిగ్గజం ఎంకే గ్లోబల్ ఫైనాన్స్ సర్వీసెస్ షేరు 20 శాతం అప్పర్ సర్క్యూట్‌తో రూ.80 వద్ద లాకయ్యింది.
- క్యూ4 పలితాలు మెప్పించకపోవడంతో ఐసీఐసీఐ సెక్యూరిటీస్ 5% పడి రూ. 439 వద్ద స్థిరపడింది.

సైయంట్ లాభం 14 శాతం జంప్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మార్చి త్రైమాసికంలో సైయంట్ నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 14 శాతం ఎగసి రూ.176 కోట్లు సాధించింది. ఎబిటా రూ.249 కోట్లు, ఎబిటా మార్జిన్ 14.2 శాతం నమోదైంది. గ్రూప్ ఆదాయం 48 శాతం అధికమై రూ.1,751 కోట్లకు చేరుకుంది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో నికరలాభం 8.2 శాతం పెరిగి రూ.565 కోట్లు దక్కించుకుంది. గ్రూప్ టర్నోవర్ 32.7 శాతం దూసుకెళ్లి రూ.6,016 కోట్లను తాకింది. మొత్తం డివిడెండ్ ఇప్పటి వరకు అత్యధికంగా ఒక్కో షేరుకు రూ.26కు చేరడం విశేషం.



సెమీస్‌లో సాకేత్ జోడీ

జీఎండబ్ల్యూ ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నీలో సాకేత్ మైనేని–యూకీ బాంబ్రీ (భారత్) జోడీ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. మ్యూనిక్‌లో గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో సాకేత్, యూకీ తొలి సెట్‌లో 5–2తో ఆధిక్యంలో నిలిచింది. ఈ దశలో ప్రత్యర్థి జంట డస్టిన్ బ్రౌన్ (జమైకా)–పావ్లాసెక్ (చెక్ రిపబ్లిక్) గాయం కారణంగా వైదొలిగింది. దాంతో సాకేత్–యూకీ జోడీని విజేతగా ప్రకటించారు.

కేఎల్ రాహుల్‌పై రూ. 12 లక్షల జరిమానా



స్లో ఓవర్ రేట్ కారణంగా లక్నో సూపర్ జెయింట్స్ జట్టు కెప్టెన్ కేఎల్ రాహుల్‌పై ఐపీఎల్ నిర్వాహకులు రూ. 12 లక్షలు జరిమానా విధించారు. జైపూర్‌లో బుధవారం రాజస్తాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో లక్నో పది పరుగుల తేడాతో గెలిచిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌లో లక్నో బౌలర్లు నిర్ణీత సమయంలో పూర్తి ఓవర్ల కోటా పూర్తి చేయలేకపోయారు.

ఫైనల్లో భారత్


ప్రపంచకప్ స్టేజ్–1 ఆర్చరీ టోర్నీ



తరుణ్‌దీప్ రాయ్, అతాను దాస్, ధీరజ్

అంటాల్యా (తుర్కియే): తొమ్మిదేళ్ల విరామం తర్వాత భారత పురుషుల రికర్వ్ జట్టు ప్రపంచకప్ టోర్నీలో తొలిసారి ఫైనల్లోకి దూసుకెళ్లింది. వరల్డ్ కప్ స్టేజ్–1 ఆర్చరీ టోర్నీలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బొమ్మదేవర ధీరజ్, ఒలింపియన్స్ అతాను దాస్, తరుణ్‌దీప్ రాయ్‌లతో కూడిన భారత జట్టు స్వర్ణ పతక పోరుకు అర్హత సాధించింది. గురువారం జరిగిన టీమ్ ఎలిమినేషన్ మ్యాచ్‌ల్లో భారత జట్టు విశేషంగా రాణించింది. తొలి రౌండ్‌లో 'బై' పొంది నేరుగా రెండో రౌండ్ ఆడిన భారత్ 5–4తో జపాన్‌పై గెలిచింది. అనంతరం క్వార్టర్ ఫైనల్లో 6–2తో చైనీస్ తైపీపై, సెమీఫైనల్లో 6–2తో నెదర్లాండ్స్‌పై విజయం సాధించింది. ఆదివారం జరిగే ఫైనల్లో చైనాతో భారత్ తలపడుతుంది. చివరిసారి భారత్ 2014లో రెండు ప్రపంచకప్ టోర్నీలలో ఫైనల్ చేరి రన్నరప్‌గా నిలిచింది. 2010లో షాంఘైలో ఆఖరిసారి భారత జట్టు వరల్డ్‌కప్‌లో స్వర్ణ పతకం సాధించింది.

సెమీస్‌లో జ్యోతి సురేఖ



మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. టాప్ సీడ్ హోదాలో బరిలోకి దిగిన జ్యోతి సురేఖ తొలి రౌండ్‌లో 145– 137తో మిరియం హస్లెర్ (స్విట్జర్లాండ్)పై, రెండో రౌండ్‌లో 145–141తో డానిలి లుట్జ్ (అమెరికా)పై, మూడో రౌండ్‌లో 145–138తో సోఫియా (మెక్సికో)పై, క్వార్టర్ ఫైనల్లో 147–142తో టాంజా జెలెనథిన్ (డెన్మార్క్)పై గెలిచింది. భారత్‌కే చెందిన అవ్‌నీత్ కౌర్ మూడో రౌండ్‌లో 'షూట్ ఆఫ్'లో 9–10తో సారా లోపెజ్ (కొలంబియా) చేతిలో... సాక్షి రెండో రౌండ్‌లో 137–142తో ఆండ్రియా మునోజ్ (స్పెయిన్) చేతిలో... అదితి 146–147తో ఎలీసా రోనెర్ (ఇటలీ) చేతిలో ఓడిపోయారు.

సిరాజ్ సూపర్ షో...

సిరాజ్ గెలిపించిన మ్యాచ్ ఇది! నిప్పులు చెరిగే బౌలింగ్, కళ్లు చెదిరే ఫీల్డింగ్‌తో పంజాబ్ కింగ్స్‌పై స్పీడ్‌స్టర్ పంజా విసిరాడు. పంజాబ్ కుదురుకోకుండా దెబ్బ మీద దెబ్బ వేయడంతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టు ఈ సీజన్‌లో మూడో విజయాన్ని సాధించింది.


- 4 వికెట్లతో హడలెత్తించిన ఆర్‌సీబీ పేసర్
- మెరిసిన డుప్లెసిస్, కోహ్లి
- 24 పరుగులతో బెంగళూరు గెలుపు
- పంజాబ్‌కు ఆల్‌రౌండ్ దెబ్బ



సిరాజ్

మొహాలీ: మెరుపులతో డుప్లెసిస్, కోహ్లి బెంగళూరును నడిపిస్తే... బౌలింగ్‌తో గెలిపించిన ఘనత మాత్రం సిరాజ్‌దే! దీంతో ఐపీఎల్‌లో గురువారం జరిగిన పోరులో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు 24 పరుగుల తేడాతో పంజాబ్ కింగ్స్‌పై విజయం సాధించింది. మొదట బెంగళూరు 20 ఓవర్లలో 4 వికెట్లు నష్టానికి 174 పరుగులు చేసింది. 'ఇంపాక్ట్ ప్లేయర్'గా దిగిన రెగ్యులర్ కెప్టెన్ డుప్లెసిస్ (56 బంతుల్లో 84; 5 ఫోర్లు, 5 సిక్సర్లు), ఈ మ్యాచ్‌లో సారథ్యం వహించిన విరాట్ కోహ్లి (47 బంతుల్లో 59; 5 ఫోర్లు, 1 సిక్స్) చెలరేగారు. హర్‌ప్రీత్ బ్రార్‌కు 2 వికెట్లు దక్కాయి. తర్వాత పంజాబ్ 18.2 ఓవర్లలో 150 పరుగులకే కుప్పకూలింది. ప్రభ్‌సిమ్రన్ (30 బంతుల్లో 46; 3 ఫోర్లు, 4 సిక్సర్లు), జితేశ్ శర్మ (27 బంతుల్లో 41; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించారు. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' సిరాజ్ (4/21) కీలకమైన వికెట్లు తీశాడు.

డుప్లెసిస్ ధనాధన్ 'ఇంపాక్ట్'



కోహ్లి, డుప్లెసిస్‌ల ఓపెనింగ్ మైదానంలోని ప్రేక్షకుల్ని మెరుపులతో మురిపించింది. దూసుకొచ్చే బంతిని కాచుకొని, గతి తప్పిన బంతిని బౌండరీలవైపు శిక్షిస్తూ బెంగళూరు ఇన్నింగ్స్‌ను ఏకంగా 16 ఓవర్ల పాటు నడిపించారు. 137 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యాన్ని జోడించారు. ఈ క్రమంలో ముందుగా డుప్లెసిస్ 31 బంతుల్లో, తర్వాత కోహ్లి 40 బంతుల్లో ఫిఫ్టీలను పూర్తి చేసుకున్నారు. వీరిద్దరి పరుగుల పంజా 'కింగ్స్'ను ఉక్కిరిబిక్కిరి చేయగా, స్వల్ప వ్యవధిలో వీళ్లిద్దరితో పాటు హిట్టర్ మ్యాక్స్‌వెల్ (0) అవుటవడంతో 200 మార్క్‌ను దాటకుండా పంజాబ్ అడ్డుకుంది. అనంతరం కష్టపడితే ఛేదించే లక్ష్యంతో బరిలోకి దిగిన పంజాబ్‌ను సిరాజ్ తన తొలి ఓవర్ నుంచే కష్టాలపాలు చేశాడు. అథర్వ (4)ను ఎల్బీగా అవుట్ చేశాడు. సిక్స్, ఫోర్ కొట్టి జోరు మీదున్న హర్‌ప్రీత్ సింగ్ (13)ను డైరెక్ట్ హిట్‌తో రనౌట్ చేశాడు. ప్రభ్‌సిమ్రన్ రాణింపు తర్వాత జితేశ్ శర్మ మెరుపులతో లక్ష్యం దిశగా సాగుతుంటే మళ్లీ సిరాజ్ నిప్పులు చెరిగాడు. హర్‌ప్రీత్ బ్రార్ (13), ఎలిస్ (1)లను క్లీన్‌బౌల్డ్ చేసి పరాజయాన్ని ఖాయం చేశాడు.



స్కోరు వివరాలు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: కోహ్లి (సి) జితేశ్ శర్మ (బి) హర్‌ప్రీత్ 59; డుప్లెసిస్ (సి) స్యామ్ కరన్ (బి) ఎలిస్ 84; మ్యాక్స్‌వెల్ (సి) అథర్వ (బి) హర్‌ప్రీత్ 0; దినేశ్ కార్తీక్ (సి) అథర్వ (బి) అర్ష్‌దీప్ 7; మహిపాల్ (నాటౌట్) 7; షహబాజ్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 174. వికెట్ల పతనం:** 1-137, 2-137, 3-151, 4-163. **బౌలింగ్:** అర్ష్‌దీప్ సింగ్ 4-0-34-1, హర్‌ప్రీత్ 3-0-31-2, ఎలిస్ 4-0-41-1, స్యామ్ కరన్ 4-0-27-0, రాహుల్ చహర్ 4-0-24-0, లివింగ్‌స్టోన్ 1-0-9-0.

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: అథర్వ (ఎల్బీడబ్ల్యూ) (బి) సిరాజ్ 4; ప్రభ్‌సిమ్రన్ (బి) పార్నెల్ 46; షార్ట్ (బి) హసరంగ 8; లివింగ్‌స్టోన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) సిరాజ్ 2; హర్‌ప్రీత్ సింగ్ (రనౌట్) 13; స్యామ్ కరన్ (రనౌట్) 10; జితేశ్ శర్మ (సి) షహబాజ్ (బి) హర్షల్ పటేల్ 41; షారుఖ్ (స్టంప్డ్) దినేశ్ కార్తీక్ (బి) హసరంగ 7; హర్‌ప్రీత్ బ్రార్ (బి) సిరాజ్ 13; ఎలిస్ (బి) సిరాజ్ 0; అర్ష్‌దీప్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (18.2 ఓవర్లలో ఆలౌట్) 150. వికెట్ల పతనం:** 1-4, 2-20, 3-27, 4-43, 5-76, 6-97, 7-106, 8-147, 9-149, 10-150. **బౌలింగ్:** సిరాజ్ 4-0-21-4, పార్నెల్ 3-0-32-1, హసరంగ 4-0-39-2, వైశాక్ 3-0-29-0, మ్యాక్స్‌వెల్ 1-0-5-0, హర్షల్ పటేల్ 3.2-0-22-1.

ఢిల్లీకి తొలి విజయం

రాణించిన వార్నర్, అక్షర్



న్యూఢిల్లీ: ఈ ఐపీఎల్ సీజన్‌లో ఢిల్లీ ఐదు మ్యాచ్‌లాడినా... అందని విజయం ఆరో మ్యాచ్‌లో అతికష్టమ్మీద దక్కింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ 4 వికెట్ల తేడాతో కోల్‌కతా నైట్‌రైడర్స్‌పై గెలిచింది. తొలుత కోల్‌కతా 20 ఓవర్లలో 127 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ జేసన్ రాయ్ (39 బంతుల్లో 43; 5 ఫోర్లు, 1 సిక్స్), రసెల్ (31 బంతుల్లో 38 నాటౌట్; 1 ఫోర్, 4 సిక్సర్లు) నైట్‌రైడర్స్ పరువునిలిపే స్కోరు చేశారు. అక్షర్ పటేల్ (2/13), కుల్దీప్ యాదవ్ (2/15), ఇషాంత్ శర్మ (2/19), నోర్జే (2/20) సమష్టిగా కూల్చారు. అనంతరం సులువైన లక్ష్యాన్ని ఛేదించేందుకు ఢిల్లీ ఆఖరి దాకా తెగ కష్టపడింది. చివరకు 19.2 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 128 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ డేవిడ్ వార్నర్ (41 బంతుల్లో 57; 11 ఫోర్లు) అర్ధసెంచరీ సాధించాడు. అక్షర్ పటేల్ (22 బంతుల్లో 19 నాటౌట్; 1 ఫోర్) కీలక పరుగులు చేశాడు. వరుణ్ చక్రవర్తి, అనుకూల్ రాయ్ చెరో 2 వికెట్లు తీశారు.

స్కోరు వివరాలు

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: రాయ్ (సి) అమన్ హకీమ్ (బి) కుల్దీప్ 43; లిటన్‌దాస్ (సి) లలిత్ (బి) ముకేశ్ 4; వెంకటేశ్ అయ్యర్ (సి) మార్ష్ (బి) నోర్జే 0; నితీశ్ రాణా (సి) ముకేశ్ (బి) ఇషాంత్ 4; మన్‌దీప్ (బి) అక్షర్ 12; రింకూ సింగ్ (సి) లలిత్ (బి) అక్షర్ 6; నరైన్ (సి) వార్నర్ (బి) ఇషాంత్ 4; రసెల్ (నాటౌట్) 38; అనుకూల్ రాయ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) కుల్దీప్ 0; ఉమేశ్ (సి అండ్ బి) నోర్జే 3; వరుణ్ చక్రవర్తి (రనౌట్) 1; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (20 ఓవర్లలో ఆలౌట్) 127. వికెట్ల పతనం:** 1-15, 2-25, 3-32, 4-50, 5-64, 6-70, 7-93, 8-93, 9-96, 10-127. **బౌలింగ్:** ఇషాంత్ శర్మ 4-0-19-2, ముకేశ్ 4-0-34-1, నోర్జే 4-0-20-2, అక్షర్ 3-0-13-2, మిచెల్ మార్ష్ 2-0-25-0, కుల్దీప్ 3-0-15-2.

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: వార్నర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) వరుణ్ 57; పృథ్వీషా (బి) వరుణ్ 13; మార్ష్ (సి) సబ్–వీస్ (బి) నితీశ్ రాణా 2; సాల్ట్ (సి అండ్ బి) అనుకూల్ 5; మనీశ్ పాండే (సి) రింకూ (బి) అనుకూల్ 21; అక్షర్ పటేల్ (నాటౌట్) 19; అమన్ హకీమ్ (బి) రాణా 0; లలిత్ యాదవ్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (19.2 ఓవర్లలో 6 వికెట్లకు) 128. వికెట్ల పతనం:** 1-38, 2-62, 3-67, 4-93, 5-110, 6-111. **బౌలింగ్:** ఉమేశ్ యాదవ్ 1-0-6-0, కుల్వంత్ 1.2-0-20-0, రసెల్ 1-0-12-0, నరైన్ 4-0-36-0, వరుణ్ 4-1-16-2, అనుకూల్ 4-0-19-2, నితీశ్ రాణా 4-0-17-2.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	6	4	2	8	1.043
లక్నో	6	4	2	8	0.709
చెన్నై	5	3	2	6	0.265
గుజరాత్	5	3	2	6	0.192
బెంగళూరు	6	3	3	6	-0.068
ముంబై	5	3	2	6	-0.164
పంజాబ్	6	3	3	6	-0.298
కోల్‌కతా	6	2	4	4	0.214
హైదరాబాద్	5	2	3	4	-0.798
ఢిల్లీ	6	1	5	2	-1.183

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

చెన్నై × హైదరాబాద్ (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

మాడ్రిడ్ ఓపెన్ టోర్నీకీ నాదల్ దూరం



బార్సిలోనా: స్పెయిన్ టెన్నిస్ స్టార్ రాఫెల్ నాదల్ తుంటి గాయం నుంచి ఇంకా కోలుకోలేదు. దాంతో అతను ఈ సీజన్‌లో మరో టోర్నీకి దూరమయ్యాడు. ఇప్పటికే ఇండియన్ వెల్స్, మయామి, మోంటెకార్లో మాస్టర్స్ సిరీస్ టోర్నీలతోపాటు బార్సిలోనా ఓపెన్‌లో నాదల్ ఆడలేదు. వచ్చే సోమవారం మొదలయ్యే మాడ్రిడ్ మాస్టర్స్ సిరీస్ టోర్నీ నుంచి కూడా నాదల్ వైదొలిగాడు. ఈ టోర్నీలో నాదల్ ఐదుసార్లు విజేతగా నిలిచాడు. జనవరిలో ఆస్ట్రేలియా ఓపెన్ తర్వాత నాదల్ మరే టోర్నీలోనూ బరిలోకి దిగలేదు. మే 28న మొదలయ్యే ఫ్రెంచ్ ఓపెన్‌గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఆడేది లేనిది ఇప్పుడే చెప్పలేనని 22 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ సాధించిన నాదల్ వ్యాఖ్యానించాడు.

2025 కల్లా 3 వేల ఎలక్ట్రిక్ వాహన చార్జింగ్ కేంద్రాలు

తెలంగాణ రెడ్కో చైర్మన్ సతీష్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 2025కల్లా 3 వేలకు పైగా ఎలక్ట్రిక్ వాహన చార్జింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలంగాణ రాష్ట్ర పునరుత్పాదక శక్తి అభివృద్ధి సంస్థ (రెడ్కో) చైర్మన్ వై.సతీష్‌రెడ్డి చెప్పారు. అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కళాశాలలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అన్ని జిల్లా కేంద్రాలు, 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 129 మున్సిపాలిటీల్లో ఎలక్ట్రిక్ వాహన చార్జింగ్ వసతి కల్పిస్తామని పేర్కొన్నారు. గత ఏడాది రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోళ్లు ఐదు రెట్లు పెరిగినట్టు వివరించారు. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, పట్టణాల్లోని ప్రధాన ప్రాంతాల్లో చార్జింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడమే లక్ష్యమని తెలిపారు. రెడ్కో సొంతంగా ఇప్పటికే 150 చార్జింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసిందని సతీష్‌రెడ్డి చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేటుకు సంబంధించి హైదరాబాద్‌లో దాదాపు 500 చార్జింగ్ కేంద్రాలున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెడ్కో వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జానయ్య, జీఎం ప్రసాద్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో కొత్తగా 52 కరోనా కేసులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గురువారం 6,534 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, వారిలో 52 మంది వైరస్‌బారిన పడ్డారు. దీంతో ఇప్పటివరకు మొత్తం నమోదైన కేసుల సంఖ్య 8.43 లక్షలకు చేరింది. ప్రస్తుతం 299 మంది ఐసోలేషన్‌లో చికిత్స పొందుతుండగా..45 మంది కరోనా నుంచి కోలుకున్నట్లు అధికారులు తెలిపారు.






కారెగట్టు, సారెకల్లు అటవీ ప్రాంతంలో దుప్పులు


మర్కోడు అటవీ ప్రాంతంలో కెమెరాలకు చిక్కిన అడవి దున్నలు

'కిన్నెరసాని'లో జంతువైవిధ్యం కనువిందు

- అభయారణ్యంలో పెరుగుతున్న వివిధ రకాల వన్యప్రాణులు
- ఇటీవల ట్రాప్ కెమెరాలకు చిక్కిన జీవాలు


అడవి పంది

పాల్వంచ రూరల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కిన్నెరసాని అభయారణ్యంలో జంతువైవిధ్యం కనువిందు చేస్తోంది. అభయారణ్యంలో వివిధ రకాల వన్యప్రాణులు, జంతువుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. అడవిదున్నలు, జింకలు, ముళ్లపందులు, దుప్పులు, రకరకాల పక్షులు సందడి చేస్తున్నాయి. అభయారణ్యంలోని వివిధ ప్రాంతాల్లో వైల్డ్‌లైఫ్ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాల్లో వీటి కదలికలు తాజాగా నమోదుకాగా, గురువారం మీడియాకు విడుదల చేశారు. వీటి సంఖ్య గణనీయంగా పెరిగినట్లు అధికారులు చెబుతున్నారు. కాగా, ఇక్కడ జీవవైవిధ్యం అన్నివిధాలా అనుకూలంగా ఉండటం, మెరుగైన సౌకర్యాల కారణంగా వన్యప్రాణుల సంతతి పెరుగుతోందని ఎఫ్‌డీవో దామోదర్‌రెడ్డి వెల్లడించారు. అభయారణ్యంలో 50 హెక్టార్లలో గడ్డిపెంపకం, నీటివసతి కోసం 22 సోలార్ పంపుసెట్లు, 110 పర్క్యులేషన్ ట్యాంకులు, 42 చెక్‌డ్యామ్‌లు నిర్మించడంతోపాటు పశువులు, మనుషుల సంచారాన్ని అరికట్టడంతో వన్యప్రాణుల స్వేచ్ఛాజీవనానికి, పునరుత్పత్తికి ఆటంకం లేకుండాపోయిందని వెల్లడించారు.


ఎరుపు మీసాల బిల్బుల్ పక్షి


నల్లరెక్కల ఉల్లంకి పిట్టలు


ఆసియా ఓపెన్ బిల్లు పక్షి

యాదాద్రీశుడి హుండీ ఆదాయం రూ. 1.86 కోట్లు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామికి 20 రోజుల హుండీ ఆదాయం కింద రూ.1,86,38,644 సమకూరింది. గురువారం శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపంలో ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఇందులో రూ.1,86,38,644 నగదు కాగా..241 గ్రాముల మిశ్రమ బంగారం, 4 కిలోల 650 గ్రాముల మిశ్రమ వెండి, విదేశీ నగదు ఉన్నట్టు ఈవో తెలిపారు.


హుండీల్లో వచ్చిన నగదు, నగలను లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది





Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.